
ఆంధ్రసచిత్ర వారపత్రిక

16-22 మే, '86

రు. 2-5



* ప్లీజ్ నన్ను శపించు నేస్తం
* భయం
* అట్టహాసం
* జీవితంతో పోరాటం

* భవిష్యద్రష్ట జీన్‌డిక్సన్
* ఓంగీ జాతి నాయకుడు -తంబోలే



ఎందుకంటే క్రొత్త మేలుపర్చబడిన ఫారెక్స్® మొదటి మొదటి ఘన ఆహారాలకు మారే పాపాయికి సహాయకరంగా అత్యావశ్యక పదార్థాల సమ్మేళనం.

ప్రొటీన్లు మరియు క్రొవ్వు పదార్థాల సరియైన కలయిక.
ఫారెక్స్. పాపాయి బలంగా మరియు ఆరోగ్యవంతంగా పెరిగేలా తోడ్పడటానికై ప్రొటీన్లతో సమృద్ధమైనది. పాపాయి యొక్క సున్నిత జీర్ణశక్తికి అనువుగా సరియైన పాళ్లలో క్రొవ్వు పదార్థంతో ప్రత్యేకంగా రూపొందించబడినది.

పాపాయి రక్తాన్ని ఆరోగ్యవంతంగా వుంచడానికి తగినంత ఐరన్.
నాల్గవ నెలప్పటికి పాపాయి యొక్క ఐరన్ నిల్వ తరిగిపోతుంది. పాపాయి రక్తాన్ని ఆరోగ్యవంతంగా వుంచి రోగాలను ఎదుర్కోడానికి సహాయకరంగా తగినంత ఐరన్ కల్గినది ఫారెక్స్.

కాల్షియం-ఫాస్ఫరస్‌ల ఆదర్శవంతమైన నిష్పత్తి.
దిన-దినమూ, పాపాయి పళ్లు, ఎముకలు బలంగా మరియు ఆరోగ్యవంతంగా పెరిగేలా తోడ్పడటానికి, ప్రత్యేకంగా రూపొందించబడిన ఫారెక్స్‌లో కాల్షియం, ఫాస్ఫరస్‌లు ఆదర్శవంతమైన 2:1 నిష్పత్తిలో కలవు.

మరి మీరు పాపాయికి పెట్టే ప్రతి చెంచాడు పోషణ తత్వ-యుక్త ఫారెక్స్ మరింత రుచికరం. కలపడానికి మరింత సులభం.




క్రొత్త మేలు పర్చబడిన **ఫారెక్స్®**

CLARION/B/GX/13/244 TEL


"నాకు నచ్చిన వ్యక్తి"

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యాస రచన పోటీ



మొదటి బహుమతి : పోర్టబుల్ బ్లాక్ అండ్ వైట్ టి.వి.



రెండవ బహుమతి మిక్సర్



మూడవ బహుమతి : పెద్ద సూట్‌కేస్



ప్రత్యేక బహుమతులు 3 హెచ్.ఎం.టి. చేతి గడియారాలు

నిబంధనలు

1. ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చు. ఆంధ్రపత్రిక సంస్థలోని ఉద్యోగులు, వారి బంధువులు ఈ పోటీలో పాల్గొనరాదు.

2. వ్యాసంలో మీకునచ్చిన వ్యక్తిగా ఇప్పుడు జీవించి ఉన్న వారిలో ఎవరినైనా పేర్కొనవచ్చు.

3. వ్యాసం ఒక అరఠావు (సుమారుగా 17x29 సెం.మీ) మించరాదు. కాగితానికి ఒకవైపే సిరా లేదా బాల్‌పెన్‌తో రాయాలి.

4. ఈ పేజీలలో ఇచ్చిన ప్రశ్నావళి, కూపన్‌లని పూర్తి చేసి వ్యాసంతో పాటు విధిగా పంపాలి. వ్యాసం రాయనివారు కూడా ప్రశ్నావళి పూర్తిచేసి పంపవచ్చు.

5. పోటీకి పంపిన వ్యాసాలని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపటం సాధ్యంకాదు. కాబట్టి వాటితోపాటు స్వంత చిరునామాకల, స్టాంపులు అంటించిన కవర్లు జతపరచవద్దని కోరుతున్నాము.

6. గడువుతేదీ 31-5-1986 ఆ తర్వాత అందిన వ్యాసాలు పరిశీలింపబడవు.

7. ఈ పోటీలో తుది నిర్ణయం సంపాదకునిదే. పోటీలో పాల్గొనే వారంతా దానికి బద్ధులై ఉండాలి. దీని విషయమయి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

8. పోటీకి పంపే వ్యాసాలని సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-520003 అన్న చిరునామాకి పంపాలి. కవరుమీద "నాకు నచ్చిన వ్యక్తి వ్యాసరచన పోటీకి" అని స్పష్టంగా రాయాలి.

పాఠకులందరూ ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని దీనిని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాము.

–సంపాదకుడు

ప్రశ్నావళి

ముగింపు తేదీ : 31–5–1986

1. నాకు ఎక్కువ నచ్చిన శీర్షిక ______________________________

2. కథలు	చదువుతాను	□	చదవను	□
3. సీరియల్ నవలలు	చదువుతాను	□	చదవను	□
4. సినిమా శీర్షిక	చదువుతాను	□	చదవను	□
5. న్యూఢిల్లీ లేఖ	చదువుతాను	□	చదవను	□
6. హైదరాబాద్ నోట్‌బుక్	చదువుతాను	□	చదవను	□
7. బొమ్మల కథ	చదువుతాను	□	చదవను	□
8. వారఫలాలు	చదువుతాను	□	చదవను	□
9. ప్రశ్నావళి	చదువుతాను	□	చదవను	□
10. డాక్టర్ సలహాలు	చదువుతాను	□	చదవను	□
11. ధర్మపథం	చదువుతాను	□	చదవను	□
12. కార్టూన్లు	చూస్తాను	□	చూడను	□
13. కవిత	చదువుతాను	□	చదవను	□
14. ఉత్తరాలు	చదువుతాను	□	చదవను	□
15. సినిమా శీర్షికలో సినిమా ప్రముఖులతో ఇంటర్వ్యూలు	ఉండాలి	□	ఉండనక్కరలేదు	□
16. వ్యాసాలు	చదువుతాను	□	చదవను	□
17. ఆంధ్ర సచిత్ర వారపత్రికకి లేఖలు	రాస్తాను	□	రాయను	□
18. ఆంధ్ర సచిత్ర వారపత్రిక నాకు సక్రమంగా	అందుతోంది	□	అందటంలేదు	□
19. నేను ఆంధ్రసచిత్ర వార పత్రికని తెప్పించేది	ఏజెంటుద్వారా	□	పోస్టుద్వారా	□
20. నేను ఆంధ్రసచిత్రవార పత్రికని ప్రతివారం షాపులో కొంటాను	అవును	□	కాదు	□

(తగిన విధంగా ఆయా గడులలో ✓ గుర్తుపెట్టండి)

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

"నాకు నచ్చిన వ్యక్తి"

వ్యాస రచన పోటీ

వ్యాసం రాసిన వారి పేరు : ....

పూర్తి చిరునామా : ....

....

....

....




RITA

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు : (1938-1972)

16-22 మే, '1986
శ్రీ అక్షయ నామ సం. వైశాఖ. శు. సప్తమి.
సంపుటము 78 : సంచిక 36

సంపాదకుడు -
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు. 2-50
పోస్టులో 6నెలల చందా రు. 71.50
పోస్టులో 12నెలల చందా రు. 143.00

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధినగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఛాన్సలర్‌గా ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు
(ఫోటో : ఎం. ఎ. మోహన్‌రావు)

కథలు :

"ప్లీజ్-నన్ను శపించు నేస్తం" 15
భయం 32
అట్టహాసం 34
జీవితంతో పోరాటం 47

సీరియల్ నవలలు:

సర్పయాగం 8
బలికోరిన ప్రేమ 22
వసంత గీతం 40
జీవితం చేజారిందా? 54

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు-7, ప్రశ్నావళి-14, ఇద్దరూ ఉద్యోగస్తులైతే!-21, డాక్టర్ సలహాలు-27, విచిత్ర యదార్థ గాధలు-28, వారఫలం-30, వ్యక్తిగతం-31, ధర్మపథం-43, రాతియుగానికి రాకెట్ యుగానికి వారధి ఓంగి జాతి నాయకుడు-తంబో లే-44, ఫాలాక్షుని డైరీ-46, ఇ'వేమన' పద్యాలు - 51, న్యూఢిల్లీ లేఖ-52, హైదరాబాద్ నోట్‌బుక్-60, అభిమాన తారలపై అభిప్రాయం!-61, జయసుధ సమాధానాలు - 62.సినిమా విశేషాలు-64.



ఆకర్షించే శీర్షికలు

నటి భానుప్రియ ముఖ చిత్రంతో వెలువడిన 4-10 సంచికలో 'జయసుధ సమాధానాలు', అభిమాన తారలపై అభిప్రాయాలు, ఇద్దరూ ఉద్యోగస్తులైతే, శీర్షికలు మమ్మల్ని అయస్కాంతంలా హత్తుకుంటున్నాయి.

ఎం. ప్రసాదరావు, బానుప్రకాష్,
మక్కువ.

కథలు

మి (మా) ఆంధ్ర సచిత్ర వారపత్రిక 4-10 ఏప్రిల్'86 సంచిక చాలా బాగుంది. 'మూగరాగాలు' కథ గుండెలను కదిలించి వేసింది.

చిట్టిబాబు, పాలగుమ్మి

★ ★ ★

భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన పత్రికలో "మూగరాగాలు" చాలా బాగుంది. "గోపన్న" పాత్ర చిత్రీకరణ మాకు కన్నీరు తెప్పించింది.

సింగం దత్తాత్రేయమూర్తి, ఒంగోలు

★ ★ ★

నటి భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన 4-10 ఏప్రిల్ '86 సంచికలోని కథలు నాకు మీరే కావాలి, మూగరాగాలు, మా ఇంటిల్లిపాదికి చాలా నచ్చాయి.

పట్నాయుని సురేష్,
ఆమదాలవలస

★ ★ ★

ఏప్రిల్ (4-10) భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన సంచికలోని "పంతాలు - పట్టింపులు" కథ నన్ను ఎంతో ఆకట్టుకుంది.

"మూగరాగాలు" కథ చాలా బాగుంది. గోపన్నలాంటి స్వామి భక్తి కలిగిన వారు ఈనాడు అతి తక్కువగా ఉన్నారు.

ఉమామహేశ్వర్, కొంకుదురు

సీరియల్స్

భానుప్రియ ముఖచిత్రంతో (4-10 ఏప్రిల్) మా ముందుకొచ్చిన నా అభిమాన పత్రికలో ఎం. డి. సౌజన్యగారి కొత్త సీరియల్ "బలి కోరిన ప్రేమ" చాలా బాగుంది.

రెడ్డి, పద్మావతి, మాచర్ల

★ ★ ★

4-10, ఏప్రిల్ '86 సంచికతో ప్రారంభమైన క్రొత్త సీరియల్ - "బలి కోరిన ప్రేమ" చదివాము. ఈ సీరియల్‌లో సీరియస్ ఘట్టాలు చదువుచున్నంత సేపూ హృదయస్పందన చేసాయి. ముఖ్యంగా మురళీధర్ పాత్ర. మున్ముందు అన్నపూర్ణకు మరేమి సీరియస్ పరిణామాలు వున్నాయో అని వేచి వున్నాము.

పక్కి గోపాలకృష్ణ
పట్నాయక్,
బల్లిగూడ (ఒరిస్సా)

★ ★ ★

ఈ వారంతో అయిపోయిన - చైతన్య స్వరూపం మొదటి నుంచి చాలా బాగున్నది. స్వరూపలాగ కొందరు స్త్రీలున్నా, ఆడపిల్లలకి జరిగే అన్యాయాలు జరగవు. త్యాగమయీ అనురాగమయీ నా అభివందనములు. ఈ కథ సినిమా తీస్తే బాగుండును.

డి. రోహిణి, తిరుపతి

★ ★ ★

4-10'86 భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఎంతో ఆకర్షణీయంగా ఉంది. అలాగే కొత్త సీరియల్ "బలి కోరిన ప్రేమ" మొదలే మమ్ములను ఎంతో ఆకట్టుకుంది. రచయితకు మా కృతజ్ఞతలు.

నాగండ్ల వెంకటేశ్వరరావు, రమేష్,
దోర్నకల్

★ ★ ★

"ప్రేమసాగరం" ఆద్యంతం ఆసక్తిదాయకంగా సాగుతుంది. జయరాం ప్రేమకై అన్ని బాధలు భరించి, స్వప్న జీవితాన్ని సాగిస్తున్న విధం అత్యంత ఆకర్షణీయంగా వుంది. కాని తుదకు స్వంత భర్తే అనుమానాన్ని వ్యక్తం చేయగా, దాన్ని ఆమె ఎదుర్కొన్న సంఘటన రచయిత్రి న్యాయం చేకూర్చేలా చిత్రించారు.

గొర్బిల్ల రమణారావు, లక్ష్మీబాయి
ఖర్గపూర్

★ ★ ★

సీరియల్స్‌లో చైతన్య స్వరూపం చదువుతున్నంత సేపూ ఈ లోకాన్నే మరిచిపోయి కథలో లీనమై చదువుతున్నాను. కథలో స్వరూపగారి పాత్రను రచయిత చాలా బాగా చిత్రీకరించారు. 'బలి కోరిన ప్రేమ' మొదట్లోనే మమ్ములను బాగా ఆకట్టుకొన్నది. తరువాతి సంచిక ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడవలసి వస్తుంది. జీవితం చేజారిందా? ప్రేమసాగరం కూడా చాలా ఆనందింపచేస్తున్నాయి.

కొండ్రెడ్డి రామమోహనరావు వ్యాఘ్రేశ్వరం


గమనిక

2-8 మే' 85 సంచికలో పడిన 'ఇద్దరి - ఇద్దైన....'లో కొన్ని అచ్చు తప్పులు దొర్లాయి! లెక్సికాన్‌కి రెక్సికాన్ అని పడింది. ఇట్లీలో 'ిి' వత్తు పోయింది. ద్రవిడియన్‌లో 'వి' బదులు 'లి' పడింది. గోడెగారి పేరు ముందు పొడి అక్షరాలతో సి బదులు ఎ ఉండాలి.

–రా. గం. □

సీరియల్

సర్ప యాగం



(గత సంచిక తరువాయి)

2

దేవరకొండ గ్రామంలో సుమారు అరవై కుటుంబా లుంటాయి. అందులో అయిదారు కుటుంబాలు తప్ప.... తక్కినవన్నీ అగ్రవర్ణాలకు సంబంధించిన కుటుంబాలే. ఆస్తుల్లో నాగరాజు గారితో సాటిరాగల వారు ఆ వూళ్ళో ఒక్కరూ లేరు. రైతులు చాలా మంది నాగరాజు గారి భూముల్ని కౌలుకు చేస్తూ జీవిస్తున్నారు.

"చదువుకున్న వాడికన్నా చాకలివాడు మేలు" అనే సూత్రాన్ని ఆ వూళ్ళో అందరూ విశ్వసించారేమో గానీ.... చదువుకున్న వాళ్ళు మాత్రం.... ఆ వూళ్ళో చాలా తక్కువ. ఇంతవరకు హైస్కూల్ చదువైనా పూర్తి చేసినవాడు ఒక్క నాగరాజు కొడుకు తప్ప మరొకడు ఆ వూళ్ళో అగుపించడు.

కోటి విద్యలు కూటి కొరకే కానీ.... నేడు ఆ విద్యలు కూటిని మాత్రం సంపాదించి పెట్టలేక పోతున్నాయనే వాస్తవాన్ని ఆ గ్రామంలో చాలా మంది గ్రహించినట్టున్నారు. అందుకే వాళ్ళు తమ పిల్లల్ని పొలం పనులు చెయ్యడానికి పంపుతారు కానీ బడికి పంపడానికి మాత్రం బొత్తిగా యిష్టపడరు.

ఆ వూరి బడిలోని అటెండెన్స్ బుక్‌లో ముప్పయి కంటే ఎక్కువ పేర్లుండవు. అది ఏకోపాధ్యాయ పాఠశాల. దేవరకొండ గ్రామం మూఢ నమ్మకాలకు నిలయం. ఆచారాలతో, అర్థంలేని అంధ విశ్వాసాలతో, అజ్ఞానంతో ఆ గ్రామం మూడు పూవులా ఆరుకాయల్లా నిత్యం విలసిల్లుతూ వుంటుంది.

ఆకాశంలో విమానం వెళ్ళే చప్పుడు విన్పించిందంటే.... "పై మోత్ర పోతావుంది రోయ్" అంటూ యిప్పటికీ ఆ వూళ్ళోని జనంలో ముప్పాతిక మంది తమ యిళ్ళల్లోంచి వెలుపలి కొచ్చి ఆకాశం వేపు ఆశ్చర్యంగా.... ఆ విమానం పూర్తిగా కనుమరుగయ్యే వరకు నోళ్ళు తెరుచుకుని చూస్తూ వుండిపోతారు.

ఆ వూళ్ళో.... నాగరాజు గారి పెద్ద కొడుకు మొట్టమొదట టేప్‌రికార్డర్ తెచ్చి పాటలు విన్పించినప్పుడు.... అంత చిన్న పెట్టెలో మనుషులు ఎలా యిమిడి వున్నారా? అని అనుకుంటూ అమితాశ్చర్యంతో గొప్ప విచిత్రం జరిగిపోయినట్టు అదే పనిగా ఆడవాళ్ళు తమ బుగ్గల్ని నొక్కుకున్నారు.

ఆ వూరి ప్రజలంతా చాలా అమాయకులని చిల్లర దేవుళ్ళంతా ఎప్పుడో తెలుసుకున్నారు. అందుకే రకరకాలయిన దేవుళ్ళంతా ఎక్కడెక్కడి నుండో వచ్చి.. దేవరకొండ గ్రామం చుట్టూ సెటిలై పోయారు. ఆధునిక నాగరికతా ఛాయలేవీ ఆ వూరి పొలిమేరలోకి కూడా ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రవేశించవు.

ఆ వూరికి పడమటి వేపు నాలుగు ఫర్లాంగుల దూరంలో విశాలమైన ఒక పెద్ద మామిడితోట వుంది. ఈ దేశంలో ఎన్ని రకాల మతాలూ కులాలూ వున్నాయో దాదాపు అన్ని రకాల వృక్షాలు ఆ మామిడి తోటలో వున్నాయి.

ఆ తోట యజమాని పాలకొండ నాగరాజు. ప్రతి ఏటా బోలెడంత డబ్బు ఆ తోట మీద ఆయనకు ఆదాయంగా వస్తుంది. దేశ సరిహద్దు ప్రాంతంలో కాపలా కాసే సైన్య సమూహంలా.... ఆ మామిడి తోట చుట్టూ వెయ్యబడిన ఎత్తయిన ముళ్ళకంచె వుంది. కంటికి రెప్పలా అది ఆ తోటను కాపాడుతూ వుంటుంది.

ఆ మామిడి తోట లోపల.... ఉత్తర దిశగా కంచెకు కాస్త దూరంగా.... రెండు పాకలు వెయ్యబడి వున్నాయి. అందులో ఒక పాక చిన్నది. మరొకటి పెద్దది. ఆ రెండు పాకల్లో రెండు యానాది కుటుంబాలు నివసిస్తున్నాయి. చిన్న పాకలో యానాది వెంకట్రాముడు, పెద్ద పాకలో యానాది నర్సయ్య కాపుర ముంటున్నారు.

ఆ చిన్న పాకలోకి సూర్యు డెప్పుడూ తొంగి చూస్తుంటాడు. వరుణ దేవుడికి అంతకంటే అభ్యంతరం లేదు. ఆ పాకపై కప్పబడిన తాటాకులు గాలికి అప్పుడప్పుడు రాజకీయ నాయకుల వాగ్దానాల్లా ఎగిరి పోతుంటాయి. ఆరు నెలలకో పర్యాయం.... ఆ పాక అనవాయితీ తప్పకుండా కూలిపోతూ వుంటుంది.


ఆ పాకలో కాపురముండే వెంకట్రాముడికి నా అనే వారెవరూ లేరు. అతడు మూడేళ్ళ పిల్లాడుగా వున్నప్పుడు అతని తండ్రి చనిపోయాడు. పదేళ్ళ క్రితం తల్లి పోయింది. ఆరు నెలల క్రితం పెళ్ళి చేసుకున్న అతడి భార్య.... మూడు నెలలకే వదిలిపెట్టి పోయింది. ప్రస్తుతం వెంకట్రాముడు ఆ పాకలో ఏకాకి.

ఆ పక్కనున్న మరో పాకలో యానాది నర్సయ్య, అతని భార్య మల్లక్క, కొడుకు గోవిందుడు, కూతురు కన్నమ్మ నివశిస్తున్నారు. వెంకట్రాముడికి నర్సయ్య కుటుంబానికి నడుమ ఎలాంటి బాంధవ్యాలూ లేవు. అయినప్పటికీ.... వెంకట్రాము డంటే వాళ్ళందరికీ చాలా అభిమానం.

నర్సయ్య మల్లక్కలకు సుమారుగా ఏభై సంవత్సరా లుంటాయి. గోవిందుడికి యిరవై, కన్నమ్మకు పదునెనిమిది సంవత్సరా లుంటాయి. దేవరకొండ లోని రైతుల బర్రెల్ని ప్రతి రోజూ మేపుకు రావడం గోవిందుడి ఉద్యోగం. ప్రతిఫలంగా రైతులు ఒక బర్రెకు ఒక నెలకు మూడు రూపాయల చొప్పున గోవిందుడికి యిస్తారు.

యానాది తెగలో పుట్టినా.... పసితనం నుండి రైతుల పొలాల్లోకి కూలికి వెళ్ళడం చేత, వ్యవసాయానికి సంబంధించిన పనులన్నీ కన్నమ్మకు కొట్టిన పిండే. ప్రతి రోజూ కన్నమ్మ రైతుల పొలాల్లోకి కూలికి వెళ్ళి సాయంత్రం చీకటిపడే సమయానికల్లా తిరిగి మామిడితోటలోని తమ పాకకు చేరుకుంటూ వుంటుంది.

జరిగిన కథ– 1: దేవరకొండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పంతులు గుర్నాథం. పిల్లలకి పాఠాలు చెప్పటం తప్ప తక్కిన పనులన్నిటినీ చాలా సమర్థవంతంగా చేయగలడు. వీర్రాజు, గుర్నాథం మాట్లాడు కుంటుండగా స్కూలు బయట పాము వచ్చిందని పంతులుతో చెప్తాడు బాలయ్య. బాలయ్య పాములను పట్టే యానాది వెంకట్రాముడిని పిలుచుకు రావడానికి వెళతాడు. స్కూలు దగ్గర కోలాహలం వినిపించగానే పాలకొండ నాగరాజు అక్కడికి వస్తాడు. నాగరాజుకి ఆ గ్రామంలో మంచి పలుకుబడి ఉంది. నాగరాజుకి "పాముగండం" ఉందని ఎవరో జ్యోతిష్కు డొసారి చెప్తాడు. బొరియలోని పాము వైపే చూడసాగాడు పాలకొండ నాగరాజు



ఇక నర్సయ్య మల్లక్కలు అప్పుడప్పుడు "ఊదరకుండ"ను తీసుకుపోయి.... పొలాల గట్లలో ఊదరపెట్టి, ఎలుకల్ని పట్టుకొస్తుంటారు. వలపన్ని ఉడుతలు పడుతుంటారు. ఆ కుటుంబం ఎలాగో కాలం గడిపేస్తోంది. వాళ్ళు ఏనాడూ ఆకలితో గడపలేదు. అలాగని ఎప్పుడూ కడుపునిండా తిననూ లేదు.



యానాది వెంకట్రాముడి విషయానికొస్తే.... రెండు పలుగులూ, రెండు కత్తులూ, ఒక పాత వల, ఒక ఊదరకుండ యింతకు తప్ప.... అతడికి పిత్రార్జితం అంటూ మరేమి లేదు. నిజానికి యానాది వాళ్ళకు యింతకు మించిన ఆస్తులు సాధారణంగా వుండవు.

ఒక్కోసారి పొరబాటున.... ఆ వూళ్ళో వాళ్ళ పశువులు ఆ మామిడి తోటలో పడి గడ్డి మేస్తుంటాయి. దొంగతనంగా కొందరు ఆ తోటలో కొచ్చి, ఎండు కట్టెల్ని విరుచుకు పోతుంటారు. అందుకే.... వెంకట్రాముడు ఆ తోటలో ఎప్పుడూ అటూ యిటూ తిరుగుతూ జాగ్రత్తగా కాపలా కాస్తుంటాడు.

వెంకట్రాముడికి మరో ముఖ్యమైన హాబీ వుంది. అది.... పాముల్ని పట్టడం. వాటి తోలు తీసి అమ్ముకోవడం. తన కంటికి పాముగాని అగుపించిందంటే.... పది రూపాయల నోటు అగుపించినంతగా ఆనందపడి పోతా డతడు. వెంకట్రాముడి కంట్లో పడితే.... యిక ఆ పాముకు ఆయుషు పూర్తి అయిపోయినట్టే లెక్క.

వారానికో పది రోజులకో కనీసం ఒక్క పామునైనా పట్టి, దాని తోలు తియ్యకుంటే.... అతడికి చాలా వెలితిగా ఉంటుంది. పాము తోళ్ళను సంతలో అమ్మి, వచ్చిన ఆ డబ్బుతో అతడు బీడీలు, బట్టలు మొదలైనవి కొనుక్కుంటూ వుంటాడు. కొంత డబ్బును కూడా అతడు మిగలబెట్టుకుంటుంటాడు.

సర్పయాగం

విశాలమైన ఆ మామిడి తోటలో సంచరించే పాముల కన్నింటికీ వెంకట్రాముడి సర్పయాగం సంగతి బాగా తెలుసు. వాటి పాలిట అతడు యమకింకరుడు. అందుకే.... ఎప్పుడైనా అవి వెంకట్రాముడిని గానీ చూశాయంటే, ప్రాణ భయంతో పిల్లిని చూసిన ఎలుకల్లా పరుగులు తీస్తాయి.

వెంకట్రాముడి పాక ముందు భాగంలో ఎటు చూసినా.... అతడి చేత చంపబడిన పాముల యొక్క వెన్నెముకలే దర్శన మిస్తాయి. అతడు చేస్తున్న అంతులేని సర్పయాగానికి అవే నిదర్శనాలు. ఆ మామిడితోట లోని పాముల్లో ముప్పాతిక భాగం అతని సర్పయాగానికి ఆహుతై అసువుల్ని పోగొట్టుకున్నాయి.

వెంకట్రాముడి పాకకు ఎదురుగా కొంత ధూరంలో.... ఓ పేద్ద వేప చెట్టుంది. ఆ చెట్టు కింద ఎత్తయిన ఓ పుట్ట వుంది. ఆ పుట్టలో బలమైన ఓ నాగుపాము నివసిస్తోంది. ఆ పామును వెంకట్రాముడు రెండుసార్లు స్వయంగా చూశాడు. అయినా.... దాన్ని పట్టుకునేందుకు అతడు కనీసం ప్రయత్నించ లేదు.

కారణం.... ఆ పామంటే వెంకట్రాముడికి భయమేదో ఉండడం కాదు. నాగుపామును చంప కూడదు అనే నిబంధనేదో ఉండడం అంతకన్నా కాదు. అసలు అతని కళ్ళలో పడి.... అతడి సర్పయాగానికి ఆహుతి కాని నాగుపాము అదొక్కటే.

"ఔరేయ్ యంకట్రాఁవా! నీ గుడిసె ముందు.... యాపసెట్టు కిందుండే పుట్టలో బలమైన ఓ పాముంది. అది మాఁవూలు పాము కాదు. అది నాగదేవత. మా యిలవేల్పు. తోలుకు ఆశపడి, నువ్వు దాన్ని పట్టుకునిసంపినావా.... నీ పేగులు తీసేస్తాను. యీ సంగతి మాత్రం గెవనం (జ్ఞాపకం) పెట్టుకో!"

వెంకట్రాముడిని హెచ్చరిస్తూ, చాలా సార్లు పాలకొండ నాగరాజు పలికిన పలుకులివి. వెంకట్రాము డా పలుకుల్ని మరిచిపోలేదు. అందుకే.... అతడా పామును చూసినా పట్టుకునే ప్రయత్నం చెయ్యడు. అందుకో బోయిన మంత్రి పదవి హఠాత్తుగా జారిపోయిన ఎమ్మెల్లేలా.... ఆ పాము తన కళ్ళ ముందు ప్రాకి పోతూ వుంటే వెంకట్రాముడు తెగ బాధ పడి పోతాడు.

దేవుళ్ళూ, భూతాలూ, దయ్యాలూ వీటికి సంబంధించి చిన్నప్పటి నుండి ఎందుకో వెంకట్రాముడికి బొత్తిగా నమ్మకాలు లేవు. పామంటే.... అది విష ప్రాణి. అది మనిషిని కాటు వేస్తుంది. మనిషిని కాటు వేసే విషప్రాణి దేవత ఎలా అవుతుంది? ఇది వెంకట్రాముడికి జవాబు దొరకని ప్రశ్న.

మనిషికి దప్పిక వేస్తే మంచినీళ్ళు కూడా పొయ్యని ఈ మనుషులు.... విష ప్రాణి కోసం పాలు తెచ్చి పుట్టల్లో ఎందుకు పోస్తారు? సాటి మనిషికన్నా విషప్రాణి విలువైనదా? ఇది వెంకట్రాముడికి నివృత్తి కాని సందేహం. అయితే తన సందేహాలను గురించి అతడెప్పుడూ ఎవరినీ అడగలేదు.

ఇరవై మూడేళ్ళ వయసున్న వెంకట్రాముడు నల్లగా తుమ్మ దుంగలా వుంటాడు. అతడి ఛాతీ చాలా విశాలంగా నల్లరేగడి భూమిలా వుంటుంది. తైల సంస్కారం లేకుండా.... అతడి తల వెంట్రుకలు పిడుచ కట్టుకు పోయి పిచ్చుక గూడులా వుంటుంది. అతడి చేతులు యినుప కడ్డీలా బలిష్ఠంగా వుంటాయి.

తన పాక ముందున్న మామిడి చెట్టు నీడలో ఓ చిన్న రాతి ముందు కూర్చుని.... సన్నని దుమ్మును ఆ రాతిపై పోసి, ఆ దుమ్ముపై కత్తి నూరుకుంటూ పదను పెడుతున్నాడు వెంకట్రాముడు. సరిగ్గా అప్పుడే బాలయ్య అక్కడికి పరుగుతో వచ్చి, వెంకట్రాముడితో పాము సంగతి చెప్పి, వెంటనే బయలుదేర మన్నాడు.

"యేం పామది?"– చెట్టు నీడలోంచి పైకి లేచి బాలయ్యను ప్రశ్నించాడు వెంకట్రాముడు.

"యేంపామో తెలవదు. మొత్తానికది శానా పెద్ద పామే. యిస్కూలు దెగ్గిర సింత సెట్టు కాడ బొక్కలో దాగుంది. బిన్నే (తొందరగా) బయల్దేరు"– అన్నాడు బాలయ్య.

పది రోజుల నుండి వెంకట్రాముడికి ఒక్క పాము కూడా దొరక లేదు. ప్రస్తుతం పాము సంగతి వినగానే.... అతడి కళ్ళు ఆనందంతో మెరిశాయి. అతడి బుర్రలో యిరవై రూపాయలు కదలాడ సాగాయి. వెంటనే పాకలోకి వెళ్ళి పలుగును అందుకుని ఉత్సాహంగా వూళ్ళోకి బయలుదేరాడు వెంకట్రాముడు.

రెండడుగులు వేసిన వెంకట్రాముడు చటుక్కున ఆగిపోయాడు. తను "నాగముష్టి" చెక్కను తీసుకు పోవడం మరిచిపోయిన సంగతి.... చప్పున గుర్తు కొచ్చిందతనికి. నాగముష్టి చెక్కను తీసుకు పోకుండా పాము జోలికి వెళ్ళడం చాలా ప్రమాదమని వెంకట్రాముడి అభిప్రాయం.

నాగముష్టి చెక్కంటే.... అదొక రకమయిన చెట్టుకు సంబంధించిన చెక్క. అది పాము విషానికి విరుగుడని, పాము కరవగానే ఆ చెక్కను నోట్లో వేసుకుని నమిలి.... ఆ రసాన్ని మింగితే, విషం ఎక్కదని అంటారు. అందుకే పాముల వేటకు వెళ్ళేటప్పుడు వెంకట్రాము డా చెక్క పలుకుల్ని విధిగా తీసుకు వెళతాడు.

"పెద్దమ్మా! పెద్దమ్మా!"– అని పిలుస్తూ నర్సయ్య పాకలోకి ప్రవేశించాడు వెంకట్రాముడు. నర్సయ్యని "పెద్దయ్యా" అని మల్లక్కను "పెద్దమ్మా" అని పిలవడం.... వెంకట్రాముడికి పసితనం నుండి బాగా అలవాటై పోయింది.

"యేంగావాల్రా యంకట్రాఁవా?"– తమ పాకలోకి వచ్చిన వెంకట్రాముడిని అడిగింది మల్లక్క.

"నా దెగ్గిర నాగముస్టి సెక్క సీదా (పూర్తిగా) అయిపూడ్సింది (అయిపోయింది). రొవ్వంత (కాస్త) మీ యింట్లో వుంటే పెట్టు పెద్దమ్మా"– అడిగాడు వెంకట్రాముడు.

"నాగముస్టి సెక్కను అడగతా వుండావు పాముల్ని పట్టే దానిక్కి పోతుండావా?"

"అవును పెద్దమ్మా! వూళ్ళో పాముండాదంట. నన్ను తొడుకొని రమ్మని ఆ పిలగాన్ని రైతులు నాకాడికి పంపించినారు"– బాలయ్య వేపు చేయి చూపెట్టి చెప్పాడు వెంకట్రాముడు.


"యేం పామంట?"

"యేం పామో వూళ్ళోకెళ్ళి సూస్తేగానీ నికరంగా తెలవదు పెద్దమ్మా!"

"నాగముస్టి సెక్కను మీ పెద్దయ్య యీ కొంపలో యాడ (ఎక్కడ) బెట్నాడో నాగ్నూడా సరిగ్గా తెల్సి సావదు. ఆ మూల దొంతి మీద.... పైనుండే దుత్తలో యేఁవన్నా వుండాదేఁవో సూడు. నాకు సూపు మట్టం (తక్కువ). యెల్తుర్లోనే యేఁవీ కన్పడదు."

మల్లక్క ఆ మాట చెప్పగానే గబగబా వెంకట్రాముడు దొంతి వద్దకు వెళ్ళి.... పైనున్న దుత్తను కిందికి దించి, అందులో వున్న చిన్న గుడ్డ మూటను విప్పాడు. అందులో నాగముష్టి చెక్క కన్పించిం దతనికి. నాలుగైదు ముక్కలు తీసి మొలగుడ్డలో దోపుకుని ఊళ్ళోకి బయలు దేరాడు వెంకట్రాముడు.

ఊళ్లోకి ప్రవేశించిన వెంకట్రాముడికి.... స్కూల్ ముందు చింతచెట్టువద్ద జనం గుంపులుగా వుండడం కన్పించింది. పాము అక్కడే వున్నట్లు గ్రహించా డతడు. ఆ చింతచెట్టువద్దే కుర్చీలో కూర్చునివున్న నాగరాజును చూడగానే



సర్పయాగం

వెంకట్రాముడి ఆశలన్నీ నీరుకారిపోయాయి.

కారణం..... అక్కడ బొరియలో వున్న పాము నాగుపామైతే.... నాగరాజు దాన్ని చంపనివ్వడు. ప్రాణంతో పట్టుకుని వూరవతలకు వెళ్ళి, దాన్ని వదిలెయ్యమంటాడు. తన శ్రమ అంతా వృధా అయిపోతుంది. అదే వెంకట్రాముడి బాధ.

అందుకే ఆ బొరియలో వున్నది నాగుపాము కాకూడదని, జెర్రిపోతై వుండాలని వెంకట్రాముడు మనసులో కోరుకున్నాడు. పైగా నాగుపాము తోలు పెద్ద ఖరీదు కాదు. దానికంటే జెర్రిపోతు చర్మానికి రేటు ఎక్కువ.

"రారా యంకట్రాఁవా! నీ సేతిలో యీ పొద్దు యీ పాముకు తీరిపోయింది. దీని కర్మ, నీ అదురుస్టం. అందుకే యిది బొక్కలో దూరి యాడికీ పోకుండా వుండాది"-అంటూ వీర్రాజు వెంకట్రాముడికి బొరియలోని పామును చూపెట్టాడు.

వెంకట్రాముడు చప్పుడు చెయ్యకుండా పామున్న ఆ బొరియ దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. దానితోక చివరిభాగం అతనికి స్పష్టంగా కన్పిస్తోంది. వెంకట్రాముడు ఓ సన్నని కట్టెపుల్లను చేతికి అందుకుని బొరియలోని ఆ పాము తోకపై రెండు మూడు సార్లు ఆ పుల్లతో పొడిచాడు.

అలా పొడవడంచేత భూమి లోపల ఆ బొరియ మరింత పొడవుగా వుంటే....పాము మరికొంత ముందుకు వెళుతుంది. అలా పొడిచినా పాము ముందుకు వెళ్ళలేదంటే....యిక భూమిలో ఆ బొరియ పొడవుగా లేనట్టే. వెంకట్రాముడు పుల్లతో అలా పొడిచినా ఆ పాము ముందుకు వెళ్ళలేదు.

"యింతమందిని సూస్తే పాము కల్సరపడి (కలతపడి)పోతాది. మీరంతా రొవ్వంత యడంగా జరగండి. నేను పామును బయటకు లాగి పారేస్తాను"-వెంకట్రాముడు అలా అనగానే గుంపుగావున్న వాళ్ళంతా దూరంగా పరుగెత్తారు.

నాగరాజు కూడా కుర్చీలోంచి పైకి లేచి దూరంగా వచ్చేశాడు. తనకు నాగుపాము గండం వుందని జ్యోతిష్కుడు చెప్పినప్పటినుండి నాగరాజుకు నాగుపాము భయం విపరీతంగా పట్టుకుంది. ఏ క్షణంలో తనను పాము కరుస్తుందోనని నాగరాజు ప్రతిక్షణం సందేహిస్తూనే వుంటాడు.

ఆయనకు పాముగండం ఉందనే సంగతి ఆ ఊళ్ళో అందరికీ తెలుసు. నాగరాజును ఏ నాగుపామైనా పుణ్యం కట్టుకుంటే బాగుడునని ఆ వూళ్లో చాలామంది తమ అంతరంగంలో అనుకుంటూ వుంటారు. పాము కరిస్తే నాగరాజుకు బదులు ఆ పామే చస్తుందని ఆయన స్వభావం తెలిసినవారి అభిప్రాయం.

వెంకట్రాముడు బొరియవద్ద నిలబడి కొంచెం ముందుకు వంగి మెల్లగా ఆ బొరియలోకి తన కుడి చేయిని పోనిచ్చాడు. ఒక్క క్షణంలో చటుక్కున పాము తోకను తన చేత్తో పట్టుకుని....కబుక్కున పామును బొరియలోంచి పూర్తిగా బయటకులాగి దూరంగా విసరేశాడు.

బయటపడ్డ ఆ-పాము భయంతో ....వేగంగా తప్పించుకుని వెళ్ళబోయింది. కాని వెంకట్రాముడు ఒక్క ఉదుటున వచ్చి.... చేతిలోని తమర కట్టెతో ఆ పాము తలను గట్టిగా నేలకేసి నొక్కేశాడు. యిక అది కదల్లేకపోయింది. తర్వాత గబుక్కున చేత్తో దాన్ని తలకింద పట్టుకున్నాడు. వెంకట్రాముడి ఆనందానికి అవధులులేవు. కారణం.....అతడు కోరుకున్నట్లే అది జెర్రిపోతు.

3

ఊళ్లో పట్టుకున్న ఆ జెర్రిపోతును ప్రాణంతోటి తన పాక వద్దకు తీసుకొచ్చాడు వెంకట్రాముడు. పాము ఏ ప్రదేశంలో దొరికినా.....దానిని తన పాకవద్దకు తీసుకొచ్చి, తర్వాత దాని చర్మం తీసుకుంటాడతడు. కొందరు యానాదివాళ్ళు పామును చంపిన తర్వాత దాని చర్మం తీసుకుంటారు.

కానీ వెంకట్రాముడు మాత్రం పామును చంపకుండానే....అది ప్రాణంతో వుండగానే, దాని తోలు తీసేస్తాడు. తోలు తీసేసిన పిదప పాము వెన్నెముకతో పాటు విలవిలా కొట్టుకుంటూ అటూ యిటూ ఎగురుతుంటే......కర్రతో దానిమీద పొడుస్తూ, దానితో చెలగాటమాడడం వెంకట్రాముడికి చాలా సరదా.

సూర్యుడు నడినెత్తికొస్తున్నాడు. ఎండకు భరించలేక పక్షులన్నీ చెట్ల గుబుర్లలో తలదాచుకున్నాయి. మామిడిచెట్ల కిందున్న ఎండుటాకుల్ని కాళ్ళతో చిదురుకుంటూ, కన్పించిన పురుగుల్ని తింటున్నాయి కోళ్ళు. దూరంగా ఓ చెట్టుపై ఎగిరే గద్ద వెన్నుపోటు పొడవబోయే నాయకుడిలా.....అవకాశంకోసం ఆశగా కోడి పిల్లలవేపే చూస్తోంది.

పాక ముందు కూర్చుని.....వెంకట్రాముడు తన సర్పయాగాన్ని ప్రారంభించాడు. పాము తలవద్ద ఓ చేత్తో, తోక వద్ద మరో చేత్తో పట్టుకుని....నేలమీద ఆ పామును వెల్లికిలా పరుండబెట్టాడతడు. అతడి చేతుల్లోంచి తప్పించుకుని ఎలాగైనా పారిపోవాలని ఆ పాము ఎంతో ప్రయత్నిస్తోంది.

పాము తోకను తన కుడిపాదంతో గట్టిగా తొక్కుకుని.... తలవద్ద ఎడంచేత్తో పట్టుకుని, పామును నేలకేసి బలంగా అదిమి పట్టుకున్నాడు వెంకట్రాముడు. ఇప్పుడిక అది అటూ యిటూ కదలలేకపోయింది.. వెల్లికిలా పడివున్న ఆ పాము పొట్టమీద.....అతడు తలనుండి తోక వరకు కుడిచేత్తో ఓసారి తడిమాడు.

తర్వాత పళ్ళతో గట్టిగా నొక్కి పట్టుకున్న బ్లేడు ముక్కను కుడి చేత్తో అందుకుని.....తలవద్దనుండి తోక వరకు పాము పొట్టమీద మెల్లగా కొయ్యడం మొదలెట్టాడు వెంకట్రాముడు. బ్లేడు కడుపులోకి దిగగానే.... పాము ఒంట్లోంచి రక్తం చిమ్ముకొచ్చి అతడి చేయి బాగా తడిసి పోయింది.

పాము గిలగిలా కొట్టుకుంటోంది. అయినా దాన్ని కదలనివ్వకుండా గట్టిగా నొక్కి పట్టాడు వెంకట్రాముడు. పాము తలమీది చర్మం పనికిరాదు. అందుకే దాని మెడచుట్టూ బ్లేడుతో కోశాడతడు.

అయిదు నిముషాల్లో కోత పని పూర్తి అయిపోయింది. చర్మాన్ని ధాని ఒంటి నుండి మెల్లగా విడదీశాడతడు. కొంతసేపటికి పాము చర్మం.....పాము ఒంటి నుండి విడివడిపోయింది. ఇక వెన్నెముక మాత్రమే మిగిలింది. ఆ వెన్నెముకను దూరంగా విసరి పారేశాడు వెంకట్రాముడు.

"యేం పామురా యంకట్రాఁవా?"-అంటూ యానాది నర్సయ్య అక్కడి కొచ్చాడు.

"జెర్రిపోతు పెద్దయ్యా."

"యాడ దొరికింది?"

"వూళ్ళో యిస్కూల్ దెగ్గిర."

"మనిసి అలికిడి యింటేనే జెర్రిపోతు వుచ్చబోస్కొని వురకతాది. అట్టాంటిది వూళ్ళోకెందుకొచ్చినట్టు?"

"యెందుకంటే యేం జెప్పేది పెద్దయ్యా? దీనికి తీరిపోయింది. అందుకే వొచ్చుంటాది."

వెంకట్రాముడు పాకలోకి వెళ్ళి, దోసెడు ఉప్పు తీసుకొచ్చి....బయట రాతిపైపోసి, పొడిగా నూరాడు. తర్వాత పాము తోలును నెత్తురు లేకుండా శుభ్రపరిచి.... ఆ తోలును నేలపై వెడల్పుగా పరిచాడు. పొడిగా నూరిన ఉప్పును తీసుకుని ఆ తోలుమీద రాయసాగాడు వెంకట్రాముడు.

అలా పాము చర్మంపై ఉప్పు రాయడంచేత.... ఆ చర్మం వాసన లేకుండా,

"స్త్రీ జన్మ"

అణకువ కలిగి ఉంటే
సామిదమ్మగా ఖ్యాతి'
మెలకువ కలిగిఉంటే
మైత్రేయిగా కీర్తి!

—కె. కిశోరుబాబు
—కె. అశోకుబాబు

తొందరగా చెడిపోకుండా ఎక్కువకాలం ఉంటుంది. అది బాగా ఆరిపోయిన తర్వాత చిన్న పుల్లను తీసుకుని..... ఆ పుల్లకు పాము తోలును కండెలాగా చుట్టసాగాడు వెంకట్రాముడు. అవాళ్టి సర్పయాగపు తంతు అంతటితో ముగిసింది.

"యంకట్రాఁవా!"..... అంటూ నర్సయ్య ఏదో చెప్పబోయి మళ్లీ మానేశాడు.

"యేంది పెద్దయ్యా?"-నర్సయ్యవేపు ప్రశ్నార్థకంగా చూశాడు వెంకట్రాముడు.

'యేఁవీ లేదురా. రేపు నువ్వు యింట్లోనే వుంటావా లేకపోతే.....పాం తోలు తీస్కోని అమ్మేదానికి సంతగ్గాని పోతావా?" సందేహంగా అడిగాడు నర్సయ్య.

"నాతో యేఁవన్నా పనుండాదా?"

"అవ్"

"యేం పని పెద్దయ్యా?"

"రేపు మనం వొక సోటికి పోయి రావాల'

"యాడికి (ఎక్కడికి)"?

"యల్లంపల్లికాడికి"-నర్సయ్య చెప్పాడు.

"యేం పని పెద్దయ్యా?"

"పెండ్లి పెత్తనం."

"యెవురికి?"

"మనోళ్ళకే."

"అది తెల్సు. నేనడిగేది గోయిందుడికా? లేక కన్నమ్మకా?"-ప్రశ్నించాడు వెంకట్రాముడు.

"కన్నమ్మకైతే మనం పెత్తనం పోవాల్సిన పనేఁవుంది?" సేసుకునే మొగోడెవడున్నావుంటే....వోడే యెతుక్కుంటా వొస్తాడు"-గర్వంగా అన్నాడు నర్సయ్య.

"నిజఁవే పెద్దయ్యా! కన్నమ్మకేం తక్కువ? సేసుకునేవోడెవడన్నా వొచ్చి సూస్తే..... కొండసిలవ పాము తోలు మాదిర్తో కన్నమ్మను కండ్ల కద్దుకొని సేసుకుంటాడు."

"అందుకే దాని పెండ్లి గురించి నాకంత బాదలేదు. గోయిందుడి - -

(కార్యం) సేసేస్తే బాగుంటాదని నేనూ, మీ పెద్దమ్మా అనుకుంటావుండాం."

"మంచిదే పెద్దయ్యా! యిప్పుడు గాకపోయినా యెప్పుడో వొకప్పుడు ఆ కార్నిం జరగాల్సిందేగదా. పెండ్లి కూతురి పోవిడి (ఆచూకి) యేఁవన్నా వొచ్చిందా?"

"పాటూరు దెగ్గిర యల్లంపల్లికాడ......మన యానాదోళ్ళు నాలుగిండ్లోళ్ళు వుండారంట. ఆ యిండ్లల్లో పెండ్లి కావాల్సిన బిడ్డ వుండాదని తెల్సింది"-అన్నాడు నర్సయ్య.

"పనీ పాటా, కూతీ నాలీ సెయ్యడం తెల్సిన బిడ్డేనా? అరువుగా (బుద్ధిగా), వుండే బిడ్డేనా?"-అంటూ పెళ్ళికూతురు వివరాల గురించి అడిగాడు వెంకట్రాముడు.

"అయ్యన్నీ యిలావరిగా (వివరంగా) నాకు మాత్రం యేం తెల్సు? మనం యెళ్ళి బిడ్డను సూస్తే గదా మనకు ఆ పాపం పున్నెం తెల్సేది"-నర్సయ్య అన్నాడు.

"యీ సంగతి పెద్దమ్మకు సెప్తివా?"

"సెప్పినానబ్బా. ఆ బిడ్డను సూసొద్దాఁవని మీ పెద్దమ్మ రొండు దినాలనుంచి నన్ను పోర్తా వుంది. నువ్వు గూడా వొస్తే....ముగ్గరం యెళ్ళి సూస్కోనిరావొచ్చు."

"అయితే రేపోఁదాఁవా?"

"వొచ్చేదానికి నీకు యీలుంటాదా?"

"నేనేఁవన్నా యీడ నిలుకులేకండాఁ (తీరిక లేకుండా) సేద్యాలు సేస్తావుండానా నాకు యీలు లేకపొయ్యేదానికి? పచ్చార పాము మాదిరిగా యెప్పుడూ యీ మాఁవిడి సెట్ల దెగ్గిర పడుండే పనేగద నాకు"-నవ్వుతూ అన్నాడు వెంకట్రాముడు.

"సరే....అయితే రేపు పోదాఁవా?"

"పోదాంలే"-అంటూ వెంకట్రాముడు తన పాకలోకి వెళ్ళిపోయాడు.

(ఇంకా ఉంది)



ఎన్. ఆర్. కె. కాకినాడ

★ గుడిలో దైవ దర్శనం తరువాత కొంచెం సేపు కూర్చుని వెళ్ళాలంటారు. కారణం?

● తెలియదు గాని మా తాత అనేవాడు దైవదర్శనం రుణం తీర్చినట్టు కాదు- పడేసి పోడానికి - కూర్చోవాలి అని. అది మమ్మల్ని కూర్చో పెట్ట డానికనే వాడో, శాస్త్రమో యిప్పటికి తెలియ లేదు.

పి. వి. ఆర్. తణుకు

★ మీరు పాఠకులకు తగ్గట్టు సమాధానాలిస్తారు. ఇవి మీరే ఇస్తారా? సంపాదకు లిస్తున్నారా?

● వారిస్తే నాపేరెందుకేస్తారయ్యా బాబూ!

బి. హెచ్. ఆర్. కొత్తపల్లి

★ మీ సమాధానాలు పురుషుల మనస్సును ఎంతగానో నొప్పిస్తున్నాయి.... మీ సలహా?

● సింపుల్. చదవద్దనండి! చదవ మని ఎవరు కంపెల్ చేస్తున్నారు. పత్రికలో పడే అన్నీ అందరూ చదవరు. ఎవరికి నచ్చినవి వారు చదువుతారు.

డి. పి. ఖుర్దారోడ్డు

★ మీ ప్రశ్నావళి అంటే నాకు చాలా యిష్టం. పత్రిక రాగానే ముందు చదువుతాను.

● సంతోషం. నువ్వూ తిట్టుకుంటూ చదువు తావా పద్మజా?!

పి. ఎస్. ఆర్. ఎమ్. గుంటూరు

★ మీ దృష్టిలో భగవంతు డంటే ఎవరు?

● మంచి మనసు, సహృదయం, సహాయ గుణం, ప్రేమ, దయ, జాలి, కరుణ, సేవ-యివన్నీ దైవ స్వరూపాలే కద- వేరే ప్రత్యేక రూపం, స్థలం, సమయం దేవుడి కోసం కావాలా?

జి. ఎస్. ఆర్. చీరాల

★ నీవు ఏమన్నా చదువుకున్నావామ్మా? సమాధానాలు చూస్తే చదువు కొనట్టుగా తోస్తుంది. స్త్రీలకు మన సనాతన ధర్మం యిచ్చినంత స్వాతంత్రం యింకే మతం యివ్వలేదే ఏమిటి నీ వట్లా రాస్తావు?

● అయ్యా రిటైర్డు సివిల్ ఇంజ నీరుగారూ, మీరు ఏకాలంలో వున్నారు?! సనాతన ధర్మం మగాడికిచ్చిన హక్కులను బాధ్యతలను తు. చ. తప్పక పాటిస్తున్నట్టేనా? ఆడవారు మటుకు దాన్ని పట్టుకు పాకులాడాలా? అది యిచ్చిన స్వతంత్రం ఏమిటి? కాస్త ఆలోచించండి. ఇక నా చదువు గురించి ఆలోచించకండి. ఎందుకంటారా? అది సనాతనం కాదు..... నా సమాధానాలు ఊపిరి తీసే మనుషుల కోసం. మెట్ట వేదాంతుల కోసం, ప్రాచీన ధర్మోద్ధారుల కోసం, మాత్రం కాదు. క్షమించండి.

జి. వి. ఆర్. న్యూ పాల్వంచ

★ నేడు ఏ పత్రిక చూసినా, కథ చదివినా సెక్సు ఎక్కువగా వుంటూంది. కారణం ఏమిటి?

● పాఠకు లదే కావాలంటున్నారని- పత్రికల వాళ్ళు అంటున్నారు.

ఎల్. ఆర్. నౌపాడ

★ ఈ నాటి స్త్రీలు ఉద్యోగం చేయడంలో ఉద్దేశ్యం మగవారిని సూటి పోటీ మాటలతో వేధించడానికా? లేక వారి బ్రతుకు తెరువు కొసమా?

● మగవాళ్ళెందుకు చేస్తున్నారు ఉద్యోగాలు? సంపాదనకేగా? మరి ఆడవాళ్ళు అదే ఉద్యోగం చేస్తే - తప్పేముంది? సంసారం గడవడానికే వీళ్ళూ ఉద్యోగాలు చేస్తారు. మానసిక తృప్తి కొసం ఉద్యోగాలు చేసే స్త్రీలు చాలా అరుదు. ఈ దేశంలో కష్టం కూడా. ఆడదాని ఉద్యోగానికీ, సంపాదనకి కూడా విలువ తీసి పారేసి మాట్లాడే తత్వం చాలా మందిది. అలాంటి వాళ్ళు సూటీపోటీ మాటలూ పడాలి. అవ్వా కావాలి. బువ్వా కావాలి అంటే యింక కుదరదు మరి..... ఎంత ఆడదే అయినా ఓర్పు ఎన్నాళ్ళ కేనా ఓర్పు సన్నగిలడం ప్రారంభించదా?

బి. ఎ. కె. కోట బొమ్మాళి

★ మనసుకి గుణానికి తేడా ఏమిటి?

● మనసుని చెప్పక చెప్పేదే గుణం. అంచేత తేడా తక్కువ.

★ మీరు దేవుణ్ణి పూజిస్తారా? కోపిస్తారా?

● పాపం ఆయనగారేం చేశాడు కోపించడానికి?!


ఎన్. ఎస్. పి. పొద్దుటూరు


★ ఈ కాలానికి ఉద్యోగస్తులు మేలా? వ్యాపారస్తులు మేలా?

● వ్యాపారస్తులే మెరుగు, కొల బుర్రడు వుండదు రాబడి.

★ మీ యింటికి వస్తే మమ్ములను ఆహ్వానిస్తారా?

● వచ్చేసాక, రండి అంటారా అనా?- ఆహ్వానించడం - నేను పిలిస్తే! రాడం - మీరు వస్తే!! □





ప్లీజ్....నన్ను శపించు నేస్తం”



తులసి బాలకృష్ణ

జ్యోత్స్న ప్రవర్తనకి నిర్విణ్ణుడై, నోట మాటరాక నిలబడి పోయాడు కమలాకర్. తనెరిగిన జ్యోత్స్నేనా ఇలా ప్రవర్తిస్తున్నది అని ఆశ్చర్యపోయాడు. అసలు జరుగుతున్నది కలా నిజమా అనే అనుమానంతో గిజగిజలాడి పోయాడు....

.... జ్యోత్స్న!!

– ఏడెనిమిది నెలల క్రితం తను కాలేజీని, ఆ తర్వాత ఈ ఊరినీ వదిలిపెట్టే వరకూ తన నీడై తిరుగుతూ, గురువుగా పూజించి, స్నేహితుడిగా ఆప్యాయత కురిపించి, కళాకారుడిగా ఆరాధించి, తనే లోకం అన్నట్లుగా ప్రవర్తించిన జ్యోత్స్న.... "నాలో నిద్రాణంగా వున్న కళల్ని తట్టి లేపింది నువ్వే కమలాకర్" అని కృతజ్ఞతతో పలికిన జ్యోత్స్న.... "నువ్వెళ్ళిపోతే మన కళాశాలలో కళ పోయి వట్టి శాల మాత్రం మిగుల్తుంది" అని డగ్గుత్తికతో పలికిన జ్యోత్స్న.... "నువ్వే నాకు గురువువి, స్నేహితుడివి, ఆదర్శానివి, అన్నవి, అన్నీ. రేప్పొద్దున్న నాకు భర్తగా లభించే వ్యక్తి నీతో నా పరిచయానికి అభ్యంతరం చెప్తే– అతన్నే వదిలి పెడ్తాను. లేదా, అవసరమయితే జీవితమే వదిలి పెడ్తాను" అంటూ ఘోరమైన శపథం చేసిన జ్యోత్స్న.... ఇంత కేర్‌లెస్‌గా.. ఇంత గర్వంగా. . ఎవరో మామూలు వ్యక్తి దగ్గర, క్రొత్త వ్యక్తి దగ్గర ప్రవర్తించినట్లుగా.. !?!

"ఒకవేళ నేనే పొరబాటు పడుతున్నానేమో. పని వత్తిడితో ఆమె బిజీగా వుండి వుంటొచ్చు– మరోసారి పలకరిద్దాం. ఏమయినా అవసరమయితే సాయం చేద్దాం" అనుకుంటూ, స్టేజి డెకరేషన్ డైరెక్టు చేస్తూన్న ఆమె వద్దకు నడిచి, "ఏం జ్యోత్స్నా– ఎలా వుంది కల్చరల్ సెక్రటరీగా రెస్పాన్సిబిలిటీ? ఇంతకు ముందు ప్రతి కాలేజీడేనాడూ నేను కంగారు పడ్తూంటే ఎగతాళి చేసే దానివి కదా– ఇప్పుడు అనుభవంలోక వచ్చిందా అమ్మాయికి?!" అంటూ ఉడికిస్తున్నట్లుగా నవ్వాడు కమలాకర్

చర్రున అతని వైపు తిరిగి, తీవ్ర స్వరంతో అంది జ్యోత్స్న, "నో– నాటెటాల్. చాలా సునాయాసంగా చిటికల మీద జరిపించేస్తున్నాను పన్లన్నీ. అన్‌డౌటెడ్‌గా గ్రాండ్ సక్సెస్ అయి తీరుతుంది ప్రోగ్రాం."

– దెబ్బ తిన్నాడు కమలాకర్.

గతంలో లాగ చనువుగా, ఆప్యాయంగా, హాస్యయుతంగా జవాబు చెప్తుందేమో, "కొంచెం సజెషన్సిచ్చి, హెల్ప్ చెయ్యకూడదా పెద్ద" అని ముద్దొచ్చేట్లు జాలిగా అడుగుతుందేమో నని ఆశ పడి, భంగపడ్డాడు.

జ్యోత్స్న అక్కడ్నుంచి కదలి, పని వాళ్లకు ఏవో పురమాయించి, మళ్లీ ఇటు వస్తూ, "అవునూ, ఒఖ్ఖడివే వచ్చావా– మీ ఆవిడని కూడా తీసుకొచ్చావా?" అనడిగింది. కాని ఆ ప్రశ్నలో ఆశించే జవాబు ఏమీ అగుపడలేదు కమలాకర్‌కి గాయపడ్డ మనస్సుతో అన్నాడు, "కేవలం పెర్ఫార్మెన్స్ ఇచ్చి బాధ్యత తీర్చుకోవడానికేగా నాకు పిలుపు వచ్చింది. నాకిక్కడ ఎవ్వరూ సన్మానం చెయ్యడం లేదు కదా! అందుకనే ఒఖ్ఖడినీ వచ్చాను"– ఈ సారన్నా తన బాధని అర్థం చేసుకుంటుందేమో నన్న చిరు ఆశతో ణికిసలాడింది అతని గొంతులో.

ఆ మాటల్ని పట్టించుకోలేదు జ్యోత్స్న. "ఏం కమలాకర్– పనుల హడావుడిలో నిన్ను నేను సరిగ్గా పట్టించుకోక హర్ట్ చేసానా? హర్ట్ చేస్తే మాత్రం కైండ్లీ ఎక్స్‌క్యూజ్‌మి" అని క్షమాపణలు చెప్పుకోలేదు. పైగా ఇలా అంది, "ఈవాళ నీ మోనో యాక్షన్ చాలా సింపుల్ అండ్ సూపర్బ్‌గా వుండాలి.

అంతా ఎలైట్ వస్తున్నారు. నీకు టెన్ మినిట్స్ టైమ్. దాటకూడదు సుమా. ఆఁ! అన్నట్లు, మునుపట్లా ఆ ఏడుపులూ, పెడబొబ్బలవీ వద్దు. చక్కగా హాయిగా డీసెంట్‌గా నవ్వొచ్చేదేదైనా చెయ్యి. ఓకే?"

అదురుతూన్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ, తలదించుకుని, ఎఱ్ఱబడ్డ ముఖంతో, ప్రయత్నం మీద గొంతు పెగల్చుకుని, అన్నాడు కమలాకర్, "నాకు చేత నయినదేదో చేస్తాను."

"రైట్. నేనొస్తానూ. ఈరోజు ఛీఫ్‌గెస్ట్‌గా సినీహీరో కళ్యాణ్ వస్తున్నారు. ఈ రోజు ఆయనే మెయిన్ ఎట్రాక్షన్. గెస్ట్‌హవుస్‌లో దిగారు. నేను వెళ్ళి, ప్రోగ్రాంటైముకి కారులో తీసుకు వస్తాను. ఈలోగా నువ్వు ఇంకొకసారి పోర్షన్ అదీ బాగా చూసుకుని; టైముకి మేకప్ చేయించుకుని రెడీగా వుండు" అని హడావుడిగా వెళ్ళి పోతూన్న ఆమెని మంచు తెరల్లాంటి కన్నీటిపొరల వెనుకగా చూస్తుండి పోయాడు–

గుండెలు మండు తున్నాయి.

మనస్సుకి పెద్ద బండరాయి కట్టి గుంజ తున్నట్లుగా వుంది.

కొద్ది నెలల క్రితం వరకూ కల్చరల్ ఏక్టివిటీస్‌కి మకుటంలేని మహారాజై తను ఏలిన తన కాలేజీలో.... తనొక అనామకుడిలా.... బ్రతిమాలి తన కళను ప్రదర్శించు కునేందుకు ఛాన్సు సంపాదించుకున్న వాడిలా....

ఆపుకోలేని బాధలో అతని కళ్ల నిండా నీళ్ళు ఉబికాయి.

..... తనకు ఎంతో చక్కటి ఆహ్వానం, ఆప్యాయతా లభిస్తుందనీ, తన రాకతో ప్రోగ్రాంకే కళ వచ్చిందంటూ జ్యోత్స్న సంతోషిస్తుందని ఎంతో ఆశించాడు. కాని ఇలా.....

అప్రయత్నంగా ఆడిటోరియం బయటకు నడిచి, కాలేజీ ఆవరణంతా ప్రేమగా కలియ చూశాడు. అయిదు సంవత్సరాల పాటు తనని అందలం ఎక్కించి తాము బోయీలై అభిమానంతో మోసిన

"ప్లీజ్ – నన్ను శపించు నేస్తం"

చెట్లూ, ఆట స్థలాలూ, భవంతులూ, ఆనందంతో పులకించి పోతూ, ఆప్యాయంగా పలకరిస్తున్న భ్రాంతి కలుగుతోంది.

టైము చూసుకున్నాడు – మూడు.

ఇంకా ప్రోగ్రాం ప్రారంభమవడానికి నాలుగు గంటల టైముంది.

జ్యోత్స్న నుంచి వచ్చిన ఆహ్వానానికి సంబరపడి పోయి, ఆఫీసరుని ఎంతో బ్రతిమలాడి, రెండు రోజుల శెలవు మాత్రం అతి ప్రయత్నం మీద సంపాదించుకుని, భార్య ప్రోత్సాహాన్ని పొంది, గర్భవతి అయిన ఆమె నొఖ్ఖత్తెనీ అక్కడే తప్పనిసరి అయి వదలి, రాత్రి రైలు ఎక్కితే– ఈ ఉదయానికే చేర వలసిన రైలు, ఆలస్యమయి మధ్యాహ్యం ఒంటి గంటకు చేర్చింది. లాడ్జికి పోయి, హడావుడిగా స్నానపానాదులు ముగించుకుని, రెండు మెతుకులు కొరికి, ఇక్కడ తన సహాయం ఏవిధంగా కావలసి వస్తుందో నని కాలేజీకి పరుగెత్తుకు వస్తే..... లభించిన గౌరవం ఇదీ–

కాలేజీ ఆవరణంతా దాదాపు నిర్మానుష్యంగా వుంది.

ఒకళ్లిద్దరు వాలంటీర్లు, పనివాళ్ళు ఆడిటోరియం సర్దడంలో బిజీగా వున్నారు.

ఇప్పుడేవిటి చెయ్యడం? ఊళ్లో తన నెరిగివున్న స్నేహితులు కొన్ని వందలున్నారు. కాని చెదిరిన మనస్సుతో వాళ్లని కలిసి ఎంజాయ్ చేయగలడా తను? ఇంతగా ఆశాభంగం చెంది కూడా, రాత్రి వరకూ వుండి, పెర్ఫార్మెన్స్ ఇచ్చి, అనామకుడిగా వెళ్లి పోవడమా, లేక ఇప్పుడే చడీ చప్పుడూ లేకుండా వెళ్లిపోవడమా? అలా వెళ్లిపోతే..... ఆమె తనని ద్రోహి అనుకోదూ? ఇంకా ఏ కొశానో మిగిలిన ఆ కొంచెం అనురాగం కూడా ఇగిరిపోదూ?! మరి ఉంటే.... ఈ బాధతో తను అంత క్లిష్టమయిన పాత్రని విజయవంతంగా పోషించగలడా?!..... ఏమో, ఈ బాధే ఆ పాత్ర పోషణకి బాసటగా నిలుస్తుందేమో..... సాయంత్రానికి ఆమె మారి, మంచిగా ప్రవర్తిస్తుందేమో..... ఏది ఏమయినా అసలైన కళాకారుడు ఎప్పుడూ ప్రదర్శన ఇవ్వకుండా మోసం చేయకూడదు.... ఉండి పోవడానికే నిశ్చయించు కున్నాడు కమలాకర్.

నెమ్మదిగా గ్రౌండ్స్ మధ్యలో వున్న మర్రి చెట్టు దగ్గరకు నడిచి, వ్రేళ్ల మీద జరిగి, ఆకుల మధ్యగా ఆకాశాన్ని చూస్తూ, గతంలోని మధురాను భూతుల్ని నెమరు వేసుకోవాలని ప్రయత్నమయితే చేశాడు కానీ, మనసు మాత్రం పదే పదే ఈ రోజు కలిగిన బాధకే మూగగా మూలుగుతోంది.

–పశ్చిమాకాశం సంధ్యారాగాన్ని సంతరించుకుని, ఎఱ్ఱ చీర ధరించి, అరుణ బింబాన్ని బొట్టుగా దిద్దుకుని ముస్తాబవుతూండగా, స్టూడెంట్లూ, లెక్చరర్లూ ఒక్కొక్కరే వస్తూండటంతో కాలేజీ ఆవరణ కళకళ లాడసాగింది. వస్తూన్న వారి నెవ్వరినీ ఆకర్షించడం ఇష్టం లేక చెట్టు చాటుకు పోయి కూర్చున్నాడు గాని, అతనిని కొందరు గమనించడం, అతనిని చుట్టు ముట్టి, అతనిప్పుడు ఎక్కడుంటున్నదీ ఏం చేస్తున్నదీ కనుక్కొని, అతని ఏక్టివిటీస్ గురించి విచారించి, ఈ రోజు అతను ఏం పెర్ఫార్మెన్స్ ఇవ్వబోతున్నాడో ఉత్సుకతతో వాకబు చేస్తుంటే– తిరిగి ఉత్సాహం పుంజుకుంది కమలాకర్‌లో. చాలా సరదాగా వాళ్లతో సంభాషిస్తుంటే ఒక వాలంటీర్ వచ్చి, "కమలాకర్ గారూ– ఈ రోజు కల్చరల్ ప్రోగ్రాంలో పార్టిసిపేట్ చేసే వాళ్లందర్నీ వెంటనే గ్రీన్ రూం లోకి వెళ్లి తయారు కమ్మని జ్యోత్స్న గారు కబురు పంపారండీ. ప్లీజ్ మీరు రావాలి" అన్నాడు.

"ఓ ష్యూర్" అంటూ, మిత్రుల దగ్గర శలవు తీసుకుని, గ్రీన్‌రూం వైపు నడిచాడు కమలాకర్.

అతని వెనకనే నడుస్తున్న ఒక స్టూడెంట్ అడుగుతున్నాడు వచ్చి పిలిచిన వాలంటీర్‌ని, "జ్యోత్స్న ఎక్కడుంది?"

"సినిమా హీరో కల్యాణ్ వచ్చాడుకదా. గెస్ట్ హవుస్‌లో దిగాడు. ఆయన గారిని తీసుకు రావడానికి మధ్యాహ్నా వనగా వెళ్ళింది. అక్కణ్ణుంచే ఆర్డర్లు జారి చేస్తోంది. ఒళ్ళు మండి పోతోంది నాకు. తనిక్కడుండి అన్నీ చూసుకోవచ్చుగా? ఆయన గార్ని తీసుకురావడానికి మగాళ్లు పనికి రారు కాబోలు. అసలు ఫాద్దున్న అతగాడు ఊళ్లో దిగినప్పట్నుంచి తెగ పూసుకు తిరుగుతోందిలే."

–కమలాకర్‌కి చాలా బాధనిపించింది. ఇక వినలేక వడివడిగా ముందుకు అడుగులు వేశాడు.

గ్రీన్ రూంలోకి వెళ్తూనే బట్టలు మార్చుకుని, ప్రార్థన చేసుకుని, మేకప్ మేన్‌కి నమస్కరించి, పాత్రని అతనికి బోధించి, కదలకుండా కూర్చుని, మేకప్ పూర్తయ్యాక మళ్లీ అతనికి నమస్కరించి, పాత్రోచితమైన దుస్తులు ధరించి, అద్దంలో చూసుకుని సంతృప్తిగా నిట్టూర్చాడు కమలాకర్.





తల్లి పాలు బిడ్డకు అన్నిటికీ మించిన పోషకాహారమేకాక ఎంతో మానసిక సంతృప్తిని కూడా కలుగచేస్తాయి



తల్లి పాలు తాగటం వలన మాతా శిశువుల ఆత్మానుబంధం ఎంతో దృఢతరమవుతుంది. తల్లి ప్రేమను బిడ్డకు పంచి పెట్టేందుకు యిదే ప్రకృతి సిద్ధమైన పద్ధతి. శిశువు సంతోషంగా సంతృప్తిగా పెరిగేందుకు దోహద పడుతుంది.

కేవలం తల్లి పాలు మాత్రమే బిడ్డకు కావలసిన పోషకాహారాన్ని, సమపాళ్ళలో అందించ గలుగుతాయి.

మీ బిడ్డను, మీ చనుపాలతోనే పెంచండి. అదే ప్రకృతి నిర్దేశించినది, మీ శిశువుకు కావలసినది.

కాని ఏదైనా అనుకోని ఇబ్బంది వచ్చినపుడు, అంటే ఏదైనా జబ్బు చేసినప్పుడో, పాలు సరిపడనప్పుడో విజయ స్ప్రేను వాడండి – చక్కగా పరీక్షించబడిన నమ్మకమైన శిశు ఆహారం. మీ బిడ్డ ఆరోగ్యం కాపాడడానికి డబ్బా మీద వ్రాసిన సూచనలను క్షుణ్ణంగా చదివి, అమలు పెట్టండి.

శిశు సంరక్షణ కొరకై, విజయ స్ప్రే తయారీ దారులైన ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య వారిచే విడుదల చేయబడినది.

AKSHARA 15986 APDDCFL (Tel)

'ఇప్పుడు జ్యోత్స్న వుంటే ఎంత బాగుండేది?! ఈ మేకప్ చూసి, జోకులు వేసేది. పాత్రని వివరిస్తుంటే శ్రద్ధగా వినేది. స్టేజిమీద తను మై మరచి నటిస్తుంటే తనూ సర్వం మరచి చూచేది':

మళ్ళీ ఇందాకటి వాలంటీర్ వచ్చాడు గ్రీన్ రూంలోకి.

"ఇంకో పావు గంటకి– అంటే టంఛన్‌గా ఏడుగంటలకి కార్యక్రమం మొదలవుతుంది. ప్రార్థన అవుతూనే కమలాకర్ గారి మోనో ఏక్షన్" అన్నాడు.

త్రుళ్ళి పడ్డాడు కమలాకర్–

"జ్యోత్స్నని రానీండి – ఈ లోగా ఎవరిదైనా....."

"లేదండి. ఆవిడే కబురంపారు. హీరో గారు బయల్దేరడానికి ఆలస్యమవవచ్చుట. ఆయన బయల్దేరే వరకూ ఆమె వెయిట్ చెయ్యాలి కదా. అందుకని ఏడుగంటలకి ప్రార్థన చేసేసి, వెంటనే కమలాకర్ గారి మోనోఏక్షన్, ఆ తర్వాత లైట్ మ్యూజిక్ చేయించెయ్యండని ఆవిడ కబురంపారు."

నిరుత్సాహపడి పోయాడు కమలాకర్.

జ్యోత్స్న లేకుండా పెర్ఫార్మ్ చెయ్యాలా? అసలంత దూరం నుంచి వచ్చిందే ఆమె కోసం. మధ్యాహ్నం ఆమె అంత కేర్‌లెస్‌గా ప్రవర్తించినా, పెర్ఫార్మెన్స్ చూశాక అయినా ఆమెకు మళ్ళీ పాత స్నేహం గుర్తొచ్చి, అప్పటి అభిమానం పెల్లుబుకుతుందని కదా ఆశించింది!

క్షణాలు గడుస్తున్న కొద్దీ ఆమె కోసం అతనిలో ఆతృత ఎక్కువ కాజొచ్చింది.

ఏడయ్యింది.

ప్రార్థన ప్రారంభమయ్యింది.

రెండు నిముషాల్లో ముగిసింది.

కమలాకర్ మోనో యాక్షన్‌కి సంబంధించిన అనౌన్స్‌మెంట్ అయ్యింది. పూర్వ విద్యార్థి కమలాకర్ మోనో యాక్షన్ చేస్తాడనే అనౌన్స్‌మెంట్ వింటూనే కరతాళ ధ్వనులు మ్రోగాయి.

స్టేజి మీదకు వెళ్తూ వంగి కళ్ళ కద్దుకుని, ఆఖరి ఆశగా గుమ్మం వైపు చూశాడు జ్యోత్స్న కోసం. ఆమె రాలేదు. ఈ రోజు అమోఘమయిన ఏకపాత్రాభినయం చేయబోతున్నాడు తను. హాస్యంతో ప్రారంభమయి, రౌద్రంగా నడిచి, దుఃఖంతో సమాప్తమయ్యే పాత్ర అది. ఎప్పటి లాగే జ్యోత్స్న తనకి స్టేజి మీదకు వెళ్ళేముందు బెస్టాఫ్ లక్ చెప్పుతుందని ఆశించాడు. ఫలించలేదు.

ఇంక ఆలస్యం చేస్తే కళకి ద్రోహం చేసినట్లే.

మనస్సుని పాత్ర మీదకు మరల్చి, పరకాయ ప్రవేశం చేసి, రంగస్థలం మీదకు నడిచారు కమలాకర్.

అతన్ని చూస్తూనే తిరిగి హర్షధ్వానాలు చేశారు ప్రేక్షకులు.

అంతే – కళాకారుడ్ని హిమాలయాల శిఖరాగ్రాన కూర్చోపెట్టే ఆ హర్షధ్వానాలకు కమలాకర్ హృదయం ఆనంద తరంగమయి పోగా, అద్వితీయంగా అభినయాన్ని ప్రారంభించాడు. అతని అతిచక్కని ఆంగిక సాత్వికాభినయాలకు, విరిచి చెప్పే డైలాగ్ డెలివరికి పదేపదే తరంగాలుగా

"ప్లీజ్ –నన్ను శపించు నేస్తం"

నవ్వులూ, చప్పట్లూ వినిపిస్తూనే వున్నాయి. పాత్ర స్వభావం ప్రకారం హాస్యాన్ని గుప్పించి, నెమ్మదిగా పాత్ర తాలూకు రెండవ ముఖాన్ని స్వంతం చేసుకుని, రౌద్ర రసాన్ని క్రమేపీ అభినయిస్తూ, ఉద్రేకంతో సంభాషణలు చెప్తుంటే – హాలంతా ఏ ఒక్కరు ఊపిరి వదిలినా వినిపించేటంతటి నిశ్శబ్దాన్ని సంతరించుకుంది. కనురెప్పలు వేయడం మరచి పోయి, నటరాజు ఆవహించిన కమలాకర్‌ని తదేకంగా చూస్తున్నారు ప్రేక్షకులు –

అంతలో –

అవాంతరం!!

నిశ్శబ్దానికి భంగం!!

కళకు తీరని కళంకం!!

– బయట పెద్ద చప్పుడు చేస్తూ ఆగిన కారులోంచి దిగిన హీరో గారు మెట్లెక్కి వస్తున్నారు. జ్యోత్స్న వెన్నెల నవ్వులు కురిపిస్తూ అతనికి అంటీ అంటనంత దూరంలో నడుస్తూ అతనికి ఆహ్వానం పలుకుతోంది. ప్రేక్షకులలో ఒకరి తర్వాత ఒకరూ అటువైపు చూడడం, తమ సహజమయిన వ్యామోహం కొద్దీ ఉత్సాహంగా కేకలు పెట్టడం, కొందరు లేచి నిలబడితే, మరికొందరు కుర్చీలను తోసుకుంటూ వరండాలోకి పరుగెత్తడం క్షణాల్లో జరిగిపోయింది.

హీరో లోపలకు అడుగు పెడ్తూనే అందరికీ చేతులు ఊపేసరికి చాలామంది ఉత్సాహంతో చప్పట్లు చరిచారు.

ఒక్కసారిగా భయంకర నిశ్శబ్దం నుంచి వాతావరణం విపరీతమయిన గందరగోళ స్థితికి మారేసరికి, ఏకాగ్రత చెదిరిన కమలాకర్ అప్రతిభుడై, అంతలోనే నిలద్రొక్కుకుని, ధైర్యాన్ని కూడదీసుకుని, తనలో కలిగిన వికారాన్ని ముఖంలో అగుపడనీయకుండా జాగర్త పడుతూనే, ఓరకంట గుమ్మం వైపు చూస్తూనే కారణం గ్రహించి, ఉగ్రుడయ్యాడు.

జ్యోత్స్నని మింగెయ్యాలన్నంత కోపం ఉబికింది అతనిలో.

జ్యోత్స్న నిర్లక్ష్యంగా స్టేజి మీదున్న కమలాకర్ వైపు చూసి, చికాకు పడిపోయింది. హాస్యం చెయ్యమంటే అరుపులు మొదలెట్టాడే అని విసుక్కుంది. అతిథికి పెడబొబ్బలతో ఆహ్వానం చెబుతున్నామేనని బాధ పడుతూ, కమలాకర్‌కి కనిపించేలా తల కొట్టుకొనేసరికి – గుండెల్లో గునపం దిగేసినట్లు మెలికలు తిరిగి పోయాడు. కమలాకర్.,

స్టేజి వైపొకసారి చూసి, నవ్వాపుకుంటూ, "ఎవరు పాపం అతనూ, అంతగా బాధ పడుతున్నాడూ?" అనడిగాడు హీరో జ్యోత్స్నని.

"ఎక్స్ స్టూడెంట్ - స్టేజెక్కితే ఓ పట్టాన దిగడు. గొప్ప జిడ్డు" అంది మళ్ళీ తల కొట్టుకుంటూ.

"ఏమిటట పాపం బాధ? మళ్ళీ కాలేజీలో చేరతాట్టా?" అంటూ ఫెళ్ళున నవ్వాడు హీరో. అతని నవ్వులో శృతి కలిపింది జ్యోత్స్న అతని ప్రక్క సీట్లో కూర్చుంటూ. వాలంటీర్ ఒకర్ని పిలిచి, మోనో యాక్షన్ త్వరగా ముగించమని కమలాకర్‌కి చెప్పమంది.

ప్రేక్షకుల్లో అలజడి ఇంకా తగ్గలేదు.

హీరో గారి వైపే వుంది అందరి దృష్టి.

అగ్నిపర్వతాలు బ్రద్దలవుతూన్నాయి కమలాకర్ గుండెల్లో. ఒళ్ళంతా చెమట ధారలుగా కారసాగింది. శరీరం మీద బట్టలొక్కటొక్కటిగా ఎగిరిపోయి, తను అన్ని వందల మంది ముందు నగ్నంగా నిలబడ్డట్లు, అందరూ తనని చూసి పరిహసిస్తున్నట్లు భ్రాంతి కలుగుతూండగా – అదుపు తప్పిన ఆవేశంతో పిచ్చిగా ఘొల్లున ఏడుస్తూ, అంతలోనే పగలబడి నవ్వసాగాడు.

క్షణాల్లో మళ్ళీ హాలంతా నిశ్శబ్దం ఆవహించింది.

ఆ నిశ్శబ్దమే కమలాకర్‌ని అదుపు తప్పకుండా ఆదుకుంది. పరిస్థితి అర్థమయ్యింది అతనికి. కళాజీవితంలో మొట్టమొదటి సారిగా ఫెయిలయ్యే పరిస్థితి తృటిలో తప్పిందని గ్రహించాడు. తన అదృష్టం కొద్దీ పాత్ర ప్రకారం కూడా తను ఉన్మాద స్థితినే అభినయించి, శోకానికి బానిసయి పాత్రని ముగించాలి. ఉత్సాహంగా ముందుకు సాగాడు కమలాకర్.

మరో అయిదు నిముషాలకు ముగించాడు.

తెరపడింది.

మరో అరగంటలో మిగిలిన సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసాయి. జ్యోత్స్న స్టేజి మీదకు వచ్చి మీటింగుకి ఏర్పాట్లు చేయించింది. కమలాకర్‌ని త్వరగా ముగించమని చెప్పలేక పోయిన వాలంటీర్ మీద సన్నగా విసుక్కుంది.

పాత్రలో నుంచి తిరిగి మామూలు మనిషిగా మారి, నీరసంగా నడిచి, గ్రీన్‌రూంలో ప్రవేశించి, వేషం మార్చుకున్నాడు కమలాకర్. ఇప్పటికయినా జ్యోత్స్న వచ్చి కంగ్రాట్యులేషన్స్ చెప్తుందేమోనని ఎదురు చూసాడు. ప్రేక్షకుల్లో ఎవ్వరూ కూడా వచ్చి అతన్ని అభినందించలేదు. అందరూ హీరో గారిని దగ్గర నుంచి చూడడానికి, ఆటోగ్రాఫ్‌లు తీసుకోవడానికి సంబరపడుతున్నారేగాని, కమలాకర్ ధ్యాసే ఎవ్వరికీ లేదు.

తెర తెరచుకుంది –

చిరునవ్వులు చిందిస్తూ, మైకు ముందు బొమ్మలా నిలబడి వుంది జ్యోత్స్న. గొంతు చిన్నగా సవరించుకుని, కాలేజీ ప్రిన్సిపాల్‌నీ, హీరో గారినీ వేదిక మీదకు ఆహ్వానించి, పూలదండలతో సత్కరించింది. ఆపైన హీరోగారిని తన భాషా పరిజ్ఞానం అంతా ఉపయోగించి కీర్తించింది. ఆయన క్రీగంట చిరునవ్వులతో కృతజ్ఞతలు అందజేస్తే – తన్మయత్వంతో అందుకుని, ఉప్పొంగే గుండెల్లో భద్రంగా దాచుకుంది.

తర్వాత హీరోగారు మాట్లాడారు. కాలేజీ అమ్మాయిలూ, అబ్బాయిలూ తన పిక్చర్లని ఎక్కువ

లైక్ చేసా్తరనీ, అమ్మాయిలు తనకు ప్రేమలేఖలు విపరీతంగా వ్రాసూ్తంటారనీ చెప్పారు. తర్వాత ఆయన ఉపన్యాసం జ్యోత్స్న పైకి మళ్లింది.

"ప్రసు్తతం మా ఫీల్డులో చదువు, సంస్కారం, కళ వున్న హీరోయిన్లకు కరువుంది. జ్యోత్స్న గారికి ఇంట్రస్టు వుందో లేదో తెలియదు నాకు గానీ అందం, చలాకీతనం, చదువు, సంస్కారం, కళ వున్న ఆవిడ నెంబర్ వన్ హీరోయిన్ కాగలరు" అనగానే హాలంతా చప్పట్లు, ఈలలూ, గోల పేట్రేగి పోయింది.

జ్యోత్స్న ఆనందంతో మెలికలు తిరిగి పోయింది.

మరో నిముషానికి తన ఉపన్యాసాన్ని ముగించి, కూర్చున్నాడు హీరోగారు.

ప్రిన్సిపాల్ శ్రీమతి జానకీప్రసాద్ గారు నిలబడ్డారు మైకు ముందు.

అంతా నిశ్శబ్దం- ఆవిడ యెడల గల భయ భక్తులకు తార్కాణం.

"సభకి వందనం. నేను ఇప్పుడు మన కాలేజీకి సంబంధించిన ఏ విషయాలూ మాట్లాడ బోవడం లేదు. నేటి కార్యక్రమానికి సంబంధించి రెండు ముక్కలు మాత్రం మాట్లాడుతాను. నేను పెద్దదాన్ని కాబట్టి, ఎవరినయినా నా మాటలు నొప్పిస్తే, అంతగా పట్టించు కోకూడదని కోరుతున్నాను, సరి అయిన పద్ధతిలో ఆలోచిస్తే నన్ను అపార్థం చేసుకునే అవకాశమే వుండదని కూడా మనవి చేసు్తన్నాను.

"మన ముఖ్య అతిథి కూడా నాకంటే బాగా చిన్నవారు కాబట్టి, నన్ను తప్పుగా అర్థం చేసుకోరని నమ్ముతూ, నాలుగు మాటలు చెప్తున్నాను. నేను వీరి సినిమాలు ఏవీ చూడలేదు. మా పిల్లలు చూసూ్తంటారు అన్ని సినిమాలూ. ఈ రోజుల్లో సినిమా హీరోకి నటనతో పరిచయం వుండాల్సిన అవసరం ఏమాత్రం లేదనీ, కాస్త ఎర్రగా బుర్రగా వుండి, నాలుగు ఫైట్లూ, అయిదు డ్యాన్సులూ చేయగలవాడే ఈ రోజుల్లో సినీ హీరో అని వాళ్లంటూంటారు. మరందులో నిజమెంతో నాకు తెలియదు. అయితే వీరు అటువంటి హీరో అయ్యుండరని, మంచి నటులనీ నమ్ముతున్నాను."

-జ్యోత్స్న కంగారు పడింది, హీరోగారు కోపగించుకుంటారేమోనని. అయితే ఆయన గారు మాత్రం ఇప్పుడు అసలయిన నటన ప్రదర్శిసూ్త, తన లోని వికారాన్ని బహిర్గతం కాకుండా కాపాడు కుంటున్నాడు.

గ్రీన్‌రూంలో అవమాన భారంతో డీలా పడిపోయి కూర్చుని వున్న కమలాకర్‌లో కొద్దిగా చలనం కలిగింది. జ్యోత్స్న గాని, హీరోగాని తన మాటే ఎత్తలేదు. కనీసం ప్రోత్సాహం కోసమయినా తన నటన బాగుందనలేదు. ఇంక ప్రిన్సిపాల్ గారు తనని మెచ్చు కుంటారన్న ఆశ అతనికి ఏ కోశానా లేదు. కాలేజీలో చదువుతున్నన్నాళ్లూ 'బుద్ధిగా చదువుకోక ఎందుకి నాటకాలు' అంటూ చివాట్లు పెడుతూండేవారు. అసలెప్పుడూ కల్చరల్ ప్రోగ్రాములు చూడడానికి రాని ఆవిడ ఈ వాళ వచ్చారు- బహుశా అందరితో బాటే తనూ ఒక పోటు పొడవడానికేమో.

"ఇంక ఈ రోజు ప్రోగ్రాం ఆర్గనైజేషన్ గురించి- వచ్చిన అతిథులు ఎంత గొప్ప వారయినప్పటికీ, అప్పటికి స్టేజి మీద జరుగు తూన్న ప్రదర్శనకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడవలసిన బాధ్యత కార్యకర్తలకు ఉంటుంది. చక్కటి ప్రదర్శన మధ్యలో అలజడి రేగి, అభాసు పాలయితే ఆ కళాకారులు ఎంతగా బాధ పడతారో నేను ఊహించగలను. ఈ రోజు కార్యక్రమం మధ్యలో జరిగిన ఆ అలజడిని నేను తీవ్రంగా గర్హిసూ్త, అది కార్యకర్తల అసమర్థతగా చెబుతున్నాను".

-జ్యోత్స్న ముఖం నల్లగా మాడి పోయింది.

యాంత్రికంగా తల దించుకుంది.

గ్రీన్‌రూంలో కమలాకర్ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. గ్రీన్ రూంలోకి అమర్చబడ్డ స్పీకర్లోంచి ప్రిన్స్‌పాల్ గారి మాటలు మధురగీతమై వినిపించాయి అతని చెవులకు. యాంత్రికంగా లేచి, సైడ్ వింగ్‌లోకి నడిచి, ధైర్యంగా నిలబడి వినసాగాడు.

"అయితే విశేషమేమిటంటే, ఎప్పుడూ ఇటువంటి ఫంక్షన్స్‌కి వెళ్లని నేను ఈ రోజు వచ్చినందుకు ఏమీ బాధ పడటం లేదు. ఎందుకంటే ఈ రోజు జీవితాంతం గుర్తుంచుకోదగ్గ ఒక చక్కటి మోనో ఏక్షన్ చూశాను".

-కమలాకర్ తన చెవుల్ని తనే తప్పుగా అంచనా వేసుకోసాగాడు.

"ఇట్ వజ్ రియల్లీ సూపర్బ్- ఎక్స్ట్రాఆర్డినరీ- హైలైట్"

-కమలాకర్ హృదయంలో నూరు కోయిలలు కూసాయి.

"ఆ మోనో ఏక్షన్ చేసిన అబ్బాయి కమలాకర్‌ని నేను గత అయిదారేళ్ళుగా చూసూ్తనే వున్నాను. ప్రతి సంవత్సరం ఈ నాటకాలనీ అవనీ ఇవనీ అతను తిరుగుతూన్నా నే నొక్కసారి కూడా చూడడం తటస్థించ లేదు. పైగా, మీరు నమ్మరేమో - వాత్సల్యం కొద్దీ 'శుభ్రంగా చదువుకోక ఈ భాగోతం లేవిటయ్యా' అని తిట్టేదాన్ని. అందుకు ఈ రోజు సిగ్గు పడుతున్నాను- అయామ్ రియల్లీ ఎషేమ్డ్".

-కమలాకర్ కళ్లల్లో నీళ్లు చిమ్మాయి. గుండెలు ఉబికాయి. అప్రయత్నంగానే రెండు చేతులూ ఎత్తి ఆవిడకు అక్కడ నుంచే నమస్కరించాడు.

"నిజంగా ఎంత గొప్పగా నటించా డతను!! పావుగంటలో విశ్వ రహస్యాన్ని మనముందుంచాడు. అంత తక్కువ సమయంలో ఒకే ఒక పాత్ర ద్వారా హాస్యాన్ని, రౌద్రాన్నీ, కరుణనీ కురిపిసూ్త, సందేశం అందించడం- రియల్లీ ఫెంటాస్టిక్. సభా ముఖంగా అభినందించడానికి అతన్ని స్టేజి మీదకు రావలసిందిగా కోరుతున్నాను."


ముకుళిత హసా్తలతో, ఆనందంతో తడబడే అడుగులతో, సజల నయనాలతో స్టేజి మీదకు వచ్చిన కమలాకర్- ముందు ప్రేక్షకులకు శిరస్సు వంచి అభివందనం చేసి, ప్రిన్సిపాల్ గారి దగ్గరకు నడిచి, వినమ్రుడై తల దించుకుని నిలుచున్నాడు. ఆవిడ వాత్సల్యంగా అతని భుజం తట్టి, "కంగ్రాట్యులేషన్స్ మై బోయ్ - విష్ యు ఆల్ ది బెస్ట్" అనగానే సభాస్థలి అంతా హర్షధ్వానాలతో దద్దరిల్లి పోయింది. ఉత్సాహ వంతులయిన కొందరు వచ్చి, కమలాకర్‌ని భుజాల మీదకు ఎత్తుకుని ప్రేక్షకుల లోనికి తీసుకు పోయారు.

మరో అయిదు నిముషాలకు సభ ముగిసింది.

ప్రిన్సిపాల్‌గారు బయల్దేరుతూన్న హీరోగారికి కృతజ్ఞతలు కాలేజీ తరపున తెలియజేశారు. ఆయన్ని దిగబెట్టడానికై సిద్ధమవుతూన్న జ్యోత్స్నని వారించి, ఒక లెక్చరర్ గారిని ఆపనికి నియమించి, జ్యోత్స్నతో, "ఆడపిల్లకు కొన్ని లిమిట్స్ అవసరం" అన్నారు, తీవ్రంగా.

★ ★ ★ ★ ★ ★

ట్రయిన్ టైముకి అరగంట ముందుగానే స్టేషన్‌కి



వచ్చాడు కమలాకర్ స్టేషనంతా అతనికి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన స్నేహితులతో, కాలేజి స్టూడెంట్లతో కళకళలాడుతోంది వాళ్ళందరి తోనూ ఎంతో ఆత్మీయత, అభిమానాలతో సరదాగా కబుర్లాడి, ట్రయిన్ కదులుతూండగా ఎక్కి, అందరి దగ్గరా చెమర్చిన కళ్ళతో శలవు తీసుకుంటూన్న కమలాకర్ చూపులో– అందరి వెనుకగా.... చీకట్లో ... ఒంటరిగా నిలబడి.... తనకు చేయి ఊపుతూ వీడ్కోలు చెపుతూన్న జ్యోత్స్న పడడం, అతను తేరుకుని ఆమె వైపు ప్రత్యేకంగా చేయి ఊపే అవకాశమే ఇవ్వకుండా రైలు వేగం పుంజుకుని, ముందుకు సాగి పోవడం క్షణాల్లో జరిగి పోయింది.

★ ★ ★ ★ ★ ★

సరిగ్గా రెండు రోజులకి ఒక ఉత్తరం అందుకున్నాడు కమలాకర్.

"డియర్ కమలాకర్,

క్షమించమని అడిగే అర్హత కోల్పోయినా క్షమాపణలు కోరుకుంటున్నాను. నీ ప్రోత్సాహంతో గుర్తింపు సంపాదించుకున్న నేను– నిన్నే గుర్తు పట్టనంత నిర్లక్ష్యంగా ప్రవర్తించానంటే, నిజంగా రాక్షసత్వం నన్నావహించినట్లే. నాన్నగారి పలుకుబడితో హీరోని తీసుకు రాగలిగాను. మన కాలేజీకి మొట్టమొదటి సారిగా అంత పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తిని తేగలిగిన ఘనత నాకు దక్కిందన్న గర్వంతో కళ్ళు మూసుకు పోయాయి నాకు. అతని ముందు నా

పిచ్చిమాటలు

"మీ బ్రతుకుల్లో కూడా
ఉషోదయం వస్తుందని"
ఎవరో అన్న ఆ
పిచ్చిమాటల్ని పట్టుకొని
చేతులు కట్టుకొని
తూర్పున చూస్తూ కూర్చోకు–
ఎందుకంటే
ఆ ఉషోదయం వచ్చేది ప్రకృతి నుంచి–
మన బ్రతుకుల్లో,
ఈ ఉషోదయం వచ్చేది మన చైతన్య జాగృతి నుంచి

–షేక్ అక్బర్ బాషా

"ప్లీజ్ – నన్ను శపించు నేస్తం"

మైకం కమ్మిన కళ్ళకు నువ్వు ఎంతో తక్కువ వాడివిగా కనిపించావు. నేను తలచుకుంటే నీలాంటి చిన్న కళాకారుల్ని వెయ్యిమందిని నా చుట్టూ దీపం చుట్టూ పురుగుల్లా తిప్పుకోగలననే భ్రాంతిలో మునిగి పోయాను.

అతని దృష్టిని ఆకర్షించ గలిగాను కాబట్టి విలయితే అతని ప్రోత్సాహంతో నేనూ పాపులర్ కావాలని దురాశ పడ్డాను. అందుకనే నేను అతని చుట్టూ తిరగడమే కాక మా స్నేహితురాళ్ళని కూడా తీసుకెళ్ళి అతనికి పరిచయం చేసి, జోకులతో, ఇకఇకలతో, పకపకలతో అతన్ని తృప్తి పరిచాను. అప్పటి కప్పుడు ఎంజాయ్ చేసి వెళ్ళిపోయే అటువంటి వాళ్ళకు నేనొక లెఖ్ఖా? నాలాంటి వాళ్ళెందరో?!

ప్రిన్సిపాల్ గారి స్పీచ్ నాకళ్ళు తెరిపించింది.

అప్పట్నుంచే నా అసలు కమలాకర్ నాకు కనిపించసాగాడు. నా గురువు, నా నేస్తం, నా ఆప్తుడు, నా సోదరుడు, ... నా ముందు చిరునవ్వుతో ప్రత్యక్షమయ్యాడు. గొఱ్ఱెల మందలో గొఱ్ఱెలా అందరితో బాటే నేనూ పాపులర్ అయిన వ్యక్తినే ఆకాశానికి ఎత్తి చూపద్దామనుకున్నాను గానీ, అసలైన కళాకారుడవయ్యుండి గుర్తింపు పొందవలసిన నిన్ను విస్మరించి, కృతఘ్నతతో ప్రవర్తించాను.

ఈ అల్పురాలు ఉపేక్షించినా సరైన సన్మానం సహృదయులే చేశారు.

క్షమించక పోయినా ఫర్వాలేదు– తిడుతూ నయినా జవాబు వ్రాస్తే ఈ జన్మకు తృప్తి.

నీ, కృతఘ్నురాలైన శిష్యురాలు– జ్యోత్స్న."


–చదవడం పూర్తి చేసి, ఉత్తరాన్ని మడిచి, పెదవులకు తాకించుకుని, లోలోనే నవ్వుకుంటూ, ఇలా అనుకున్నాడు కమలాకర్, –"పిచ్చిపిల్ల". □

ప్రైవేటు ప్రాక్టీసుకి ఆర్థిక స్తోమత కావాలి!

"డాక్టర్లులాగా చదువై పోగానే ప్రాక్టీసు పెట్టుకోడానికి లాయర్లకు కుదరదు. ఎక్కడన్నా ఉద్యోగం వస్తే చేరొచ్చు కానీ ప్రైవేటు ప్రాక్టీసు పెట్టుకోవాలంటే తగిన ఆర్థిక స్తోమత ఉండాలి. అనుభవం కోసం పేరున్న లాయర్ దగ్గర కొంత కాలం అంటే కనీసం మూడేళ్ళన్నా అసిస్టెంట్‌గా పని చెయ్యాలి! ఈ మూడేళ్ళూ జీతం, భత్యం ఉండదు." అన్నారు అడ్వకేట్ కొల్లిపర రవీంద్ర.

శ్రీ రవీంద్ర, ప్రముఖ సివిల్, క్రిమినల్ లాయర్ శ్రీ కంఠంనేని రవీంద్రరావు దగ్గర అసిస్టెంట్‌గా ఉంటున్నారు.

షీల రవీంద్ర భార్య. ఆమె కూడా ఎల్. ఎల్. బి. చదివారు. షీలా రవీంద్రలది ప్రేమ



శ్రీ రవీంద్ర, శ్రీమతి షీల.

వివాహం!"ప్రేమించడం తప్పు, ప్రేమించిన వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం తప్పు అంటారేమిటండీ ఈ కాలంలో కూడా.... మేమెవరినీ పట్టించుకోలేదనుకోండి!" అన్నారు శ్రీమతి షీల.

ఈమె ఒక ప్రక్క ప్రముఖ లాయర్ శ్రీ కె. వి. ఎస్. ఎన్. ప్రసాదరావు దగ్గర జూనియర్ లాయర్‌గా ఉంటూ మరో ప్రక్క మేరిస్టెల్లా కళాశాలలో పార్ట్ టైమ్ లెక్చరర్‌గా మర్కెంటైల్ లా బోధిస్తున్నారు!

"భార్యాభర్తలిద్దరూ లాయర్లై ప్రాక్టీసు పెట్టుకుంటే చాలా మంచిదే. కానీ ప్రారంభ దశలో ఇద్దరమూ ఉదయం ఎనిమిది గంటలకే సీనియర్ లాయర్ల దగ్గర అప్రెంటీస్‌కు వెళ్ళడము, తిరిగి పది

ఇద్దరూ ఉద్యోగస్తులైతే

గంట్లకు వచ్చి ఆదరాబాదరా నాలుగు మెతుకులు తిని కోర్టు కెళ్ళడమూ, మళ్ళీ సాయంత్రం ఐదింటికి కోర్టు నుండి తిరిగొచ్చి సీనియర్ దగ్గరకు వెళ్ళి కేసులు చూడటం, రాత్రి ఏ ఎనిమిదింటికో వచ్చి జర్నల్స్ తిరగేసి మరునాడు కోర్టులో వాదించాల్సిన కేసుకు సంబంధించిన సిమిలర్ కేసులను కోట్ చెయ్యడానికి నోట్స్ ప్రిపేర్ చేసుకున్న తర్వాత అప్పుడు విశ్రాంతి! ఈ విధంగా మూడేళ్ళు కష్టపడితే గానీ లాయర్లుగా గుర్తింప బడము. ముఖ్యంగా మాకు కావలసిన లైబ్రరి సంపాదించుకోడానికి ఆర్థిక స్తోమత ఉండాలి!" అన్నారు రవీంద్ర.

"హైకోర్టులో, సుప్రీమ్ కోర్టులలో లాగా "పర్టిక్యులర్ బ్రాంచస్ ఆఫ్ లా" సెలక్టు చేసుకోడానికి వీలు లేకుండా ఉంది ఇక్కడ. చేస్తే క్రిమినల్ లేదా సివిల్, కాకపోతే రెండూ కలిపి ప్రాక్టీస్ చెయ్యాలి! ముఖ్యంగా స్త్రీలు లాయర్లయితే మాట్రిమోనియల్ కేసులు బాగా చేయగలరు" అనే శ్రీమతి షీల- "కోర్టులో కాస్త గట్టిగా వాదిస్తే నిన్నకాక మొన్న వచ్చిన వాళ్ళు, సీనియర్స్‌ని లెఖ్ఖ చేయకుండా ఆ వాదనేమిటీ?" అన్న ఇన్‌ఫీరియార్టి, సుపీరియార్టి కాంప్లెక్స్‌లు పోతేగానీ నిజమైన జస్టిస్ రాదు" అని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

"నిజమే! ఆడవాళ్ళు లా చదవడమే చాలా అరుదు! వాళ్ళని ప్రోత్సహించాలి గానీ, నిరుత్సాహ పరిస్తే ఎలా చెప్పండి?"

మా సంభాషణ కొనసాగుతుండగానే రవీంద్రకు కెనరా బ్యాంక్ నుండి లా ఆఫీసర్‌గా పోస్టు చేసినట్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్ త్వరలోనే పంపిస్తామని కితాబు అందింది.

"కంగ్రాజ్యులేషన్స్"! మరి ఉద్యోగంలో చేరిపోతారా.... లేక ప్రైవేటు ప్రాక్టీసు మీదే ఉండా మీ అభిప్రాయం?"

"ఇప్పుడు నా అభిప్రాయం మార్చుకుంటున్నాను. ఉద్యోగంలోనే చేరిపోతాను. షీలకు కూడా ఈ విధంగా ఉద్యోగం రావడానికి చాలా అవకాశాలున్నాయి. ప్రస్తుతం లేడీ లా ఆఫీసర్లు కావాలని చాలా మంది ప్రకటిస్తున్నారు! లెటస్ ట్రై అవర్ లక్!" అన్నారు రవీంద్ర.

"ప్రైవేటు ప్రాక్టీసు కన్నా ఉద్యోగంలో ఫిక్సెడ్ ఇన్‌కమ్ ఉంటుంది, స్ట్రెయిన్ తక్కువ" అన్నాను.

"కానీ.... ప్లీడర్ గారొస్తున్నారు.... అన్నిటికీ మా లాయరు గారున్నారు.... అన్న గౌరవం, సర్వ స్వతంత్రాలూ ఉండవు కదండీ!" అన్నారు శ్రీమతి షీల! అది నిజమే...

– కృష్ణాజీ

సీరియల్

బలి కోరిన ప్రేమ

ఎం.డి. సౌజన్య

(గత సంచిక తరువాయి)

డాక్టర్ రంగారావ్ ఈ విషయంగా మళ్ళీ తన డబ్బుని, పలుకుబడిని వుపయోగించాల్సి వచ్చింది. అన్యాయంగా రవికాంత్ మోసానికి బలైన అన్నపూర్ణను ఆదుకోడానికి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ఔత్సాహిక నాటక సమాజాల వాళ్ళు, వివిధ పరిషత్తుల వాళ్ళు, రాష్ట్రేతర నాటక సమాజాల వాళ్ళు, నటులు ఉదారంగా చందాలు పంపి అండగా నిలిచారు.

ఫలితంగా అన్నపూర్ణ నిర్దోషని జైలు శిక్ష తప్పి బయట పడింది.

రాష్ట్రంలోని అన్ని దినపత్రికలు, స్థానిక పత్రికలు ఈ కేసు విషయంగా అన్నపూర్ణకు బాసటగా నిలిచాయి. అన్నపూర్ణా ఎంటర్ ప్రయిజెస్ తాలూకు డబ్బు మొత్తం ప్రభుత్వం స్వాధీన పరచుకుంది.

* * * *

"ఏమిటమ్మా అన్నపూర్ణా.....!! ఏదో సుదీర్ఘంగా ఆలోచిస్తున్నావ్! మన ఇల్లు వచ్చేసింది. ఇదిగో ఇక్కడేమనం దిగాలి!" అన్నది, రమాదేవి.

అంతవరకు తన జీవితంలో చేదు అనుభవాలు మిగిల్చిన గాయం తాలూకు గతాన్ని ఒక దృశ్యంగా గుర్తు చేసుకున్న అన్నపూర్ణ పరిసరాలు చూస్తూ తనెక్కడ వుందో గుర్తించింది. ఎదురుగా పెద్ద పోర్టికో, పెద్ద పెద్ద క్రోటను చెట్లు, కోటంత మూడంతస్తుల భవనం చుట్టూ చక్కటి పూలతోట, అందంగా కత్తిరించిన పచ్చగడ్డి తివాచీలా మెరుస్తూ - దూరంగా స్విమ్మింగ్ పూల్ - కాంపౌండ్ గోడ చుట్టూ ఎత్తయిన కొబ్బరి చెట్లు "అచ్చం భారీ హిందీ రంగుల సినిమాలో దృశ్యంలా గొప్పగా వుంది!" అనుకుంది.

"రామ్మా! ఇదిగో ఇటే పూజామందిరం! లోపల నా యిష్టదైవం వెంకటేశ్వరస్వామి వున్నాడు! ఆ కలియుగ దైవానికి దండం పెట్టి.... మనం తలపెట్టిన పనిలో విజయం కలగాలని ప్రార్థించాలమ్మా!" అంది, కారు దిగి అన్నపూర్ణను ఆహ్వానిస్తూ.

అన్నపూర్ణ కారు దిగి పెద్ద హాలున్న గడప దాటబోతుండగా 'శుభమా అని ఇంటి కోడలుగా వస్తున్నావు.... కుడి కాలు ముందు పెట్టమ్మా!" అంది.

ఆ మాటలతో అన్నపూర్ణ వళ్ళు గగుర్పొడిచినట్లనిపించింది.

తను కేవలం ఒక నటిగా నటించటానికే.... అవంతి పాత్రలో ప్రవేశిస్తున్నది!!..... అది కాంతిభూషణ్, స్వస్థత చేకూర్చే ప్రయత్నంలో సాయపడటానికి!! కాని యీ విషయం తను బయటి వారికెవ్వరికీ తెలియ

జరిగిన కథ–6: కోటీశ్వరురాలు రమాదేవి తన కొడుకు కాంతిభూషణ్ ప్రాణాలు కాపాడమని అన్నపూర్ణని అభ్యర్థిస్తుంది. భగ్న ప్రేమికుడు కాంతిభూషణ్ ప్రియురాలు అవంతిగా నటించడానికి అన్నపూర్ణ ఒప్పుకుంది. రమాదేవితో కూడా కారు ఎక్కినప్పుడు గతం గుర్తొచ్చింది. ఎగ్జిబిషన్‌లో అన్నపూర్ణకు జనతా ఎంటర్ ప్రైజెస్ ప్రొప్రయిటర్ రవికాంత్ పరిచయమయ్యాడు. అతనామెకు తన కంపెనీలో ఉద్యోగం ఇస్తాడు. ఆ తర్వాత ఆమెను తన వ్యాపారంలో భాగస్వామిని చెయ్యటమే కాకుండా తన జీవిత భాగస్వామిని కూడా చెయ్యటానికి సన్నాహాలు చేస్తుంటాడు. రవికాంత్ అన్నపూర్ణను రిజిష్టరు మేరేజి చేసుకుంటాడు. పెళ్ళిలోనే అన్నపూర్ణను పోలీసులు అరెస్టు చేస్తారు. రవికాంత్ చేసిన కుట్ర, మోసం అన్నపూర్ణకు అర్థమయ్యాయి. ఆమెపై కోర్టులో కేసు నడిచింది.

నివ్వకూడదు!! తను కాంతిభూషణ్ భార్య అవంతిగా నటిస్తూ - తను హద్దుల్లో తను వుంటూ నడుచుకోవాలి! అంతా కత్తి మీద సాము... పైగా కాంతిభూషణ్ మతిస్థిమితం లేని మనిషి? అతన్ని మామూలు మనిషిని చేయాలి!

ఇలా ఆలోచిస్తూ బయట కాళ్ళు కడుక్కుని వెంకటేశ్వరుడి పూజామందిరంలోకి అడుగు పెట్టింది అన్నపూర్ణ!

లోపల నిలువెత్తు శిలావిగ్రహం, చుట్టూ చిన్న ఎలక్ట్రిక్ దీపాలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

"ఆ ఏడుకొండల మీద వెలసిన స్వామి దివ్యదర్శనం చేసుకున్నట్లుంది.....!! స్వామీ.... నేను చేపట్టబోతున్న ఈ మంచి పనిలో విజయం లభించే వరకూ పోరాడే ఆత్మ స్థయిర్యాన్ని యివ్వు!" అంటూ చేతులు జోడించింది. అన్నపూర్ణ. రమాదేవి దాదాపు కళ్ళనీళ్ళతో స్వామి ముందు సాష్టాంగ పడి ప్రార్థించింది. తరువాత ఆమె దేవుడికి కొబ్బరికాయ పగలగొట్టి హారతి ఇస్తుండగా "అమ్మా! అబ్బాయిగారు... రంగు రంగుల పెయింటింగ్స్ వున్న ఆల్బమ్‌లన్నీ చించి తగలబెట్టబోతున్నారు.... మీరు త్వరగా రావాలి!" అన్నాడొక నౌకరు కంగారు కంగారుగా వచ్చి.

"పదమ్మా ఇక ఆలస్యం చేస్తే మంచిదికాదు ... ఆ గదిలోకి వెళ్ళి ... నువ్వు త్వరగా ... రెండు జడలు వేసుకుని ... అవంతిలా మేకప్ అయి, ఆ మేడమీద గదిలోకి వచ్చెయ్! అదిగో అవే మేడ మీదికి మెట్లు ... మొదటి గదే, మొదటి అంతస్తులో! అక్కడ నువ్వెలాంటి దృశ్యం చూసినా భయపడవద్దు!" అంది తను పరుగులాంటి నడకతో వెళ్ళిపోతూ.

అన్నపూర్ణ అవంతిగా రూపు దాల్చటానికి ప్రక్క గదిలోకి వెళ్ళింది.

తరువాత ఒక గంటకు మేకప్ ముగించి, ఆ పెద్ద గది ముందుకు అన్నపూర్ణ వచ్చి ఆగింది.

ఆ గది తలుపు గడియ లోపలి నుంచి వేసి వుంది. తలుపు గడియ ఎందుకు వేసి వుందో ఆమెకు అర్థంకాలేదు! లోపల పెద్ద పెద్ద క్యాన్‌వాస్ పెయింటింగ్స్ తగలబడిపోతున్నట్లు మంటలు - ఒక విధమైన నూనె వాసన ఆమె నాసికా పుటాలకు తాకింది

రమాదేవి కాంతిభూషణ్‌ను వారిస్తూ "బాబూ ... భూషణ్ ...!! ఇదేమిటి నువ్వు ఎంతో కష్టపడి వేసుకున్న పెయింటింగ్స్ అన్నీ అలా తగులబెడుతున్నావెందుకు బాబూ! వద్దు బాబూ! ఆగు ... ఆగు ...!" అంది - అతని చేతిలోని ఒకపెయింటింగ్ బలవంతంగాలాక్కుంటూ

"అమ్మా ...!! ఈ పెయింటింగ్స్ అన్నీ తగులబడిపోనీ ...!! వీటిని కాపాడే ప్రయత్నం చేయకమ్మా! ఇవన్నీ ... నా గతమంతా గుర్తు చేస్తున్నాయి ...!! క్షణ క్షణానికి గుర్తు చేస్తున్నాయి ...! ఎప్పుడో మానవలసిన గాయాన్ని రేపుతున్నాయి ...!! ఇవన్నీ చూస్తుంటే ... ఇవి చిత్రించటానికి నన్ను ప్రోత్సహించిన ... ఆ అవంతి అనుక్షణం నాకు గుర్తొస్తున్నదమ్మా ...!! అందుకే ... ఇవన్నీ తగులబడిపోనీ!" అంటూ అరుస్తూ పెయింటింగ్స్ మంటల్లోకి విసురుతున్నాడు.

ఇక తను కాంతిభూషణ్‌ను బలవంతంగానైనా ఆపకపోతే పెయింటింగ్స్ అన్నీ తగులబడటమే గాక ... నేలమీద పరచివున్న కాశ్మీర్ పట్టు తివాసీలు, విండో కర్టెన్లు మొత్తం తగలబడిపోవటం ఖాయం.

అప్పటికే మంటలు ఒక ప్రక్క మెల్లిగా అంటుకొని, అది రాజుకొని, మంట పెద్దదవుతోంది.

అయినా కాంతిభూషణ్ వాటిని లెక్క చేయటంలేదు.

అవన్నీ ఏం పట్టనట్లు కోపంగా గోడకున్న పెయింటింగ్స్ అన్నీ ఒక్కొక్కటి తీసి ఆ మంటలవేపు బంతి విసిరినట్లు విసురుతున్నాడు. అవంతి నిలువెత్తు పెయింటింగ్స్ మంటల్లో పడవేయబోతుంటే రమాదేవి ఆ పెయింటింగ్‌ను పట్టుకుని ఆపబోతూ

"బాబూ!! ... భూషణ్ ...!! ఈ పెయింటింగ్ ... తగలపెట్టవద్దు ... ఇదన్నా వుండనీ ...!" అంది వారిస్తూ. కాని, కాంతిభూషణ్ ఆమె మాటల్ని లెక్క చేయక "అమ్మా అవంతిని నేను శాశ్వతంగా మరచిపోవాలంటే అవంతి తాలూకు గుర్తులేవీ ... నా దగ్గర ఉండకూడదు ...!! పోనీ ...!! అవంతి నాతో దూరమై పోయింది గదా ...! అలాగే ... అవంతి తాలూకు జ్ఞాపకాలు శాశ్వతంగా దూరమై

పోనియమ్మా ...!! వదులు .. ఇది కూడా తగలబడిపోనీ ...!" అంటూ తల్లి చేతిలో నుంచి ఆ పెయింటింగ్ బలవంతంగా లాక్కోబోయాడు.

కాని రమాదేవి ఆ ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తూ అంతకంటే బలంగా ఆ పెయింటింగ్‌ను పట్టుకుంది.

కాంతిభూషణ్‌కు కోపం పెరిగి - మరింత పట్టుదలగా ఆ పెయింటింగ్ లాక్కోబోయాడు.

ఇద్దరి మధ్యా కొన్ని క్షణాల పెనుగులాట జరిగింది, ఒక మృగశక్తి తనలో ప్రవేశించినట్లు కాంతిభూషణ్ తల్లి చేతిలోని పెయింటింగ్ తన శక్తినంతా కూడదీసుకుని లాగాలని చూశాడు

అప్పటికే మార్ఫియా ఇంజెక్షన్ చేతికి చేసుకొని వుండటంతో అతనిలో ఒక వింత శక్తి ప్రవేశించినట్లయ్యింది.

అతనేం చేస్తున్నాడో అతనికే తెలియదు!

"వదులమ్మా ...! ఈ పెయింటింగ్ వదులు ...!!" అంటూ బిగ్గరగా అరుస్తూ కోపంతో ఊగిపోతున్నాడు అతను.

చివరకు మిగిలిన ఆ ఒక్క పెయింటింగ్‌నన్నా ఎలాగైనా దక్కించుకోవాలని రమాదేవి మూర్ఖంగా దాన్ని పట్టుకొని వ్రేలాడసాగింది!

అప్పటికే నేలమీది కాశ్మీర్ తివాసీ, విండో కర్టెన్లని మంటలు అంటుకున్నాయి. వాటి వల్ల సంభవించే ప్రమాద తీవ్రత ఇద్దరిలో ఎవరు పట్టించుకునే స్థితిలో లేరు.

అన్నపూర్ణ ఆ గది కిటికీలో నుంచి లోపలి దృశ్యాన్ని ఒక ప్రేక్షకురాలిగా చూస్తూ నిలబడింది.

ఆమెకేదో ప్రమాదం సంభవించబోతుందనే భావన కలిగింది.

అయితే లోపలికెడదామంటే లోపల నుంచి గడియ వేసి వున్నట్లుంది.

ఇంకా ఆలస్యం చేస్తే ఏం జరుగుతుందోనన్న ఆతురతతో అన్నపూర్ణ తలుపు దగ్గరికి పరుగెత్తి –

"రమాదేవిగారూ!! ... రమాదేవిగారూ ...!!" అంటూ తలుపు దబదబ బాదసాగింది.

అయినా రమాదేవి ఆమె మాటలు వినిపించుకునే స్థితిలో లేదు.

"బాబూ! భూషణ్ ... వద్దు నా మాట విను ...!!" అంటూ - ఇంకా బ్రతిమాలుతూనే ఆ పటాన్ని పట్టి ఆపే విశ్వప్రయత్నం చేస్తుండగా, చివరకి ఆ పటం ఆమె చేతుల్లో నుంచి ఒక్కసారిగా జారిపోయింది.

ఒక ఉన్మాద స్థితిలో.... వళ్ళు తెలియని పట్టుదలతో, అమిత బలంతో లాగుతున్న అతను ఒక్కసారిగా అమిత బలంతో ఎవరో నెట్టినట్టు వెళ్ళి మంటల్లో పడి, "అమ్మా!" అంటూ ఒక్క గావుకేక పెట్టాడు.

రమాదేవి, "బాబూ!" అంటూ ముందుకు పరిగెత్తింది.

అప్పటికే జరగవలసిన ప్రమాదం జరిగిపోయింది

రమాదేవి కాంతిభూషణ్ చేతులు పట్టి బరబరా అతనిని ప్రక్కకు లాగింది!!

"రమాదేవిగారూ!! తలుపు తెరవండి!! తలుపు తెరవండి....!" అంటూ బిగ్గరగా అరుస్తూ, తలుపు దబదబ కొట్టింది, అన్నపూర్ణ.

"అయ్యో!! నా కళ్ళు!! నా కళ్ళు....!! అమ్మా నా కళ్ళు కనిపించటం లేదు...!! నా కళ్ళు కనిపించటం లేదు!" అంటూ గోలగా అరుస్తున్నాడు, కాంతిభూషణ్.

రమాదేవి, "బాబూ భూషణ్....!! ఏమిటి బాబూ! ఏమైంది బాబూ!" అంటూ, భూషణ్‌ని పట్టి లేవి కూర్చోపెట్టే ప్రయత్నం చేస్తోంది.

ఈలోపు గది నిండా, దట్టంగా ఇంకా మంటలు వ్యాపించ సాగాయి.

"రమాదేవిగారూ!! తలుపు తెరవండి....!! త్వరగా తలుపు తెరవండి!" అంటూ ఇంకా బిగ్గరగా అరుస్తూ, తలుపులు బద్దలు కొడుతోంది అన్నపూర్ణ.

ఆ కేకలు విన్న నౌకర్లు నలుగురు పరిగెత్తు కొచ్చి తలుపులు బల ప్రయోగంతో విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు.

అప్పటికే ముఖం కొద్దిగా, కళ్ళు పూర్తిగా కాలిపోయిన కాంతిభూషణ్, స్పృహకోల్పోయి రమాదేవి చేతుల్లో అచేతనంగా వుండి పోయాడు.

అందరూ కలసి పట్టి కాంతిభూషణ్‌ను ఆ గది మంటల్లో నుంచి కాపాడి బయటికి తెచ్చారు.

"అయ్యో!! భూషణ్....!! ఎంత పని జరిగింది బాబూ! ఎంత పని జరిగింది!" అంటూ రమాదేవి గోలగా గుండెలు బాదుకుంటూ విలపించ సాగింది.

ఇంతలో ఒక నౌకరు వెళ్ళి డాక్టర్‌కు ఫోన్ చేశాడు తక్కిన నౌకర్లు బొక్కెన్లతో పరుగు పరుగున నీళ్ళు తెచ్చి ఆ మండుతున్న తివాచీలను, డోర్ కర్టెన్లను, పెయింటింగ్స్‌ను ఆర్పారు

తను రంగ ప్రవేశం చేద్దామను కుంటుండగా అలా ఎందుకైందో అన్నపూర్ణ వూహకు అంద లేదు!

"కాంతిభూషణ్‌కు నేను... నిజమైన అవంతిని అవునో కాదో నన్న అనుమానం రాకుండా.... రంగ ప్రవేశం చేయటానికి అనుకూలంగా. విధే ఈ సంఘటన కల్పించిందా!?..., !!? కళ్ళు కనిపించని కాంతిభూషణ్‌తో నేనే నిజమైన అవంతినని.... చెప్పి నమ్మించటానికే కాంతిభూషణ్‌కు ఈ ప్రమాదం జరిగిందా?" అనుకుంది.

ఇంతలో డాక్టర్ వచ్చి– పరీక్షించి– "కొన్నాళ్ళు కళ్ళకు కట్టు కట్టి విశ్రాంతి ఇస్తేనే కాని చూపు సంగతి చెప్పలేను!" అన్నాడు.

ఆ మాటలతో రమాదేవి గుండెలు పగిలేట్టుగా శోకాలు పెట్టి ఏడ్చింది.

★ ★ ★ ★


రమాదేవి బలవంతాన అన్నపూర్ణ, రమాదేవి ఇంటికి రాగానే కాంతిభూషణ్‌కు కళ్ళకు అంత ప్రమాదం సంభవించటం అన్నపూర్ణను కృంగదీసింది! ఆమె అది అశుభమనుకుంది.

అయితే ప్రతిదీ.... ఏదో ఒక మంచికే దారి తీస్తుంది.... అన్న నానుడిలో చెప్పినట్టు.... కాంతిభూషణ్‌కు తాత్కాలికంగా అంధత్వం ప్రాప్తించటం, ఆమెకు అసంకల్పితంగా సాయపడింది.

రమాదేవి సాయంతో ఆమె ... కాంతిభూషణ్ ... అవంతి కలసి రకరకాల పిక్‌నిక్‌లకు.... టూర్స్‌కు వెళ్ళినప్పుడు ఇద్దరి మధ్య జరిగిన సంభాషణల టేప్‌లు వినటం, అవంతి ఎలా ఏమాట ఎలా వొత్తి పలుకుతుందో, కొన్ని ప్రత్యేక అక్షరాలు ఎలా నొక్కి పుచ్చరిస్తుందో, ఎలా నవ్వుతుందో, చిలిపిగా ఎలా అల్లరి



గడుసులోకం —బాబు



బలికోరిన ప్రేమ

పట్టిస్తుందో, కాంతిభూషణ్‌ని ఎలా "భూషణ్ డియర్" అని ముద్దుగా పిలుస్తుందో, అరుస్తూ కేకలు పెట్టి నప్పుడు ఆమె గొంతు ఎలా వుంటుందో.... ఆమెకు ఏఏ హిందీ, ఇంగ్లీషు పాటల చరణాలంటే ఇష్టమో, బాత్‌రూంలో ఆమె ఏ పాటలు కూనిరాగాలు తీస్తుందో.... అన్నీ ఒక మిమిక్రీ ఆర్టిస్ట్‌లా స్టడీ చేసింది.

ఆ టేపులు మళ్ళీ మళ్ళీ విన్నది! తను నిజమైన అవంతిని అనుకరిస్తూ అన్ని విధాలా తనూ నిజమైన అవంతనే భ్రమ కాంతిభూషణ్‌కి కలిగించటానికి తన గొంతూ టేప్‌లో రికార్డ్ చేసి విన్నది.

మార్పులు– చేర్పులు– చేసింది.

అదొక సాధనగా కృషి చేస్తూ, రాత్రింబవళ్ళు మేల్కొని రిహార్సల్సులా చేసింది.

"ఇప్పుడు ఫర్వాలేదు!! కళ్ళతో చూడలేని కాంతిభూషణ్‌ని.... నేనే నిజమైన అవంతిననే భ్రమ కల్పించి నమ్మించ గలను!" అనుకుంది. రమాదేవి ఎప్పుడు రంగప్రవేశం చేయమంటే అప్పుడే రంగంలోకి దిగటానికి సిద్ధమైంది.

అక్కడ కాంతిభూషణ్ బెడ్ ప్రక్కనే రమాదేవి రాత్రింబవళ్ళూ ఏడుస్తూ కూర్చుంది!

కళ్ళకు ప్రమాదం జరిగిన అయిదో రోజు కాంతి భూషణ్‌కు స్పృహ వచ్చింది!

అతను స్పృహరాగానే "అమ్మా......!! అమ్మా!!" అంటూ బిగ్గరగా పిలిచాడు.

"ఏమిటి బాబూ ! భూషణ్ .... నేనిక్కడే వున్నాను నాయనా..... !! ఇక్కడే వున్నాను ....!!" అంది రమాదేవి కాంతిభూషణ్ చెయ్యి పట్టి .....

అతను లేచికూర్చోబోతూ.... కూర్చోలేక..... కళ్ళకు కట్టుకట్టి వుండటం ఏమిటో మొదట గుర్తు రాక తరువాత గుర్తొచ్చి "అమ్మా..... నాకళ్ళు .....!!?" అన్నాడు మాట తడబడుతుండగా...

"కొన్నాళ్ళు విశ్రాంతి .... తరువాత.... బాగయిపోతాయన్నారు బాబూ....!! " చెప్పింది రమాదేవి, బాధను మాటల్లో కనిపించకుండా దాచుకునే ప్రయత్నంలో

కాంతి భూషణ్ కాస్సేపు ఏమి మాట్లాడలేదు.

"ఈ చీకటి శాశ్వితమైపోతే..... !! ఇక పగటికీ రాత్రికీ ..... నాకు తేడా వుండదు కదమ్మా!" అన్నాడు , గొంతు గాద్గదిక మయి పోతుండగా.

రమాదేవి అతని భయమేమిటో అర్థం చేసుకుని " అలా అనకు బాబూ! నీకళ్ళు తప్పకుండా బాగవుతాయని .... డాక్టర్‌గారు..... చెప్పారు!!! బాబూ భూషణ్..... నీ కోసం ..... అవంతి ఫోన్ చేసింది బాబూ!" అంది.

అవంతి పేరు వినగానే ..... "అవంతా!? ఏ అవంతి?" అన్నాడు తృళ్ళిపడ్డట్టు భూషణ్.

"అదే బాబూ.... నా కోడలు.... అవంతి!" అంది సంతోషంగా, రమాదేవి.

"అవంతా!? నిజంగానా.....!? ఎక్కడినుంచి? " అన్నాడు మంచం మీద నుంచి దిగే ప్రయత్నంలో

"అమ్మాయి.... విశాఖపట్నం వచ్చిందట బాబూ! హోటల్ ఏషియా నుంచి మాట్లాడింది! నిన్ను గురించి అడిగింది!"

"నన్ను గురించి .... అడిగిందా....!! నన్ను గురించి ఏం చెప్పావు మమ్మీ....!?" అన్నాడు కాంతి భూషణ్ ....

"మా అబ్బాయిని చేసిన మోసం చాలు..... !! ఇక నైనా వాడిని బ్రతకనివ్వు తల్లీ! – అన్నాను కోపంగా!" చెప్పింది రమాదేవి, కాంతిభూషణ్ ముఖంలో భావాలు చదవాలని ప్రయత్నిస్తూ.

"అమ్మా నిజంగా అలా అన్నావా?!? అవంతి నాకోసం అంత దూరం నుంచి వస్తే అలా అన్నావా?" అన్నాడు కాంతిభూషణ్ ఆందోళనగా.

"ఔను బాబూ!! నీకంత ద్రోహం చేసి వెళ్ళిన అవంతిని నువ్వింకా ప్రేమిస్తున్నావాబాబూ? " అడిగింది రమాదేవి, ఆశ్చర్యంగా.

"ప్రేమ త్యాగం కోరుతుందంటారు! నాప్రేమ అవంతి పట్ల నిజమైనదైతే..... ఒకరోజు అవంతే తిరిగి నా దగ్గరికొస్తుందనుకున్నానమ్మా!! అమ్మా.... నన్ను అవంతి దగ్గరికి తీసి కెళ్ళు !! నేను అవంతితో మాట్లాడాలి!! నేను అవంతిని చూడాలి!!.... నేను.... అవంతిని ..... చూడలేను....కదూ? .... !! వద్దమ్మా అవంతిని ఈస్థితిలో వుండి చూడలేను!! అవంతిని నేనింకా చూడలేనమ్మా..... !! అవంతిని పోనీ....!!" అన్నాడు తన గుడ్డితనం గుర్తొచ్చి.

కాస్సేపు అతను అలా మధన పడి ..... దుఃఖాన్ని దిగమింగి .... "పోనీ..... ఒక సారి అవంతిని వచ్చి నన్ను చూసి పొమనమ్మా!" అన్నాడు , ఎలాగో మాట పెగల్చుకుని.

"అలాగే బాబూ! అలాగే అడుగుతాను....!! కాని నువ్వు అవంతిని క్షమించగలవా బాబూ? " అడిగింది రమాదేవి.

తల్లి వేసిన ఆ ప్రశ్నకి కాంతిభూషణ్ వెంటనే సమాధానం చెప్పలేదు.

రమాదేవి ఈ లోపు ఫోన్ చేయబోతూ, అన్నపూర్ణను క్రిందికి వెళ్ళి ఫోన్‌లో హోటల్ నుంచి మాట్లాడినట్లు మాట్లాడమని సంజ్ఞ చేసింది.

కాస్సేపటికి లైన్ కనెక్షన్ వచ్చి క్రింద నుంచి అన్నపూర్ణ మాట్లాడటం మొదలు పెట్టగానే "ఇదిగో అవంతి మాట్లాడు తోంది బాబూ–! " అంటూ రిసీవర్ అతని చేతికిచ్చింది.

"హలో అవంతీ!! నేను భూషణ్‌ని మాట్లాడుతున్నాను!" అన్నాడు కాంతిభూషణ్, ఆనందపరవశుడైపోతూ.

"హలో భూషణ్....!! హౌ ఆర్ యూ...!! మీ అమ్మగారికి నేను ఉదయమనగా



దర్శకత్వం: వి.మధుసూదనరావు

నిర్మాత: వెంకట్ అక్కినేని

చక్రవర్తి • వి.యస్.సుందరం • వెంకటరత్నం

బలికోరిన ప్రేమ

ఫోను చేశాను.... నేను వచ్చానని...... కాని .... ఆమె ఏదో అన్నారు!! భూషణ్ ... నేను తొందర పడ్డానని వొప్పుకుంటాను...! ఇద్దరం పట్టింపులకు పోయాము....!! నేను నా తప్పు తెలుసుకున్నాను... పశ్చాత్తాప పడుతున్నాను...!! సారి చెబుతున్నాను....!! డియర్ నా మీద కోపం పోలేదా?" అంది అన్నపూర్ణ, అవంతిలా.

భూషణ్‌కు ఆ మాటలు ఎంతో సేద తీర్చినట్లనిపించాయి.

"అవంతీ!! ... నువ్వు ....ను ...వ్వు ... వచ్చావంటే నేను ఇంకా నమ్మలేకపోతున్నాను....!! నువ్వు .... నిజంగానే... వచ్చావా!?" అన్నాడు సంతోషంతో వుక్కిరిబిక్కిరయిపోతూ, ఇంకా నమ్మలేక.

"ఔను డియర్! నేను ఫోన్ చేసింది నువ్వు వస్తావనే? కాని... నువ్వు యింత వరకు రాకపోతే.... ఇక నువ్వు రావని... ఇక ఇక్కడి నుంచి శాశ్వతంగా వెళ్ళిపోదామనే నిర్ణయించుకున్నాను!! నా మీద కోపం నీకు పోలేదా డియర్!... ఇక నా ముఖం చూడవా?" అంది అన్నపూర్ణ.

"లేదు అవంతీ!! నేను మామూలు పరిస్థితుల్లో అయితే నీ దగ్గరకే వచ్చేవాణ్ణి! కాని... ఇప్పుడు .... నువ్వే ఇక్కడికి రా అవంతీ!! వస్తావు కదూ?"

"తప్పక వస్తాను భూషణ్!! తప్పక వస్తాను ...!! కాని నేను మీ యింటికి వస్తే .... మీ మదర్ నన్ను ...!?" అంది అన్నపూర్ణ.

"లేదు అవంతీ ...!! నేను నిన్ను గురించి మా అమ్మ గారికేమీ చెప్పలేదు ...!! నీ వల్లనే నేను ఇలా అయిపోయానని మా అమ్మగారి అనుమానం!! అందుకే ఆమె నీతో ఫోన్‌లో అలా మాట్లాడి వుండవచ్చు!! నువ్వున్నది హోటల్ ఏషియాలోనే కదా...!? అక్కడికి మా అమ్మగారినే పంపుతున్నాను...! ఆమే నిన్ను ఇంటికి తెస్తారు!" అన్నాడు.

ఈ మాటలతో – అటు అన్నపూర్ణ, టెలిఫోన్ సంభాషణ వింటున్న రమాదేవి సంతోషించారు.

"అమ్మా! హోటల్ ఏషియాలో అవంతి వుంది....!! మనింటికి రావటానికి సంశయిస్తోంది! నువ్వు వెళ్ళి ... అవంతిని ఇంటికి పిలుచుకురామ్మా!" అన్నాడు కాంతిభూషణ్, తల్లిని అర్థిస్తూ.

రమాదేవి వెంటనే ఆ మాటలకు సమాధానం చెప్పకుండా "బాబూ!! నువ్వు ఇంకా అవంతిని?!" అంది బాధగా.

"మరచి పోలేనమ్మా! ఇప్పటికే కాదు... ఎప్పటికీ మరచిపోలేను!! అమ్మా ... అవంతి చాలా మంచిదమ్మా ...!! ఓ దుర్మార్గుడి మాటలు విని ఆ పొరపాటు చేసింది....!! ఇప్పుడు పశ్చాత్తాపంతో తన తప్పు తెలుసుకుని మళ్ళీ నా దగ్గరి కొచ్చింది! ఇప్పుడు ... నేను అవంతిని కాదంటే ... ఇక నాకు శాశ్వతంగా దూరమైపోతుంది....!! అవంతిని వదలి నేను బ్రతకలేను!" అన్నాడు కాంతిభూషణ్ బాధగా.

"కాని... అవంతి నిన్ను ఈ పరిస్థితిలో చూసి ఇంకా నిన్ను ...!?"

"తప్పక ప్రేమిస్తుందమ్మా!! అమ్మా.. నాకీ స్థితి కలగటం ఒకరకంగా అదృష్టమే అనుకుంటాను! నా ... అవంతి ప్రేమ నిజమైందో కాదో .... ఇప్పుడే తేలిపోతుంది....!! వెళ్ళమ్మా!! ... వెళ్ళు!! వెళ్ళి అవంతిని పిలుచుకురా!! నువ్వే చూడు ... అవంతి ఏమిటో !!" అన్నాడు.

రమాదేవి సంతోషంగా బయలుదేరింది. తన పథకం పారినందుకు .... అవంతి స్థానంలో అవంతిగా వస్తున్న అన్నపూర్ణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రంగప్రవేశం చేసే అవకాశం కలిగిందని ఆమె ఆనందానికి అవధులు లేవు.

తల్లితో కలిసి అవంతి వస్తుందో రాదోనన్న సంశయంతో, అవంతి రాక కోసం ఎదురు చూస్తూ అసహనంగా వున్నాడు, కాంతిభూషణ్.

"ఇదిగో బాబూ! అవంతి వచ్చింది!" అంది రమాదేవి, అన్నపూర్ణతో ప్రవేశిస్తూనే.

"మైగాడ్!! ఇదేమిటి భూషణ్ ...!! ఆ కళ్ళేమిటి...!? ఏమైంది భూషణ్ ...!!? నీ కళ్ళకు ఏమైంది ...!? అయ్యో!?" అంటూ ఏడుస్తూ సూట్‌కేస్ కింద పడేసి భూషణ్ దగ్గరికి పరుగెత్తి అతని గుండెల మీద వాలిపోయింది, అవంతి.


భూషణ్ ఆమెను గుండెలకు హత్తుకుంటూ "కళ్ళకు కొద్దిగా.... రెస్ట్ అవసరమయ్యే ప్రమాదం జరిగింది అవంతీ!" అన్నాడు ఆమెకు ధైర్యం చెబుతూ.


"అత్తయ్యా!! భూషణ్‌కు ఇంత ప్రమాదం జరిగిన సంగతి ... ప్రొద్దున నేను ఫోన్ చేసినప్పుడెందుకు చెప్పలేదు?" అంది భూషణ్ కళ్ళకు కట్టి వున్న కట్టును పట్టుకుని చూస్తూ

"ఏం చెప్పమన్నావమ్మా!! అబ్బాయి పరిస్థితి చూస్తే నా గుండె తరుక్కుపోతోంది....!! వాడిలా పిచ్చివాడయి పోయే స్థితికి తెచ్చింది నువ్వు కదూ?" అంది కోపంగా.

అవంతి ఆ మాటలకు సమాధానం చెప్పలేక "చూశావా భూషణ్!! నీ మీద ఎంత ప్రేమ లేకపోతే నన్నూ నా వాళ్ళను విడిచి పెట్టి ఇంత దూరం వస్తాను!" అంది అవంతి ఏడుస్తూ.

"అమ్మా! అయిందేదో అయిపోయింది! ఇక మనం వర్తమానాన్ని గురించి ఆలోచిద్దాం! అవంతి తన తప్పు తెలుసుకుని వచ్చింది....!! అవంతి మనసు నొప్పించొద్దు!" అన్నాడు కాంతిభూషణ్, అవంతినే సమర్థిస్తూ. రమాదేవి ఇంకేమీ అనలేక "బాబూ! మీరిద్దరూ సుఖంగా వుంటే అదే నాకు పదివేలు ....!! కన్నతల్లిని కావటాన... నీ బాధ చూడలేక ఉద్రేకంతో ఏదో అన్నాను! ఏమీ





అనుకోకమ్మా!" అంది. ఇంతలో ఫోన్ మ్రోగింది.

అవంతి వెళ్ళి ఫోన్ ఎత్తి "హలో" అంది.

అటు వైపు వ్యక్తి మాటలు వింటుంటే ఆమె ముఖంలో రంగులు మారాయి. అయిదు నిమిషాలు గడిచాయి. "ఎవరు అవంతి!?" అడిగాడు, కాంతిభూషణ్.

"ఒక పాత స్నేహితుడు....!! ఇప్పుడే ఫారిన్-టూర్ నుంచి వచ్చాడట....!! నేనిక్కడ వున్నానని తెలిసి నన్ను ఒక్కసారి హోటల్ ఏషియాకు రమ్మంటున్నాడు!" అంది.

"హోటల్ ఏషియాకా?... ఎందుకు?" అడిగాడు కాంతిభూషణ్.

"అతని కేదో .... ఫారిన్ ఎక్స్చేంజిలో హోటల్ వాళ్ళతో పేచీ వచ్చిందిట! నేను ప్రక్క రూమ్‌లో నే ఉన్నానని తెలిసి, నా సాయం ఏదో సాక్షిగా కావా లట.....!! కారు పంపుతున్నాను! వెంటనే వచ్చి వెళ్ళమంటున్నాడు"అంది.

రమాదేవికి ఆ మాటలు వింతగా అనిపించాయి.

"ఏమిటి అన్నపూర్ణా ... ఏమిటి?" అన్నట్టు చూసింది ఆవిడ.

"చెబుతాను.....!! తొందర పడవద్దు!" అన్నట్టు సంజ్ఞ చేసింది, అన్నపూర్ణ.

బయట పోర్టికోలో కారు ఒకటి వచ్చి అప్పటికే సిద్ధమైనట్టు, మెట్లు దిగిన అన్నపూర్ణకు కనిపించింది.

"ఏమిటమ్మా అన్నపూర్ణా!! ఏమిటి? ఎక్కడికి?" అడిగింది... రమాదేవి

"ఇక్కడికే, వస్తాను ....!!" అంది ముందుకు వెళుతూ.

"ఎవరమ్మా ఫోన్ చేసింది...!!? నువ్వు నిజంగానే హోటల్ ఏషియాకేనా?!" అడిగింది మళ్ళీ.

"ఎవరో నేను ఇక్కడ అవంతిగా వచ్చిన సంగతి కనిపెట్టి ... నన్ను వెనక్కి వచ్చేయమని హెచ్చరిస్తున్నారు...!! కాదంటే ... నా ప్రాణాలకే ప్రమాదమని సీరియస్‌గా వార్నింగ్ ఇస్తున్నారు!" అంది.

"ఎవరమ్మా... అది!?"

"ఎవరో నా శ్రేయోభిలాషని ... ఎంత త్వరగా నేను అతని మాట వింటే ... అంత శ్రేయస్కరమని చెబుతున్నాడు!" చెప్పింది అన్నపూర్ణ.

"మనిద్దరం ఈ పనికి పూనుకోవటానికి సంబంధించి ఎవరికి తెలియదే!!? మరి... మరి ఈ శ్రేయోభిలాషి ఎవరు?" అడిగింది రమాదేవి సంభ్రమాశ్చర్యాలతో.

"ఎవరో తెలియదు!! కాని... నేను అవంతిగా ఇక్కడకు వచ్చానన్న సంగతి తెలిసి అతను నన్ను హెచ్చరిస్తున్నాడంటే ... అతనెవరో మనకు ప్రబల శత్రువై వుండాలి! నా ఉనికి వల్ల అతని కేదో నష్టం జరుగుతుందని భావించి వుంటాడు....!! అందుకే వెంటనే ఇక్కడి నుంచి వెళ్ళి పొమ్మని హెచ్చరిస్తున్నాడు!" అంది అన్నపూర్ణ సాలోచనగా.

"అయితే పోలీసులకి ఈ విషయం చెబుతామా?" అడిగింది రమాదేవి.

"అలా చెప్పటం వల్ల ... అనవసరంగా అల్లరయ్యేది మనమే!" చెప్పింది అన్నపూర్ణ.

"ఎందుకని!?"

"ఒకవ్యక్తి బదులు మరో వ్యక్తి ... తనే ఆ వ్యక్తిగా నిజజీవితంలో నటించటం ఇమ్‌పర్సనేషన్ క్రింద నేరం!" చెప్పింది అన్నపూర్ణ.

పరిస్థితి ఇలా మారటం ఏమిటో అర్థం కాక నిట్టూర్చింది, రమాదేవి.

"అయితే ... హోటల్ ఏషియాకు .... వంటరిగా వెళతావా?" అడిగింది రమాదేవి.


"నాకేదైనా ప్రమాదముంటుందనుకోను! అయినా ముందు జాగ్రత్త కోసం ఏం చేద్దామంటారు?"

"ఎంత చిన్నపామునైనా పెద్ద కర్రతో చంపాలంటారు...! కిడెంచి ఫేలించటం మంచిది...! నేనూ నీ వెంట వస్తాను....!!"

"అంత ప్రమాదం వెంటనే వుంటుందనుకోను...!! సరే నేను వెళ్ళి అతనెవరో మాట్లాడుతాను. ఈలోపు మీరు నా కోసం క్రింద వేచి వుండండి! నేను వెళ్ళి అరగంట వరకు రాకపోతే నేను వెళ్ళి తిరిగిరాని రూముకు పోలీసుల్ని పిలిపించండి!" అంది అన్నపూర్ణ.

రమాదేవి, అన్నపూర్ణ కారులో హోటల్ ఏషియాకు బయలుదేరారు.

(ఇంకా ఉంది)



యన్. ఆర్. కె–పాకాల

'ఎలర్జీ' అంటే ఏమిటి? డాక్టరు నాకు డస్ట్ ఎలర్జీ కలదన్నారు. ఎలర్జీ ట్రీట్‌మెంటుకు ఏ డాక్టరు వద్దకు వెళ్లాలి? ట్రీట్‌మెంటు ఏ విధంగా చేస్తారు?

ఏ వస్తువైనా శరిరానికి పడనప్పుడు అలర్జీ అనటం జరుగుతుంది.

కొన్ని మెడికల్ కాలేజీ ఆస్పత్రులలో అలర్జీ క్లినిక్‌లు ఉంటాయి. అక్కడ సంప్రదించటం. వారు "డీసెన్సిటైజ్" చెయ్యటానికి ప్రయత్నిస్తారు.

ఆర్. ఎస్. సి – ద్రోణాచలం

నేను 1980 నుంచి కడుపునెప్పితో బాధపడుతున్నాను. అప్పటి నుంచి మందులు వాడుతున్నాను. 1982 డిసెంబరులోను, 1983 మే నెలలోను అమీబియాసిస్‌కి చికిత్స చేశారు. కానీ తగ్గలేదు. 1985లో సిగ్మాయిడోస్కోపీ చేసి ఏమి లేదన్నారు. నాకుమాత్రం ఎడమవైపు నెప్పిగా ఉంటుంది. దాదాపు ఆరువేల మాత్రలు వాడాను. దీనివలన భవిష్యత్తులో ప్రమాదమా?

కడుపునెప్పికి ఎన్నో కారణాలు ఉంటాయి. శస్త్ర చికిత్స నిపుణులు శరిరంలో ఏ లోపమూ లేదని తీర్మానించవలసి ఉంటుంది. అల్సరేటివ్ కొలైటిస్, పాలీప్, కొన్ని నరాల బలహీనతవల్ల వచ్చే ఇంటస్టైనల్ హర్రి మొదలయిన వాటివల్ల కూడా కడుపునెప్పి వస్తుంది.

వైద్య పర్యవేక్షణలో మందులను వాడితే ప్రమాదంలేదు. మీ రంతట మీరు మందులను కొని వాడకండి.

కె.ఆర్ – హైదరాబాద్

నా వయస్సు 21 సంవత్సరములు. నాకు 5 సంవత్సరముల నుండి ఒక వరిబీజము వాపువున్నది. ఈ వాపు ఒకొక్కమారు చాలా ఎక్కువగా వుంటుంది. ఈ మధ్య కడుపునెప్పి వచ్చుచున్నది. ఆర్థిక పరిస్థితుల మూలంగా ఆపరేషన్ చేయించుకోలేదు. ఆపరేషన్ చేయించుకోంటే ముందు ముందు ఏమైనా ఇబ్బందులు వస్తాయా?

మీరు వ్రాసిన లక్షణాలనుబట్టి, కడుపునెప్పి ఉండటాన్నిబట్టి అది ఇన్‌డైరెక్ట్ ఇంగ్వైనల్ హెర్నియా అని తెలుస్తున్నది. శస్త్ర చికిత్స చేసే వైద్యులకి చూపించి వారి సలహా ప్రకారం శస్త్రచికిత్స చేయించుకోవటం మంచిది. ఆపరేషన్ చేయించుకున్నందువల్ల ఇబ్బందులేవీ రావు. చేయించుకోకపోతే మాత్రం కొన్ని అవాంతరాలు, అందులోనూ ముఖ్యంగా స్ట్రాంగులేటెడ్ హెర్నియా వచ్చే అవకాశం ఉంటుంది. అప్పుడు ప్రాణాపాయస్థితి ఉంటుంది. □

విచిత్ర యథార్థ గాథలు

—పులిగడ్డ విశ్వనాథరావు.

భవిష్యద్రష్ట జీన్ డిక్సన్

అమెరికాకు చెందిన జీన్ డిక్సన్ అనే మహిళ 1952 లో ఒకరోజు ఉదయం సెంట్ మాథ్యూ కాథెడ్రల్‌లో ప్రార్థనకు వర్జిన్ మేరీ విగ్రహం ముందు మోకరిల్లబోయింది. ఆమె మదిలో దేదీప్యమానంగా అమెరికా అధ్యక్షుని నివాసం వైట్ హవుస్ ప్రత్యక్షమైంది. ఆ భవంతిపై 1960 అనే అంకె రూపొందింది. ఆమె చూస్తూండగా ఆ అంకె నుంచి నల్లటి మేఘం బైటకు వచ్చి వైట్ హవుస్‌పైనా, ఆ భవంతి ముందు నిల్చున్న ఒక వ్యక్తిపైనా చినుకులు కురిపించసాగింది. ఆ వ్యక్తి పొడవుగా, యవ్వనంలో ఉన్నాడు. అతడి జుత్తు గోధుమ రంగులో వత్తుగా ఉంది. కళ్ళు నీలంగా ఉన్నాయి.

అతడు డెమొక్రెటిక్ పార్టీకి చెందినవాడని, అతడు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నుకోబడతాడని, అతడు పదవిలో ఉండగానే చంపబడతాడని ఆమెకు ఆమె అంతరాత్మ చెప్పింది. మార్చి 11, 1956 తేదీ 'పరేడ్'



జీన్ డిక్సన్

అనే పత్రికలో ఆమె జోస్యం ప్రచురితమైంది. 1960 లో జాన్ కెనెడీ అమెరికా అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. ఆయన వత్తు గోధుమ రంగు జుత్తు, నీలం కళ్ళతో చూడ ముచ్చటగా ఉండేవాడు. జీన్ చెప్పినట్టుగానే నవంబరు 22, 1963 తేదీన డల్లాస్‌లో ఆయన పదవిలో ఉండగానే హత్య చేయబడ్డాడు. హత్యకు ముందు జీన్ వైట్ హవుస్‌లో తన స్నేహితులను హెచ్చరించింది కాని వాళ్ళు కెనెడీ కుటుంబానికి ఈ విషయం చెబితే వారు నమ్ముతారో లేదో అని, పైపెచ్చు వైట్‌హవుస్‌లో తమను మూఢ విశ్వాసులని అంతా ఎగతాళి చేస్తారని వారు ఊరుకున్నారు.

జీన్ డిక్సన్‌కి ఇటువంటి అతీంద్రియ దృశ్యాలు తరచు కనబడతూ ఉండేవి. వాటితో ప్రతీకలనుబట్టి ఆమె ఆ దృశ్యాల అర్థం చెప్పేది. ఆమె స్ఫటికగోళం (క్రిస్టల్ బాల్)లో చూసి, లేదా తన వద్దనున్న చీట్ల దొంతరను కోయించి కూడా జోస్యం చెప్పేది. సంబంధ వ్యక్తి మునివేళ్ళను స్పృశించి, ఆ వ్యక్తి ప్రకంపనాలను తెలుసుకుని కూడా భావి సంఘటనలను చెప్పగలిగేది. ఆమె ఎవరివద్దా ప్రతిఫలం తీసుకునేదికాదు.

1957 లో ఒక ఇంటర్వ్యూలో జీన్‌ను ఒక పత్రికా ప్రతినిధి జవహర్‌లాల్ నెహ్రూ గారి గురించి ప్రశ్నించాడు. ఆమె స్ఫటిక గోళంలో చూసి ఏడేళ్ళ వ్యవధిలో ఇంగ్లీషు 'ఎస్' అక్షరంలో మొదలయే పేరు గల ఒక మనిషి నెహ్రూగారి జాగాలో ప్రధానమంత్రి అవుతాడని చెప్పింది. ఆమె చెప్పినట్టుగానే మే 1964 లో నెహ్రూగారు అస్తమించగా శాస్త్రీజీ ఆయన స్థానంలో ప్రధానిగా ఎన్నికయారు.

జీన్ తండ్రి ఫ్రాంక్ పింకర్ట్, తల్లి ఎమ్మా ఫాక్‌గ్రాఫ్ జర్మన్ దేశస్థులు. వారు పెళ్ళి తర్వాత హనీమూన్‌కి అమెరికాకు వచ్చి అక్కడే స్థిరపడిపోయారు. జీన్ తల్లి ఆమెను చిన్నతనంలో ఒకసారి రెడ్ ఇండియన్ ఎరుకల మహిళ వద్దకు తీసుకెళ్ళింది. ఆమె జీన్ చేయి చూసి ఇటువంటి రేఖలు కోట్లలో ఒకరికి ఉంటాయని, ఈ పాప గొప్ప భవిష్యద్రష్ట అవుతుందని చెప్పి, ఒక స్ఫటిక గోళం ఇచ్చిందట. జీన్ జేమ్స్ డిక్సన్ అనే స్థిరాస్తి దళారిని పెళ్ళాడింది. ఆమె భర్తకు అతడి వృత్తిలో సహాయం చేసేది. ఆమె క్యాన్సర్ రోగులకు, బీదసాదలకు చందాలు సేకరించి ధర్మ కార్యాలు కూడా చేసేది.

జీన్ జోస్యాలు తరచు పత్రికలలో ప్రచురితమై, రేడియో, టి. వి. లలో ప్రసారమై తర్వాత యథార్థాలుగా మారేవి. దాంతో ఆమె అమెరికాలో చాలా ప్రసిద్ధి చెందింది. 1944 ఆఖరిలో అప్పటి అమెరికా అధ్యక్షుడు రూస్‌వెల్ట్ ఆమెను వైట్ హవుస్‌కు రప్పించి. "నేను నా పని ముగించడానికి ఇంకా ఎంత వ్యవధి ఉంది?" అని తాను ఎన్నాళ్ళు బ్రతకనున్నది పరోక్షంగా అడిగాడు. ఆమె అతడి మునివేళ్ళను స్పృశించి ప్రశ్నను దాటవేయబోయింది. రూస్‌వెల్ట్ పట్టుపట్టగా, "ఆరు నెలలు, లేదా ఇంకా తక్కువే కావచ్చు" అని సమాధానం చెప్పింది. చైనా అప్పటికి సామ్యవాదిగా మారలేదు. చైనా సామ్యవాదిగా మారుతుందని ఆమె చెప్పగా రూస్‌వెల్ట్ నమ్మలేకపోయాడు. చైనాకి విరుద్ధంగా అమెరికా, రష్యా ఏకమవుతాయని కూడా ఆమె రూస్‌వెల్ట్‌కు చెప్పింది. రూస్‌వెల్ట్ ఆరు నెలలలోగానే 12 ఏప్రిల్ 1945 తేదీన కన్ను మూశారు.

1946లో వాషింగటన్‌లో ఒక భారత దౌత్య వేత్తకు జోస్యం చెబుతూ భారత విభజన జరుగుతుందని, అతడు కొత్తగా ఏర్పడిన దేశం పౌరసత్వం స్వీకరిస్తాడని చెప్పింది. ఆ దౌత్యవేత్త అది నమ్మలేదు కాని మరుసటి ఏడే ఆమె చెప్పింది వాస్తవం అయింది. ఆ దౌత్య వేత్త పాకిస్తాన్ పౌరత్వం స్వీకరించాడు. ఆమె ఒక పార్టీలో హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామిక వేత్త మిర్ లాయిక్ అలీకి హైద్రాబాద్ రాజ్యం భారత దేశంలో విలీనమవుతుందని జోస్యం చెప్పింది.

1947 వేసవిలో డేనియల్ మాగ్నెర్ అనే యాజమాన్య నిపుణుడు ఆమె భర్తతో తన తూర్పు దేశాల పర్యటనలో న్యూఢిల్లీకి కూడా వెళుతున్నట్టు పేర్కొన్నాడు. జీన్ చెవిన 'న్యూఢిల్లీ' అనే మాట పడగానే ఆమె, "ఆరు నెలల్లో ఎవరో మహాత్మా గాంధీని హత్య చేస్తారు. అతడు గాంధీగార్ని చంపుతాడని ఎవరూ ఊహించలేరు," అని చెప్పింది. ఆమెకు గాంధీగారు చేతులెత్తి దేవుణ్ణి ఆరాధిస్తున్నట్టు, తర్వాత రక్తసిక్తమై నేలకు ఒరిగి పోయినట్టు, దృశ్యం కనపడిందట. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి డాగ్ హేమర్‌షోల్డ్ విమాన ప్రమాదంలో చనిపోతాడని, శృంగార తార మెరిలిన్ మన్రో ఆత్మహత్య చేసుకుంటుందని, జర్మనీ ఛాన్సలర్ కొన్రాడ్ ఎడినార్ రిటైరవుతాడని జీన్ ముందుగానే జోస్యం చెప్పింది. ఆమె జోస్యాలు నిజమయాయి.

మే 14, 1953 తేదీన రేడియో కార్యక్రమంలో రష్యాలో అమెరికా మాజీ రాయబారి జోసెఫ్ డెవిస్ ప్రశ్నించగా ఆమె స్ఫటిక గోళంలో చూసి రష్యా ప్రధాని మెలన్కోవ్ రెండేళ్ళకంటె తక్కువ సమయంలో ఉంగరాల జుత్తు, మేకగెడ్డం, ఆకు పచ్చ కళ్ళు గల ఒక మనిషికి తన పదవిని అప్పచెప్పుతాడని అంది. "రష్యాలో అంత తేలిగ్గా అధికారం చేతులు మారదు" అని ఆ మాజీ రాయబారి సందేహం వెలిబుచ్చాడు. కొంచెసేపు తర్వాత జీన్‌కు స్ఫటికగోళంలో మరొక దృశ్యం గోచరించింది. "ఆ తర్వాత ఒక వెండి బంతి అంతరిక్షంలోకి

చూసుకుపోయి, భూమి చుట్టు తిరిగి, రష్యాకు వచ్చి శాంతి కపోతంలా ఒక లావుపాటి, బట్ట తలాయన తల మీద వాలుతుంది," అని చెప్పింది.

ఆమె చెప్పినట్టే ముందు మేకగెడ్డం, ఉంగరాల జుత్తు, ఆకుపచ్చని కళ్ళుగల మార్షల్ బుల్గానిన్ మెలన్కొవ్ జాగాలో ప్రధాని అయాడు. తర్వాత బట్టతల, స్థూలకాయం గల క్రుశ్చేవ్ అధికారాన్ని చేపట్టాడు. 1957లో క్రుశ్చేవ్ హయాంలో రష్యా ప్రధమంగా మానవ నిర్మిత ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపింది. 23 ఏళ్ళ క్రితం జీన్ భావి పోప్‌లలో ఒకరిపై హత్యాయత్నం జరుగుతుందని చెప్పింది. ఆమె చెప్పినట్టు గానే ప్రస్తుత పోప్ ద్వితీయ జాన్ పాల్‌పై హత్యాయత్నం జరిగింది.

అప్పుడప్పుడు జీన్ డిక్సన్ జోస్యాలు విఫలమయ్యేవి. మచ్చుకి చంద్రమండలంపై ప్రధమంగా రష్యా మనిషిని దింపుతుందని ప్రకటించింది. ఐతే ఈ పొరపాట్లు అతీంద్రియ దృశ్యాలలో తాను చూసిన ప్రతీకలను అపార్థం చేసుకోవడం వలన జరుగుతాయని ఆమె సంజాయిషీ చెప్పింది.

చైనా రష్యాతో సరిహద్దు కలహానికి తల పడుతుందని, తర్వాత రష్యాతో యుద్ధం చేస్తుందని, ఆయుద్ధంలో చైనా క్రిమి వాయువులు వాడుతుందని, రష్యా, అమెరికాలు ఏకమై చైనాతో యుద్ధం చేస్తాయని చెప్పింది. ఐతే ఇది ప్రపంచ యుద్ధానికి దారి తీయదుట. ఈ శతాబ్దితొమ్మిదవ దశాబ్దిలో అమెరికాలో జాతి సమస్య తీవ్రతరం అవుతుందని, దాని మూలంగా పెక్కు ఆఫ్రికా, ఏషియా దేశాలు అమెరికాకు ఎదురు తిరుగుతాయని, దీని మూలంగా ప్రపంచ యుద్ధం మొదలవుతుందని ఆమె చెప్పింది.

1962లో పశ్చిమ ఆశియాలో ఒక మహాత్ముడు జన్మించి యావత్ మానవాళిని ఒక విస్తృత మతం క్రింద సంఘటిత పరుస్తాడని, ఆ మతం క్రొత్త క్రైస్తవ మతానికి నాంది పలుకుతుందని, పోప్ ఆధిపత్యం క్రమంగా తగ్గిపోతుందని జీన్ చెప్పిన జోస్యాలు. పదహారవ శతాబ్దపు ఫ్రెంచి భవిష్యద్రష్ట నోస్ట్రాడామస్ చెప్పిన జోస్యాలతో కొంత మట్టుకు జీన్ చెప్పిన జోస్యాలు కలుస్తాయి. అతడు కూడా చైనాలో హిట్లర్ వంటి నియంత జన్మిస్తాడని, రష్యా, అమెరికా కలిసి చైనాతో యుద్ధం చేస్తాయని, 1999 జూలైలో మహాయుద్ధం అవుతుందని, దాంట్లో ఉత్తరార్ధ గోళపు దేశాలు ఎక్కువగా వినాశం చెందుతాయని చెప్పాడు.

జీన్ దైనందిన జీవితంలో కూడా జోస్యాలు చెప్పి మిత్రులని, బంధువులని ఆపదల నుంచి కాపాడేది. ఆమె స్నేహితురాలు బెట్టీ న్యూయార్క్ నుంచి వాషింగటన్‌లో జీన్‌కు ఫోను చేసి ఫలానా నెక్లెసు నచ్చింది, కొనేదా అని అడిగింది. జీన్ ఆమెతో ఆ నెక్లెస్ ధర ఇంకా తగ్గుతుంది, అప్పుడు కొనుక్కో అని చెబుతూ "నీ కిటికీ బైట ఒక మనిషి తచ్చాడుతున్నాడు. అతడు నిన్ను బ్లాక్‌మైల్ చేయబోతున్నాడు. నువ్వు అతడు బెల్ మోగించినా తలుపు తీయక," అని సలహాఇచ్చింది. బెట్టీకి నిజంగా ఒక మనిషి కిటికీబైట కనబడ్డాడు. అతడు బెల్ కూడా మోగించాడు. బెట్టీ తన పనిమనిషి ద్వారా అతడి పేరు, ఫోను నెంబరు తీసుకుని తన వకీలుకు అంద చేసింది. వకీలు దర్యాప్తు చేసి బెట్టీ అతడికి ఎప్పుడో రాసిన ఉత్తరాల ఆధారంగా ఆ మనిషి ఆమెను బ్లాక్‌మైల్ చేయదలచాడని ఆమెకు తెలిపాడు. నెక్లెస్ ధర కూడా తగ్గాక బెట్టీ దాన్ని కొనుక్కుంది. □

శివోక్తం


(ప్రఖ్యాత కన్నడ కవి సర్వజ్ఞ వచనాలు ఆధారంగా)

తీర్థయాత్రలకై నీవు తిరుగనేల
కాశికిం బోవ నేమిటి కారణమ్ము
సర్వకారణ భూతుండు, శాశ్వతుండు
నీదు హృదయాన పూర్ణుడై నిలిచియుండ

ఆకటం దూలు నరులకు నన్నమిడుము
నెనరు మాటల నీ నాల్క దనర నిమ్ము
ఇతరు లెవరైన నీవలె నెంచుమయ్య
ఎచటనో గాదు కైలాస మిచట గలదు

ఇచ్చియొరులకు నేదేని నెద్వకయ్య
ఇచ్చి చెప్పకు యొరులతో నెన్నడేని
ఇచ్చి యది దోసమని మది నెంచకయ్య
చేరి యున్నది నీ బువ్వ శివుని చెంత.

– కనమలూరు వెంకట శివయ్య



వారఫలం

16-5-1986 శుక్రవారం నుండి 22-5-1986 గురువారం వరకు

★ **మేషం** : వ్యాపారంలో అనుకొన్న దానికన్నా అధికాదాయం చేకూరుట నిశ్చయం. పత్రికాధిపతులకు, ముద్రణా సంబంధమైన పరిశ్రమలయందున్న వారికి, కళాకారులకు యోగ్యమయిన కాలం. భారి వ్యాపారం జరిపే వారికి అనుగుణ్యమైన వారం. స్త్రీలకు : వయసులో ఉన్నవారికి శుభకార్యానుకూలం.

★ **వృషభం** : నూతన మిత్రుల కలయిక, విద్యారంగాన ప్రసిద్ధి, సంఘ సేవయందాసక్తి, ఉన్నత పదవులకు ప్రాకులాట, సాహితీపరంగా పెంపు చెప్పదగిన సమయం. వారమంతా బాగుండగలదని చెప్పదగిన అవకాశాలున్నాయి. స్త్రీలకు :ఉద్యోగరిత్యా చేసిన ప్రయత్నాలు ఫలవంతంకాగలవు. అవసరాలకు ద్రవ్యం అందటం గమనింపదగిన అంశం.

★ **మిధునం** : రాజకియంగా ఉత్తమమైన కాలం. కొందరు విద్యా నిమిత్తంగా దూర ప్రాంతాలకు ప్రయాణించు అవకాశమున్నది. నిత్యావసర వస్తువులు సేకరించుకొగల అవకాశం, వ్యాపారరిత్యా లాభదాయక వారం. మాటకు విలువ చేకూరటం గమనింపదగిన అంశం. స్త్రీలకు : నాలుగు విధాలా పెంపునకు అవకాశం. స్వల్పంగా ధనాదాయం.

★ **కర్కాటకం** : సంఘంలో విలువ పెరుగుతుంది. మాటకు మన్నన లభిస్తుంది. తిరిగి తిరిగి విసిగి వదలిన మొత్తంలో అధిక ప్రయత్నాన కొంత కాకపోయిన కొంత అయినా అందగల అవకాశాలున్నాయి. కొందరకు ప్రభుత్వ పరంగా రావలసిన దబ్బు అందుతుంది. స్త్రీలకు : కళా రంగ ప్రతి, స్వల్పంగా ధనాదాయం.

★ **సింహం** : అప్పులు తీర్చికొనుటకు అవకాశమున్నది. ఒకానొక రంగాన చేసిన ప్రయత్నం సానుకూలం కాగలదు. బంధువులతో మనస్తాపం రావచ్చు. ప్రయాణాలలో యిబ్బందులకు, వస్తువులు పోగొట్టుకొనుటకు అవకాశమున్నది. స్త్రీలకు : ప్రయాణాలందు ప్రమాదాలు, అధిక శ్రమ, వ్యయం.

★ **కన్య** : పరిచితుల సహాయమున్నది. డబ్బును గూర్చిన చిక్కులు నివృత్తియగు మార్గమున్నది స్థిరాస్తి పెంపొందించుకొనే మార్గమున్నది. శని గ్రహాను గ్రహ మున్నది. కొందరకు ఉద్యోగ రిత్యా 'ప్రమోషన్' లభ్యమయ్యే అవకాశమున్నది. స్త్రీలకు : రాబడియందు పెంపు, ఉద్యోగరిత్యా చక్కని అవకాశాలు లభిస్తాయి. సుఖ శాంతులు, ఆనందోత్సాహాలకు అవకాశం.

★ **తుల** : రాజకియంగా పెంపులేదని, ఒకవేళ ప్రాకులాడితే యిబ్బందులకు గురి కావలసి రావచ్చునని, వృత్తియందు ఆటంకాలు రానున్నవని, ప్రయాణాలందు ప్రమాదం సంభవమని గ్రహించి మెలగాలి. చాలమందికి మేధావుల సంపర్కం ఏర్పడుతుంది. స్త్రీలకు : కార్య విలంబన, అధిక వ్యయం.

★ **వృశ్చికం** : కుటుంబ సభ్యులతో, బంధువులతో, ఆత్మియులతో, మిత్రవర్గంతో ఎంత జాగ్రత్తగా మాట్లాడితే అంత మంచిది. మీరు వ్యాపారం చేసేలాగైతే, మేలైన సరకులు సేకరించుటకు అవకాశం గల వారం. స్త్రీలకు : బంధు మిత్ర కలయిక, సరస సంభాషణలు, వృత్తి యందు వృద్ధి.

★ **ధనుస్సు** : ఏ వ్యవహారమయినా సానుకూలం చేసికోవాలంటే చూచీ చూడనట్టుండరాదు. బాగా యోచించి కార్యసాధన గావించుకోవాలి. వృత్తియందు పెంపు చేకూరుతుంది. రాజకియంగా మీకు సంతృప్తి కలుగుతుందని చెప్ప వీలు లేదు. స్త్రీలకు : అధిక ఖర్చులు, వ్యవహారపు చిక్కులు చెప్పదగిన కాలం.


★ **మకరం** : ఇంకా వ్యవహారాలు ఎటూ తేలని స్థితి. స్థిర చరాస్థులందు వెనుక ముందు లుండక తప్పదు. తోడి వారితో అనవసరంగా మనస్తాపం రాగలదేమో గ్రహించి మెలగండి. దూరపు ప్రయాణాలు కొందర విషయంలో చెప్పదగిన అవకాశమున్నది. స్త్రీలకు : రాజకియంగా ఏవిధంగా మేలు కాదని గ్రహింపగలరు.

★ **కుంభం** : ఒకానొక గృహ వ్యవహారం సులువుగా సానుకూలమవుతుంది. ముఖ్య బంధువులు యింటికి రాగల అవకాశాలున్నాయి. ప్రయాణం చేయక తప్పదు. కొందరు యిబ్బందులకు గురికాకను తప్పదు. స్త్రీలకు : కుటుంబ కలతలు, వృత్తియందు అనానుకూలత చెప్పదగిన అంశాలు.

★ **మీనం** : అన్ని విధాలా హుషారుగా ఉండనున్న దినాలు. చేసిన యత్నాలు సానుకూలమయ్యే మార్గమున్నది. వ్యవహారపు చిక్కులుంటే నివృత్తి కాగలవు. ఇంట శుభ కార్య ప్రస్తావన లుండగలవు. ప్రయాణాలు సుకరంగా, ఆనందంగా సాగిపోగలవు. ఇంతకు, యత్న కార్యసిద్ధి, ఆరోగ్యమందు పెంపు, స్వల్పాదాయం, కళారంగావకాశాలు లభ్యం కానున్నవి. స్త్రీలకు : వృత్తి యందు పెంపు, ధనాధాయం, కొందరకు ప్రమోషన్' అవకాశాలుంటాయి.

–విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

వ్యక్తిగతం



మదరాసులో ఆయిదేళ్ళ లోపుగా గణిత శాస్త్రం శాల అధ్యయన సంస్థను సమున్నత ప్రమాణాలతో, నెలకొల్పాలని ఆశిస్తున్న శ్రీ ఇ. సి. జార్జ్ సుదర్శన్ (54) భారతదేశం నుండి అమెరికాకి వెళ్ళి స్థిరపడిన శాస్త్రవేత్తలలో ఎన్నదగిన వారు. ప్రాథమిక భౌతిక శాస్త్రం, జీవ భౌతిక శాస్త్రం, దృక్‌శాస్త్రంలలో 200కి పైబడి పరిశోధనా పత్రాలను ప్రచురించిన ఈయనకి గణితశాస్త్ర పరమైనచిక్కులను విడదీయడం పట్ల మక్కువ ఎక్కువ. జన్మరీత్యా క్రైస్తవుడయినా ప్రస్తుతం హిందువుగా జీవిస్తున్న సుదర్శన్ కేరళకు చెందిన వారు. ఈయన భార్య శ్రీమతి లలిత ఇంజనీరింగ్ పట్టభద్రురాలు.

1951లో మదరాసు క్రిస్టియన్ కళాశాల నుంచి సైన్స్‌లో ఆనర్స్ డిగ్రీ తీసుకొన్న సుదర్శన్ ఎం.ఏ. డిగ్రీ కూడా మదరాసు విశ్వవిద్యాలయం నుంచి స్వీకరించారు. బొంబాయిలో ఉన్న "తాతా వారి మౌలిక శాస్త్ర పరిశోధనా సంస్థ"లో చేరి ప్రపంచ ప్రసిద్ధి పొందిన హోమీ బాబా సాహచర్యాన్ని అందుకో గలిగారు. బాబా నిర్వహించిన శాస్త్ర సదస్సుకు ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేసిన భౌతిక, గణిత శాస్త్రవేత్తలతో (వీరిలో ఎక్కువ మంది నోబెల్ బహుమతి గ్రహీతలే!) జార్జ్ సుదర్శన్‌కు పరిచయ భాగ్యం కలిగింది. ఈ భాగ్యమే ఈయనను రోచెస్టర్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రాబర్ట్ మార్షాక్‌కి చేరువ చేసింది. ఆయన పర్యవేక్షణలో నే జార్జ్ సుదర్శన్ 1957 నాటికి "డాక్టర్" కాగలిగారు. 1959లో హోమీ బాబా సూచన మేరకు బొంబాయికి వచ్చినా జీతభత్యాల విషయంలో సంతృప్తి కలుగక పోవడంతో రోచెస్టర్‌కే తిరిగి వెళ్ళిపోయారు. న్యూయార్క్ విశ్వ విద్యాలయంలో కొంత కాలం ఉన్నాక ప్రస్తుతం టెక్సాస్ విశ్వవిద్యాలయానికి చెందిన "సెంటర్ ఫార్ పార్టికల్ థియరీ"కి డయిరక్టర్‌గా పని చేస్తున్నారు.

పోయిన సంవత్సరం జులైలో జరిగిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మదరాసు వారి 22వ స్నాతకోత్సవంలో ఉపన్యసిస్తూ "సైన్స్, టెక్నాలజీ– ఇవి రెండూ ఒకే అంశాన్ని వ్యక్తపరచే విభిన్న విషయాలు! ప్రగతిని కోరుకునే వారు టెక్నాలజీని మాత్రమే ఆహ్వానించరు. టెక్నాలజీ ఎంత ముఖ్యమో, మౌలిక శాస్త్రీయ పరిశోధన కూడా అంత ముఖ్యమైనది" అని వెలిబుచ్చిన అభిప్రాయాలు అక్షర సత్యాలు. "మన దేశంలో పరిశోధన చేయడానికి కావలసిన పథకాన్ని సమకూర్చు కోవడం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కన్నా చాల తేలిక. కావలసినదల్లా చిత్త శుద్ధి, నిజాయితీ, అంకిత మనస్తత్వం ఉన్న శాస్త్రజ్ఞులు" అని జార్జ్ సుదర్శన్ వెల్లడించిన అభిప్రాయాన్ని ఎవరూ కాదనలేరు.

ఈయన అనుకొంటున్నట్లే అతి త్వరలో మదరాసులో గణిత శాస్త్రంశాల అధ్యయన సంస్థను నెలకొల్పి శాస్త్ర పరిశోధనలో ఉన్నత ప్రమాణాలను పాటించి భావి తరాల వారికి మార్గ దర్శకులుగా నిలిచిపోవాలని ఆశిద్దాము.... □



పాకిస్తాన్ మాజీ ప్రధాన మంత్రి కీ. శే. జుల్ఫికర్ ఆలీ భుట్టో కుమార్తె, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పి.పి.పి) అధ్యక్షురాలు కుమారి బెనజీర్ భుట్టో (32) ఏప్రిల్ 10న తిరిగి స్వదేశానికి వచ్చారు. లాహోర్ విమానాశ్రయంలో ఆమెకు అపూర్వమైన స్వాగతం లభించింది. అక్కడి నుంచి 13 కి.మి. దూరంలో గల సభాస్థలికి మధ్య ఉన్న మార్గం అంతా జనంతో క్రిక్కిరిసి పోయింది. విమానాశ్రయం నుంచి కారులో ఆమె సభాస్థలికి చేరుకోటానికి దాదాపు 10 గంటలు పట్టింది! ఆమె ప్రసంగం వినటానికి దాదాపు 5 లక్షల మంది వచ్చారు. అసత్యారోపణలతో తమ తండ్రిని ఉరి తీయించిన జనరల్ జియాని పదవిచ్యుతుడిని చేయటం, శాంతి, అహింసల ద్వారా పాకిస్తాన్‌లో అసలైన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించటం తమ ధ్యేయంగా ఆమె పేర్కొన్నారు. తొమ్మిదేళ్ళ సైనికపాలన కంచ అణగారి పోయి ఉన్న పాక్ ప్రజలకి బెనజీర్ భుట్టో ఒక ఆశాజ్యోతిగా కనిపిస్తున్నది. రెండేళ్ళలోగా పాకిస్తాన్‌లో తిరిగి ఎన్నికలు జరపాలని ఆమె గట్టిగా కోరారు. పంజాబ్ రాష్ట్రం (పాకిస్తాన్) రాజధాని లాహోర్ నుంచి ఆమె తమ ప్రచారాన్ని ప్రారంభించటం ఆమె రాజకీయ పరిణతని సూచిస్తున్నది. పంజాబ్ మద్దతు లేకుండా ఏ ఉద్యమం, పార్టీ విజయాన్ని సాధించ లేదన్నది గతంలో అనేకసార్లు నిరూపింప బడింది. ప్రభుత్వాన్ని గడగడలాడించ గల సత్తా ఆ రాష్ట్రానికి ఉందన్న విషయం ఆమె గ్రహించింది. అక్కడ తమ ప్రభుత్వం ఎలా ఉందో తెలుసుకుని తమ స్వరాష్ట్రమైన సింద్‌కి వెళతారామె. సింద్ ఎప్పుడూ భుట్టోలకే అండగా నిలుస్తుంది.

ప్రజా బలంతో ఫిలిప్పయిన్స్ అధ్యక్షుడు మార్కోస్‌ని పదవిచ్యుతుడిని చేసిన కొరజాన్ అక్వినోతో బెనజీర్‌ని పోల్చటం జరుగు తున్నది. బెనజీర్ ప్రచారంలో ఇది కూడా ఒక భాగం అయింది. శ్రీమతి అక్వినో భర్తని మార్కోస్ హత్య చేయించాడు. అలాగే బెనజీర్ తండ్రి భుట్టోని జియా ఉరి తీయించాడు. ఇద్దరికి ప్రజల సానుభూతి బాగా లభించింది. రాజకీయాలలోకి ప్రవేశించాల్సిన అవసరం కలిగింది. జైలు శిక్ష, గృహ నిర్బంధం, ప్రవాసంతో సహా తొమ్మిదేళ్ల పాటు నిరాశాంధ కారంలో కొట్టు మిట్టాడుతున్నా కూడా ఆమె తమ పి. పి. పి. పతాకాన్ని అంత ఎత్తున ఎగురుతూ ఉండేలా చేసారు. బయట వారు కల్పించుకోకుండా నిరోధించేందుకు ఆమె పాకిస్తాన్‌కి ఆయువు పట్టనదగిన వాషింగ్‌టన్, మాస్కో, రియాద్‌లు సందర్శించారు. తమ ప్రయత్నంలో ఆమె ఎంతవరకు విజయాన్ని సాధిస్తారన్నది వేచి చూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్టీలో ఉన్న చీలికలు ప్రధానం కాదు. పాలకుల ప్రతిస్పందన ఎలా ఉంటుందన్నది ముఖ్యం. కాలగతిలో అదే తగ్గి పోతుందన్న ఉద్దేశంతో బెనజీర్‌కి తమ పలుకుబడిని మరింతగా పటిష్ఠం చేసుకునేందుకు జియా అనుమతిస్తాడా? లేక అణచివేత విధానాన్ని పునఃప్రారంభిస్తారా? తాను పదవి నుంచి దిగిపోవాలనుకుంటె తప్ప బెనజీర్ కోరుతున్న రీతిలో ఎన్నికలు జరపటానికి ఆయన అంగీకరించడు. ఎందుకంటే పి. పి. పి. గెలుస్తుం దనటంలో సందేహం లేదు కాబట్టి.

బెనజీర్‌కి కొండంత ప్రజాబలం అండగా ఉన్నా, పత్రికా సమావేశాలలో ఆమె తమ పార్టీకి హింసపై నమ్మకం లేదని, శాంతియుతంగానే మార్పు కోరుతున్నామని, పరిస్థితులు అనుకూలించకపోతే 1990 వరకూ ఎన్నికల కోసం తాము వేచి ఉండగలమని ఆమె చెప్పినప్పటికీ ఇప్పుడు కొత్తగా తిరిగి ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వాన్ని ఒప్పించటం అంత తేలిక కాదు. సైనిక దళాల ప్రధానాధికారిగా ఇప్పుడు తమకి ఉన్న రెండవ బాధ్యతని వదులుకోడానికి సిద్ధంగా లేమన్న స్థిర నిర్ణయాన్ని జియా వ్యక్తం చేశారు. అందువల్ల పరిస్థితులు అనుకూలంగా లేకపోతే తిరిగి సైనిక పాలన విధించవచ్చున్న సూచన కనిపిస్తున్నది. బెనజీర్‌కి ప్రజాబలం ఉంటే జియాకి ఆయుధ బలం ఉంది. పాకిస్తాన్‌లో అసలైన ప్రజా స్వామ్యాన్ని పునఃప్రతిష్ఠించే ఉద్దేశ్యంతో ఆమె చేసిన వాషింగ్‌టన్ పర్యటన సరళ స్వభావులైన కొద్ది మంది సెనెటర్‌లకి, కాంగ్రెసు వారికి సంతృప్తి కలిగించి ఉండవచ్చు. కానీ రీగన్ పరిపాలనా యంత్రాంగం మద్దతు ఆమెకి లభించక పోవచ్చు. ప్రస్తుతం ఇస్లామాబాద్ నిర్వహిస్తున్న భౌగోళిక పరమైన రాజకీయ పాత్రకి ముగ్ధు డవుతున్న శ్రీ రీగన్ మాస్కోకి అనుకూలంగా ఉండే ఒక పాకిస్తానీ రాజకీయవేత్తని, ముజాహిదీన్ వ్యతిరేక దృక్పథం ఉన్న ఆమె పార్టీని, అమెరికా వ్యతిరేక నినాదాలని చేసే అనుచర వర్గం గల బెనజీర్‌ని ఆహ్వానించటానికి అంత సుముఖంగా ఉండక పోవచ్చు.

లాహోర్, కరాచి, పెషావర్, రావల్‌పిండిలలో బెనజీర్ పట్ల ప్రజల ఆదరాభిమానాలు అమోఘంగా ఉన్నప్పటికీ ఆమె రాజకీయపు బాట మాత్రం గతుకులతో, గోతులతో నిండి ఉన్నదనే చెప్పవలసి ఉంటుంది. 32 సంవత్సరాల వయసు గల కుమారి బెనజీర్ భుట్టో తమ లక్ష్యాన్ని ఎలా సాధిస్తారో వేచి చూడవలసి ఉన్నది.... □

భయం

పి. సత్యవతి శాస్త్రి

సాల్ట్ డిపార్టుమెంటులో లోవర్ డివిజన్ క్లర్కుగా కాకినాడలో పని చేస్తున్న సూర్యారావుకి తలవని తలంపుగా ఒక ప్రమోషన్ ఇచ్చి నౌపడా గ్రామానికి బదిలీ చేసారు. అతనికి ఇద్దరు పిల్లలు. వారిలో మొదటిది ఆడపిల్ల. రెండవవాడు మగపిల్లవాడు. పసివాడికి ఇంకా నాలుగు ఏళ్ళు నిండలేదు.

ఆ పరిస్థితిలో పిల్లలతో పాటు భార్య ఇందిరను పుట్టింటనే అట్టే పెట్టి తాను ఒక్కడే నౌపడా వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు సూర్యారావు. కాని భార్య దానికి బొత్తిగా ఒప్పుకోలేదు. కంట నీరు పెట్టుకుని పిల్లలతో పాటు తాను కూడ నౌపడాకు బయలుదేరతానని భీష్మించుకుని కూర్చున్నది.

దానిమీద సూర్యారావు దానికి తన అభ్యంతరం చెప్పాడు.

"నౌపడా అంటే నీకింకా తెలియడంలేదు. అది ఒక చిట్టడివిలాంటి గ్రామం. అధమం ఒక కిలో మీటరు దూరం దాకా ఎక్కడా ఒక్క ఇల్లైనా కన్పించదు. ఆ ఇళ్ళైనా సాల్ట్ డిపార్టుమెంటు ఉద్యోగస్తులవి.

ఆపైన దొంగల భయం. దానిపైన పాముల భయం కూడా చాలా ఎక్కువ. ఎక్కడ చూచినా పాముల పుట్టలే. నీ వక్కడ అడుగు పెట్టగానే విపరీతమైన భయంవల్ల పై ప్రాణాలు పైనే ఎగిరిపోతాయి. నా మాట విని పుట్టింటిలో నే ఉండిపో." అయినా ఇందిర ఆ మాట తన చెవి కెక్కనీయలేదు.

సూర్యారావుకి ఇంకా ముప్పయ్యైదేళ్ళ ప్రాయం నిండలేదు. భార్య ఇందిర అతనికన్న పదేళ్ళు చిన్న. ఆమె కొంత అందగత్తెలలోనే లెక్క. పచ్చని శరీరచ్ఛాయతో, చక్రాలలాంటి కళ్ళతో, చక్కని చిక్కని చిరునవ్వుతో చూచిన వారి నిట్టే ఆకట్టుకోగలదు.

ఆమె తాను కూడ వెంట వస్తున్నానని పట్టుపట్టి రాగాలు మొదలు పెట్టినప్పుడు సూర్యారావు ఒక చిన్న ఛలోక్తి విసిరాడు.

"ఇందూ! నీవు కంట నీరు పెట్టుకుంటే మరింత అందంగా కన్పిస్తావు. ఆపైన కాటుక కూడ పెట్టుకుంటే చూడ రెండు కళ్ళు చాలవనిపిస్తుంది."

దానికి ఇందిర, "బాగానే ఉంది వరస. అందుకనే కాబోలు ఇటీవల తెల్లవారింది మొదలుకుని సాయంత్రం దాకా నన్నిలాగ ఏడుపించుకుని తింటున్నారు. ఏది ఏమయినా సరే నన్ను కూడా నౌపడా తీసుకు వెళ్ళవలసిందే."

ఇందిర కంట నీరు చూడగానే సూర్యారావు గుండె చెరువయింది. మరి కాదనలేక భార్యతోను, పిల్లలతోను కలిసి నౌపడాలో ఒక చిన్న గవర్నమెంట్ క్వార్టర్‌లో తన నివాస ప్రారంభించాడు. అలాగ ఒక నెల రోజులు గడిచేసరికి ఇందిర ఆ పరిస్థితులకు కొంచెం అలవాటు పడింది.

సామాన్యంగా ఆదివారం వచ్చిందంటే సాల్ట్ డిపార్టుమెంటు ఉద్యోగస్థులలో చాలా మంది నౌపడా గ్రామానికి ఏడెనిమిది కిలో మీటర్ల దూరంలో వున్న టిక్కలికి వెళ్ళి పోతూ వుంటారు. అక్కడ కావలసిన కొన్ని అత్యవసర వస్తువులు కొనుక్కుని సినిమా చూచి రాత్రి సుమారు పదకొండు గంటల ప్రాంతంలో ఇళ్ళకు చేరుకుంటూ ఉంటారు.

ఆవేళ సాయంత్రం కాగానే సూర్యారావు తన తోడి సాల్ట్ డిపార్టుమెంట్ ఉద్యోగస్తులతో కలిసి ఏదో సరికొత్త సినిమా చూచి రావడానికి టిక్కలి బయలు దేరాడు. ఇందిర కూడ బయలు దేరాలని అనుకున్నది కాని తాను ఒక్కతే పిల్లలతో కలిసి టిక్కలి వెళ్ళాలి.

అంతేకాని తోడుగా మరి మిగిలిన ఆడవాళ్ళు ఎవళ్ళూ లేరు. అందుచేతనే సూర్యారావు ఇంకొకప్పుడు ఎప్పుడైనా భార్యను సినిమాకు తీసుకుని వెడతానన్నాడు. అంతేనే కాని మరి ప్రస్తుతానికి వీలు లేదన్నాడు.

అందుచేత మరి ఏమి అనడానికి ఇందిరకు పాలుపోలేదు. ఆలస్యం చేయకుండా వెంటనే తిరిగి రావలసిందని పిల్లలతో పాటు వీధిలో నిలుచున్నది.

ఇటీవల నలుగు రైదుగురు బందిపోటు దొంగలు ఒక పెద్ద ఉప్పు కాంట్రాక్టరు ఇంటిలో జొరబడి అతని గుండె మీద బాకు ఆనించి భూమిలో దాచుకున్న నగలు, నట్రలు అపహరించుకుని పోయారని విని మరింతగా గజగజ వణికిపోయింది.

అంతకు మునుపే ఆమె తన పరిస్థితులన్నీ తెలియచేస్తూ ఒంటరిగా నౌపడాలో వుండలేకపోతున్నానని ఒక ఉత్తరం తన పుట్టింటికి వ్రాసింది. కాని దానికి సమాధానమేమి రాలేదు. అందుచేత ఆమె కీనాడు మరింతగా దిగులు పట్టుకుంది.

శ్రీకాకుళం జిల్లా నౌపడా గ్రామం ఉప్పు పంటకు చాలా ప్రసిద్ధి కెక్కింది. హటాత్తుగా ఎవరికైన కొంచెం జబ్బు చేస్తే డాక్టర్లతో పాటు మందులు, మాకులు దొరకవు. వాటికోసం సమీపంలో వున్న టిక్కలి వెళ్ళి రావలసిందే. ఇంకా కాలక్షేపం కోసం ఏ సినిమాకో వెళ్లాలంటే టిక్కలి ఒక్కటే తప్ప వేరొక దిక్కు ఏదీ లేదు.

అది డిసెంబరు నెలాఖరు. అందువల్ల ఆ ప్రాంతంలో పొగ మంచు ప్రారంభమయింది. దానికితోడు చలి కూడ ఎక్కువయింది. ఇందిర బిక్కు బిక్కుమంటూ పిల్లలతో కలిసి లోపలికి వెళ్ళి విపరీతమైన భయంతో, ఆందోళనతో ప్రాణాలు అరచేత పట్టుకుని కూర్చున్నది.

అంతలోనే వీధి తలుపు ఎవరో తట్టినట్టు చప్పుడయింది. ఇందిర తలుపు దగ్గిరగా వెళ్ళింది. కాని ఆ చప్పుడు గాలి వీచినందువల్లే బయలు దేరిందని నిశ్చయించుకున్నది. ఆ సమయంలో గుడ్లగూబల కూతలు, నక్కల ఊళ్ళలు తప్ప మరేవి వినపడలేదు. ఇందిర కప్పుడు వెంటనే తిరిగి పుట్టింటికి వెళ్ళిపోవాలనిపించింది.

సినిమాకి వెళ్ళవద్దని తాను ఒక్కతెని ఉండలేనని ఇందిర ఎంతగా ప్రాధేయపడిన సూర్యారావు వినలేదు.

"ఇదిగో చూడు నువ్వు బి. ఏ. పాస్ అయ్యావు. ఈ రోజుల్లో స్త్రీలు అన్ని రంగాలలోను మగవారిని తలదన్నే ధైర్యంతో ముమ్మందు కురుకుతున్నారు. అంతేనేగాని బి. ఏ. పాస్ అయినా నీలాగ చీటికి మాటికి బెంబేలు పడడం లేదు. కాస్త ధైర్యంగా వుండడం అలవాటు చేసుకో. కొంచెం ధైర్యం చిక్కబట్టుకోగలిగితే ఆపదలన్ని వాటంతట అవే దూర దూరంగా పారిపోతాయి అని బుజ్జగించాడు"

కాని ఇందిరకు ఆ ఓదార్పు చెవి కెక్కలేదు. సూర్యారావును సాగనంపి ఇంటిలో అడుగు పెట్టింది. అంతలో నే ఎలక్ట్రిక్ దీపాలన్ని ఒక్కసారిగా గప్పుమని ఆరిపోయాయి. అవి మరి తెల్లవారేదాకా తిరిగి వెలగలేదు.

ఆ ప్రాంతంలో ఎలక్ట్రిక్ లైట్లు అకస్మాత్తుగా ఆరిపోయి ఎప్పుడో ఒకప్పుడు తిరిగి వెలుగుతాయి. లేకపోతే భళ్ళుమని తెల్లవారేదాకా కటిక చెకటిలో కాలక్షేపం చెయ్యవలసిందే. ఆపైన ఆ చీకటిలో పిల్లల ఏడ్పులు, రాగాలు ఆరంభమయ్యాయి.

ఇందిరకు ఆ సమయంలో అకస్మాత్తుగా ఇంటిలో ఎవరైన దూరినా దూరవచ్చుననిపించింది. ఆ గాభరాలో ఆమెకు గుండె ఆగిపోతున్నట్టనిపించింది. అయిన అతి కష్టంమీద గుండె చిక్క బట్టుకుని పిల్లలతో పాటు పడకటింటిలోకి వెళ్ళి పరుపుమీద మేను వాల్చింది.

అలాగ సుమారు పదకొండు గంటలయ్యేసరికి సూర్యారావు ఇంటికి తిరిగి వచ్చాడు. అతడు ఇంటిలోనికి రాగానే భార్య అతికష్టంమీద తడుముకుంటూ వెళ్ళి ఒక చిన్న టేబుల్ లైటు

వెలిగించింది.

ఆపైన అతనికేసి చూచి కుమిలి కుమిలి దుఃఖించడం ప్రారంభించింది. అప్పటికి పిల్లలిద్దరు బెంగటిల్లిపోయి నిద్రిస్తున్నారు.

"ఎందుకలాగ ఏడుస్తావు?" సూర్యారావు ఎంతో ఆప్యాయంగా బుజ్జగిస్తూ ఇందిరను అడిగాడు. గట్టిగా మాట్లాడవద్దని నోటికి అడ్డంగా పెట్టుకున్న చేతితో ఇందిర అతనికి సూచించింది. ఏం అని అతి రహస్యంగా నెమ్మదిగా అడిగాడు సూర్యారావు.

ఇందిర తన గొంతు బాగా తగ్గించి అతని చెవిలో ఊదింది.

"నన్ను ధైర్యంగా వుండమని సలహా ఇచ్చారు మీరు. నేను అలాగే గుండె చిక్కబట్టుకుని పిల్లలతో పాటు ఇంట్లో కూర్చున్నాను. అంతలోనే ఎవడో ఓరగా వేసిన తలుపు తెరుచుకుని తటాలున ఆ గదిలో దూరాడు. వాడెవడో నల్లని ముసుగు మనిషిలా వున్నాడు. పిల్లలతో పాటు మనం నిద్రపోగానే ఇంటిలో దాచుకున్న విలువైన సామానులు అన్ని చేత పట్టుక్కుని ఇట్టే వీథిలోకి ఉడాయించేలా వున్నాడు.

కాస్త ఆ గదిలోకి వెళ్ళి చూడండి "

ఆ మాటలు వినగానే గాభరావల్ల సూర్యారావుకి నోటమాట పెగల్లేదు. అంతలోనే రహస్యంగా ఇందిర అందుకున్నది.

"అదేమిటండీ అలాగ గాభరపడి కంగారుపడిపోతారు. కాస్త ఆ గదిలోకి వెళ్ళి చూడండి. కండలు తిరిగిన మీరే ఇలాగ భయపడిపోతే ఎలాగ!

సూర్యారావు దానికి ఏవిధంగాను బదులు చెప్పలేక ఆ పక్కనే వున్న గది దాకా వెళ్లాడు. అంతేగాని ఆ అదిలోకి అడుగుపెట్టడానికి కూడ అతనికి ధైర్యంచాలలేదు.

వెంటనే ఒక్క అంగలోనే భార్య దగ్గరకు పరిగెత్తుకునివచ్చి.

అవును నీవన్నట్లే ఎవడో ఒకడు ముసుగుపెట్టుకుని అక్కడ చిన్నబల్ల కింద నక్కి కూర్చునట్టున్నారు." ఆపైన అతనికి నోట మాట పెగల్లేదు. భరించలేని భయంతో ముచ్చెమటలు పోసాయి. అంతలోనే చటుక్కున వీధి తలుపు తెరిచి తన గొంతెత్తి దొంగ, దొంగ అని గట్టిగా అరిచాడు. ఆపైన అతనికి అంకిళ్ళు పడిపోయాయి.

వీధి అరుగు మీద చతికిలబడిపోయాడు. అదే సమయంలో ఇందిర అతని జబ్బ దొరక పుచ్చుకుని పైకి లేవనెత్తింది.

"మగమహారాజులు మీరే ఇలాగ చతికిలబడిపోతే ఎలాగ చెప్పండి. కాస్త మనం ఇద్దరం కలిసి ఆగది లోపలికి వెళ్ళి ఆ దొంగ ఎక్కడ నక్కి కూర్చున్నాడో చూద్దాం రండి. ఈ అరణ్యంలో ఎన్ని కేకలు పెట్టిన ప్రయోజనం లేదు. అంతా అరణ్యరోదనమే అవుతుంది. ఆపైన మీకు అంకిళ్ళు కూడా పడిపోయాయి. మరి ఏమి భయం లేదు లెండి. నేను ఉన్నాను లెండి. కాస్త ఆ గదిలోకి వెళ్ళి తొంగిచూడండి." అంటూ అతని జబ్బ దొరకపుచ్చుకుని గదిలోకి తీసుకుని వెళ్ళింది.

అదే సమయంలో ఇందిర సూర్యారావుని చూచి పట్టలేనినవ్వుతో పకపక నవ్వసాగింది. ఆ మరుక్షణంలోనే చిన్న గుర్రం సకిలింపు వంటి నవ్వు వినబడింది. ఆ శబ్దం వచ్చిన వేపు పరీక్షగా చూచి ఎవరిది? నీవా శ్రీనివాస్ అంటూ ప్రశ్నించాడు.

వెంటనే శ్రీనివాస్ తన ముసుగు తొలగించి కలకల నవ్వుతూ నిలుచున్నారు. అతడు చదువు సంధ్యల్లోనే కాక అల్లరి పనుల్లో కూడా బాగా ఆరితేరినవాడు. సూర్యారావు అతనికేసి చూసి నువ్వెప్పుడొచ్చావోయ్ అంటూ సమీపించాడు.

అదే సమయంలో శ్రీనివాస్ అందుకున్నాడు:


"ఈ మధ్య మీరు తనని ఒంటరిగా చేసి తరుచుగ సినిమాలకి వెళ్ళిపోతున్నారని అక్క వ్రాసింది.

ఆ సమయంలో ఇక్కడ ఉండలేక వెంటనే శ్రీకాకుళంలో మా యింటికి వచ్చేస్తున్నానని కూడా సూచించింది. అమె పరిస్థితి గమనించి నేనిక్కడికి వచ్చాను."

"అలాగా! నువ్వెప్పుడొచ్చావు" అని ఆత్రంగా ప్రశ్నించాడు సూర్యారావు:


"మీరు రావడానికి ఒక గంటముందే వచ్చాను. ఆపైన నేను, అక్క మి ధైర్యసాహసాలు గమనించి ఉప్పొంగి పోయాము. మిరు మేరు సమానధీరులు బావగారూ!" అంటూ అదే పనిగా నవ్వనారంభించాడు

అదే క్షణంలో సూర్యారావు – "నేనింకెప్పుడు మి అక్కని, పిల్లల్ని వెంట తీసుకుని పోకుండా ఒక్కడిని సినిమాకి వెళ్లనులే! ఇందిర మరి పుట్టింటికి వెళ్ళవలసిన అవసరం. లేదులే" అంటూ తన ఓటమి కప్పి పుచ్చుకోవడానికి వాండరితో కలిసి తాను కూడ నవ్వసాగాడు. □



అట్టహాసం

పులికంటి కృష్ణారెడ్డి



ఒకప్పుడు రాజులకు రాజ్యాలుండేవి!

ఆ రాజ్యాల్ని రాజులు పాలించేవాళ్ళు. రాజ్యాల్ని పాలించిన రాజుల్ని అట్టహాసాలు పరిపాలించేవి!

అట్టహాసంగా రాజ్యాలేలిన రాజన్యుల అధికారముద్రలు పాపం! ఉన్నట్లుండి అంతరించినాయి. అయితే కంటికి రెప్పలా, కట్టుకొన్న పెళ్ళాల్లా వాళ్ల బతుకుల్తో కలగలిసి పోయిన అట్టహాసాలు మాత్రం వాళ్ళను వదల్లేక, వదిల్తే తలదాచు కోవడానికి తావు దొరక్క వాళ్ళతోనే రాణివాసం చేస్తున్నాయి- నేటి గాంధేయుల్ని వదల్లేని నాటి గాంధీటోపీల్లాగా!

గాంధీ- మహాత్ముడు. మహాత్ముడు కనిపెట్టిన టోపీ కాబట్టి దానికి మహత్యముంది. మహత్యముంది కాబట్టే నేటికీ కొందరు రాజకీయ నాయకులు దాన్ని వదల్లేకున్నారు. ఆ టోపీ కూడా నమ్ముకున్న వాళ్ళకు 'టోపీ' వెయ్యడం లేదు.

అట్టహాసమూ అంతే!

కనుసన్నల్లో అట్టహాసం. కాలు తీస కాలు పెడ్తే అట్టహాసం. చిటికెవేస్తే అట్టహాసం. చేయి చాపితే అట్టహాసం. తలపంకిస్తే అట్టహాసం. పరికిస్తే అట్టహాసం. దానం చేయడంలో అట్టహాసం దండించడంలో అట్టహాసం. మాటలో అట్టహాసం. మమతలో అట్టహాసం. వెరశి ఒక నాటి రాజుల బతుకే ఒక అట్టహాసం!

ఈ అట్టహాసాన్ని ఆశ్రయించిన రాజులకు కొందరికి ఈ నాడు కూడా బతుకు ఏదో ఒక విధంగా అట్టహాసం గానే జరిగి పోతూ ఉంది.


మా 'రాజా' దీనికి ప్రబల తార్కాణం!

అట్టహాసాన్ని ఆవిష్కరించడానికి అవస్థ పడడకంటే 'రాజా'ను ఆవిష్కరిస్తే అట్టహాసమంటే సుళువుగా అర్థమవుతుంది.

"రాజా! అంటూ గొప్పలు చెప్పుకొంటున్నారే? ఈ రాజాగారికి తలదాచు కోవడానికి 'గాంధీ టోపీ' అడ్డముంది కానీ జానెడు కొంపలేదే?' అని ఎవడైనా నోరు జారినాడంటే దారిన పొయ్యే దానయ్యే దవడపళ్ళు రాలతంతాడు. ఎందుకంటే?- ఆ ఊళ్ళో ఉన్న అయిదారు అధునాతన మైన హోటళ్ళల్లో ఒక్కొక్క హోటల్లో ఒక్కొక్క గది 'రాజా' అధీనంలో ఉంటుంది. చేయి చాపనవసరం లేదు. చూపు చూస్తే చాలు. తాళాలు ఎగిరి చేతిలో పడ్తాయి!

"హోటళ్ళల్లో గదులేముంది? ఎవడి కైనా ఉంటాయి డబ్బు లిస్తే కొంగేసే వారకాంతల్లాగా. మరి కారో?" – అని అంటే- రాజా కాలు కింద పెట్టడు. కాలు కింద పెట్టడంటే రాజాగారికి కాళ్ళులేవా? – అని అడిగేవాళ్ళకు కళ్ళులేవు. ఎందుకంటే రాజాగారు ఎప్పుడూ మారుతీ కార్లో కనిపిస్తాడు. అప్పుడప్పుడు దర్జాగా మారుతీ డిలక్స్‌లో తిరుగుతుంటాడు. అంబాసిడర్‌లో ఒక సారి దర్శన మిస్తే యింకొక్కసారి ఖంటెస్సాలో కాలు మీద కాలేసుకొని కూర్చొని ఉంటాడు.

"సామ్మొకడిది. సోకొకడిది! అన్నట్లు



ఎవడిదో కారు. రాజాగారిదిజోరు. చదువూ సాయూ లేని బతుకులిట్లా ఎంతకాలం కొనసాగతాయ్?" అని అడిగితే – చదువెందుకూ? మూకుడు చేత పట్టుకొంటే మూర్ఖుడికైనా అంతముష్ట దొరుకుతూ ఉంది. సర్టిఫికెట్లు పట్టుకొంటే ఏమౌతుంది? చెప్పులరిగి పోతాయ్. అయినా రాజా గారికేం?- ఇంగ్లీషు అద్భుతంగా మాట్లాడ్తాడు. హిందీని అందంగా హుందాగా పలుకుతాడు. ఇక దక్షిణాది భాషలైతే దంచేస్తాడు!

రాజా అర్థమైనట్లే ఉంటాడు. కాని అర్థం కాడు. చాలా అందుబాటులో ఉన్నట్లే కనిపిస్తాడు. కాని అందడు. ఎక్కడ చూసినా ఉన్నట్లే ఉంటాడు. అయితే ఎక్కడా దొరకడు.

నవ్వు నాలుగు విధాలా చేటంటారు. కాని రాజాకు మాత్రం నవ్వు నాలుగు నాలుగులు పదహారు విధాలా కలిసి వచ్చింది. మాటకు ముందు నవ్వుతాడు నవ్వుతూ మాట్లాడుతాడు

మాట్లాడ్తా ఉంటే అట్టహాసం!
నవ్వుతూ ఉంటే మరి అట్టహాసం!!

రాజా ఎప్పుడూ పదిమంది మధ్యలో ఉంటాడు. ఆ పది మంది పదిరాళ్ళు. రాజాగారు మాత్రం రత్నం. పది రాళ్ళల్లో ఒకరత్నం చూడముచ్చటగా కాదు– అట్టహాసంగా ఉంటుంది.

రాజా ఖద్దరు పంచె కట్టాడు. ఖద్దరు లాల్చీ తొడుక్కుంటాడు. రెండూ సిల్కువే!–

మోకాళ్ళకిందకి లాల్చీ. చేతుల్ని మింగేస్తూ లాల్చీ చేతులు. పాదాల కిందికి జారి అపాదాల పై పారాడుతున్న సరిగంచులు. రాజా నడుస్తూంటే సరిగంచులు విధుల్ని ఊడుస్తుంటాయి అట్టహాసంగా! – గాంధి యిప్పుడుండి ఆ దృశ్యాన్ని చూసి ఉంటే ఖద్దరుకు పట్టిన గతికి కళ్ళ నీళ్ళు పెట్టుకొనే వాడేమో?– కానీ "ఇద్దరు వల్ల ఏదో ఒక సామాజిక ప్రయోజనం జరుగుతున్నది' అని నేటి గాంధేయ వాదులు సరిపెట్టుకొంటున్నారు.

రాజా ఉంగరాలు పెట్టుకొంటారు.

"రాజాయేనా ఉంగరాలు పెట్టుకొనేది. అందరూ పెట్టుకొంటారు." అని ఎవరైనా ఎదురు ప్రశ్న వేస్తే వాళ్ళకు అట్టహాసానికి కొత్తగా అర్థం తెలియదన్న మాట. ఉంగరాలు అందరు పెట్టుకొంటారు. రెండు చేతుల్లోని ఒక్క వేలికి పెట్టుకొంటారు. లేదా రెండు వేళ్ళకు పెట్టుకొంటారు. కాని రాజా అట్లా కాదే? ఎనిమిది వేళ్ళకు పదహారు ఉంగరాలైనా పెట్టుకొనే వాడే కాని అట్టహాసంగా ఉండదని ఎనిమిది వేళ్ళకు పది ఉంగరాలు మాత్రమే పెట్టుకొంటాడు. రోల్డ్ గోల్డ్ చేతిగడియారానికి గోల్డ్ చైన్ వేసి వదులొదులుగా కుడి చేతికి పెట్టుకొంటాడు.

పాపం! లాల్చీ వాడు గాటి చేతుల్లో యివన్నీ బురఖాల చాటుల్లో అందమైన మొగాల్లా అజ్ఞాత

వాసం చేస్తుంటాయి.

అందుకే రాజాగారు కూర్చున్నా, నడుస్తున్నా, కారులో పయనిస్తున్నా, నిలబడి, పది మందిని పలకరిస్తున్నా నాట్యం చేస్తున్నట్లుగా చేతుల్ని మార్చి మార్చి పైకెత్తి దించుతుంటాడు. అందులో కూడా ఒక అట్టహాసాన్ని గమనించండి.

రాజా ఎడమ చేతిని పైకెత్తుతాడు. పైకెత్తిన చేతిని అలవోకగా కదిలిస్తాడు. లాల్చీ చేయి కిందికి జారుతుంది– పదహారేండ్ల అమ్మాయి పైట జారినంత పని! నాలుగు వేళ్ళకున్న అయిదు ఉంగరాలు అట్టహాసాలు పోతాయి. చూడనట్లే రాజాగారు వాటివైపు ఒక్కచూపు విసరుతారు. పెదవులపై మందహాసం. అదొక అట్టహాసం!

ఆ చేతిని కిందికి దించుతాడు. నాట్యం చేసి అలిసిపోయిన అందమైన అమ్మాయిలు గ్రీన్ రూమ్‌లోకి పరుగెత్తినట్లు అయిదు ఉంగరాలు అజ్ఞాత వాసానికి వెళ్ళి పోతాయి. అప్పుడు రాజాగారు కుడి చేతిని పైకెత్తుతారు. కిందికి జారాల్నా ? వద్దా? అన్న సంశయంలో పడిన లాల్చీ చేయి , రాజాగారి చేయి అట్టహాసంగా కదిలేసరికి అమాంతంగా కిందికి జారుతుంది. అయిదు ఉంగరాలతో కలిసి 'రోల్డ్ గోల్డ్ వాచ్' అట్టహాసంగా దర్శన మిస్తుంది. అప్పుడు రాజా వాటి వైపు చూడరు. వాటిని చూస్తున్న వాళ్ళ చూపుల్లోకి చూస్తారు.

ఆ చూపుల్లో అట్టహాసం!

రాజా తిరుపతిలో అట్టహాసాలు పోతుంటాడు

'రాజాలా!

"నీ మతి మండినట్లే ఉంది. తిరుపతిలోనే ఉంటాడా? మదరాసులో ఉండడా? హైదరాబాద్‌లో ఉండడా? ఆ మాటకొస్తే ఢిల్లీలో ఉండడా? అమెరికాలో ఉండడా?" అని అంటే– అన్ని చోట్లా ఉంటాడు. తిరుపతిని కేంద్ర బిందువుగా ఉంచుకొని తరచు తన అట్టహాసాన్ని వికేంద్రీకరిస్తూ ఉంటాడు.

తిరుపతిలో ఉండడం అందరికి కాకపోయినా కొందరికి బ్రహ్మాండమైన వరం! అందులో రాజాగారి కైతే మరిన్ని!–

వస్తూ పోతూ ఉన్న చుట్టాల తాకిడికి తట్టుకోలేక తిరుపతిలో కొందరు తికమక పడిపోతున్నారు. పెద్ద పెద్ద వాళ్ళకు దర్శనాలు చేయించి కొందరు మరి పెద్దవాళ్ళయి పోయేవారు. నిజమా అంటే? ఒకటి రెండు ఉదాహరణలు చెప్పక తప్పదు.

పట్టుమని పాతికేండ్లు కాలేదు. అప్పుడు పాతిక మైళ్ళు . ఇప్పుడైతే దాదాపు నలభై కిలో మీటర్లు. అప్పుడు మువ్వావలా! ఇప్పుడు మూడు రూపాయలు చార్జి. దూరం మారలేదు. చార్జి భారం మాత్రం పెరిగింది. ఈ డబ్బు పెట్టి టిక్కెట్టు కొనడానికి యిక్కట్లు పడిన ఒక మహాశయుడు టిటి ఈలకు సలాం కొట్టేవాడు. స్పెషల్ స్క్వాడ్ వస్తే కండ్లల్లో దుమ్ము కొట్టేవాడు. శ్రీవారిసేవలో చేరినాడు. చిన్న ఉద్యోగిగా చేరినాడు. అందరు చూస్తూనే ఉన్నారు. ఏడుకొండల వాడు కూడా

అట్టహాసం

చూస్తూనే ఉన్నాడు. చూస్తూ చూస్తూ ఉండగానే పటుడింతై అంతై అన్నట్లుగా అతడు కోటికి పడగెత్తినాడు. చూస్తున్న వాళ్ళు చూచి నట్లే ఉన్నారు,– వేసిన గొంగళి వేసిన చోట అన్నట్లుగా! అతడు మాత్రం చేరవలసిన ఎత్తుకు చేరుకున్నాడు, అంతా ఆయన లీల!

'తెలుగు దేశంలో తిరగని చోటు లేదు. చేయని ఉద్యోగం లేదు. చలాయించని అధికారం లేదు!' అటువంటి ఒకానొక మహానుభావుడు శ్రీవారి సేవలో నే జన్మతరించాలను కొన్నాడు. ఎవరిచేతులు కాదని కాళ్ళు పట్టుకొన్నారో? ఆయన తిరుమల కొండెక్కినాడు. కొండెక్కి కూర్చున్నాడు. ఆయన సతీమణి కలర్ టీవీ ముందు కూర్చుని కిలకిలా నవ్వుతూ ఉంది– అన్నట్లుండి పట్టిన అదృష్టానికి ఉప్పొంగి పోతూ.

ఇట్లా చిన్న చిన్న గుంటల్లో చేపల పట్టడమంటే రాజాగారికి చిరాకు. చిన్నతనం కూడా. మరపడవెక్కి మహాసముద్రంలో నే వల విసరాలంటాడు. అట్లానే విసురుతున్నాడు.

చాలా చాలామంది పెద్ద పెద్ద వాళ్ళు మరి మరి పెద్ద కార్లల్లో ఏడు కొండల వాడి దర్శనార్థం తిరుపతికి వస్తుంటారు. ఆ పెద్ద పెద్ద వాళ్ళందరూ దైవదర్శనానికి ముందు రాజా దర్శనం జేసుకొంటుంటారు.

ఈ పెద్ద పెద్ద మనుష్యులు పెద్ద పెద్ద కార్లలో ఏరోజు తన కొసరం వచ్చేది రాజాకు ముందుగానే తెలుస్తూ ఉంటుంది. ఏవేళకు వచ్చేది తెలుస్తూ ఉంటుంది. అయినా రాజాగారు మాత్రం సరిగ్గా వాళ్ళు వచ్చే వేళకు అర్థగంటకు మునుపే అయిపు లేకుండా పోతాడు!

పెద్ద పెద్ద వాళ్ళు వస్తారు. పెద్ద పెద్ద హొటళ్ళ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఇక్కడకాదు– అక్కడంటే అక్కడికి వెళ్ళతారు. అక్కడకాదు – మరొక్క చోట అంటే అక్కడికి పోతారు. ఎక్కడా రాజా దర్శనం లభించక పోయే సరికి కార్లలో కూలబడతారు. తెగబాధపడి పోతుంటారు. అప్పుడొకవ్యక్తి ఆపద్బాంధవుడిలా అక్కడ ప్రత్యక్ష మవుతాడు.

"ఏవండి? రాజాగారి కోసమేనా మీరెదురు చూసేది?"

అని అడగతాడు.

అన్ని గొంతులు కలగలిసి 'ఔనండి!! అంటాయి ఒక్కసారిగా.

"రాజాగారిప్పుడొక సాంఘిక సేవా సంస్థను స్థాపించినారు. పేరు గుర్తులేదు కాని , పెద్ద బజార్లో ఏ చిన్న పిల్లవాణ్ని అడిగినా చెప్తాడు. అక్కడికివెళ్ళి చూడండి!" అంటాడు.

"పెద్ద బజారా?.... ఈ ఊళ్ళో మాకంటికి అన్నీ చిన్న చిన్న బజార్లు గానే కన్పిస్తున్నాయే?.... మరైతే ఆ పెద్ద బజారు ఎంత దూరముంటుంది? ఎటు వెళ్ళాలి?" అన్న సవా లక్ష ప్రశ్నల్ని చూపుల్తో మిళితం చేసి మిడిగుడ్లు పెట్టారు పెద్ద పెద్ద మనుష్యులు.

"అయ్యో పాపం! అంతగా యిబ్బంది పడిపోతున్నారే?" అని చూపుల్తోనే నొచ్చుకొని మాధవ సేవ కోసం వచ్చిన ఆ పెద్దమనుష్యులకు మానవ సేవకు అర్థం చెప్ప దలచు కొన్నట్లుగా అతడు తన కులానే తలుపు తీసి అట్టహాసంగా కార్లో కూర్చుంటాడు. 'పోనీయండి!' అంటాడు దర్పంగా. అతడు చెప్పినట్లు డ్రైవరు వింటాడు. డ్రైవరు చెప్పినట్లు కారు వింటుంది. పెద్ద పెద్ద మనుష్యులకు పెద్ద శ్రమ లేకుండానే ఆ సాంఘిక సేవా సంస్థముందు కార్లు ఆగుతాయి.

అందరికంటే ముందు సాంఘిక సేవకుడు కారు దిగుతాడు. పెద్ద పెద్ద మనుష్యులు ఒకరి తర్వాత ఒకరుగా దిగుతూంటే! అదో ! అదే ఆఫీసు!'అని ఎడమచేతి చూపుడు వ్రేలితో పెద్ద బజారనబడే ఆ చిన్న సందులో కుడివైపు మేడ రెండో అంతస్థుకు వ్రేలాడ దీసిన 'నేమ్ బోర్డ్' చూపిస్తాడు. వాళ్ళందరు ఆతురతగా ఆ బోర్డు వైపు చూస్తుంటే అతడు తన దారి తాను చూసుకొంటాడు.

ఆఫీసు కంట పడే సరికి ఆఫీసును చూపించిన వ్యక్తి గుర్తుకొస్తాడు. సాక్షాత్ ఏడు కొండల వాడే ఎదురొచ్చి తమను ఆదుకొన్నాడన్నంత సంతోషంతో ఆ పెద్ద పెద్ద మనుష్యులు తమ పెద్ద పెద్ద శరీరాల్ని యిటు మళ్ళిస్తారు. 'థ్యాంక్స్' చెప్పడానికి. అంత ఖరీదైన 'థ్యాంక్స్' అందుకొనడానికి అనర్హుడి నన్నట్లుగా అతడక్కడ కనబడడు. వాళ్ళ మొగాలు ఒక్క క్షణం రంగుమారాయి. అతడి మంచి తనాన్ని తెగమెచ్చు కుంటూ వాళ్ళందరూ అతడు వెళ్ళిపోయిన దిక్కువైపు తిరిగి వంగి వంగి నమస్కరిస్తారు!– రాజాగారి అట్టహాసంలో యిది ఒక భాగమే అని తెలియనిఅమాయకులు పాపం!

వంగి వంగి నమస్కారాలు చేయడంతో తమ బాధ్యత తీరిపోతుంది. పెద్ద పెద్ద వాళ్ళ లక్షణమే అది. అందుకని ఆ వెళ్ళిపోయిన ఏబ్రేసి మొకంగాణ్ని పెద్దగా పట్టించుకోకుండా రాజాగార్ని కలవడానికి సైనికుల్లా బయల్దేరుతారు అయితే ఆ మేడ ముందు ఒకరి మొగం ఒకరు చూస్తూ నిలబడిపోతారు.

ఆ సాంఘిక సేవా సమితికి దేశంలో చాల పెద్ద పేరుంది. పెద్ద పెద్ద వాళ్ళ సుహృద్భావమే పెట్టుబడిగా చాలా ఆదర్శవంతంగా నెలకొల్ప బడింది. చేస్తున్న సాంఘిక సేవ కేమిటో కానీ దాని తాలూకు ప్రకటనలు మాత్రం పెద్ద పెద్ద పత్రికల్లో తరచు కనిపిస్తుంటాయి. తాడిత పీడిత జనోద్ధరణ ఆ సంస్థ ధ్యేయం. అయితే ఆ సంస్థలో ప్రవేశించడం అంత సులువుగాదని ముందు హెచ్చరిక చేస్తున్నట్లుగా ఉంటాయి మిద్దెకు యిరుకు మెట్లు!

ఆ యిరుకు మెట్లను చూసే పెద్ద పెద్ద మనుష్యులు యిరకాటంలో పడి ఒకరి మొగం ఒకరు

చూసుకుంటూ నిలబడింది. చూస్తూ నిలబడ్తే ఏమవుతుంది? ధ్యేయం రెండో అంతస్థులో ఉంది. వాళ్ళు కింద ఉన్నారు. ధ్యేయాన్ని సాధించాలంటే పైకెక్కాల్సిందే? – అందుకే. యిక తప్పదన్నట్లుగా ఒకరి వెనుక ఒకరుగా 'క్యూ' కట్టారు. ఒకరి తర్వాత ఒకరుగా ఆ యిరుకు మెట్ల మీద బెరుకు బెరుగ్గానే పైకెక్కుతారు. ' బ్రతుకు జీవుడా!' అని ఆఫీసులో అడుగుపెట్టారు.

ఆ సేవాసంస్థలో రాజాగారికి సంబంధముందో? లేదో? ఉంటే ఆ సంబంధం ఎటువంటిదో? లేకుంటే ఆ ఆఫీసులో రాజా ఎట్లా అధికారం చెలాయించ గలుగుతున్నాడో? – ఆ ఏడు కొండల వాడికే ఎరుక!

ఆ ఆఫీసులో ఏ కార్య కలాపాలు జరిగినా జరక్కున్నా ఆఫీసుమాత్రం అందంగా ఉంటుంది. పది మంది ఒక్కసారి దాడి చేసినా నిలబడవలసిన అవసరం లేకుండా కూర్చోవడానికి కుర్చీలున్నాయి. పిలవకనే పలికే ఒక నౌకరు ఆ ఆఫీసును కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటాడు. వచ్చిన పెద్ద మనుష్యుల్ని అతి మర్యాదగా ఆహ్వానిస్తాడు. తలకొక్క కుర్చీ వేస్తాడు. వాళ్ళు కాలుతో చెప్పిన పని చేతులతో చేస్తాడు. మళ్ళీ ఆ చేతుల్తోనే మంచి నీళ్ళు కూడా యిస్తాడు. నౌకరు చేస్తున్న సేవలకు మురిసి ఆ సంస్థ ఏ సేవ చేస్తున్నది? లేదన్న సంగతిని మరిచి పోతారు. ఆ సేవా సంస్థను దర్శించిన పెద్ద మనుష్యులు!

ఆఫీసులో అడుగు పెట్టిన పెద్ద పెద్ద మనుష్యులకు ఈ సత్కారం అట్టహాసంగా జరిగేసరికి , ఈ సత్కారానికి , రాజా సంస్కారానికి ముడి పెట్టి ఆలోచిస్తూ ఆనంద లహరిలో తేలిపోతుంటారు.

అప్పుడు మేడముందు కారుదిగుతాడు రాజా అట్టహాసంగా!

"రాజాగారు వస్తున్నారయ్యా!" అంటాడు నౌకరు వినయంగా.

అందరు ఒక్కసారిగా పైకి లేస్తారు. ఏడు కొండల వాడి ముందు వంగినంత వినయంగా వంగి నమస్కరిస్తారు.

రాజా వస్తూ మందహాసం చేస్తాడు అట్టహాసంగా!

"అరెరె! చాలాసేపయినట్లుందే వచ్చి! అబ్బబ్బ! ఏం చేయాల్నో తోచక చచ్చి పోతున్నానండీ! ఈ ఊళ్ళో బతకడం కంటే ఏ అడవిలోనో తలదాచుకోవడం నయం. ఒకడొస్తాడు. మండలం ఆఫీసులో నా బతుకు ముండమోసి పోతున్నదండీ!' అని ఏడుస్తాడు. ఇంకొకడొస్తాడు. 'బ్యాంకు చుట్టూ తిరిగి తిరిగి కాళ్ళరిగి పోతున్నాయ్!' అని అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొంటాడు. మరొకడు ఎం. ఎ. ఫస్ట్ క్లాసులో పాసై సర్టిఫికేట్లు పట్టుకొని పట్టిన చేతులు వదల నంటాడు. ఏం చేయాల్నో అర్థం కాదు. ఎవర్ని కాదనాలి? ఎవరిని ఔననాలి??... ఛఛఛ ! దినగండం నూరేండ్లాయుస్సుగా ఉంది బతుకు!"

ఒక చిన్న ఏక పాత్రాభినయం చేస్తూ రాజు గారు కుర్చీలో కూర్చుంటాడు అట్టహాసంగా!

"ఇవన్నీ చాలని కొదవకు ఈ వేళ మాతో గొడవ!" అని వచ్చిన వాళ్ళల్లో ఒక్కడు నొచ్చుకొన్నట్లే మెచ్చుకొంటాడు.

"అరెరె! మీదేం వుందండీ? పైకెక్కి పోవడం ఒక్కగంట . దిగిరావడం ముప్పావు గంట. అక్కడ మహా ఉంటే ఒక్క అర్ధగంట . మీతో కలిసి నాకూ దైవదర్శనం. పుణ్యం పురుషార్థం కూడా! " అంటూనే రాజుగారు పైకి లేస్తారు అట్టహాసంగా. వాళ్ళందరు వెంట నడుస్తుంటే కారు దగ్గరికి నడుస్తాడు మరి అట్టహాసంగా!

"రెండు కార్లెందు కండీ? ఒక్క కార్లో సర్దుకోవచ్చుగా?" అని అతి వినయంగా ఒకరు సలహాయిస్తుంటే –

"లేనప్పుడు సర్దుబాటు. ఉండీ అనుభవించ లేనివాడు పిసినారి. ఆ మాట పడడం నాకు చేతగాదు బాబూ!" అంటూ రాజా తన కార్లోనే కాలుమీద కాలేసి కూర్చుంటాడు అట్టహాసంగా.

కార్లు బయల్దేరతాయి!

ఊరికి ఉత్తరంగా తిరుమల కొండ. అయితే రాజాగారి కారు దక్షిణంగా పోతూ ఉంటుంది. అతిథులు ఆశ్చర్యపడతారు. రాజా పడనీ అనుకొంటాడు. అతిథులు పల్లెత్తుమాట పైకి అనలేరు. రాజా "అది వాళ్ళ ఖర్మ" అనుకొంటాడు.

అంతలోనే రాజాగారి కారు ఆగుతుంది. ఊరవతల ఒక "కాంట్రాక్టర్ యార్డ్" ముందర.

రాజా కారు దిగుతాడు. అతను దిగేసరికి అతని వెంట వచ్చిన అతిథులు దిగుతారు. రాజా ఆ "యార్డ్"లోకి అట్టహాసంగా నడుస్తాడు. వాకిట కావలి తిమ్మడు ఘూర్కా నిటారుగా నిలబడి వందన సమర్పణ చేస్తాడు. కనీసం ఘూర్కా వైపు కన్నెత్తి చూడకుండా సైనిక వందనం స్వీకరించే ప్రధానిలాగా రాజా అట్టహాసంగా లోనికి నడుస్తాడు.

అక్కడ రెండు మూడు లారీ లుంటాయి. కదిలించినా కదలని ఒక కారు ఉంటుంది. ఒక షెడ్డులో సిమెంటు బస్తా లుంటాయి. రకరకాల సైజుల్లో యినుపకమ్ములు చిందరవందరగా పడి ఉంటాయి. ఆఫీసు మాత్రం తీర్చి దిద్దినట్లు చాలా అందంగా ఉంటుంది. ఒక గోడమీద మేనేజర్ "నేమ్ బోర్డ్" యింకొక గోడకు క్యాషియర్, మరొక గోడమీద క్లార్క్ నేమ్ బోర్డ్‌లు మిలమిల మెరుస్తూ ఉంటాయి. ఆయా నేమ్‌బోర్డ్ కిందనే ఒక అందమైన కుర్చీ, టేబిల్ ఉంటాయి. అయితే ఆ మూడు కుర్చీలు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. రాజాగారు ఆఫీసులో అడుగు పెట్టేటప్పటికి ఎక్కడుంటాడో "వాచ్‌మేన్" రొప్పుతూ రోజుతూ వస్తాడు. వంగి వంగి నమస్కరిస్తూ అల్లంత దూరాన నిలబడతాడు.

రాజా అట్టహాసంగా ఆఫీసంతా కలియ చూస్తాడు. కండ్లు చికిలిస్తాడు. తల పంకిస్తాడు. ఆ తర్వాత –

"ఏరా? మేనేజ రెక్కడ?" అని గద్దిస్తాడు.

"ఇప్పుడే ఏదో పనిమీద పొయ్యినాడయ్యా!" అంటాడు వాచ్‌మేన్ వినయంగా.

"పోనీ! క్యాషియర్ ఏమైనాడు?"


"ఇంకా రాలేదయ్యా!"

"ఛీ ఛీ! వీళ్ళు మనుష్యులా? పశువులా?.... ఏరా? నీ కెన్నిసార్లు చెప్పినారా ఆఫీసులో ఎవరో ఒక రుండి తీరాలని! (అప్పటికి వాచ్‌మేన్ యజమాని అయినట్లు!) అరకాసు కోతి అర్ధణా బెల్లం తిన్నట్లుంది వ్యవహారం. రాస్కెల్స్! మీకంతా నోటి మాటలు పనికి రావురా! కాలికున్నది చేతికి తీసుకుంటే కూలు కుదరమన్నట్లు కుదురుతుంది!"

వాచ్‌మేన్ వణికి పోతుంటాడు చేతులు కట్టుకొని!

"పోనీ! క్యాష్‌చెస్ట్ తాళాలైనా యిచ్చి చచ్చినారా?
- (అప్పటికి వాచ్‌మేన్ అపర హరిశ్చంద్రు డైనట్లు!)
- గద్దిస్తాడు రాజా.

ఆ గద్దింపుతో అదరిపడి వాచ్‌మేన్ నోట మాటరాక తల వంచుకొంటాడు. రాజా మరీ రెచ్చిపోతాడు!



"అంతా వెధవలు. పనికిమాలిన వెధవలు!– ఇంగితజ్ఞానం లేని నీచులు– ఇప్పుడేం చెయ్యాలి నేను? ఇంతమంది మిత్రుల్ని వెంట బెట్టుకొని అడక్కతినాల్నా? ఉండీ దరిద్రు డంటారేా? నాలాంటి వాళ్ళనేరా!"

రాజా అగ్గిమీద గుగ్గిలమై చిందులు తొక్కుతుంటాడు.

"రాజాగారూ! యిప్పుడు డబ్బుతో వచ్చిన అవసర మేఁవిటండీ? మేమున్నాం గదా?"– అంటూ కల్పించుకొంటారు పెద్ద పెద్ద మనుష్యులు.

"ఉంటే?"

"మీకింకా కోపం తగ్గలేదు!"

"కోపమా?.... వీళ్ళందర్ని నరికి పోలి చల్లితే మాత్రం పాపమా? మీరందరూ నేను రమ్మంటే వస్తారా? లేదు దినమూ వస్తారా? ఎప్పుడో ఒకసారి వస్తే ఈ ఒక్కసారైనా తృప్తిగా ఖర్చు పెడదామంటే?...."

"మీరనడం మరి బాగుందండీ! యాత్రకని వచ్చిన వాళ్ళు ఒకరి ఖర్చుమీద యాత్ర చేస్తే ఆ పుణ్యఫలం దక్కదు. అది ధర్మం. మీరు మాతో రావడమే మాకు లక్షలకు లక్షలు ఖర్చు పెట్టినట్లు!.... రండి వెళ్ళదాం!"

"ఇది యాత్రో గిత్రో నాకు తెలియదు. ధర్మమో అధర్మమో కూడా నాకు తెలియదు. మీరుండేది తిరుపతిలో. తిరుపతిలో మీ వెంట నేనుంటూ మీచేత ఖర్చు పెట్టిస్తే నా పరపతేంగాను?"

"అదా మీ సందేహం. అయితే మీరే ఖర్చు పెట్టండి!" అంటూ ఒకపెద్ద నోట్ల కట్టను రాజాగారి జేబులో కూరుతారా పెద్ద మనుష్యులు.

రాజా వద్దు వద్దంటూనే జేబును వాళ్ళకు వాటంగా తిప్పుతాడు. ఆ జేబు నిండుతుంది. అట్టహాసంగా ఏడుకొండల వాడి దర్శనం అయిన తర్వాత యింకొక జేబు నిండుతుంది!

అట్టహాసం

రాజా అట్టహాసంగా బతుకుతున్నాడు!

అయితే తనకేమాత్రం సంబంధం లేని కాంట్రాక్టర్‌యార్డ్‌లో నానా తిట్లు తిన్న "వాచ్‌మేన్"ని, సలాంకొట్టిన ఘూర్ఖాని మరిచిపోడు. వాళ్ళను అట్టహాసంగా గమనిస్తుంటాడు.

అది రాజాగారి అట్టహాసమే!

రాజా తరచు సినిమాలకు వెళ్ళుతుంటాడు. అది కూడా మొదటిరోజు మొదటి సినిమాకే! ఒంటరిగా వెళ్ళడం రాజా అట్టహాసానికే అవమానం గనుక పది మందితో కలిసి వెళ్ళుతుంటాడు. పదిమందితో కలిసి వెళ్ళడమంటే ఎవడంటే వాడితో కాదు. ఆ ఊళ్ళో ఉన్న పెద్ద పెద్ద అధికార్లతోనే కలిసిపోతూ ఉంటాడు. అందులో కూడా ఒకసారి కనిపించిన అధికార్లతో మరొకసారి కనిపించడు. ఒకసారి పోలీస్ అధికార్లతో కలిసి అయితే యింకొకసారి ఇన్‌కంటాక్స్ మొనగాళ్ళతో! ఒకసారి కమర్షియల్ టాక్స్ వాళ్ళతో అయితే యింకొకసారి బ్యాంక్ మేనేజర్లతో!

ఆఫీసర్లని సినిమాకు ఆహ్వానించడం.... ముందుగానే సీట్లు రిజర్వ్ చేయించడం.... ఇంటింటికి స్వయాన వెళ్ళి ఆహ్వానించడం.... సినిమాలో కూర్చుంటుంటే ఎవరెవరి ప్రక్కన ఎవరు కూర్చోవాలో జాగ్రత్త పడడం.... సినిమా చూస్తు ఉంటే మధ్య మధ్య వేడి వేడి పానీయాలు అడక్కుండానే సరఫరా చేయించడం.... సినిమా అయిన తర్వాత వాళ్ళ వాళ్ళ అభిరుచిల్నిబట్టి వాళ్ళ కొక మందు పార్టీ ఏర్పాటు చేయించడం– అంతా అట్టహాసంగా జరిగిపోతుంది.

ఈ అట్టహాసాలన్నీ ఒక ఎత్తయితే సినిమా జరుగుతూంటే మధ్య మధ్య రాజాగారి కోసం పిలుపులు వస్తుంటాయి. అవి మరి అట్టహాసం!

ఆఫీసర్ల మధ్య కూర్చుని రాజా అట్టహాసంగా సినిమా చూస్తూ ఉంటాడు. అప్పుడు చేతి లైటు గుడ్డి వెలుగులో తడబడుతూ వస్తాడు గేట్‌కీపర్! వచ్చి "సార్! రాజాసార్‌కి ఫోన్‌సార్!" అంటాడు.

"అబ్బబ్బ! రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరం వదలనట్లు నా పాలిటి కి యముళ్ళు ఎక్కడ దాపురించినారో? ఏమో? నేను సినిమా కొచ్చింది ఎట్లా పసికట్తారో కట్తారు. ఇక్కడ కూడా కాసేపు ప్రశాంతంగా ఉండనివ్వరు. ఎట్లా చావాల్నో వీళ్ళతో?" అంటూ అయిష్టంగానే పైకి లేస్తాడు. అయితే ఆదరాబాదరా వెళ్తాడు.

ఆఫీసర్లు ఆశ్చర్యంలో పడి కొట్టుమిట్టాడు తుంటారు.

"బొంబాయి నుండి ట్రంక్‌కాలొస్తే ఆఫీసు నుండి యిక్కడికి డైవర్ట్ చేసినారు. గోయెంకా స్వయాన మేనమామ పినతల్లి గారి వదినె కొడుకంట. రేపు ఫ్లైట్‌లో దిగబోతున్నాడు. వెళ్ళి రిసీవ్ చేసుకోవాలి. ఈ తిరుపతిలో పుట్టడం పెద్ద నేరమై పొయ్యిందండీ!" అని తనలో తాను గొణుక్కొంటూ వస్తాడు. వచ్చి ఆపసోపాలు పడుతూ కూర్చుంటాడు.

ఆఫీసర్లు సినిమా మాట కూడా మరిచి రాజాను గురించి ఆలోచిస్తుంటారు.

అర్ధ గంట గడుస్తుంది!

అంతలోనే మళ్ళీ వస్తాడు గేట్‌కీపర్, "సార్! ఫోన్!" అంటూ.


"ఒరే! వాళ్ళను కాదురా ముందు నిన్ను తన్నాలి. ఒకవేళ ఫోన్ చేసినారే అనుకో! లేరని ఒక్క కూత కూసుంటే ఈ బాధంతా తప్పేది కదరా? మీలాంటి వెధవలకంతా తలకాయల్లో ఉండేది మట్టిరా! మట్టి!!– ఛో! లేరని చెప్పు!" అని అంటూనే, "ఏదైనా ముఖ్యమైన వార్తయితే కొంపలు మునుగుతాయ్!" అని గొణుక్కుంటూ లేచిపోతాడు.

ఆ దర్జా దర్పం తమకు లేకుండా పోయినాయే అని ఆఫీసర్లు ఆలోచిస్తుంటారు. అయితే ఆ తిట్లు తిన్నదానికి, ఆ అపద్ధపు ఫోన్‌కాల్స్ అంద చేసిన దానికి గేట్‌కీపర్‌కి అయిదు రూపాయలు అడ్వాన్సుగా ముట్టిన సంగతి వాళ్ళకేం తెలుసు?

ఈ అట్టహాసాల అంబారిల్లో ఊరేగిన ఒకానొక బ్యాంకు మేనేజర్ సంబరపడి రాజాను మరి అట్టహాసంగా చూడాలని ముచ్చటపడి పది లక్షలు అప్పు మంజూరు చేయించినాడు ఒక ప్రెస్సు పెట్టడానికని!

క్షణాలమీద లక్షలు చేతి కందినాయి. నిముషాలమీద పారిశ్రామిక వాడలో స్థలం కేటాయించ బడింది. గంటల్లో పైకి లేచినట్లుగా అందాల భవంతి నెలల్లో పైకి లేచింది. యంత్రాలు తలలొత్తి నడిచి వచ్చి అట్టహాసంగా నిలబడినాయ్!

"రాజా" ఈ అధునాతనమైన అచ్చుకూటమికి "ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్" అని ఒక శుభ ముహూర్తాన నామకరణం చేసినాడు.



"ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్" అనబడే ఈ చిన్నతరహా పరిశ్రమను రాజా పట్టుబట్టి భారీ పరిశ్రమల మంత్రివరేణ్యుల చేతులమీదుగానే ప్రారంభోత్సవం చేయించినాడు అట్టహాసంగా. ఆ ప్రారంభోత్సవంలో భారీ పరిశ్రమల మంత్రి అతిశ్రమతో తన భారీ కాయాన్ని కష్టపెట్టి బ్రహ్మాండంగా మాట్లాడినాడు. దేశానికి పరిశ్రమలు అందునా చిన్నతరహా పరిశ్రమలు పెద్ద వెన్నెముక లన్నాడు. వెన్నెముక లేకపోతే శరీరమే లేనట్లు పరిశ్రమలు లేకపోతే దేశమే– దేశ ప్రగతి కాదు– లేదన్నాడు. కాబట్టి ముఖ్యంగా "నేను చెప్పే దేమిటంటే? నేను చెప్పేదేమిటంటే?" అని గట్టిగా బల్ల గుద్ది, గుద్దిన చేతిని యింకొక చేత్తో తడుముకొంటూ చిన్నతరహా పరిశ్రమలకు పని కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నాడు. ఆ మాట గాలి వేగంగా పయనించి రాజధాని నగరంలో "రమ్" సేవిస్తున్న చిన్నతరహా మంత్రి చెవుల్లో పడింది. కలిసి వచ్చే కాలాన నడిచి వచ్చే కొడుకు పుట్టాడన్నట్లు వేళా విశేషం!– చిన్నతరహా పరిశ్రమల మంత్రి ఆ తెంపులోనే అప్పటికప్పుడే ఉత్తర్వులు జారి చేసినాడు– వెంటనే ఒక పాఠ్య పుస్తకాన్ని "ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్"కు ప్రింటింగు కివ్వమని!

రాజుగారే తలుచుకొంటే దెబ్బలకు కొదువ లేదన్నట్లుగా మంత్రిగారి ఉత్తర్వులు నిముషాలమీద కార్యరూపం దాల్చినాయి.

ఏడవ తరగతి సామాన్యశాస్త్రం యాభైవేల కాపీలు అచ్చువేయడానికి ప్రభుత్వం నుండి ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్సుకు ఉత్తర్వు లందినాయి! ఉత్తర్వు లందిన వారం లోపుగానే లారీల్లో కాగితం దిగింది. పని అట్టహాసంగా ప్రారంభమయింది.

స్థానిక ముద్రణాలయ అధినేతలు కొందరు ముక్కుమీద వేలేసుకొన్నారు. కొందరు ముక్కు చీదుకొన్నారు. కొందరు ప్రభుత్వ పాక్షిక వైఖరిని నిరసిస్తూ కారి ఉమ్మినారు– అరచేతిని అడ్డంగా పెట్టుకొని. ఎవరేమనుకొంటే యేం? ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్ అధినేత రాజా మూడు నెలలు గడువు యిస్తే రెండు నెలల్లోపుగానే ఫారాలు అచ్చు వేయించినాడు.

అచ్చయిన ఫారాల్ని మడిచి, మడిచిన ఫారాల్ని వరుసక్రమంలో పుస్తకంగా పేర్చి ఆ మీదట కుట్టాలి. కుట్టిన పుస్తకానికి అట్ట తగిలించి ఆ తర్వాత అందంగా కత్తిరించాలి.

అయితే అట్టను మాత్రం ప్రభుత్వ ముద్రణాలయమే సరఫరా చేస్తుంది. ఎందుకంటే– ఆ పనిని కూడా ప్రైవేట్ ప్రెస్సులకే అప్పచెప్పితే యాభైవేల ప్రతులంటే లక్షప్రతులు అచ్చువేసి రాష్ట్రంలో అచ్చు పుస్తకాల డిమాండ్ దృష్ట్యా వాళ్ళే ఒక దుకాణం ప్రారంభించే ప్రమాదం ఉంది కాబట్టి. యాభైవేల ప్రతులంటే యాభైవేల అట్టల్నే ప్రభుత్వ ముద్రణాలయం సరఫరా చేస్తుంది!

ఆ అట్టల్ని తేవడానికని రాజా అట్టహాసంగా బయల్దేరినాడు రాజధాని నగరానికి. రాజధాని నగరంలో ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో దిగినాడు. డైరెక్టరుగారికి, డైరెక్టరేట్ సిబ్బందికి ఆ త్రీస్టార్ హోటల్లో "ఫైవ్‌స్టార్" గౌరవ మర్యాదల్ని జరిపించినాడు అట్టహాసంగా!

"ఆ గౌరవమర్యాదలతో ఉబ్బితబ్బిబ్బులైన డైరెక్టర్-

"రాజగారూ! అష్టరాల్ అట్టలకోసం మీరింత దూరం పనికట్టుకొని రావాలా? కాకితో కబురంపినట్లు ఒక ఫోన్‌కాల్ కొట్టుంటే సరిపోయేది కదా? లారీలు ప్రెస్సు ముందు నిలబడేవి!" అని చాలా చాలా నొచ్చుకొన్నాడు.

"సార్! జరిగిందేదో జరిగి పొయ్యింది. ఇంక జరగవలసిం దాలోచించండి. అట్టలు అందినట్లు ఈ రశీదులో రాజాగార్ని ఒక్క సంతకం దయచెయ్యమనండి. మిగత పని నేను చూసుకొంటాను!" అని అంటూ "అట్టల గుమాస్తా" అతి వినయంగా ఫైలును రాజాగారి ముందు పెట్టాడు.

రాజా రశీదులో సంతకం పెట్టాడు అట్టహాసంగా!

ఆ తరువాత–

"అట్టల గుమాస్తా" తాను చెప్పిన పనిని తుచ తప్పకుండా నిర్వహించాడు. వారం తిరక్కముందే లారీలు అట్టల కట్టల్ని ప్రెస్సులో దించినాయి!

రాత్రింబవళ్ళు బైండింగ్ పని ఎడతెరపి లేకుండా ఏకబిగిన జరుగుతూంటే రాజా అట్టహాసంగా నవ్వుకొన్నాడు.

రెండు వారాల్లో పని పూర్తయింది. అయితే అట్టలు నలభైవేల పుస్తకాలకే సరిపడినాయి. అంటే పదివేల పుస్తకాలకు అట్ట షార్ట్!– రాజా కొక పెద్ద షాక్!

రాజా కోపంతో ఎగిరెగిరి పడినాడు. అట్లానే ఎగిరి విమానంలో పడినాడు. గంటల్లో రాజధాని నగరంలో పడినాడు. ఆ మీదట కార్లోపడి ఆ కార్లోనే పడుతూ లేస్తూ ప్రభుత్వ ముద్రణాలయానికి వెళ్ళినాడు. సరాసరి వెళ్ళి "అట్టల గుమస్తా" ఖాటు పీకేయాలన్నంత కోపంతో వెళ్ళి అతని ముందు నిలబడినాడు.


"అట్టల గుమాస్తా" అతి వినయంగా లేచి నిలబడినాడు. నమస్కరించినాడు కూడా!

"నీ అతి వినయాలు అక్కడికాపు. పదివేల అట్టలు తక్కువ పంపిన దానికి కారణం చెప్పు. నేననుకుంటె నీవేమైపోతావో ఆలోచించి బదులు చెప్పు!" అని అన్నాడు రాజా అట్టహాసంగా.

అట్టల గుమాస్తా బాగా ఆలోచించే బదులు చెప్పినాడు.

"అయ్యా! అయ్యా! తమరు పెద్దవాళ్ళు. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం– తమవంటి వాళ్ళకు కూడని పని. యాభైవేలు అట్టలకు బదులు నలభైవేలు అట్టల్ని మాత్రం పంపినానా! అంటే మిగిలిన అట్టల్ని వండుక తింటాననో మీరనుకొంటే అది చాలా పొరబాటు. అందులో మీరు సాక్షాత్ మినిష్టర్ కేండిడేట్. మీపట్ల అజాగ్రత్తగా ప్రవర్తిస్తే కొంప లంటుకపోవూ! అందుకే కదండి మీకు సరఫరా చేయవలసిన అట్ట నమూనా చూపిస్తూ యాభైవేలు అట్టలు ముట్టినట్లు మీ దగ్గర రశీదు తీసుకొనింది. ఇందులో ఏదో చిన్న మెలిక పడింది. మీరు బాగా ఆలోచించాలి. టెక్స్టుబుక్స్ డిమాండ్ మీకు తెలియనిదా? మీ పర్కర్లు అమ్మేసి ఉండొచ్చు. లేదా లారీ వాళ్ళు మోసం చేసి ఉండవచ్చు. మీరు తెలివిగా లారీలు దించినప్పుడే జాగ్రత్తగా లెక్కపెట్టుకొని ఉంటే ఈ గొడవంతా ఉండేది కాదు. ఈ విషయంలో ఈ పరిస్థితుల్లో తమకు నేనేమి సహాయం లేకపోతున్నందుకు విచారిస్తున్నాను!" అని తన సుదీర్ఘోపన్యాసాన్ని ముగించి అట్టల గుమాస్తా అట్టహాసంగా కూర్చున్నాడు– మంత్రిగారి కేండిడేట్ అన్న భయం కూడ లేకుండా!

ఇంతకాలం ఎంతో అట్టహాసంగా బతికిన రాజా నీళ్ళు నములుతూ నిలబడిఉండే రాజాను చూస్తూ అష్టరాల్ "అట్ట"హాసం చేసింది!★ □



సీరియల్

వసంతగీతం

దేవినేని ఉష

(గత సంచిక తరువాయి)

ఆ తరువాత నేను రాంబాబుకు లెటర్స్ వ్రాయలేదు. అతన్నుంచి వచ్చే లెటర్స్ కూడా దీప నా కివ్వడం మానేసింది. నా మీద అనవసర ప్రచారాలు పెరిగి పోతున్నయి. అసలే చిన్న వూరు అవటాన చాలా మందికి నేను చెడిపోయినట్టుగా తెలుస్తోంది. పెద్దన్నయ్య వెళ్ళిపోయినా మూడో అన్నయ్య, నాలుగో అన్నయ్య వచ్చారు హాలీడేస్‌కు. వాళ్ళు పెద్దన్నయ్య డ్యూటీ చార్జి తీసుకుని నన్ను శల్య పరీక్ష చేయసాగారు. నాన్నగారిని కూడా నా గురించి చాలా మంది బజారులో అడుగుతున్నారట. కాలేజీలో కూడా అందరికీ తెలిసి పోయింది. గోడల మీదకు నా పేరు ఎక్కించారు. ఇదంతా సుధాకర్ చేసే అల్లరి అని తెలుస్తూనే ఉంది. అయినా ఒక జులాయి వెధవ మాటే ప్రతివాళ్ళూ వేదం అని నమ్ముతున్నారు. కానీ ఆడపిల్లనైన నా మాట ఎవరూ నమ్మడం లేదు. దీపది, సుధాకర్ ఇళ్ళూ ఒకే బజారులో కాబట్టి పోస్ట్‌మెన్ ద్వారా నాకు వచ్చే లెటర్స్ ఆచూకీ లాగి దాంతో నన్ను భయపెట్టి లొంగదీసుకోవాలని ప్రయత్నించినట్టు గ్రహించాను.

పరీక్షలు దగ్గరకు వస్తున్నయి. చేయని అపరాధానికి తలవంచి దీక్షగా చదివి ఎగ్జామ్స్ వ్రాసేసాను.

ఇంట్లో కూడా నాకు అదివరకటిలా విలువ ఇవ్వడం లేదు. నాన్నగారు నాకు పెళ్ళి సంబంధాలు తె స్తున్నారు. వరుసగా నలుగురు వచ్చారు. వారికి నేను నచ్చాను. నాన్న ఇచ్చే కట్నం నచ్చింది. వెళ్ళి లెటర్ వ్రాస్తామని వాళ్ళు ఇక్కడ చెప్పి వెళ్ళటం "మా అబ్బాయి పెళ్ళికి ఆగుతాను, కొన్ని రోజుల తరువాత చేసుకుంటాను" అంటున్నాడని వాళ్ళ వద్ద నుండి అనంగీకార లేఖ వచ్చేది. దాంతో ఇంట్లో అగ్నిపర్వతం పేలేది. అందరూ నా లేత మనసుపై విరుచుకు పడేవారు. నేను నిస్సహాయంగా అవమానంతో ఏడవటం తప్ప ఏమీ చేయలేక పోయేదాన్ని.

ఆ రోజు అమ్మ నాన్నతోటిఆఫీసర్ గారి భార్యకు తోడుగా విజయవాడ వెళ్ళింది. ఆ ఆఫీసర్ గారి భార్య బట్టలు తీస్తుందట. అమ్మను సెలక్షన్‌కు రమ్మని కోరింది. అమ్మ వెళ్ళింది. అన్నయ్యల కేదో పనుండి ఏలూరు వెళ్ళారు. ఇంట్లో నేను ఒక్కదాన్నే ఉన్నాను. నాన్న ఆఫీస్‌కు వెళ్ళిపోయారు.

అమ్మ వండి పెట్టిన అన్నం ఎలాగో నాలుగు ముద్దలు తిని పడుకుని ఆలోచించు కుంటున్నాను. సమయం మధ్యాహ్నం రెండు అవుతోంది. కాలింగ్ బెల్ మోగింది. నాన్నగారికి అంతక్రితమే ఆఫీస్ ప్యూన్ వచ్చి భోజనం తెమ్మన్నారని అడిగితే క్యారేజీ కట్టి ఇచ్చాను. సాయంత్రం వరకూ ఎవరూ రారని నాకు తెలుసు. ఎవరా? అని తలుపు తీసాను. ఎదురుగా రాంబాబు నిలబడి ఉన్నాడు. నా ఒళ్ళు భయంతో చమటలు పట్టాయి.

"ఎంత పని చేసారు? ఎందుకు ఇలా వచ్చారు?" కంగారుగా అడిగాను.

"అనూ! నన్ను కనీసం కూర్చో నివ్వవా?" అతని కంఠం దీనంగా ఉంది. "ఓ ఐయామ్ సారీ! కూర్చోండి" ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రిలీఫ్‌గా అతనికి కుర్చీ చూపించాను. అతను కూర్చున్నాడు. "అనూ! నువ్వు లెటర్స్ వ్రాయక పోయేసరికి నాకు పిచ్చెక్కినట్టుగా ఉంది. రెండు నెలల నుండి నా లెటర్స్‌కు జవాబివ్వడం మానేసావు. ఇక ఉండబట్టలేక ఇలా వచ్చేసాను. మొదట దీప ఇంటికి వెళ్ళాను. ఆమె ఏమిటో విచిత్రంగా మాట్లాడింది. దాంతో శలవు తీసుకుని ఇలా వచ్చాను" అంటూ చెప్పాడు.

"నా అదృష్టం ఇవాళ వచ్చారు. ఇంట్లో ఎవరూ లేరు" అంటూ సుధాకర్ గురించి అతడు పెట్టే అల్లరి గురించీ క్లుప్తంగా చెప్పాను.

అతని మొహం పాలిపోయింది. "మైగాడ్! ఇంత జరిగిందన్నమాట. ఒక ఆడా, మగా స్నేహాన్ని ఈ లోకం సహించదు. అలా అయితే పరిస్థితులన్నీ చక్కబడే వరకూ నాకు లెటర్స్ వ్రాయకు. ఇక నుండి నేను కూడా వ్రాయను. కానీ అనూ! నేను ఈ లోకంలో మొట్టమొదటిగా లైక్ చేసేది నిన్నే. నీ మనసులో నన్నెప్పటికీ గుర్తుంచుకో" అతని కంఠం ఆర్ద్రం అయింది. నాకూ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇంత మంచి స్నేహితుడిని దూరం చేసుకోవాల్సి వచ్చినందుకు నాకు చాలా బాధ కలిగింది.

"మిమ్మల్ని ఎప్పటికి మర్చిపోను" ప్రామిస్ చేసాను.

"నీకు ఎప్పుడే అవసరం వచ్చినా నన్ను గుర్తుంచుకో. నీకు ఎటువంటి సహాయం కావాలన్నా నేను చేస్తాను. మర్చిపోకు" అంటూ "మరి శలవ్" అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

హైదరాబాద్ నుండి నా కోసం వచ్చిన నా ప్రియ మిత్రుడికి కనీసం మంచి నీళ్ళయినా ఇవ్వాలని నాకు తోచలేదు. సాయంత్రం వరకూ అలానే పిచ్చిగా ఏడుస్తూ ఉండిపోయాను.

★ ★ ★ ★

అలా రాంబాబు వచ్చి వెళ్ళిన విషయం మా ఇంట్లో ఎవరికీ తెలియ లేదు. కానీ నా కోసం ఏ పెళ్ళి సంబంధం వచ్చినా విచిత్రంగా చెడిపోతోంది. దానికి కారణం సుధాకర్ అని నాకు తెలుసు. కానీ నేనే అందుకు కారణం అని ఇంట్లో నన్నే అందరూ అనరాని మాటలు అంటున్నారు. నా తప్పు ఏమీ లేకున్నా అన్నిటికీ సహనంతో తలవంచాను. దానికైనా ఒక హద్దు ఉంటుంది కదా! ఆ సహనం హద్దు దాటబోయే సమయానికి ఒక విచిత్రం జరిగింది.

అమ్మ ఎవరిదో పెళ్ళికి ఏలూరు వెళ్ళగా అక్కడ మాఅమ్మ అన్నయ్య కనబడ్డాడట. చాలా ఏళ్ళుగా కలుసుకోని అన్నా చెల్లెలు అప్పుడు కలుసుకుని మాట్లాడుకోకుండా ఉండలేక పోయారు. శాంతపడిన అన్నగారిని అమ్మ తన వెంట మా ఇంటికి తీసుకు వచ్చింది. ఆయన మా అందరితో బాగా మాట్లాడాడు. నన్ను చూసి బంగారు బొమ్మలా ఉన్నావు. మా అబ్బాయికి పెళ్ళి వారికి మాట ఇచ్చేసాను. లేకపోతే నా కోడలుగా నిన్ను చేసుకునే వాడినని సరదాగా అన్నాడు.

అదృష్టం జారిపోయి నందుకు అమ్మ చాలా బాధపడింది. వాళ్ళ అన్నయ్యను ఆయన కొడుకు పెళ్ళి సంబంధం మాటలు అడుగుతోంది. నేను గదిలోకి వెళ్ళిపోయాను. ఆయన ఆ సాయంత్రం సుధాకర్ ఇంటికి వెళ్ళాడు. రాత్రికి వస్తూ ఒక కబురు మోసుకొచ్చాడు. అది విన్న నా గుండెలో అగ్నిపర్వతం పేలింది. నా సహనం హద్దులు దాటిపోయింది. దానికి ఆనకట్ట వేయడం నాతరం కాలేదు.

సుధాకర్ నన్ను పెళ్ళి చేసుకుంటాడట. దానికి వాళ్ళ ఇంట్లో అందరికీ ఇష్టమేనట. అయిన సంబంధం కాబట్టి కళ్ళు మూసుకుని సుధాకర్‌కు ఇచ్చేయవచ్చు అని మామయ్య చెప్పాడు. అమ్మ సంబరపడి పోయింది. బంధువులందర్నీ కలుపుకోవాలని ఆవిడ తాపత్రయం. అన్నయ్యలు కూడా సుధాకర్‌కు నా సంగతి అంతా తెలిసి అతను ముందుకు వచ్చినందుకు చాలా సంతోషం ప్రకటించారు. ఇంత మంది ఔనన్నది నాన్న మాత్రం ఎందుకు కాదంటారు!

నా మనసులో మాత్రం తుఫాన్ ప్రారంభం అయింది. పెద్ద పులికి బలివ్వబోయే మేకలా అయింది చివరకు నా పరిస్థితి. సుధాకర్ చక్కగా ప్లాన్ ప్రకారం తన పథకం ఏర్పరచి అందులోకి నన్ను ఒడుపుగా లాగాడు. మామయ్య రాకున్నా మరొకరితోనైనా కబురు చేసేవాళ్ళే.

జరిగిన కథ–5: మాలతిని చూడటానికి పెళ్లి చూపులకై మద్రాసు వెళ్తాడు కృష్ణ. కృష్ణ, మాలతి ఒకరినొకరు నచ్చారు. హైదరాబాదుకు తిరుగు ప్రయాణంలో అను పరిచయమైంది కృష్ణకు. రాంబాబు చేతిలో నుండి తప్పించుకొని వచ్చి కృష్ణ ఆశ్రయం కోరింది అను. ఆమెను ఒక వర్కింగ్ ఉమెన్ హాస్టల్లో చేర్పించి ఆమెకు గవర్నమెంట్ జాబ్ ఇప్పిస్తాడు కృష్ణ. కృష్ణ పెళ్లి మాలతితో నిశ్చయమైంది. అను తన జీవితంలో జరిగిన చేదు సంఘటనలను కృష్ణకి చెప్పసాగింది.

అసలే అతనంటే నాకు ఇష్టం లేదు. దానికి తోడు అన్యాయంగా నా బ్రతుకు బజారున పెట్టిన అతనంటే నాకు పరమ అసహ్యం. అతడిని జీవితాంతం భర్తగా ఎలా అంగీకరిస్తాను. ఆ రాత్రంతా బాగా ఆలోచించాను. తెల్లారి మామయ్య మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. నేను ఒకటి నిశ్చయించుకున్నాను. సుధాకర్‌కు గుణపాఠం చెప్పాలి. కుక్క కాటుకు చెప్పుదెబ్బకొట్టాలి అనుకున్నాను. అంతకు మించి నేను మరేం ఆలోచించలేదు.

రెండు రోజులు భారంగా గడిచాయి. మంచి రోజు చూసుకుని నాకు పసుపు, కుంకుమ పెట్టటానికి వస్తామని సుధాకర్ తండ్రి కబురు చేసాడు. నేను సమయం కోసం చూస్తున్నాను.

ఆరోజు అన్నయ్యలు సుధాకర్‌కు బట్టలు తేవాలని ఏలూరు వెళ్ళారు. సాయంత్రం నాలుగు గంటలు అయింది . నేను నా ప్లాన్ అమలు జరపాలని అనుకున్నాను. గబగబా సూట్‌కేస్‌లో గదిలో ద్వారి గప్‌చిప్‌గా బట్టలు సర్దుకున్నాను. అమ్మ లోపలెక్కడో ఉంది. నాన్నగారు రాలేదు ఇంకా. నాకు ఉన్న నగలు వేసుకున్నాను. నా సర్టిఫికెట్స్ మర్చిపోలేదు. మెల్లగా నాన్న బీరువా తీసి అందులో డబ్బు పర్స్‌లో జాగ్రత్త చేసుకున్నాను.

అమ్మ స్నానానికి వెళ్ళింది. ఇదే అదను అనుకుంటూ సూట్‌కేస్, హేండ్‌బ్యాగూ పట్టుకుని బైటకు వచ్చేసాను. అన్నయ్యలు ఏలూరు వెళితే రాత్రి వరకూ రారు. నాన్న ఎదురు పడకూడదని కోరుకున్నాను. దేవుడు కరుణించాడు. నాన్న ఎదురు రాలేదు. బస్‌స్టాండ్‌కు వచ్చాను. విజయవాడ బస్ బైటే ఎదురుపడింది. గబాల్న ఆపి ఎక్కేసాను. బస్‌లో నాకు తెలిసిన వారు ఎవరూ లేకపోవటం నా అదృష్టం.

విజయవాడలో దిగి రిక్షా కట్టించుకుని టెలిగ్రాఫ్ ఎక్స్‌ఛేంజ్‌కు వెళ్ళాను. రాంబాబు ఎడ్రెస్ నాకు పరిచితమే. నోటెడ్ అయిపోయిన అతని ఎడ్రస్‌కు నేను హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌కు బయల్దేరి వస్తున్నట్టు అర్జంట్ టెలిగ్రాం ఇచ్చాను.

మొదట సుధాకర్ అనే భయంకర క్రూర మృగం నుండి తప్పించుకుని, హైదరాబాద్‌లో రాంబాబు సహాయంతో ఏదైనా జాబ్ చూసుకుని నా కాళ్ళ మీద నేను నిలబడాలని , అప్పటి వరకు అజ్ఞాతంలో ఉండాలని నిశ్చయించుకున్నాను.

అన్నయ్యలు , నాన్న వచ్చి నా గురించి తెలుసుకుని వెదికే సరికి నేను హైదరాబాద్‌లో ఉంటాను అనుకున్నాను.

ఆరాత్రి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. మీరు నన్ను చూసారు. ఉదయం మాట్లాడారు" ఆపింది అను.

కృష్ణ కూడా ఈ లోకంలోకి వచ్చాడు. అమాయకత్వంతో ఎన్ని ఆపదలు తెచ్చుకుంది అనుకున్నాడు.

"రాంబాబును నమ్మి వెళితే అతను మంచి బహుమానం చేశాడు. నాకు జాబ్ ఇప్పిస్తానన్నాడు. ఎంతో ధైర్యం చెప్పాడు. కానీ అతడిలోని మగ పశువును అదుపులో పెట్టుకోలేక పోయాడు. ఆ పశువు నా మీద విజృంభిస్తే ఎలాగో తప్పించుకుని నేను మీదగ్గరకు చేరాను" పూర్తిగా చెప్పింది అను.

"మీరు ట్రైన్‌లో నన్ను కలవకపోతే, మీ ఎడ్రెస్ నాకు ఇవ్వకపోతే నా బ్రతుకు ఎంత ఎగతాళి అయ్యేదో తల్చుకుంటే ఒణుకు పుడుతుంది" అంది మళ్ళీ. కృష్ణ చిన్నగా నవ్వాడు. "మంచి వారిని దేవుడు ఎప్పుడూ కాపాడుతుంటాడు. ఇందులో నీతప్పేంలేదు కాబట్టి ఆ భగవంతుడు నీకు చక్కని దారి ఏర్పరిచాడు".

"అవును" మనస్ఫూర్తిగా అంగీకరించింది.

"అర్రె చాలా పొద్దుపోయింది." వాచీ చూస్తూ అన్నాడు. పన్నెండు గంటలు అయింది. వర్షం ఇంకా పడుతూనే ఉంది.

"అమ్మో! నేను హాస్టల్‌కు ఎలా వెళ్ళను" భయంగా అంది.

"ఇంకేం వెళతారు? మార్నింగ్ వెలుదువుగాని పడుకో" అంటూ అనుకు పక్క పరిచాడు.

కృష్ణ త్వరగానే నిద్రపోయాడు. అనుకు నిద్రపట్టలేదు. ఆమె మనసంతా కెలికిన గాయంలా మండుతోంది.

తెల్లారగానే అను లేచి హాస్టల్‌కు వచ్చేసింది. పెద్దమ్మ ఒకావిడ తీసుకు వెళ్ళి



వసంతగీతం

రాత్రి అక్కడే ఉంచేసిందని అబద్ధం చెప్పింది సుమిత్రాదేవికి.

రాత్రంతా వర్షం కాబట్టి సుమిత్రా దేవి పెద్దగా సీరియస్ అవలేదు.

* * * *

వారం రోజులు మామూలుగా జరిగిపోయాయి. ఆ రోజు కృష్ణకు లెటర్ వచ్చింది. అది మాలతి తండ్రి మద్రాసు నుండి వ్రాసాడు. తను రేపు ఒక క్లయింట్ పనిమీద హైదరాబాద్ వస్తున్నట్టు. ఎల్లుండి కృష్ణను కలుసుకోవటానికి అతని రూమ్‌కు వస్తానని.

ఆ రాత్రంతా కృష్ణ ఆలోచనలలో మాలతే కదలాడింది. నిండుగా నవ్వే ఆమె పెదవులు గుర్తు వచ్చాయి. మర్నాడు సాయంత్రం బ్యాంక్ నుండి వస్తూ రేపటికి లీవ్ పెట్టి వచ్చాడు. రామనాధం గారు ఏ టైమ్‌కు వస్తారో తెలీదు. అందుకే ఆ రోజు లీవ్ పెట్టేశాడు.

మర్నాడు అంతా రామనాధంగారు వస్తారని ఎక్కడకూ వెళ్ళకుండా రూమ్‌లోనే ఉన్నాడు. భోజనానికి వెళ్తూ ఇంటామెకు చెప్పి వెళ్ళాడు.

రాత్రి పది గంటలు అయిపోయింది. రామనాధం గారు రాలేదు. ఎదురు చూసి, ఎదురు చూసి కృష్ణకు విసుగెత్తి పోయింది.

మర్నాడు అనవసరంగా లీవ్ ఎందుకని బ్యాంక్‌కు వెళ్ళిపోయాడు. సాయంత్రం వరకూ రామనాధం గారు రాలేదు ఎందుకో? అని ఆలోచిస్తూ ఉండిపోయాడు.

బ్యాంక్ అయిపోయింది. అన్నీ సర్దేసి బైటకు రాబోతుండగా అను వచ్చింది. ఆ రోజు తన కథ చెప్పి హాస్టల్‌కు వెళ్ళిపోయాకా అనుని ఇప్పుడే చూసాడు. నవ్వుతూ పలకరించాడు.

"కృష్ణగారూ! మీకిప్పుడేమైనా పని ఉందా"? మెల్లగా అడిగింది.

"నాకేం పని లేదు. ఎందుకు?"

"సికింద్రాబాద్ రాజేశ్వరిలో నాకు నచ్చిన పిక్చర్ వచ్చింది. అది చూడాలని ఎంతకాలం నుండో అనుకుంటున్నాను. అది ఇవాళతో ఆఖరు. ఆ సంగతి నాకు మూడింటికి తెలిసింది. ఇప్పుడు ఒక్కదాన్నే ఏం వెళ్తాను. మీరు తోడు వస్తారా?"

"ఏం పిక్చర్?"

చెప్పింది . అది మంచి పిక్చరే. నిన్నంతా రామనాధం గారి కోసం ఎదురు చూసి అతనికి బోర్ కొట్టింది. తనకూ రిలీఫ్‌గా ఉంటుంది, అను కోర్కె తీర్చినట్టూ ఉంటుంది అనిపించి "ఓ. కే." అన్నాడు.

మొదట కాఫీ బార్‌కు వెళ్ళి చెరో కప్పు కాఫీ తాగారు. తరువాత ట్యాంక్‌బండ్ దగ్గరకు వచ్చి సికింద్రాబాద్ బస్ ఎక్కారు.

పిక్చర్ బిగిన్ చేసారు. ఇంట్రస్టుగా ఉంది. పిక్చర్ కొంచెం అయాకా కృష్ణ పక్కసీట్లో ఎవరో వచ్చి కూర్చున్నారు. అను అడిగే సందేహాలకు సమాధానం చెప్తూ చూస్తున్నాడు కృష్ణ. ఇంటర్వెల్ అయింది. లైట్లు వెలిగాయి. ఎందుకో తల తిప్పి పక్కకు చూసి ఆశ్చర్యపోయాడు. పక్క సీట్లో వ్యక్తి అదే స్థితిలో ఉన్నాడు. కృష్ణ మొహం మతాబులా వెలిగింది. కానీ అవతల వ్యక్తి వదనం మూడిపోయి ఉంది.

"నిన్న అంతా మీ కోసం చూసాను. రాలేదు. ఇవాళ మీరు ఇక్కడ... నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది" కృష్ణ ఆప్యాయంగా పలకరించాడు.

"ఈ హాల్ పక్కనే మా అక్కగారిల్లు. నేను మధ్యాహ్నం వచ్చాను. ఐదింటి వరకూ పనితో సరిపోయింది. మీ బ్యాంక్ దగ్గరకు వెళ్ళాను. కానీ మీరప్పటికే ఒక అమ్మాయితో ఎక్కడికో వెళ్ళారని అక్కడ తెలిసింది. ఇక సరాసరి ఇక్కడకు వచ్చాను. మనసు బాగుండక, అక్క ఇంటికి వెళ్ళాలనిపించక థియేటర్ కనబడితే ఏదో కాలక్షేపం అనుకుని లోపలకు వచ్చాను" గంభీరంగా చెప్పారు రామనాధం గారు.

"ఈ అమ్మాయి పేరు అను. నాకు ఆప్తురాలు " అంటూ అనుని పరిచయం

వసంతోత్సవం

వసంత ఋతువు ప్రారంభంనాడు జరిగే వేడుక వసంతోత్సవం. వసంత ఋతువు మనకు ఉగాది పండుగతో ప్రారంభ మవుతుంది. తొమ్మిది రోజులు వసంత నవరాత్రులు వైభవంగా జరుగుతాయి. చాంద్రమానాన్ని అనుసరించి చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి వైశాఖ బహుళ అమావాస్య వరకూ వసంత ఋతువు. కాని, బార్హస్పత్యమానాన్ని అనుసరించిన ఉత్తర భారతీయులకు మాత్రం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమితోనే వసంతర్తువు ప్రారంభ మవుతుంది. మనకు ఏప్రిలు మొదటి వారంలోనే సాధారణంగా ఇది ప్రారంభ మవుతే, వారికి మార్చినెల మధ్యనే ప్రారంభ మవుతుంది. వసంతోత్సవం మనకంటే ఉత్తర దేశీయులకే ఎంతో ముఖ్యం.

వసంతోత్సవ ప్రసక్తి కాళిదాసు రచించిన శాకుంతల నాటకంలో ఉన్నది. శకుంతలను తిరస్కరించినందున విచారంలో మునిగిఉన్న దుష్యంతుడు ప్రతి సంవత్సరమూ జరిగే వసంతోత్సవాన్ని ఆ యేడు నిలిపివేశాడు. శ్రీ హర్ష దేవుని రత్నావళీ నాటికలో వత్సరాజు ఈ వేడుకను గురించి వివరిస్తాడు. వినోదంగా పసుపు, సున్నం కలిపిన వసంతం



ధర్మపథం....

ఒకరిపై ఒకరు చల్లుకొని వినోదించడం ఇందులో ప్రధానం, ఉయ్యాల లూగడం కూడా దీనికి అందంగా ఉండేది. అది దేవాలయాలకు కూడా వ్యాపించినది. శ్రీ కూర్మం మొదలైన క్షేత్రాలలో ఫాల్గుణ పౌర్ణమినాడు జోలోత్సవం జరుగుతుంది. మొన్న మొన్నటి వరకూ వివాహాలలో చివరిదినం వేడుకగా వసంతాలు జల్లుకోవడం మన ప్రాంతాలలోనూ ఉండేది. ఒక్కరోజు జరిగే నేటి వివాహాలలో ఆ ఆచారం అంతరించి పోయింది.

ఈ పండుగే ఉత్తర దేశీయుల హోళీ పండుగగా మారింది. వేడుకగా చల్లుకునే వసంతానికి బదులుగా వేర్వేరు రంగుల నీళ్ళు చల్లుకోవడం, మనుష్యులను వికార రూపులుగా చెయ్యడం జరుగుతున్నది. ఇదివరలో పరిచితులపైనే వసంతం చల్లబడేది. ఇప్పటి రంగుల నీళ్ళు అపరిచితులపైకి కూడా చల్లబడి, వారికి ఎంతో చికాకు కలిగిస్తున్నవి. సంతోషానికి బదులు చికాకు, భయం చోటు చేసుకున్నవి. వసంతోత్సవం రూపు చెడి రంగుల పండుగగా పేరు తెచ్చుకున్నది.

కాలక్రమేణా సదుద్దేశంతో ప్రారంభమైన ఆచారాలు ఏ విధంగా మారిపోయినదీ ఈ వసంతోత్సవ వృత్తాంతం వల్లనే తెలుస్తున్నది.

–బులుసు వేంకట రమణయ్య

చేసాడు.

ఆయన తన ఎక్స్‌రే కళ్ళతో అనుని పరిశీలించారు.

"నారూమ్‌కు రేపు రండి. నేను ఇంట్లోనే ఉంటాను" కృష్ణ ఆహ్వానించాడు.

"లేదు . నాకు వీలు పడదు" నిర్మొహమాటంగా అనేసి ఆయన సీట్లోంచి లేచి బైటకు వెళ్ళిపోయాడు. కృష్ణ మనసు చివుక్కుమంది. ఆయన ధోరణిలో ఏదో మార్పు కనబడింది. అతని మెదడులో లక్ష అనుమానాలు పాముల్లా మెదలసాగాయి.

బైటకు వెళ్ళిన ఆయన తిరిగి రాలేదు. కృష్ణ ఆ తరువాత సినిమా చూడలేకపోయాడు. అతని మనసులో జంకు ఏదో ఏర్పడింది.

పిక్చర్ అయ్యాక బస్ కోసం నిలబడే ఓర్పు అతనికి లేకపోయింది. ఆటో మాట్లాడాడు.

అనుకు అతని ధోరణి అర్ధం కాలేదు. హాల్లో మాట్లాడిన వ్యక్తి ఎవరో, ఆ తరువాత కృష్ణలో మార్పు ఎందుకు వచ్చిందో గ్రహించలేక పోయింది.

సీరియస్‌గా, మౌనంగా ఉన్న అతన్ని పలకరించే సాహసం చేయలేక తనూ మౌనంగా ఉండిపోయింది.

అనుని హాస్టల్ దగ్గర దించేసి తను ఆటోలో వెళ్ళిపోయాడు.

అంతు తేలని ఆలోచనలతో కృష్ణకు ఆ రాత్రి నిద్రపట్టలేదు.

ఏదో ఆశతో మర్నాడు లీవ్ పెట్టి ఇంట్లో ఉండిపోయాడు. కానీ రామనాధం రాలేదు. ఆ రోజే కాదు వరుసగా వారం రోజులు గడచి పోయాయి. రామనాథం గారు రాలేదు. కృష్ణకు చాలా బాధ కలిగింది. అనుతో తను ఆయనకు సినిమా హాల్లో కనబడటమే పెద్దనేరం అని అతనికి అర్ధం అయింది. అను ఆ రోజే సినిమా చూపించమని అడగాలా? అదే సమయానిక ఆయన అదే హాల్‌కు రావాలా?అని చిరాకు కలిగింది. అనుపై కేవలం స్నేహం , జాలితప్ప అతనికి వేరే భావం లేదు అది ఆయనకెలా తెలుస్తుంది. అయినా దైవలీల మార్చడం ఎవరి తరం?

సుబ్బారావుగారి నుండి లెటర్ వచ్చింది కృష్ణ ఆతురతగా విప్పాడు.

అందులో ఉరుములు, పిడుగులు చూసి అదిరి పోయాడు

కృష్ణ క్యారెక్టర్ మంచిది కాదని, అతనికి ఎవరో అమ్మాయితో సంబంధం ఉందని, ఆమెకు కృష్ణ చాలా సాయం చేసాడని, ఆమెను కృష్ణతో రామనాధం గారు కళ్ళారా చూసారని , దాంతో ఆయన విన్నవన్నీ నిజాలని గ్రహించి సుబ్బారావుగారితో సంబంధం వదులు కుంటున్నట్టుగా రామనాధం చాలా ఘాటుగా దూషిస్తూ లెటర్ వ్రాసాడనీ. కృష్ణను నిందిస్తూ రాసారు సుబ్బారావుగారు ఒకసారి కృష్ణను విజయవాడ రమ్మని వ్రాసారు.

లెటర్ చదవగానే కృష్ణకు నీరసం వచ్చేసింది ఇదేమిటి ఇలా జరిగింది? ఒక ఆడా , మగా స్నేహంగా ఉండకూడదా? ఉంటే దాని పర్యవసానం ఇదా? ఆపదలో ఉన్నవారిని మానవత్వంతో ఆదుకుంటే అందుకు ఇదా ప్రతిఫలం? ఆ రాత్రంతా ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కిపోయింది.

వైట్ పేపర్ తీసుకుని మాలతికి అను కధ అంతా వ్రాసాడు తనామెకు ఏ స్థితిలో సహాయం చేయాల్సి వచ్చిందో వివరించాడు. కనీసం ఆమె అయినా అర్ధం చేసుకుంటుందని అతని ఆశ మర్నాడు బ్యాంక్‌కు వెళ్ళేముందు ఆ లెటర్ పోస్ట్ చేసాడు.

(ఇంకా ఉంది)

రాతి యుగానికీ రాకెట్ యుగానికీ వారధి

ఓంగి జాతి నాయకుడు – తంబోలే

అది అండమాన్ – నికోబార్ దీవుల ముఖ్యపట్టణమైన పోర్ట్‌బ్లెయిర్‌లోని ప్రదేశ పరిషత్తు భవనం. ప్రదేశపరిషత్తు అంటే రాష్ట్ర అసెంబ్లీతో సమానమైనది. ఆ భవనంలో ప్రదేశ పరిషత్తు సమావేశం జరుగుతున్నది. ఆ రోజు 21 ఫిబ్రవరి, 1986. నల్లగా నిగనిగలాడే శరీరం, పొట్టిగా, దృఢంగా, ఉంగరాల జుత్తుతో, ఎర్రటి కళ్ళున్న ఒక సభ్యుడు లేచి, ఎలుగెత్తి సభనుద్దేశించి ఇలా అన్నాడు:

"మేముంటున్న ద్వీపంలో సరైన రోడ్డు లేదు. మాకు నెలనెలా రేషను సరిగ్గా అందడం లేదు. పడవల రాకపోకలు అంతంత మాత్రంగానే వున్నాయి. బయట ప్రపంచానికీ మాకూ ఏమాత్రం సంబంధం లేదు. ఎవరైనా ప్రమాదకరమైన పరిస్థితిలో వుంటే పోర్ట్‌బ్లెయిర్‌కు సమాచారాన్ని అందచేయడానికి కనీసం వైర్‌లెస్ సెట్ కూడా లేదు. మా జాతి వారి ఈ కనీస అవసరాలను వెంటనే సమకూర్చాలని సభ వారికి విజ్ఞప్తి చేస్తున్నాను" అన్నాడు హిందీలో గంభీరంగా–

ఆ వ్యక్తి రాతి యుగాన్నించి రాకెట్ యుగానికి ఇటీవలే ప్రయాణం చేసిన – చేస్తున్న – ఓంగి జాతి నాయకుడు తంబోలే.

99 మంది మాత్రమే ఉన్న జాతి!

ప్రపంచంలోని అతితక్కువ జనాభా గల ఆదిమ జాతులలో ఓంగి జాతి ఒకటి అని చెప్పవచ్చును. వారి ప్రస్తుత జనాభా 99 మంది. ఈ జాతి వారికి "డుగాంగ్ క్రీక్" అన్న చిన్నద్వీపంలో అండమాన్ ప్రభుత్వం స్థిరనివాస మేర్పాటు చేసింది.

సుమారు అయిదు అడుగుల పొడవు, బలిష్టమైన శరీరంతో, ఉంగరాల జుట్టుతో, మెరిసే కళ్లతో, అమాయకత మూర్తీభవించిన తంబోలే వయసు సుమారు నలభై సంవత్సరాలుంటుంది. అతని వయసెంతో అతనికి తెలియదు. ఇప్పుడిప్పుడే నవనాగరికతా సమాజంలోకి అడుగు పెడుతున్నది ఓంగి జాతి. నిన్న మొన్నటి వరకూ దిగంబరంగా విచ్చలవిడిగా తిరిగేవారు. నేడు ప్యాంటు, షర్టు ధరించి, నాజూకుగా సిగరెట్ త్రాగడం కూడా నేర్చుకున్నారు. సంచార జాతులుగా వున్న వారికి




ఓంగి జాతి నాయకుడు తంబోలే

ప్రభుత్వం డుగాంగ్ క్రీక్ అన్న ద్వీపాన్ని వారికి ప్రత్యేకంగా కేటాయించి, అక్కడ ఇళ్లను కట్టించి, వసతి సౌకర్యాన్ని కలుగజేసింది. ఒక్కో కుటుంబానికి నెలకు ఏడు వందల రూపాయల చొప్పున భృతి ఏర్పాటు చేసింది. వినోదం, విజ్ఞానం కోసం, ఒక్కో కుటుంబానికి ట్రాన్సిస్టరును ఇవ్వడమే కాక, వారి సంక్షేమం కోసం, ఒక ఆసుపత్రి, చిన్నపిల్లల బడి, సహకార సంఘం, రేషన్ షాపు, విద్యుచ్ఛక్తి మొదలైనవి ఏర్పాటు చేసింది అండమాన్ ప్రభుత్వం.

ఇందిరాగాంధీని మరచిపోలేము.

మన ప్రధానమంత్రి ఎవరని అడిగినప్పుడు "రాజీవగాంధీ" అని వెంటనే చెప్పాడు. కానీ ఆయన ఫోటోను కూడా ఇంతవరకు చూడలేదుట!" ఇందిరాగాంధీని మా జీవితంలో మరచిపోలేము. దానికి కారణం ఆమె మా జాతికి ఎంతో మేలు చేసింది. మాకు ఇళ్ళు కట్టించి ఇచ్చింది ఆమె.



డుగాంగ్ క్రీక్ ద్వీపంలో నివసించే ఒక ఓంగి జాతి జంట

అండమాన్ ఎప్పుడు వచ్చినా మమ్మల్ని పలకరించడానికి వచ్చేది. ఇందిరాగాంధిని ఎవరో హత్య చేసినట్లు రేడియోలో విని ఎంతో దుఃఖించాము. ఆ రెండు రోజులూ ఇళ్ళల్లో నుంచి మేమెవరమూ బయటికి రాకుండా, ఏ పనీ చేయకుండా, రేడియోలో వార్తలు వింటూ ఎంతో దుఃఖంతో గడిపాము" అన్నాడు తంబోలే.

1983 వ సంవత్సరపు రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా ఢిల్లీలో జరిగిన పెరేడ్‌లో పాల్గొన్నాడు తంబోలే. ఆ సమయంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధిని కలుసుకున్నాడు ఆ సందర్భంగా ఢిల్లీ, మద్రాసు నగరాలను సందర్శించాడు. మద్రాసులో ఒక హిందీ సినిమాను చూశాడుట కానీ, సినిమా పేరు కానీ, నటీనటుల పేర్లు కానీ గుర్తు లేవుట.

కొడుకు పేరు రమేష్!

ఇటీవల వరకూ ఒంటి నిండా మట్టి పూసుకుని అలంకరించుకునే ఇతను ఇప్పుడు రోజుకు రెండు సార్లు సబ్బుతో వళ్ళు రుద్దుకుని స్నానం చేయడం, ముఖానికి పౌడరు రాసుకోవడం, తలకు హెయిర్ ఆయిల్ పూసుకోడం నేర్చుకున్నాడు. ఇతని భార్య పేరు "తోడాతోగిగ్". కానీ తన కొడుక్కు వారి జాతి వారి మోటు పేరు కాక "రమేష్" అని నవనాగరికమైన పేరు పెట్టాడు! తనకే మాత్రం చదువు రాదనీ, కానీ తన కొడుక్కి ఎంత వరకు చదువుకుంటే అంతవరకు చదువు చెప్పించి, పెద్ద ఆఫీసర్ని చేయించాలనీ కలలు కంటున్నాడు ఈ ఆదిమజాతి నాయకుడు

ఒకరకంగా సభ్య సమాజం వలన మేలు కలిగినా మరో రకంగా కీడు కూడా జరిగిందంటాడు. ఇదివరలో తమ జాతివారు పందుల్ని, చేపల్ని, పీతల్ని వేటాడి, పచ్చి మాంసం తినే వారమనీ, అప్పుడు ఎంతో బలంగా, ఆరోగ్యంగా, స్వేచ్ఛగా ఉండేవారనీ, కానీ ఇప్పుడు నూనె, డాల్డాతో తయారు చేసిన పరోటాలు, చపాతీలు తింటున్నామనీ, అందుచేత సన్నగా, బలహీనంగా, అనారోగ్యంగా తయారవుతున్నారనీ వాపోతున్నాడు తంబోలే–

ఇదివరలో ఎవరికైనా జబ్బు చేస్తే, అడవిలో దొరికే మట్టితో వైద్యం చేసేవారు. దానితో రోగి బ్రతికితే బ్రతుకుతాడు లేకపోతే లేదు. ఇప్పుడు ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన వైద్య సౌకర్యం వలన తమ జాతి అంతరించి పోకుండా మేలు జరిగిందంటాడు.

వంచిత

నువ్వున్నావు
నా కళ్ళు మీనాలని
అందుకే కాబోలు
ఈదడానికి కన్నీళ్ళు ఇచ్చివెళ్ళావు

–గాలి నాసరరెడ్డి

దేవుడు లేడు కానీ భూతం అంటే భయం!

తమకు దేవుడంటూ ఎవరూ లేరని, కానీ భూతం అంటే భయం. పెద్ద పెద్ద చేతులతో, పొడుగాటి కాళ్లతో, మట్టిలో · వుంటూ, అడవిలో తిరుగుతుందనీ దాన్ని చూసినా, తలచుకున్నా వ్యాధులు సంక్రమిస్తవనీ తంబోలే నమ్మకం. మనిషి చనిపోతే, అతని మీద ప్రేమ పెరిగి, ఆ శవాన్ని ఇంట్లోనే పూడ్చిపెడతారుట!

ప్రస్తుతం వీరి వ్యాపకం కొబ్బరి, అరటితోటల్ని పెంచడం, కాయగూరల్ని పండించడం, బుట్టల్ని అల్లడం వగైరా. ఆ వస్తువుల్ని సహకార సంఘం ద్వారా అమ్మి, ఆ డబ్బుతో వారికి కావల్సిన వస్తువులు కొనుక్కుంటున్నారు.

తంబోలే ఓంగి భాషలో ఎంతో చక్కగా పాటలు పాడతాడు. మంచి శ్రావ్యమైన కంఠం అతనిది. రేడియోలో పాటలు పాడాలని వున్నది కానీ రేడియో స్టేషన్ ఎక్కడో, ఎలా వెళ్లాలో దారి తెలియదు అంటాడు ఈ అమాయకుడు. హిందీ నట్లునట్లుగా మాట్లాడతాడు. ఇప్పుడిప్పుడే బాహ్య ప్రపంచంలో జరిగే న్యాయాన్యాయాలను ఆకళింపు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

తన జాతి వారికీ, అండమాన్ ప్రభుత్వానికి వారధిగా నిలచి, తన వారి సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న వ్యక్తి తంబోలే.

—యస్. వి. ప్రసాద్

ఆదాయపు పన్ను బకాయిలు!

ఆదాయపు పన్ను బాకీదారుల లిస్టులో వాందినటుడు అమ్జద్‌ఖాన్ అగ్రతాంబూలం పుచ్చుకున్నారట. ఈయన 53 లక్షల 43 వేల రూపాయలు కట్టాలట రాజకపూర్ 51 లక్షల 5 వేలట. ఆ లిస్టులో తొమ్మిదో స్థానం సంపాదించిన యన్టీ రామారావు 22 లక్షల 60 వేల రూపాయలుబాకీ అట ఏరుగాక హేమామాలిని, జితేంద్ర, రాఖీ, రాజేష్‌ఖన్నా, కిశోర్‌కుమార్, శశికపూర్, శివాజిగణేశన్ పేర్లు కూడా వున్నాయట అంతా చేరి 1985 మార్చి నాటికి భారతదేశ ఆదాయపు పన్నుల శాఖ వారికి 5 కోట్ల 86 లక్షల రూపాయలు బాకీ అట.

కట్నపిశాచానికి బలైన మరో వనిత!

విశాఖపట్టణానికి చెందిన ఎ. వెంకటేశ్వరరావు అనే అతని భార్య (19 ఏళ్ళు) తన అత్త, ఆడపడుచు, భర్త పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నదట. తగినంత కట్నం తసుకు రాలేదని ఆ ముగ్గురూ ఆమెను చిత్రవధ చేసేవారట పోలీసు ఈ ముగ్గుర్ని అరెస్టు చేసింవట

అభినవ దుర్యోధనుడు!

నందికొట్కూరు సర్పంచి కొంతమంది అనుయాయులతో కలిసి ఒక మిలిటరి హోటలు నడుపుతున్న రహమతబి అనే ఆమె హోటలుకు వెళ్ళి ఆమెను పట్టుకుని దుర్యోధనుణ్ణి తల్చుకుని, ఆమె బట్టలూడదీశాడట. ఆమె హోటలులోనీతడు నానా భీభత్సమూ చేశాడట!

వివాహిత స్త్రీ మానభంగం!

పాతపట్నంలో కానుఎల్లి వెంకట రమేష్ అనే ఒకతను వో 25 ఏళ్ళ వివాహితమీద మోజుపడి, తన స్నేహితులు కరణం అప్పారావు, ఆదినారాయణల సహాయంతో ఆమెను మానభంగం చేసి, తన కోర్కె తీర్చుకున్నాడట.

ఫోనులో ప్రశ్నాపత్రం!

హుబ్లిలోని కె. యం. సి. ఆసుపత్రి ట్రయినింగు సెంటరు నర్సుల పరీక్షా పత్రాలు సమయానికి రాలేదట. నర్సులంతా రెడీ అయిపోయినా ప్రశ్నా పత్రాలు రాకపోయేసరికి అక్కడి అధికారులు కన్నుడంలో విస్తుపోయారట. చిట్ట చివరి కా ఆసుపత్రి సూపరింటెండెంటుగారు డయిరెక్టరేటుకు ఫోనులో సంధిస్తే, అదే ఫోనులో ప్రశ్నా పత్రాన్ని చదివి, దాన్ని నోట్ చేసుకుని, ఇవియే అనేక శుభ లేఖార్ధములు అని అందరికి అందజెయ్యమని అనుజ్ఞ వచ్చిందట.

రోడ్డు ప్రమాదాలలో అగ్రస్థానం!

భారతదేశంలో రోడ్డు ప్రమాదాలు ప్రపంచ దేశాలలోనే మొదటిస్థానం ఆక్రమించుకున్నాయట. యు. యస్. ఎ. లో వెయ్యికి 14 రోడ్డు చావులయితే మన దేశంలో 35 చావులట. జపానులో 10 రోడ్డు మరణాలట. భారతదేశంలోని పైరులకు పట్టే పురుగు, క్రిములవల్ల సుమారు పది వేల ఎకరాల పంట నాశనమవుతోందట. పది వేల కోట్ల ధన నష్టమట. పంటమీద ఖర్చు పెట్టే ఒక రూపాయి మందువల్ల సుమారు నాలుగు రూపాయల పంట దక్కుతుందని తత్ సంబంధశాఖ నిపుణులు లెక్క లేశారట.

తల్లి పఠనాసక్తి-బిడ్డ మరణం!

బ్రిటను ఛమ్స్‌ఫర్డుకు చెందిన పెన్నీ టేలర్ అనే ఆవిడ తన నవలా పఠనానికి తన రెండున్నరేళ్ళ కూతురు అడ్డొచ్చి ఆకలో అని గోల చేస్తోందని, ఆ పసిపిల్లను మంచానికి కట్టేసి తలుపు గొళ్ళెం వేసేసిందట. ఆనక ఆ విషయం మర్చిపోడంతో ఆ పసిపిల్ల ఆ మంచంమీదే చనిపోయి, పురుగులు పట్టిందట.

గుండె కొట్టుకోవడంలో వ్యత్యాసాలు!

తల్లి గర్భంలో వున్న శిశువు గుండె నిముషానికి 140 సార్లు కొట్టుకుంటుందట. సాదా మానవుని గుండె 72 సార్లు, కుందేలు గుండె 150 సార్లు, చిట్టెలుక గుండె నిముషానికి 200 సార్లు, ఎద్దు, గుర్రాల గుండె నిముషానికి 38 సార్లు, కుక్క గుండె 118 సార్లు కొట్టుకుంటాయట.

పానీ పూరీల వ్యాపారంలో లక్షల నిలవ!


బొంబాయిలోని ఒక్కుటుంబం గత అయిదేళ్ళుగా రోడ్డుమీద పానీ పూరీలు అమ్ముకుని, కాస్త నిలవేసుకున్నారట. ఈ ప్రకారంగా నిలవేసిన సొమ్ము చూసి సొమ్మసిల్లిపోయారట ఆదాయప్పన్నువారు. ఆ పానీ పూరీలమ్ముకునేవారు అయిదేళ్ళలో యాభై లక్షలట పోగేసుకున్నది-అహా! ఆశ్చర్యం!!


అత్తింటి ఆరళ్ళకు బలైన కోడళ్ళు!

మచిలీపట్టణం నూరుద్దీన్ పేటలో అహమ్మద్ ఎలిషా అనే ఓ కాపురస్థుడు తన భార్య షకీలాను చిత్ర విచిత్ర హింసలకు గురి చేస్తుండేవాడట. ఈ ప్రక్రియలో అతనికి అతని తల్లి కూడా చేదోడు వాదోడుగా వుండేదట. హింసలు తారక స్థాయిని చేరుకుని మార్చి 20వ తేదీన ఐదు నెలల గర్భిణి అయిన షకీలా స్నానం చేస్తుండగా ఆమె భర్త, అత్తగారూ కలసి బలవంతంగా ఆమె నోట్లో పొటాషియం సైనైడు పోశారట. ఈ హింసాకాండ చూసిన పెద్ద కోడలు ఆరవున్నీసాను కూడా పట్టుకుని, ఆమెచేత కూడా యీ ద్రవం బలవంతాన త్రాగించారట. ఫలితంగా ఆ యింటి కోడళ్ళిద్దరూ ఒకేనాడు చనిపోయారట. వీరి మరణాన్ని ఆత్మహత్యలుగా ఆ యింటివారు రూపొందించారట. తన చెల్లెలు షకీలా వంటిమీది దెబ్బలు, రక్తపు మరకలు సాక్ష్యాలనీ, ఆమెను వారే చంపారనీ షకీలా అన్నగారు జకిరియా భాషా పోలీసులకు ఫిర్యాదు చేశారట.

భారతదేశంలో నిరక్షరాస్యత!

భారత దేశంలో 1981 నాటి లెక్కల ప్రకారం 424.28 మిలియను జనాభా చదువనూ, వ్రాయనూ తెలియనివారేనట. ఉత్తరప్రదేశ్‌కు మన దేశంలో అగ్రతాంబూలమట. అక్కడ 89.705 మిలియను జనాభా నిరక్షర కుక్షులట. తరువాతిస్థానం సంపాదించిన బీహారులో 51.59 మిలియనులట. □





జీవితంతో... 'పోరాటం'

అడివి సూర్యకుమారి

"స్త్రీకి విద్య, ఆర్థిక స్తోమతు ఉంటే గనక మగవాడి జులుం తగ్గుతుంది. అప్పుడీ వరకట్నపు చావులు ఆత్మహత్యలూ కూడా చాలా వరకూ ఉండవేమో!" ఏమంటావ్ అన్నట్లుగా అడిగింది సరోజ.

"పొరపాటు. ఆర్థిక స్తోమతు ఉండనీ, పి. హెచ్. డి. చేయనీ, బానిస భావం ఆమె రక్తంలోనే వుంది అది పోవాలి ముందు. అసలు మౌలికంగా మగవాడి మనస్తత్వంలో మార్పు రానిదే స్త్రీ జీవితం బాగు

పడదంటాన్నేను' సాలో చనగా అంది సీత.

"నువ్వు మరి భూతద్దంలోంచి చూస్తావ్ సీతా! స్త్రీ ఆర్థికంగా 'నిలబడ గలిగితే సుఖపడుతుందని నా ఉద్దేశం. అతని మీద ఆధారపడనప్పుడు ఆమె కిక బాధేమిటి? ఇంటా బైటా చాకిరి చేసి వేళకి తిండి తిప్పలూ చూస్తుందాయె. నెలనెల అతని సంపాదనంతా ఆమే సంపాదిస్తుందాయె. ఇంక కలత లెందు కొస్తాయి? గొడవ లెందుకుంటాయి?"

అమాయకు రాలైన పసి పిల్ల మాటలకి నవ్వినట్లు నవ్వింది సీత. కొద్ది క్షణాలాగి.

'సరేగానీ, మా అత్తయ్య కూతురు సావిత్రీ వాళ్ళ వూరొచ్చి మూడు నెలలైంది. వాళ్ళు మా యింటి కొచ్చినా నేనీసాగరంలోంచి బైటపడి దానింటికి పోలేదు. మొన్న బజారులో కన్పించి రమ్మని ప్రాణం తీసింది. తన కిక్కడికి ట్రాన్స్‌ఫర్ అయిందిలే. రేపు వెళదామా! తోడు రారాదూ?

'నా కావిడతో పరిచయమే లేదు. ఆదివారం శలవే అయినా బోల్డు పనుంటుంది నాకు' అంది సరోజ

'అబ్బ!' ఒక్క ఆదివారం నాకోసం ఖర్చు

చేయరాదూ. కొద్దిసేపాలోచించి 'సరే! పది గంటల కొచ్చెయ్యి. వెళదాం' అంది సరోజ.

* * *

మర్నాడు సీత, సరోజ రెండు బస్సులు మారి సావిత్రి ఇంటికి వెళ్ళేసరికి పదకొండు దాటింది. వీధి తలుపు తట్టగానే ఎనిమిదేళ్ళ పాప వచ్చి తలుపు తీసింది. సీతను చూడగానే–

"అమ్మా! సీతత్త వచ్చిందే' అంటూ లోపలికి, పరిగెత్తింది.

'వైర్‌లెస్ వెళ్ళి పోయింది రా ' అంది సీత నవ్వుతూ లోపలికి దారి తీసింది. హాల్లోని కుర్చీల్లో కూర్చున్నారిద్దరూ. సరోజ హాలు పరికించ సాగింది. అరమరలో వరుసగా పేర్చిన పుస్తకాలు సరోజ నాకర్షించాయ్. లేచి చూసింది. అవన్నీ సైకాలజీకి సంబంధించినవి. విసుగ్గా వచ్చి కుర్చీలో కూర్చుంది. చక్కటి ఫర్నిచర్. టి. వి. ఉన్నాయి. గదినంతా కలయచూస్తోంది సరోజ. అంతలో

"నీ చెత్త పాఠాలన్నీ ఆ కాలేజీ వెధవలికి చెప్పు నాక్కాదు". అంటున్న కటువైన కంఠధ్వని విన్పించింది

"ఇందాకొచ్చిన వాడెవడు?" మళ్ళీ అదే గొంతు.

"మా డిపార్టుమెంటులో పని చేస్తారావిడ రత్న అనీ, ఆవిడ తమ్ముడు ఈ రోజు వాళ్ళింట్లో ఫంక్షన్. మరిచి పోయారేమో, మనల్ని తన కూడా తీసుకొని రమ్మని అతన్ని పంపించింది' మృదువుగా, సన్నగా, వుందాగొంతు బహుశ సావిత్రిదే కాబోలు.

"స్కూటర్ తీసుకొచ్చాడేం, వాడి వెనకాల నిన్ను కూచో పెట్టుకుపోతాడటనా? పోక పోయావా?ఎర్రగా బుర్రగా బాగానే ఉన్నాడు. అంత దగ్గరగా నిలబడి మాట్లాడందే వినపడదా వాడికి? పరాయి మగాడితో అంత దగ్గరగా నిలబడి మాట్లాట్టానికి సిగ్గు లేదు నీకు? మళ్ళీ పంతులమ్మవి, పదిమందికి పాఠాలు చెబుతావు కాబోలు, ఇవేనా ఆ పాటాలు?"

జీవితంతో ....'పోరాటం'

బిత్తర పోయింది సరోజ ఆ వాగ్బాటికి. సీత వైపు చూసింది. సత కూడా ఆలోచిస్తున్నట్లుగా కూర్చుంది.

చీమ చిటుక్కు మన్నా శబ్దం విన్పడేంత నిశ్శబ్దం ఆవరించుకుందక్కడ.

"నీకసలు బుద్ధుందా లేదా? ఈ రోజు ఫ్రెండ్‌తో సినిమా కెళ్ళాలని నా డ్రెస్ ఐరన్ చేసి ఉంచమని చెప్పానా? ఏది చెయ్యలేదుగా?' పొగరు, ఏమిటిలే, వీడు చెప్పింది చేయటమని కదూ?

'మీ స్నానం భోజనం పూర్తయే లోపల చేసిస్తాను. నిన్న వీలు కాలేదు'.

'ఎందుకౌతుంది? ఉద్యోగం వెలగబెడుతున్నావాయే చదువు కున్న దానివాయె, మొగుడి గుడ్డలు ఐరన్ చెయ్యటం నామోషి కాదూ!నీ బోడి జీతం లేక పోతే గడవదను కున్నావా?మానెయ్! అదొక వంక దొరికింది ప్రతి దానికీ....." (వినరాని తిట్టు)" గట్టిగా విన్పిస్తున్నాయి లోపలి నుండి మాటలు.

సీత అక్కడున్న పత్రిక చేతిలోకి తీసుకొని చూడసాగింది. చాలా సామాన్యంగా. సరోజకి చాలా సిగ్గుగా, ఎలాగో వుంది. గొంతు తగ్గించి "ఆవిడ భర్త ఇంట్లోనే ఉన్నాడులా ఉంది. మనం రాకూడని సమయంలో వచ్చాంలా వుంది' అంది.

సీత పత్రికలో ధర్మపథం కోసం వెతుకుతూ 'ఔను. పది గంటలకే బైటకెళతాట్ట తను శలవ రోజైనా. కాని ఈ రోజెందుకో ఉన్నాడులా వుంది. సావిత్రి వచ్చి నిన్ను పలకరించలేదని అనుకోకు. కాస్సేపటికి కాని బైటకి రాదు అమ్మయ్య. ఇదిగో ఇక్కడుంది" అంది సీత.

'ఏమిటి?'

'ధర్మపథం'.

'ష్! ఇదో మాలోకం. "విసుక్కుంది సరోజ. టేబుల్ మీది హిందూ తీసుకొని చూడసాగింది.

"ఆ షేవింగ్ సెట్ యిలా తగలెయ్యి. కాసని వేన్నీళ్ళు కూడా ! బాత్ రూమ్‌లో వెన్నీళ్ళు పెట్టావా?లేదా?' ఆ కంఠంలో కర్కశత్వం.

పాప హాల్లో కొచ్చి 'అత్తా! అమ్మ ఇప్పుడే వస్తానంది. మిమ్మల్ని కూర్చోమని చెప్పమంది. మంచినీళ్ళు కావాలా?' అడిగింది.

'ఆ! కాసిని తెచ్చి పెట్టవే? అన్నయ్యేడి?' అడిగింది సీత.

'దొడ్లో వాడి ఫ్రెండుతో ఆడుకొంటున్నాడు' టి. వి. వస్తుందిగా. పెట్టుకోలేదేం పాపా?' అడిగింది సరోజ.

'అమ్మో! నాన్నగారున్నప్పుడు టి. వి. గాని రేడియో గాని పెట్టటమే. అమ్మొక సారి రేడియో పెట్టిందని నాన్న బాగా తిట్టారు. అప్పటి నుండి మేమేం పెట్టుకోము".

"పాపా!' లోపలినుండి సావిత్రి కేక.

'అమ్మ పిలుస్తోందత్తా' లోపలికి వెళ్ళింది పాప.

'టి. వి. కొనుక్కుందెందుకు మరి చూడనప్పుడు?' ఆశ్చర్యంగా అడిగింది సరోజ.

సీత ధర్మపథం లోకి వెళ్ళింది మళ్ళీ. కొంచెం సేపటికి–

'అత్తా' పాప వచ్చింది. "అమ్మ నిన్ను , ఈ ఆంటీని రమ్మంటోంది' అంది.

'వద్దులే ఇక్కడే ఉంటాం' ఖంగారుగా అంది సరోజ.

సీత లేచి 'పద' అంటూ లోపలికి నడిచింది. ఆమె వెనకే భయం భయంగా వెళ్ళింది సరోజ.

"క్షమించండి. పనివేళకదూ! రాగానే పలకరించలేకపోయాను. రండి" అంది చక్కటి చిరునవ్వుతో సావిత్రి. మృదువుగా సభ్యతగా వున్న సంభాషణ, చక్కటి పర్సనాలిటితో తల దువ్వుకోకపోయినా వ్రేలి ముడితో కూడా చాలా అందంగా కన్పిస్తోందామె.

"నా ఫ్రెండ్ సరోజ. బ్యాంకిలో పని చేస్తుంది" అంది సీత.

'మా సావిత్రి. ఇక్కడి ఉమెన్స్ కాలేజీలో సైకాలజీ లెక్చరర్' అంది. పరస్పర పరిచయా లయ్యాక దొడ్లో బాదంచెట్టుకింద కుర్చీలు వేయించింది సావిత్రి. చెరో కప్పు కాఫీ యిస్తూ,

"ఆయనకి భోజనం పెట్టి పంపించి వస్తాను. ఏమనుకోకండి" అంది


'ఫర్వాలేదు. నీ పనులు కానిచ్చుకో' అంది సీత.

సావిత్రి హడావిడిగా లోపలి కెళ్ళింది. సరోజ కాఫీ తాగుతూ 'ఇది స్వంత ఇల్లేనా?' అడిగింది. కిచెన్‌కి ఎదురుగా ఉన్నాయి యిద్దరి కుర్చీలు.

'ఆ! మా అత్త సావిత్రికి కట్నం బాగానే ఇచ్చింది. ఆయన సావిత్రికన్నా తక్కువే చదివాడు. అయినా మగవాడు కదా! తప్పలేదు ఆడపిల్ల తండ్రికి. ఆ డబ్బు దాచిపెట్టి ఈ ఇల్లు కొన్నాడతను" అంది సీత సీరియల్ చదువుతూ.

'ఏం చేస్తారియన?'

"పి. డబ్ల్యు. డి. లో యు. డి. సి."



వైశ్యాబ్యాంకు ప్రైవేటు రంగంలో నెం.1 బ్యాంకు తన ఇతర ఘనతలని ప్రకటిస్తోంది

వైశ్యాబ్యాంకు - ప్రైవేటు రంగంలో నెం.1 బ్యాంకు, తన ఇతర ఘనతలని ప్రకటిస్తోంది. ప్రైవేటు రంగంలోని బ్యాంకులలో వైశ్యాబ్యాంకు అత్యధిక డిపాజిట్లతో ప్రథమస్థానం చేరుకున్నది.

ప్రప్రథమంగా ఖాతాదారుల సేవా విభాగం స్థాపించింది. నలభై లక్షల ఖాతాదారుల విశ్వాసాన్ని పొంది, వారి సేవకై ఆధునిక పథకాలూ, విధానాలూ ప్రవేశపెట్టిన ఘనత వైశ్యాబ్యాంకుదే.


ప్రప్రథమంగా ఖాతాదారుల బయిట ఊరి చెక్కులు, 7 రోజులలోగా వసూలు చేయుటకు తమ "మేఘదూత్ సర్వీస్" ప్రవేశపెట్టింది. వైశ్యాబ్యాంకు విశిష్టమైన గతం మరియు భవిష్యతులతో మధ్య తరగతి మానవునికి ఆశాకిరణంగా రూపొందింది. మొత్తం అడ్వాన్సులలో 40 శాతం అత్యవసర రంగాలకే కేటాయించడం ద్వారా, వైశ్యాబ్యాంకు మధ్య తరగతి వారిపట్ల తమకున్న ఆసక్తిని వ్యక్తపరుస్తోంది.

ప్రప్రథమంగా 1976 లో తమ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో కంప్యూటర్లు ప్రవేశపెట్టిన వైశ్యాబ్యాంకు, ఈ రోజు అనేక మహానగరాల్లోని తమ ముఖ్య బ్రాంచిలలో, ఎలక్ట్రానిక్ లెడ్జర్ పోస్టింగ్ మెషిన్లని ఉపయోగిస్తోంది.

ప్రప్రథమంగా ఎమ్.ఐ.సి.ఆర్. (మాగ్నెటిక్ ఇంక్ కారెక్టర్ రికగ్నిషన్) చెక్కులు, బొంబాయి, ఢిల్లీ, మద్రాసు, కలకత్తా నగరాల్లోని అన్ని బ్రాంచిలలోనూ, మరియు ఇదే రీతిలో గిఫ్ట్ చెక్కులు తమ అన్ని శాఖలలోనూ ప్రవేశపెట్టింది.

ప్రప్రథమంగా సంఘ సేవా విభాగాన్ని నెలకొల్పి రక్తదానం, నేత్ర చికిత్స క్యాంపులను ఏర్పాటు చేయడమేకాక, ఇతర విద్యా మరియు అభివృద్ధి పథకాలను కూడా ప్రోత్సహిస్తోంది.

ప్రప్రథమంగా, ప్రైవేటు రంగాల బ్యాంకులలో వైశ్యాబ్యాంకు, మర్చెంట్ బ్యాంకింగ్, ఎక్విప్‌మెంట్ లీజింగ్ మరియు క్రెడిట్ కార్డ్ రంగాల్లో త్వరలోనే ప్రవేశించనున్నది. అనునిత్యం అభ్యుదయ ఆశయాలతో, ఉన్నత అభివృద్ధికై నిర్విరామంగా కృషి చేస్తున్న వైశ్యాబ్యాంకు మరెన్నో ఘనతలలో ఇవి కొన్ని మాత్రమే. ఖాతాదారులకి సమయానుకూలమైన సేవలందించడంలోనే బ్యాంకు ఉద్యోగులందరూ అహర్నిశలూ లీనమైయున్నారు. ఖాతాదారుల అవసరాలను క్షుణ్ణంగా అవగతం చేసికొని, వారికందించిన సేవలూ, పొందిన ఆదరణలే ఈనాడు వైశ్యాబ్యాంకుకు, ఉన్నత ప్రథమ స్థాయిని చేకూర్చాయి.



ది వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీసు : అవెన్యూ రోడ్, బెంగుళూరు - 560 002.

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ : 72, సెయింట్ మార్క్స్ రోడ్, బెంగుళూరు - 560 001.

ఛైర్మన్ : రమేశ్‌గెల్లి.

'అతను అలా మాట్లాడతాడేం ఆవిడతో అంత వయసున్న భార్యతో అలాగేనా మాట్లాడేది? కొత్తగా సంస్కారం, సభ్యత లేనట్లుంది. పైగా మనం ఉన్నామనైనా ఆలోచించలేదు చూడు' అంది సరోజ.

'ఏయ్! ఇలారా?' మళ్ళీ ఉరుములాంటి కేక.

డైనింగ్ టేబుల్‌మీద గిన్నెలు పెడుతున్న సావిత్రి హాల్లోకి కాలు పరిగెత్తింది.

"నీ కెన్నిసార్లు చెప్పాలి? ఎక్కడి వస్తువు అక్కడుంచాలని? ఆ మాటంటే పిల్లలు పెట్టారంటావ్? ఆ! అసలు నీ కెప్పటికి బుద్ధొస్తుంది? ఆ! ఎంతకాలమే? ఎంతకాలమని చెప్పను. ఎప్పటికి తెలుసుకుంటావ్ నువ్వు? టేబుల్‌మీదుండాల్సిన పేపర్ కుర్చిలో ఎందుకుంది? నీ కా యూనివర్సిటీ వాళ్ళిలా ఇచ్చారో డిగ్రీ. తీసికెళ్ళి ఏ పొయ్యిలోనో వెయ్యరాదూ"

"అయ్యో! ఆ పేపరు నేనే చదువుతూ కుర్చీలో పెట్టాను. నా మూలంగా అనవసరంగా ఆవిడ మాటలు పడ్తోంది. ఖంగారుగా అంది సరోజ. ప్రాణం చివుక్కుమంది. అక్కడ కూర్చోవాలనిపించటం లేదామెకి. అతననే మాటలు వినలేకపోతోంది.

"ఈ మువ్వైన కన్నది ఛావదేం. తమరు తల సింగారిస్తూ ఏ డబ్బామీదో, వంటింట్లోనో, టి. వి. మీదో పెట్టుంటారా! తీసుకురాఛో? వెతుకు ఎక్కడుందో ఛ...... ఛ..... ఒక్క పని సక్రమంగా చెయ్యవు. నిన్న నీ ప్రయోజనం లేదుఛో" నీకి జన్మకి జ్ఞానం రాదు."

సావిత్రి గొంతు వినపడటంలేదు.

కొద్ది క్షణాలకి భోజనానికొచ్చాడతను.

సావిత్రి నేతి గిన్నెతో నిలబడిందక్కడ. ఆవిడ ఓర్పుకి, సహనానికి ఆశ్చర్యపోతోంది సరోజ.

"ఈ కూర ఇలా తగలడిందేం. ఉప్పులేదా కొంపలో? లేదా వాడితో వెనకాల కూచొని పోలేకపోతినే అన్న దిగులుతో మరిచిపోయావా ఉప్పెయ్యటం" ఛ..... ఛ..... వంట చెయ్యడం కూడా రాదు. నీకేం చేతనవును. ఇంక ఏడవటం తప్ప. 'మజ్జిగెక్కడుందో చెప్పు?'

"అయ్యో! అదేమిటి? కూర బాగోకపోతె పప్పుంది. చారు ఉంది. వేసుకోండి. అప్పుడే మజ్జిగా? ఏం తిన్నారని?"

'తిన్నది చాలు' విసురుగా మజ్జిగ గిన్నె మూత లాగేసి కంచంలో పోసుకున్నాడు. గబగబ తిని లేచిపోయాడు.

సావిత్రి టేబుల్ నానుకొని కొద్ది క్షణాలలాగే నిలబడింది. తేరుకొని అవన్నీ సర్దుతోంది.

సరోజ మౌనంగా చూస్తోందంతా. సీత ఇంకా పత్రికని వదలలేదు. కథ కాబోలు చదువుతోంది.

'ఇదిగో! ఈ పెట్టిలో డబ్బు తక్కువగా ఉందే?' అడిగాడతను.

'నిన్న పాపకి గౌను ఒకటి తీసుకున్నాను.' అంది సావిత్రి.

సలహా

మనిషి,
మమతల హృదితో
పయనం సాగించు
నీ బాధా గాథ తీరటానికి!
సమత సన్నిధిలో
శయనించు
నీ వెతల గతుల భారం పోవటానికి!
కాని
మత మౌఢ్యపు
కుల జాడ్యపు
గోడల్లో మాత్రం
తిరుగకు –
శిథిలం కాని
పదునైన శిలలవి
నీ అంతం చూసేదాక
నిన్నొదలవవి –

—దాకరపు బాబూరావు

జీవితంతో... 'పోరాటం'

'ఇలారా!' పిలిచాడతను. చేతులు కడుక్కొని లోపలి కెళ్ళింది సావిత్రి. అతని గొంతు కంచులా మోగుతోంది.

"నాకు చెప్పకుండా ఎందుకొన్నావే? ఎంతయింది?'

"నూట పాతిక"

"నూట పాతిక రూపాయలా? ఏది? ఇదేనా? ఈ వెలిసిపోయిన రంగు గౌనేనా? ఇది ఇరవై రూపాయలకంటే ఖరీదు చేస్తుందా? ఎవడో నీకు బాగా గుండు గీశాడు. వెలిసిపోయిందే యిది! సెకెండ్‌హాండ్ గౌన్లుంటాయే. అట్లా ఉంది. ఆ! నీ సొంత తెలివి తేటలుపయోగించొద్దని నీ కెన్నిసార్లు చెప్పాను. నువ్వు చేసే పన్లన్నీ ఇట్లాంటి..... (అక్కడొక బూతు మాట) సావిత్రి మాట్లాడలేదు. వినలేనట్లు చెవులు మూసుకొంది సరోజ.

"ఇంకా డెబ్బై రూపాయలుండాలే" ఆరాగా అడిగాడు.

'అవీ, అవి... నా కొలీగ్ ఒకామెకి చాలా అవసరమంటే ఇచ్చాను. ఫస్ట్ కిచ్చేస్తుంది.'

"ఎవణ్ణడిగిచ్చావ్? ఏం నీ దగ్గర అంత ఎక్కువగా డబ్బు మూలుగుతోందా? నాకు చెప్పకుండా ఒక్కపైసా ఖర్చుపెట్టినా ఊరుకోనని, ఎముకలు విరగబొడుస్తానని తెలుసుగా. తెలిసి ఇచ్చావంటే నువ్వెంత తెగించిన దానివో ఇంకాలోచించాలి.' సంపాదిస్తున్నాను. విడికి చెప్పేదేంటిలే అనికదూ! ఖబడ్దార్! పాతేస్తానేమనుకున్నావో! నాకు చెప్పకుండా ఏమన్నా చేశావంటే.

'అదేం కాదండి. పాపం చాలా ఇబ్బందిలో ఉందావిడ ఇంటికొచ్చి అడిగితే కాదనలేకపోయాను'

'ఔను మరి. నీది జాలిగుండాయె. వచ్చే నెల దానిదగ్గర ఆ డెబ్బై రూపాయలు తీసుకొని నీ రిక్షా ఖర్చులకి వాడుకో, వచ్చే నెల నీకు డబ్బిచ్చేదిలేదు అసలు నీకెన్నిసార్లు చెప్పినా బుద్ధిరాదేం. నాకు చెప్పకుండా ఏ పని చెయ్యకు. బట్టలు ఐరన్ చేశావా?

'ఆ'

'ఆ వచ్చిందెవరు?'

'మా సీత. దాని ఫ్రెండు'

'ఎందుకొచ్చారు?'

'ఊరికెనే. చూట్టానికి'

"ఏముంది చూసేందుకు? పనిపాటలేదు. రోడ్లు పట్టుకు తిరిగేందుకు'

సరోజ మొహం కందగడ్డలా అయింది. 'సీతా నీకు బుద్ధిలేదే, ఇలాంటివాళ్ళ కొంపకి తెచ్చేవే నన్ను? ఛీ ఇంకెప్పుడూ నీతో రాను'

సీత పత్రిక చదవటంలో లీనమై బాహ్య ప్రపంచాన్నే మరిచిపోతుంది. 'ఆ! ఏమిటి? అంది చివరి మాట బుర్రకెక్కగా.

'ఏం సీతా! బాగున్నారామ్మా!' దొడ్లోకొచ్చాడతను. అతను రాగానే ఇద్దరూ లేచారు.

'ఆ!' అంది సీత.

'మీ ఆయన్ని పిల్లల్ని కూడా తీసుకు రాకపోయావా?'

'ఆ ! ఆయనకి వీలుకాదులెండి. మీ వాళ్ళంతా బాగున్నారా! ఉత్తరాలొస్తున్నాయ్యా!'

'ఆ' అంతా బాగానే ఉన్నారు. ఈమె.

'ఈమె నా ఫ్రెండ్ సరోజ. బ్యాంకిలో పనిచేస్తోంది.

'అలాగా. నమస్కారం కూర్చోండి. అరె నిలబడే ఉన్నారేం! అయినా లోపలికొచ్చి కూర్చోకపోయారా ఎండగాలేదూ?

ఆశ్చర్యంలోంచి తేరుకొంది సరోజ. అతను ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నాడు.

'మీ ఆయన ఇప్పుడు బాగున్నాడా సీతా? నిన్నేం తిట్టట, కొట్టటంలేదుకదా! తాగుడు పేకాట్ల అన్నీ మానుకున్నట్లేనా? ఇంకా సాగిస్తున్నాడా?

'ఇప్పుడలాంటివేంలేవు. బాగానే ఉన్నారు' అంది సీత కించపడుతూ.

'బాగుంటేసరే. మళ్ళీ అటువైపు వెళితే చెప్పు నా ఫ్రెండొకడు పోలీసు డిపార్టుమెంటులో పని చేస్తున్నాడు. మూణ్ణిముషాల్లో మూయిస్తా నాలుగు రోజులు జైల్లో వుంటే తెలుస్తుంది'

'డాడీ! నీకోసం ఎవరో వచ్చారు' అంది పాప.

'మీ అమ్మ మాట్లాడుతోందా?' అన్నాడు. వెనక్కి తిరిగేసరికి సావిత్రి పిల్లలకి కంచాల్లో అన్నం పెడుతూ కన్పించింది 'వెళ్తున్నా! సీతా! పనుంది అప్పుడప్పుడు వస్తుండండి' అని వెళ్ళిపోయాడు.

'పద లోపలికెళదాం' అంటూ లోపలి వైపుకి నడిచింది సీత. అక్కడింక ఒక్కక్షణం కూడా వుండాలనిలేదు సరోజకి 'పోదాం సీతా' అంది. సావిత్రి కళ్ళు ముక్కు ఎర్రగా ఉన్నాయి. ఆమె ముఖంలో అవమానం ఆత్మన్యూనతా తాలూకు చిహ్నాలు తమకేసి చూడకుండా మాట్లాడిస్తున్నాయి.

వంట. మి రొచ్చారేగాని నాకు మాట్లాడేందుకే పిలుకాలేదు. ముందు భోంచేద్దాం అంది కంచాలు పెడుతూ.

'పద్పండి!" మొహమాటపడ్తూ అంది సరోజ.

చివరికి సావిత్రి. సీత బలవంతంతో భోంచెయ్యక తప్పిందికాదు. అతను కూర ఎందుకంత అసహ్యించుకున్నాడో గాని చాలా బాగుంది సావిత్రి అమృతహస్తం అన్పించింది. భోజనం చేశాక కాస్సేపు కాలేజీ కబుర్లు చెప్పింది సావిత్రి. ఆమెను తన ఇంటి కాహ్వానించింది సరోజ నాలుక్కావటంతో బైటపడ్డారిద్దరూ. దారిలో.

"మి ఆయన్ని గురించి అలా మాట్లాడ్తాడేం. తనకెందుకు? ఇంట్లో పెళ్లాన్ని గౌరవించటం చేతకాదు. ఆవిణ్ణి మాటలతో హింసిస్తూ ఎదుటి వాళ్ళ సంసారం గురించి సలహాలు ఇస్తున్నాడు. నిజంగా నాకతనంటే చాలా అసహ్యంగా వుంది. ఆవిణ్ణి చూస్తే చాలా ఆశ్చర్యంగా వుంది. అంత విద్యాధికురాలు అసలిన్ని మాటలెలా అతనితో పడుతుందో నాకర్థం కావటంలేదు. పురుగును విదిలించినట్లు విదిలిస్తాడేం మనిషిని? ఎదుగుతున్న పిల్లల ఎదుట తల్లినలా అగౌరవపరుస్తూ మాట్లాడితే తల్లిపట్ల వాళ్ళ కెలాంటి తేలికభావం ఏర్పడుతుందో తెలుసా? వాళ్ళామెని లెక్క చేస్తారా? అదిగాక అలాంటి వాతావరణంలో పెరిగే పిల్లలు ఎలా తయారౌతారో బాబోయ్ తలుచుకొంటే భయమేస్తుంది. నెలకి పదిహేను వందలు సంపాదించుకొనే ఆమెకి పిల్లకి గౌనుకొనే స్వాతంత్రంలేదా? ఫ్రెండుకి అప్పిచేందుకు వీల్లేదా? అన్నిటికీ లెక్కలు చెప్పాలా? అయినా అబ్బ! ఎంత అనుమానం మనిషి? అంత అనుమానప్పనుగుతో ఆవిడ ఎలా కాపురం చేస్తోందో గానీ. ఎంత అసభ్యంగా మాట్లాడ్తాడు! అవతల మనం ఉన్నామన్న ఇంగిత జ్ఞానమైనాలేదు. మనల్ని గురించి కూడా ఎలా అన్నాడో విన్నావా? ఇంకెప్పుడు నన్నిలాంటి కొంపలకి తీసుకురాకు. దరిద్రపుమనిషి. అరే-పేపర్ అవతల పెట్టారని ఎన్నిమాటలన్నాడు? రోజూ యింతేనా? లేక మనం వచ్చామని తన దర్పాన్ని ప్రదర్శించాడా? ఎంత శాడిజం. ఇలాంటి మనిషితో వేగుతున్న ఆవిడ సహనం కాదు కాదు ఆవిడ చేతకానితనం అనాల్సిందే. ఇతనికంటే మి ఆయనే నయమన్పిస్తోంది నాకు. కోపమొస్తే నాలుగుబాది అది తాగితేనే పాపం తర్వాత మళ్ళీ ప్రాణం ఒకెత్తులా చూసుకుంటాడు. అనుక్షణం మాటలతో అవతలి వ్యక్తిని చిత్రహింసపెట్టి ఆనందపడే ఈ రకం మనుషులు కూడా ఉంటారా! అబ్బ! ఎంత భయంకరమైన మనిషి? పైకి చూడు ఎంత మర్యాదగా మాట్లాడాడో! పాపం ఆవిడ మనవైపు చూసేందుకే అభిమానపడింది. మనం విన్నామని ఆవిడ ఎంత బాధపడుతుందో!'

"మరి! ఆ రోజు నువ్వేమన్నావ్! ఆర్థికస్వాతంత్ర్యంగల స్త్రీ సుఖపడుతుందంటివే నాకంటే సుఖపడుతోందా

ఇ·వేమన·పద్యాలు




సావిత్రి నేనాయన తాగికొట్టిన రోజే బాధపడ్తాను కాని సావిత్రి క్షణక్షణం... అతని మాటలకి చిత్రహింసలు పడుతోంది. మనిషిని ప్రత్యేకంగా కాల్చనక్కరలేదు. మాటలు చాలవూ, దాని కర్మ అలా వుంది. ప్చ్! అంతే దాని జీవితం. నాకందుకే తనంటే జాలి. మా బంధువుల్లో బాగా చదువుకున్నది పెద్ద ఉద్యోగం చేస్తున్న ఆడపిల్ల అదొక్కర్తే. అందుకే అదంటే మా అందరికి ఎంతో ప్రేమ. అభిమానం. కాని దాని జీవితం మటుకు మా జీవితాలకంటే అధ్వాన్నంగా తయారైంది. ప్చ్! దానికి తెగింపులేదు. జీవితంతో పోరాటం అలా సాగిస్తూనే ఉంది.

"అలా అనకు సీతా! ఏదిశ్ఛతిమించరాదు. భీతితో పారిపోయే కుక్కను తరిమి తరిమి కొట్టామనుకో దానిక్కాస్త ఆసరా దొరికినా వెనక్కి తిరిగి ఎదురు తిరిగిందంటే ఎంతమందినైనా ఇట్టే ఎదిరిస్తుంది తెలుసా! ఆవిడ ఓర్పు సహనం అగ్నిపర్వతంలాంటిపి అవి ఏదో ఒకనాడు భరించలేని వేళ బ్రద్దలవకమానవు. అప్పుడతను అందులో కొట్టుకు పోక మానడు. చూస్తుండు' అంది సరోజ.

కోట్ల కర్చుతో గడ్డాఫీకి సానుభూతి !

న్యూఢిల్లీ లేఖ




డా. జయదుబాషి

ఇటీవలి తటస్థ రాజ్యాల సమావేశానికి ఎంత అయిందన్నది నాకు తెలియదు కాని ఎంతో డబ్బు వృధా అయిందని మాత్రం నిస్సందేహంగా చెప్పవచ్చు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ తమాషాకి అయిన కర్చుని పన్ను కట్టే పేద భారతీయుడు ఎందుకు పెట్టుకోవాలన్నదే నాకు అర్థం కాని విషయం. ఆ సమావేశం ప్రధానోద్దేశం లిబియాకి చెందిన ఆ ఉన్మాదుడైన వ్యక్తిని రక్షించడానికి ప్రయత్నించటమే. తమకి మరోపూట తిండి ఎక్కడనుంచి వస్తున్నదో తెలియని కోట్లాది భారతీయులు-ముఖ్యంగా దక్షిణాది కరువు ప్రాంతాలలోని వారు-ఇక్కడ ఉన్నారు కానీ ప్రభుత్వం గడ్డాఫీకి ఏం జరుగుతుందో అని మథన పడుతున్నది. ఆపాటి శ్రద్ధ ప్రభుత్వానికి తన ప్రజలమీద లేదు. గడ్డాఫీ నిక్షేపంగా ఉన్నాడు. జరగవలసినదే ఆయనకి జరిగింది. మరో విధంగా చెప్పాలంటే ఆయనకి జరిగింది ఆయనకి తగినటువంటిదే. ప్రతి తీవ్రవాదికి అతనికి తగినట్లే జరుగుతుంది. గడ్డాఫీ తన గుడారంలో కొంతకాలం దాక్కొని ఉండి మళ్ళీ అదే ఊపుతో తిరిగి బయటికి వస్తారు. ఉన్మాదంలో ఉన్న ఎలాంటివాడైనా తెలివి తక్కువగా ఉంటాడని నేననుకోను. గడ్డాఫీ మనుషులు అమెరికా విమానాన్ని స్వాధీనం చేసుకోటమో, లేక బ్రిటిష్ వారిని బందిగా పట్టుకోటమో ఎంతో దూరంలో లేదని నాకు అనిపిస్తున్నది.

నా బాధ అంతా గడ్డాఫీ గురించి కాదు, అంత భారీగా కర్చు పెట్టి ఢిల్లీలో తటస్థ దేశాల సమావేశంవారు చూపిన సానుభూతి గురించి కాదు. నా బాధ అంతా ఇదంతా మన కర్చుతో జరుగుతున్నదని. గడ్డాఫీ హంతకుల కోసం భారీగా కర్చు పెడుతున్న డబ్బు కూడా మనదే. చమురు ధరలు విపరీతంగా పెరిగిపోవటంతో వచ్చిన డబ్బు గడ్డాఫీని ఆవిధంగా తయారు చేసింది. అంతకుముందు ఆయన పావురంలాగా ఎంతో నెమ్మదిగా ఉండేవాడు. లిబియా నుంచి వచ్చే చమురుని గత పదిహేనేళ్ళుగా విపరీతమైన వెలకి మనం కొనుక్కుంటున్నాము. అలా మనం ఇచ్చిన డబ్బే ఆయన, ఆదేశాలలోని అతనివంటి మరికొందరు తమ శత్రువులపై ప్రయోగించడానికి ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తున్నారు. గడ్డాఫీ సహాయంతో జియా తయారు చేస్తున్న ఇస్లామిక్ బాంబు మన డబ్బుతోనె తయారవుతున్నది. పశ్చిమ దేశాలలో, మరికొన్నిచోట్ల లిబియా నిర్వహిస్తున్న హంతకుల రాయబార కార్యాలయాలు కూడా మన డబ్బుతోనే నడుస్తున్నాయి. ఛాద్‌పై దాడి మన డబ్బుతోనే నిర్వహింపబడింది. ఇలా చెప్పుకుపోతూ ఉంటే దానికి అంతు ఉండదు. అయినా తనకి సానుభూతి, మద్దతు కావాలని మనని అడుగుతున్నాడు – తనేదో పుచ్చుకునే స్థితిలో ఉన్నట్లు.

తగని వ్యక్తులని అడగటం ఆయన దురదృష్టం అనే చెప్పాలి. తటస్థ రాజ్యాల సమావేశంలో సగం దేశాలు దుండగులచేత నడుపబడుతూ ఉంటే మిగతా సగం దద్దమ్మలచేత పాలింపబడుతూ ఉన్నాయి. లిబియాలో గడ్డాఫీలాగే జింబాబ్వేలో ముగాబే ఉన్నారు. ఆయన ఒక క్రమ పద్ధతిలో తన స్వంత ప్రజలనే ఊచకోత కోస్తున్నాడు. తన జాతివారు కాక మిగతా జాతుల వారిని, వారి నాయకులని అంతం చేస్తున్నాడు. ముగాబే అధికారంలోకి వచ్చిన మూడేళ్ళుగా ఇదే జరుగుతున్నది అక్కడ. ఈయనే తటస్థ దేశాల సమావేశం ఆధిపత్యాన్ని భారతదేశం నుంచి అందుకోబోతున్న వ్యక్తి! ఈసారి ఆయన ఢిల్లీ వచ్చినప్పుడు తప్పకుండా మనకి ప్రజాస్వామ్యం, సమానత్వం, ఐక్యతలపై ఉపన్యాసాలు ఇస్తారు. తృతీయ ప్రపంచ దేశాలు అనబడే వాటిలో ఉన్న పేదల కోసం కాస్త కన్నీరు కార్చి తిరిగి వెళ్ళి తమ ఊచకోత పథకాన్ని కొనసాగిస్తారు. ఇథియోపియాలో పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయి. ఆదిమ జాతుల పోరాటం తీవ్రంగా ఉన్నది. ఆ ప్రభుత్వం ఆహారం, వస్త్రాల సహాయాన్ని వారు వేరే తెగకి చెందినవారన్న కారణంగా మృత్యుముఖంలో ఉన్న కొంతమంది ప్రజలకి బాహాటంగానే నిలిపి వేసింది. అయినా ఇథియోపియా తటస్థ దేశాల సమావేశం గౌరవ సభ్యురాలే. దానికి కూడా ముగాబే, ఆ భాగంలోని మిగతాచోట్ల ఉన్న ఆయన తొత్తులకి ఉన్నంత గౌరవం లభిస్తున్నది. కానీ ఈ దుండగులందరూ ఇక్కడికి వచ్చినప్పుడు మనం వాళ్ళని రాష్ట్రపతి భవనంలో ఉంచి, వాళ్ళకోసం కోట్ల రూపాయలు కర్చు పెడతాము. ఆ డబ్బంతా ప్రపంచంలోని అతి పేద దేశాలలో ఒకటైన మన ప్రజల నోటి దగ్గరనించి తీసుకున్నటువంటిదే. నేపాల్, బంగ్లాదేశ్‌లని మినహాయిస్తే ప్రపంచ బాంకు నివేదిక ప్రకారం మనది ప్రపంచంలోని అతి బీద దేశం.

మనం ఎందుకు అలా చేస్తాము? దానికి ఒక కారణం ఉన్నది. నా అనుమానం ఏమిటంటే ప్రతి తృతీయ ప్రపంచ నాయకుడూ ముగాబే లేదా గడ్డాఫీ లాంటివాళ్ళమనుకుంటారు. దానికి కారణం ఆ



దేశాలలో ఎక్కువచోట్ల ప్రజాస్వామ్యం అన్నది చాలా పలుచనైన పొరలాంటిది. అలాగే అధ్యక్షుడికి, ప్రధానమంత్రికి, నియంతకి మధ్య ఉండే తేడా కూడా చాలా స్వల్పంగానే ఉంటోంది. శ్రీమతి గాంధి ఎంత తేలికగా రాత్రికి రాత్రే మారిపోయి దాదాపు లక్షమందిని జైళ్ళలో పెట్టించి ఈ దేశాన్ని ఒక సువిశాలమైన ఖైదీల శిబిరంగా మార్చారో చూడండి. పెద్దలంతా దానికి కిక్కురుమనలేదు. సామాన్య ప్రజలే తిరగబడి ఆమెని దించివేసారు కానీ తాతాలు, బిర్లాలుకాదు, ప్రముఖ న్యాయవాదులు, విజ్ఞాన శాస్త్రవేత్తలుకాదు. వారిలో చాలామంది ఇంకా ఆమెని పొగుడుతూనే ఉన్నారు. ప్రపంచంలోకెల్లా బహుశ భారతదేశంలోనే అవినీతి నిండిన సంపన్న వర్గం ఉన్నదనవచ్చు. అధికారం, డబ్బుతో అవినీతికి పాల్పడే ఆ వర్గం తన ప్రయోజనాలు పరిరక్షింపబడితే దేనితోనైనా సర్దుకుపోవటానికి సిద్ధమవుతుంది. జింబాబ్వేలోని ముగాబే అయినా, ఆ మాటకివస్తే లిబియాలోని గడ్డాఫీ అయినా వాళ్ళకి అభ్యంతరంలేదు. కాబట్టే భారతదేశంలో శ్రీమతి గాంధి అయినా ఫర్వాలేదన్నారు. రేపు రాజీవ్‌గాంధి కూడా తమ తల్లిలాగే మారితే ఈ తాతాలు, బిర్లాలు, మోడీలు, గోయంకాలే తమ టోపీలని గాలిలోకి ఎగరేసి పదకొండు సంవత్సరాల క్రితం చేసినట్లే చేస్తారు. స్తోత్ర పాఠాలు వల్లెవేస్తారు.

మంచి ప్రభుత్వాలు, చెడ్డ ప్రభుత్వాలు అనే రెండు రకాల ప్రభుత్వాలే ఉన్నాయి. తన ప్రజలని హతమార్చే ప్రభుత్వం చెడ్డది. అది అలా చెయ్యటానికి చాలా మంచి కారణాలే ఉండవచ్చు. కానీ అలాంటి పరిస్థితులు కల్పింపబడటానికి అవకాశం కల్పించిన బాధ్యత చివరికి ప్రభుత్వానిదే అవుతుంది. స్టాలిన్ లక్షలాది తనదేశ ప్రజలని హతమార్చాడు. ఇవాళ సోవియట్ రష్యా గురించి చెప్పాలంటే ఎవరికైనా ఆ ఊచకోతే జ్ఞాపకం వస్తుంది. అంతే కానీ ఆ దేశం ఎంత విద్యుత్తుని ఉత్పత్తి చేస్తుంది, ఎన్ని ట్రాక్టర్లని ఉపయోగిస్తుందన్నది గుర్తురాదు. గడ్డాఫీ తన స్వంత ప్రజలని చంపటంతో ప్రారంభించి అంతటితో తృప్తిపడక బయటదేశాలలోని ఇతరులనికూడా హతమార్చటం మొదలుపెట్టాడు. ఒక ప్రభుత్వాధినేత అలా ప్రవర్తించటం అన్నది క్షమార్హంకాదు. తమదేశం సార్వభౌమాధికారంపై జోక్యం చేసుకుంటున్నారని చెబుతున్న మాటలన్నీ కృతకమైనటువంటివి. ఒక దేశం సార్వభౌమాధికారం సమగ్రంగా ఎప్పుడూ ఉండదు. తాము రూపొందించిన చట్టాలని తామే ఉల్లంఘించినప్పుడు సర్వసత్తాక ప్రతిపత్తి అన్నది హాస్యాస్పదమే అవుతుంది. లిబియాకాదు సర్వసత్తాక ప్రతిపత్తిగల దేశం, ఆ దేశంలోని ప్రజలకే అది ఉంటుంది. మీరూ, నేనూ సర్వసత్తాక ప్రతిపత్తి గలవారం కనుకనే భారతదేశం సర్వసత్తాక ప్రతిపత్తిగల దేశం అయింది. □

ఆర్గనైజర్ పై ఫిర్యాదు పరిష్కారం

సిక్కు సమాఖ్యకి చెందిన శ్రీ జె.ఎస్. అరోరా 1985 జూన్ 5న ప్రెస్ కౌన్సిల్‌కి చేసిన ఫిర్యాదులో ఆర్గనైజర్ సంపాదకుడు తమ వారపత్రిక 26 మే 1985 సంచికలో 'సిక్కుల సమస్య' అనే శీర్షిక కింద శ్రీ జయ్‌దుబాషి రాసిన వ్యాసాన్ని ప్రచురించడం ద్వారా రెండు మతాలకి చెందిన వారి మధ్య ద్వేషాన్ని సృష్టించే ప్రయత్నం చేసారని, అది రాజ్యాంగం యొక్క ప్రజాస్వామ్య లౌకిక తత్వానికి విరుద్ధమని ఆరోపించారు. అభ్యంతరకరమైనవిగా తాము భావించిన కొన్ని భాగాలని కూడా వాది స్పష్టంగా సూచించారు. అభ్యంతరకరమైన భాగాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి :

"లండన్‌లోని హీత్రూ విమానాశ్రయంలో ఊడ్చే పనిచేసే ప్రతి స్త్రీ సర్దారిణియే."

"పది లేదా పదిహేను సంవత్సరాలకి ముందు ఆమె, లేదా ఆమెకి సంబంధించినవారు, పంజాబ్ నుంచి లండన్ రాకపూర్వం, పేదవారైతే కావచ్చు, కానీ గర్వించదగిన, నిండైన ఆత్మగౌరవం గల ఒక సిక్కు కుటుంబానికి పెద్దగా ఉండేది. ఇప్పుడు ఆమె ఆ విమానాశ్రయం నేలని తుడుస్తూ, సిగరెట్ పీకలని, ఖాళీ కాఫీ కప్పులని ఏరుతూ, వచ్చేపోయే ప్రతి ఇంగ్లీషు వ్యక్తికి సలాములు చేస్తున్నది. తాను వేరుగా చూడబడుతున్నట్లు ఆమె భావిస్తున్నదా?"

ఆ ఫిర్యాదుని జాగ్రత్తగా పరిశీలించిన మీదట గౌరవనీయులైన ఛైర్మన్ ఈ విషయంలో విచారణ జరపటానికి తగిన ఆధారాలు ఉన్నాయన్న ఉద్దేశంతో 1979 ప్రెస్ కౌన్సిల్ నియమావళి ననుసరించి ఆ సంపాదకునికి నిబంధన 5(1) ప్రకారం నిబంధన 6 కింద వ్రాత పూర్వకమైన సమాధానాన్ని దాఖలు చేయవలసిందిగా నోటీసు జారి చేయవలసిందిగా ఆదేశించారు.

ఆ సంపాదకుడు తమ లిఖితపూర్వకమైన సమాధానంలో, అధిక్షేపణకి గురి అయిన ఆ వ్యాసంలోని భాగాలలో అసందర్భమైనది ఏదీ ప్రచురింపబడలేదని అంటూ, ఫిర్యాది నుంచి ఆ వ్యాసం ప్రచురింపబడటంపై ఆక్షేపణ తెలుపుతూ వచ్చిన ఉత్తరం తమకు అందిన వెంటనే జూన్ 16, 1985 సంచికలోని 'సంపాదకుడికి లేఖలు' శీర్షికలో ఆ ఉత్తరం సారాంశాన్ని తమ "నిష్కపటమైన క్షమాపణ"లతో సహా ప్రచురించామని విన్నవించారు. సంపాదకుడినుంచి అందిన లిఖితపూర్వకమైన సమాధానం కాపీని వాదికి పంపుతూ కౌన్సిల్ ముందు ఉన్న తమ ఫిర్యాదు విషయంలో ఆయన ఇంకా పట్టుబడతారా అన్న విషయాన్ని కౌన్సిల్ తెలుసుకోగోరుతున్నదని కోరటం జరిగింది. దానికి సమాధానంగా వాది ఆ సంపాదకుడు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని, ఆ లేఖని పూర్తిగా కాకుండా ఒక భాగాన్ని మాత్రమే ప్రచురించడం జరిగిందని, ఆ కారణంగా ఫిర్యాదు విషయంలో తాము ఇంకా పట్టుదలతోనే ఉన్నామని అన్నారు.

న్యూఢిల్లీలో 28 అక్టోబరు 1985 న జరిగిన విచారణ సంఘం సమావేశం ముందు ఈ విషయాలన్నిటినీ ఉంచటం జరిగింది. వాది తరఫున సిక్కు సమాఖ్య సంయుక్త కార్యదర్శి శ్రీ గుర్‌ముఖ్‌సింగ్ జీత్, సిక్కు సమాఖ్య సభ్యుడు శ్రీ ఆర్. ఎస్. ఛత్వాల్, ప్రతివాదులుగా సంపాదకుడు శ్రీ వి. పి. భాటియా, ఆర్గనైజర్ ప్రత్యేక ప్రతినిధి శ్రీ ఆర్. సి. బటూరియా ఆ సమావేశానికి హాజరైనారు.

ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత, రికార్డులలోని విషయాలని పరిశీలించినమీదట వివాదానికి దారి తీసిన ఆ వ్యాసం వాస్తవంగానే ఉత్తమాభిరుచి గలదిగా లేదని, సిక్కుల మతపరమైన విశ్వాసాలని అది గాయపరచేలా, హింసని ప్రబోధించే విధంగా ఉందని కమిటీ అభిప్రాయపడింది.

సంపాదకుని క్షమాపణలు


విచారణ సంఘం అధ్యక్షుడు, సభ్యుల సలహా మేరకి ఇరుపక్షాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. దానిని రికార్డు చేసారు. ఆ ఒప్పందాన్ని అనుసరించి సంపాదకుడు తమ సంచిక ఒకదానిలో ఈక్రింది విధంగా ప్రచురించాలి :

"ఆర్గనైజర్, జూన్ 5, 1985 సంచికలో ప్రచురింపబడిన 'సిక్కుల సమస్య' అనే శీర్షిక గల వ్యాసం సిక్కుల, ముఖ్యంగా సిక్కు జాతికి చెందిన మహిళల విశ్వాసాలని గాయపరిచింది కాబట్టి దానిని ప్రచురించినందుకు సంపాదకుడు క్షమాపణలని కోరటమైనది."

ఈవిధంగా ప్రెస్ కౌన్సిల్ ఆ ఫిర్యాదుని రాజీ పద్ధతిలో పరిష్కరించింది.

(23-12-85 న తీర్పు ఇవ్వబడినది.)

□



సీరియల్

జీవితం చేజారిందా?

కాకాని కమల

(గత సంచిక తరువాయి)

సీత కాపురానికి వచ్చిన కొత్తల్లో ఒక చిన్న సంఘటన జరిగింది.

అది కావటానికి చాలా చిన్న సంఘటనే కాని సీత గుండెకి కనిపించని పెద్ద గాయాన్ని చేసింది.

మనసులో చీకట్లని సృష్టించింది.

ఆరోజు.........

★ ★ ★ ★ ★

సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది.

సుబ్బులు పని ముగించుకొని వెళ్ళిపోయింది.

రంగా తోటపనిలో వున్నాడు.

సీత హాలులో కార్పెట్ మీద పిల్లలిద్దర్ని దగ్గర కూర్చోపెట్టుకుని ఆడిస్తోంది.

వాళ్ళ ముందు రకరకాల బొమ్మలు పేర్చి వున్నాయ్.

మంజు ఆట వస్తువులు అవన్ని.

ఒక పెద్ద అట్ట పెట్టి నిండా పెళ్ళి బొమ్మల సెట్ అది. ఒకసారి ప్రభాకర్ వ్యాపార నిమిత్తం జపాన్ వెళ్ళినప్పుడు అక్కడ్నుంచి కూతురుకోసం ప్రత్యేకంగాఆ బొమ్మలసెట్ తీసుకొచ్చాడు. బొమ్మలు చక్కటి నగిషి పనితనంతో చాలా అందంగా పొందికగా వుంటాయి.

... చిన్న కల్యాణ మండపం.

చుట్టూతా రంగురంగు బల్బుల తోరణాలు.

మండపంలో పెళ్ళికూతురు – పెళ్ళికొడుకూ బొమ్మలు... పల్చటి జరి దుస్తుల్లో మేలి ముసుగులో అలంకరించబడివున్నాయి.

వాళ్ళిద్దరికి చేరువగా మంత్రాలు చదివి పెళ్ళి జరిపించే పురోహితుడు.

చుట్టు రకరకాల దుస్తుల్లో... ఆడ మగ పెళ్ళి పెద్దలు.... పిల్లల బొమ్మలు. మధ్య మధ్య ట్యూబ్‌లైట్లు ఎత్తిపట్టుకున్న పనివాళ్ళ బొమ్మలు

వాళ్ళకి కాస్త దూరంగా ఎర్రటి యూనిఫారంలో వున్న బ్యాండ్ మేళం...

అన్నింటికి కీ ఇస్తే చాలు... టైమ్ పంక్చుయాలిటిగ వేటి పని అవి చేస్తాయి.

"ఢమ్. . ఢమ్..." అంటు బ్యాండ్ మ్రోగుతుంది.

సన్నాయి పాడుతుంది.

"ఓం" అంటు మంత్రాలు వినిపిస్తాయి.

లైట్లు గప్పుగప్పున వెలిగి ఆరి వెలిగి ఆరి కాంతులు విరజిమ్ముతాయి.

పెళ్ళి బొమ్మల తలలు, కనుగుడ్లు, పెదవులు తమాషాగా కదులుతాయి.

ఆ బొమ్మల సెట్ ఫారిన్‌ది. దాని ఖరీదు కూడా ఎక్కువే.

ప్రభాకర్ పిల్లలకోసం అలాంటివి చాలా కొన్నాడు.

సీత పిల్లలిద్దర్ని చెరో ప్రక్క కూర్చోపెట్టుకుని ఆ బొమ్మల సెట్ "ఆపరేట్"చేసి అత్యంత కుతూహలంగా చూస్తుంది.

మంజు దగ్గర వున్న బొమ్మలన్నింటిలోకి సీతకి ఆ బొమ్మలసెట్ అంటే చాలా ఇష్టం.

నిజానికి అలాంటి ఖరీదయిన బొమ్మలు ఆమె ఇంతవరకు ఎన్నడూ చూసి ఎరగదు. అవటానికి అవి పిల్లల ఆట వస్తువులే.

కాని అద్భుతంగా వుండి పెద్దల్ని కూడా అలరిస్తాయి.

సీతకి ఇంటిపని చాలా తక్కువ.

పిల్లల్ని చూసుకోవటమే ఆమెకి పెద్ద బాధ్యత.

అందుకే మంజులతోపాటు తను కూడా చిన్న పిల్లలా ఆ బొమ్మల పెళ్ళి చేస్తుంది.

ఆ జపాన్ బొమ్మలు "కీ" ఇచ్చినప్పుడల్లా తమాషాగా చేతులు తిప్పుతూ ఆడుతుంటే ఆమెకి చాలా ఆనందం అనిపిస్తుంది. ప్రాణం లేని ఆ బొమ్మలు ప్రాణమున్న వాటికంటె ఎక్కువగా అలరిస్తాయి.

ఒకోసారి ఆ ఇంటి వైభవాన్ని చూస్తుంటే సీతకి "కల" లా అనిపిస్తుంది. మంజు బొమ్మల సెట్టే ఎంతో అద్భుతం!

సీత నిజమైన పెళ్ళి అందులో నాల్గవవంతు వైభవంగా కూడా జరగలేదు.

కాని ఆ ఇంట్లో బొమ్మల పెళ్ళి మాత్రం ఎంతో ఆర్భాటంగా జరుగుతూంది.

"బహుశా సంధ్యా – ప్రభాకర్‌ల వివాహం కూడా ఇలాగే అత్యంత వైభవంగా వేడుకగా జరిగి వుంటుందా?" అనిపిస్తుంది.

ఆలోచన్ల మధ్యే తలదించుకొని దీక్షగా బొమ్మల్ని తిలకిస్తున్న సీత ఒక్కసారిగా త్రుళ్ళిపడినట్లు అయ్యింది.

మత్తయిన విదేశీ సెంటు పరిమళం సీతని ఒక్కసారి చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేసింది.

జరిగిన కథ –7 ప్రభాకర్ మొదటి భార్యకి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సిత అందరికి నచ్చింది. ప్రభాకర్ తను తన పిల్లల కోసమే ఈ పెళ్ళి చేసుకుంటున్నానని, భర్తగా సీతకు న్యాయం చేకూర్చ లేనేమోనని ఆమెతో చెపుతాడు. సిత ఏమైనా సరే ఈ పెళ్ళి చేసుకోనని ఇంట్లో చెప్పాలని నిర్ణయించు కుంటుంది. కాని పరిస్థితులతో తల ఒగ్గిన సీత పెళ్ళి ప్రభాకర్‌తో జరిగి పోతుంది. సీతకి పిల్లల పట్ల ఉన్న శ్రద్ధ, ప్రేమ చూస్తుంటే ప్రభాకర్‌కి ఆనందం కలుగ సాగింది. ఆ ఆనందమే అతనికి సీతంటే అభిమానం ఏర్పడేలాగా చేసింది.

ఎ్రటి హైహీల్సు షూ...
తెల్లటి పాదాలపై జీరాడే ఖరీదయిన జార్జెట్ చీర...
ఆమెకి అతి చేరువగా వచ్చి ఆగిపొయ్యాయి.
తుళ్ళి పడినట్టుయి చివ్వున వంచిన తల ఎత్తింది సీత.
ఎదురుగా కనిపిస్తున్న దృశ్యాన్ని చూసి క్షణం సేపు చిత్తరువులా వుండిపోయింది.
ఆమె కళ్ళు విశాలంగా అయ్యాయి.
నవ యవ్వనంతో తొణికి పడుతూ అల్ట్రా మోడరన్‌గ వున్న ఒక అందమైన అమ్మాయి మూసపోసిన జపాన్ బొమ్మలా తెల్లటి శరీర లావణ్యంతో మెరిసిపోతూ ఎదురుగా నిల్చుని వుంది.
జరీ పువ్వులు కుట్టిన పల్చటి జార్జెట్ చీర...
స్లీవ్‌లెస్ జాకెట్టు...
అందమైన అజంతా హెయిర్‌స్టైయిల్...
చెవులకి పెద్ద పెద్ద జూంకీలు...
చేతికి జరీ పనితనం చేసిన హ్యాండ్ బ్యాగ్...
పెదవులకి రంగు వేసుకొంది.
రూజ్ అద్దిన చెక్కిళ్ళు...
ట్వీజర్‌తో దిద్దిన కను బొమ్మలు. మధ్య చిన్న ఎ్రని స్టికర్ బొట్టు.
మెడలో పొడవుగా డాలర్ చెయిన్.
కళ్ళకి పెట్టుకున్న తేనె రంగు గాగుల్స్ తీసి స్టైయిల్‌గ చేత్తో పట్టుకొంది.
ఆమెలో అందం- ఆకర్షణ సమపాళ్ళలో వుండి తెల్లగా దంతపు బొమ్మలా నాజూగ్గా వుందా అమ్మాయి రూపం!
ఆమెని చూస్తూనే సీత కొద్ది క్షణాలు స్తంభీభూతురాలు అయ్యింది.
తనని తాను మర్చిపోయి ఆమెకేసి అలా చూస్తూ వుండిపోయింది.
"ఆషా ఆంటీ...."
మంజు ముద్దు పలకరింపుతో తేరుకుని చప్పున లేచి నిల్చుంది.
అప్పటికే మంజుల ఆవిడ చేతుల మధ్య ఇమిడిపోయింది.
ఆషా పెదవులు అందంగా ఒంపు తిరిగాయి.
"మీరు....!?" సీతని పరిశీలనగా గుచ్చి చూస్తూ అడిగింది ఆమె.
సీత గొంతు తడబడినట్లు అయ్యింది.



"నే... నేనా.... నా.... పేరు... సీత." ఆషా కను రెప్పలు రెప రెపలాడాయి.

"ఓ! ప్రభూ సెకండ్ వైఫ్?"

"అవును" అన్నట్లు చిన్నగా తల కదిలించింది సీత.

మల్లె మొగ్గ విరిసి విరియనట్లు ఆమె సుతారంగా మెత్తగా నవ్వింది.

"కూర్చోండి." అంది మర్యాదగా సీత.

"నా పేరు ఆషారాణి. ప్రభూ నాకు డియరెస్ట్ ఫ్రెండ్."

"నమస్కారం..." సీత రెండు చేతులు జోడించింది.

"అయితే ఈయనకి ఇంత అందమైన గరల్ ఫ్రెండ్ కూడా వున్నదన్న మాట." అనుకొంది మనసులో.

"నేను ఈ మధ్య కొద్ది కాలం పాటు ఢిల్లీలో వుండిపోవటం జరిగింది.. అందుకే రావటం పడలేదు." అంది ఆమె చక్కగా నవ్వుతూ.

"..............."

సీత నిశ్శబ్దంగా వుండిపోయింది.

ఆమె ఎదురుగా నిల్చోవాలంటే సీతకి ఎందుకో "గిల్టీ"గ అనిపిస్తోంది. ఇన్‌ఫీరియారిటీ ఫీల్ అవుతూంది.

"ఈమె ఇంత హఠాత్తుగా.. అది ఆయన లేని సమయంలో ఎందుకు వచ్చినట్లు? తనని చూట్టానికా? లేక...."

సీత ఆలోచన్ల మధ్యే నెమ్మదిగా తల ఎత్తి కాస్త పక్కకి తిరిగింది.

ఎదురుగా....

గోడకి బిగించిన బీరువా అద్దంలో తన ప్రతిబింబం కనిపించింది.

వెలసినట్లున్న వాయిల్ చీర.

కొద్దిగా రేగిన జుత్తు.

మెడలో మంగళ సూత్రాలు కట్టుకున్న పసుపు రాసిన నూలు తాడు, చేతులకి మట్టి గాజులు.

"సీతా! నీ పేదరికం ఇంకా నిన్ను ఒదిలిపోలేదు సుమా?" అద్దంలో రూపం వెక్కిరించింది.

అత్తగారు పెళ్ళిలో ఖరీదయిన పట్టు చీరలు, రాళ్ళ నగల సెట్ పెట్టింది.

కాని అవి నిత్యం వాడకానికి అనువుగా వుండవు.

పెళ్ళి పేరుతో తల్లి అరడజను వాయిల్ చీరలు కొని వాటితో నే అత్తగారింటికి సాగనంపింది. వియ్యాలవారు బాగా స్థితిమంతులు అనగానే ముమ్మూలుగ ఇవ్వగలిగిన వాటి దగ్గర కూడా వెనక తీసింది సుభద్రమ్మ.

"మీ ఆయన ధనవంతుడు. లక్షల మీద వ్యాపారం చేస్తాడుట. రేపట్నుంచి నీకు కావల్సినన్ని చీరలు నగలు కొంటాడు. నీకేం లోటు. కుబేరుడి ఇంటి కోడలువి అయ్యావ్..." అంది సుభద్రమ్మ.

"వెళ్ళగానే ఆయన్ని ఏమని అడగాలి?" అనిపించినా పుట్టింటి స్థితిగతులు తెల్సిన సీత తల్లితో ఇంకొక మాట అనలేకపోయింది.

కాని...

అత్తింటికి వచ్చి రెండు నెల్లు గడచినా భర్త ప్రేమగా చేరబిలిచి ఏ చిన్న కానుకా ఇవ్వలేదు.

అసలు పగటి పూట ఆమెని ప్రేమగా చూసిన సందర్భంగాని, ఆప్యాయంగా పలకరించి తీరిగ్గా మాట్లాడిన సంఘటనగానీ లేనే లేదు:

"పిల్లలు- వ్యాపారం."

ఈ రెండే అతని ప్రపంచం.

"ఇంక అటువంటి భర్తని పట్టుకుని వచ్చిన మర్నాడే చీరల కోసం నగల కోసం వేధించటం... ఊహు.. " సీతకి మనసు అంగీకరించలేదు.

"అయినా ఆయనకి లేని నామర్దా నాకు మాత్రం ఏమిటి? పని మనిషికి- తన భార్యకి ఆట్టే తేడా లేదన్న పట్టింపు ఆయనకి లేనప్పుడు నాకు మాత్రం ఏమిటి"ఆయనకి తనపై మనసు లేదని తెల్సినా వేరే గత్యంతరం లేక ఏదో... ఈ మోడు జీవితానికి ఒక ఆధారం అంటూ ఏర్పడుతుంది కదా అని ఈ పెళ్ళికి తల ఒగ్గింది. కాని అతని ఆస్థి, హోదాకి ఆశపడి కాదు కదా?" అనుకుని మనసుకి నచ్చ చెప్పుకుంది.

కాని-

ఇలా ఇంటికి ఎవరైనా అతిథులు వచ్చినప్పుడు మాత్రం తన దుస్తుల గురించి, అలంకరణ గురించి ఆలోచన వస్తుంది.

తనని చూస్తే ఈ యింట్లో ప్రభాకర్ భార్యగ తనకి.... ఈ పూర్ సీతకి... ఎలాంటి స్థానం వుందో చెప్పకనే తెల్సి పోతుంది.

"సంధ్య"లాంటి అందమైన యువతి ప్రేమలో జీవితాన్ని కలలో స్వర్గ ధామంలా అనుభవించిన ప్రభాకర్‌ని సీత చప్పున ఆకర్షించలేకపోవటం ఒక విధంగా సమర్థించదగినదే.

నిజానికి అతనికి ఈ పెళ్ళి ఇష్టంలేదు.

అందుకే బానిసని కొని తెచ్చుకున్నట్లు కొన్ని షరతులు పెట్టి కట్టు దిట్టాలుగ సీతని చేసుకున్నాడు.

ఈ మనస్థితిలో రంగాకి- సుబ్బులుకి- సీతకి తేడాలేమిటో అతనికి ఆట్టే తెలియటం లేదు.

ఇంక-

సరదాలకి కాలక్షేపానికి సంధ్య లేని లోటును తీర్చటానికి "ఆషారాణి" లాంటి గరల్ ఫ్రెండ్స్, అందాల రాణులు అతనికి చాలామందే వున్నారు.

అతను నోరు తెరిచి ఏ చిన్న కోరిక కోరకుండానే వాళ్ళంతా తమకిగా తాము అతనికి దగ్గర కావాలని తహతహ పడతారు.

అతని డబ్బు- అందం- హోదా అంతటివి.

చంద్రుడ్ని తారలు వరిస్తాయి.

ప్రభాకర్ని ఆడ పిల్లలు కోరుకుంటారు. అంతటి గ్లామర్ అతని సొత్తు.

సంధ్య మరణించాక ఆ స్థానాన్ని భర్తీ చెయ్యాలి అనుకున్న వారిలో ఆషారాణి కూడా ముఖ్యురాలు.

కాని-

ప్రభాకర్‌కి ఎవళ్ళని ఎంతలో వుంచాలో బాగా తెల్సు.

గరల్ ఫ్రెండ్‌కి- భార్యకి వుండే తేడాలు, అర్హతలు బాగా తెల్సు.

అందుకే ఏ విధమైన ప్రాపగాండా లేకుండా "సీత"ని నిరాడంబరంగా పెళ్ళి చేసుకుని ఇంటికి తెచ్చుకున్నాడు.

ఆ తరువాత ఆ వార్త ఫ్రెండ్స్‌కి- అదీ అడిగిన వారికి మాత్రమే చెప్పాడు.

ఆషా ఢిల్లీ నుంచి రాగానే ఆమెకి తెల్సిన మొట్ట మొదటి షాకింగ్ న్యూస్ ప్రభాకర్ పెళ్ళి చేసుకున్నాడని!

అంతే!

ఆ క్షణంలో అగ్గి మీద ఆజ్యం పోసినట్లు ఆమె గుండె భగ్గు భగ్గుమంది.

మనసంతా అశాంతిగ అయ్యింది.

"అతడ్ని పెళ్ళి చేసుకోవాలని, ఆ ఐశ్వర్యానికంతటికి మహా రాణి కావాలని తను ఎన్ని కలలు కంది? మొదటిసారి ఆ సంధ్య ఎగరేసుకుపోయింది. ఇప్పుడు సీత! అసలు ఎవరీ సీత! రామాయణంలోంచి లేచి వచ్చిందా?

....ఆ సంధ్య అంటే తనకి మించిన అందగత్తె, ఐశ్వర్యవంతురాలు కనుక ప్రభాకర్ పెళ్ళి చేసుకున్నా కాదనలేకపోయింది. కాని ఈ సీత ఎంత గొప్పదో చూద్దాం ..." అనుకుంటూ ఆఘమేఘాల మీద ప్రత్యేకం పనిగట్టుకుని ఇంటికి వచ్చింది.

కాని-

సీతని చూడగానే ఆమె ప్రాణం హాయిగా అనిపించింది.

ప్రభాకర్ చాలా తెలివిగా "భార్య" పేరుతో పని మనిషిని... శాశ్వత బందీని తెచ్చుకున్నాడు అనిపించింది.

"ఇలాంటి భార్యని ఇంటి దగ్గర పెట్టుకుని నా చేతుల్లోంచి జారిపోలేదు. పోనీ... ఇదీ ఒక రకంగా మంచిదే. మైడియర్ ప్రభూ! నిన్ను శాశ్వతంగా నా గుప్పెట్లో బంధిస్తాను..." అనుకుంది ఖుషీగా ఆషా.

అతలాకుతలంగా వుడుకుతూ వచ్చిన ఆమెకి సీతని చూడగానే మబ్బు విడిచిన చందమామ అయ్యింది మనసు.

....

అప్పం మించి చూపు తిప్పి ఆలోచన్ల నుంచి తేరుకుంటూ నెమ్మదిగా తల ఎత్తింది సీత.

ఆషారాణి సోఫాలో దర్జాగా కూర్చుని పిల్లలిద్దర్నీ చెరో ప్రక్క చేర్చుకుని హ్యాండ్ బ్యాగ్ తెరిచి ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ బార్ ఇస్తోంది.

ఖరీదైన ఆమె ప్రక్కన ఖరీదుగా బొద్దుగా ముద్దుగా వున్న పిల్లలు!

అతిధికి మర్యాద చెయ్యాలన్న విషయం చప్పున స్ఫురణకి వచ్చింది సీతకి.

"మీకు... ఏం తీసుకు రమ్మంటారు? కాఫీనా? కూల్‌డ్రింకా? లేక......"

చెయ్యి అటు- ఇటు సుతారంగా కదిలించి నవ్వుతూ వారించింది ఆషా.

"ప్రభూ వచ్చే టైమ్ అవుతోంది కదా! ఇద్దరం కల్సి తీసుకుంటాం." అని ఒక్క క్షణం ఆగి-

"అయినా ఈ ఇంట్లో నాకు ప్రత్యేకం మర్యాద అక్కర్లేదు. ఇక్కడ్నుంచి ఏది కావల్సి వచ్చినా తీసుకునే స్వతంత్రం నాకుంది. ఆఖరికి బీరువాలో డబ్బు కూడా" అని నవ్వి- "సీతగారూ! ప్రభూ ఈజ్ మై క్లోజ్ ఫ్రెండ్. ఐ లైక్ హిమ్ వెరి మచ్... " అంది తమాషాగా కళ్ళు తిప్పుతూ.

"............"

ఇంక మాట్లాడటానికి ఏమి లేనట్లు సీత నిశ్శబ్దంగా వుండిపోయింది.

".........."

".........."

రెండు నిమిషాల మౌనం తరువాత తిరిగి ఆషానే అంది.

"అద్సరే సీతగారూ! కూర్చోండి. అయినా నేను వచ్చింది మిమ్మల్ని చూడాలనే." అంది.

ఎదురుగా వున్న మరో సోఫాలో కూర్చుంది సీత.

"ఏం చదువుకున్నారు? మీ నాన్నగారు ఏం చేస్తారు?" అంటూ ప్రశ్నలు వేసింది.

అన్నీ చెప్పింది సీత.

సిగ్గు పడటం ఎందుకు? అనుకుంది.

అందుకే అబద్దాలు చెప్పలేదు.

పుట్టింటి గురించి లేని గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చెయ్యలేదు.

కొద్దిగా సోఫాలోంచి ముందుకి ఒంగి, చెక్కిలికింద స్టైయిల్‌గ చేతిని పెట్టుకుని సీత చెప్పినదంతా ఆసక్తిగా విన్న ఆషా కనుబొమ్మలు ఎత్తి-

"నాకు చాలా ఆశ్చర్యంగా వుంది." అంది కొద్దిగా భుజాలు కదిలిస్తూ.

".......!?" సీత విస్మయంగా చూసింది.......

"అసలు ప్రభూ ఈ పెళ్ళి ఎలా చేసుకున్నాడో నాకు తలబ్రద్దలు కొట్టుకున్నా అర్థం కావటం లేదు. బట్........" అంటూ చిత్రంగా కళ్ళు తిప్పుతూ ఆగిపోయింది.

"........."

సీత చప్పున తల దించుకుంది.

ఆవిడ ఎత్తిపొడుపు అర్థం అయిన సీతకి మనసుని ముల్లు గుచ్చినట్లయింది.

కాని-

తనకి తెల్సు:

ప్రభాకర్ ఈ పెళ్ళి ఎందుకు చేసుకున్నాడో!

.....అతడి పక్కన భార్యగ తగిన అమ్మాయి వంటింటి కుందేలులా పిల్లలకి తల్లి కాలేదు. ఆ చీదర భరించలేదు.

పిల్లలకి మనసారా తల్లి కాగలిగిన అమ్మాయి అతడి ప్రక్కన భార్యగ తగదు.

అతను చెప్పినట్లు ఆ రెండు అర్హతలు ఒక్క సంధ్యకే దక్కాయి.

నిజమే మరి. ఎవరి అదృష్టం ఎవరికి వస్తుంది?

మనసులో కలకలం చెలరేగుతున్నా పైకి నిశ్శబ్దంగా వుండిపోయింది సీత.

ప్రభాకర్ ఇంటికి వచ్చేదాకా ఆషారాణి సీతతో పుల్ల విరుపుగా ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంది.

రోజూ సీతని అంటి పెట్టుకుని వుండే పిల్లలు కూడా ఆ కాస్సేపు ఆషారాణి దగ్గర సంతోషంగా..... స్వతంత్రంగా పిన్నిని మర్చిపోయి కూర్చున్నారు....

అదే చిత్రం అనిపించింది సీతకి.

ఆ క్షణంలో మనసులో ఏ మూలో కొంచెం బాధ కూడా కలిగింది.

ఒక గంట తరువాత ప్రభాకర్ ఇంటికి వచ్చాడు.

హాల్లో కూర్చున్న ఆషాని చూస్తూనే అతని వదనం వికశించింది.

"హల్లో! హవ్ ఆర్‌యు(...?" అని పలకరించాడు.

"ఫైన్" అంటూ చెయ్యి చాచి అతడి చేతిని అందుకుని కరచాలనం చేస్తూ అతని వెంట గదిలోనికి నడిచింది.

కాపురానికి వచ్చి మూడు నెల్లు అవుతూంది.

కట్టుకున్న *భర్తే అయినా ఒక్కసారి కూడా అతడి వెనక అలా చెయ్యి పట్టుకుని స్వతంత్రంగా వెళ్ళలేకపోయింది సీత.

ప్రభాకర్ ముభావమే అందుకు కారణం.

జీవితం చేజారిందా

"ఎందుకు? అతడు తిరిగి ఏమ్మైనా అన్నా, నిర్లక్ష్యంగా చూసినా మనసుకి బాధ." అనుకున్న సీత చొరవ తీసుకోలేక పోయింది.

అసలు ఇప్పటికే ఆమె సున్నితమ్మైన మనసు గాయపడింది.

అతడు పెళ్ళికి ముందే నిష్కర్షగ చెప్పిన మాటలు, షరతులు అనుక్షణం మనసులో మెదులుతున్నాయి. అన్నింటిని మించి తన పేదరికం ఒక అలుసు. దానికి తగినట్టుగనే ప్రభాకర్ కూడా సీత పట్ల ప్రత్యేక భావం ఏది ప్రదర్శించటం లేదు. కేవలం తన పిల్లల సంరక్షణకోసం వచ్చిన మనిషిని చూసినట్లే చూస్తున్నాడు.

అందుకే –

"ఈ ఇల్లు నాది. నా భర్త... నా పిల్లలు..." అన్నభావం ఆమెకి కలగటం లేదు.

తినటం, ఇల్లు చక్కదిద్దటం, పిల్లల బాధ్యత వహించటం...

అంతవరకే పరిమితం అయ్యింది.

అంతేగాని పెళ్ళి పేరుతో ఇద్దరి మధ్య ఏర్పడే అనుబంధం ఏర్పడలేదు.

అతడు తన మెళ్ళో కట్టిన పసుపుతాడు సమాజంనుంచి రక్షణ. గౌరవం. అంతేగాని, ఆత్మీయతకి అనురాగానికి ఆలంబన కాదు!

నెమ్మదిగా ఆలోచన్లనుంచి తెప్పరిల్లి వంటగదిలోకి వచ్చింది సీత.

ట్రేలో టిఫిన్ ప్లేట్లు, పళ్ళ ముక్కలు, ఐస్క్రీం సర్ది హాల్లోకి వచ్చి చిన్నగా "రంగా" అని పిలిచింది.

ఆ తరువాత ఇద్దరికి త్రాగటానికి బోర్నవీటా గదిలోకి పంపించింది.

ఆషారాణి గదిలో ఎదురుగా వుండగానే ప్రభాకర్ తన పన్లు అన్ని పూర్తి చేసుకున్నాడు.

సీత వంటగదిలో వున్నా భర్త రూమ్‌లోనుంచి ఆషారాణి గలగలా ఇంగ్లీషులో మాట్లాడుతున్న వైనం, ఆ ఇద్దరి నవ్వులు... అన్ని వినిపిస్తూనే వున్నాయి.

చాలా రోజుల తరవాత ప్రభాకర్ హాయిగా నవ్వుతున్నాడు.

ఫ్రీగా మాట్లాడుతున్నాడు.

ఎడారి పాలైన మనిషి తిరిగి ఆత్మీయుల్ని చేరుకున్నప్పుడు కనిపించే ఉద్వేగం అతనిలో స్పష్టంగా కనిపిస్తుంది.

"ఇప్పుడు... ఈ క్షణంలో ఆయన అంత ఆనందంగా వున్నారా?" అనుకుంది సీత

ఆమెకి మనసులో ఏ మూలో నిప్పు రాజుకుంటున్నట్లు సన్నగా బాధ...

వాళ్ళిద్దరు గదిలో అవిరామంగా మాట్లాడుకుంటున్నారు.

మధ్య మధ్య నవ్వులు. జోక్స్.

సీత పిల్లలిద్దర్ని ముస్తాబుచేసి పళ్ళరసం తాగించింది.

ఇంతలో ప్రభాకర్ మేకప్ కూడా పూర్తి అయ్యింది.

అతను షాంపూతో ఫ్రెష్‌గ హెయిర్‌బాత్ చేశాడు.

మల్లెపువ్వు రెక్కల్లాంటి గ్లాస్కో పంచెని లుంగిలా కట్టుకుని చిన్న చిన్న చెక్స్ వున్న ఫుల్‌హ్యాండ్స్ షర్ట్ వేసుకున్నాడు.

చేతిమీది షర్ట్ పైకి మడుస్తూ గదిదాటి హాలులోంచి వెడుతుంటే అతడి ఒంటిమీద "స్ప్రే" చేసుకున్న చక్కటి సుగంధ పరిమళం గదంతా అలలు అలలుగ నిండింది.

ఆషా అతనికి అతి చేరువగా నడుస్తూ హాలు దగ్గరకి వెళ్ళింది.

పిల్లలిద్దరూ, కుక్కపిల్ల కారు-వెనక సీట్లో కూర్చున్నారు.

ప్రభాకర్ డ్రైవింగ్ ముందు కూర్చుంటే ఆషా అతడి ప్రక్కన ఆశీనురాలు అయ్యింది.

రోజులాగే షికారు బయలుదేరారు.

కారు కదిలింది.

కనీసం వెడుతున్నట్లు కూడా ఆషా సీతకి చెప్పలేదు.

అసలు ప్రభాకర్ వచ్చాక ఒక చిన్న మాట కూడా ఎవ్వరూ సీతతో మాట్లాడలేదు.

సామాన్యంగా అయితే రోజూ ఆఫీసు నుంచి రాగానే ప్రభాకర్ కూడా సీతతో ఎక్కువగా మాట్లాడడు.

చాలా రిజర్వ్డుగ నిశ్శబ్దంగా వుంటాడు.

పిల్లల గురించి అయితే బాగానే మాట్లాడతాడు. కాని అదే వేరే విషయాలు ఏమన్నా అయితే తప్పనిసరిగా చాలా ముక్తసరిగ మాట్లాడతాడు.

"అటువంటి మనిషి ఆమెతో ఎంత స్నేహభావంగా మాట్లాడాడు? ఎంత సన్నిహితత్వం?" అదే సీతకి చాలా ఆశ్చర్యం అనిపించింది.

అంత కంటె ఎక్కువగా ఆషారాణి ప్రవర్తన మరీ ఎక్కువగా సీతకి వేదన అనిపించింది.

"సాటి స్త్రీ కనీసం వెళ్ళేటప్పుడు తనకి చెప్పటానికేం?"

నిజం చెప్పాలంటే ప్రభాకర్ దగ్గర "రంగా"కి వున్న చనువు కూడా సీతకి లేదు.

పైకి కనిపించదుగాని రంగాకి కూడా లోలోపల సీత అంటే కొద్దిగా లోకువే.

అంతే మరి.

భర్త తిడితే ముష్టివాడు కూడా తిట్టాడన్న సామెత వూరికే వచ్చిందా?

కట్టుకున్న భర్త ఇవ్వని గౌరవం తక్కినవాళ్ళు ఎందుకు ఇస్తారు? మెత్తగా వుంటే గొడ్డు కూడా కరుస్తుంది.

గేటులోంచి సర్రమని దూసుకొని నున్నటి రోడ్డు మీద మెత్తగా జారుతూ కారు కన్నుమరుగు అయ్యే వరకూ సీత అలాగే కిటికీ వారగా నిల్చుని... చూస్తూ వుండిపోయింది.

ఏదో అదృశ్య హస్తం సన్నని వాడి బాకుని ఆమె గుండెల్లోకి దించి అటు-ఇటు కదిలించినట్లుగ అవ్యక్తమైన బాధ సీత గుండెల్లో సుడి తిరిగింది.

మనసు శ్రావణ మేఘం అయ్యింది.

ఆ రాత్రంతా ఆమెకి కలత నిదురే!

(ఇంకా ఉంది)



కొన్ని క్షణాలు టిక్ టిక్ మంటూ కలకాలము
లయదప్పని కవితా నాదాలను పలికిస్తుంటాయి
hmt
Chetak
hmt
Rajat
MON 18
AUTOMATIC
21 JEWELS
hmt
QUARTZ
MON 18
hmt
గడియారాలు
హ్యాండ్ వూండ్ • ఆటోమాటిక్
• క్వార్ట్జ్
దేశానికి సమయ నిర్ణేతలు

హైదరాబాద్ నోట్‌బుక్

కళాకారుల సన్మానం:-

రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ ఈసారి రవీంద్ర భారతిలో నిర్వహించిన అక్షయ ఉగాది ఉత్సవాలకు ఒక విశిష్టత ఉంది- తెలుగు విశ్వవిద్యాలయం కూడ ఈ ఉత్సవాల నిర్వహణలో ఆధ్వర్యం వహించడం ఆ విశిష్టత. శ్రీశైలంలో తెలుగు విశ్వవిద్యాలయ భవనాలకు శంకుస్థాపన చేయడానికి వెళ్ళిన ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారకరామారావు ఈ ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి ఎంత ఆలస్యంగా వస్తారో, ఏవో అని అభిమానులు, ప్రత్యర్థులు కూడ ఎదురు చూస్తుండగా ఆయన కేవలం ఐదు నిమిషాలు మాత్రమే ఆలస్యంగా వచ్చి, ఆలస్యానికి మన్నన కోరారు. ఉదయం 8-00 గంటలనుంచే నాదస్వరలహరిరవీంద్ర భారతి ప్రాంగణాన్ని ముంచెత్తింది. కార్యక్రమం ప్రకారం మొదట పంచాంగ శ్రవణం మొదట కావలసింది. కాని, వేద స్వస్తి వాచనంతో ప్రారంభమైంది. తర్వాత ఉషాదేవి మా తెలుగు తల్లికి మల్లె పూదండ - ప్రార్థన చేశారు. పిదప తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ తూమాటి దొణప్ప స్వాగతం చెబుతూ, కళాకారుల ఎడల ప్రభుత్వం ఆదరం సన్నగిల్లిందనే విమర్శను ఖండిస్తూ, వందమంది కవి, పండిత, కళాకారులను ఈసారి ప్రభుత్వం సన్మానిస్తుందని అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం అధికార ముద్రను రూపొందించిన శ్రీ మారేమండ శ్రీనివాసరావును, వీణా వాదనంలో తెలుగు వారికి, భారత దేశానికి కీర్తి తెచ్చిన వైణిక విద్వాంసులు శ్రీ ఈమని శంకరశాస్త్రిగారిని వైణిక సార్వభౌమ బిరుదంతో సన్మానిస్తున్నామని ఆయన అన్నారు. పిదప ముఖ్యమంత్రి ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ నేదునూరి కృష్ణమూర్తి సంపాదకత్వాన సిద్ధమయిన త్యాగరాజుల ప్రహ్లాద భక్త విజయ నాటకం క్యాసెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం తిరుపతి పౌరాణిక పాఠశాల ప్రిన్సిపాలు శ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. కాలం పరిచ్ఛిన్నం, అపరిచ్ఛిన్నమని రెండు విధాలని, అపరిచ్ఛిన్నకాలం పరమాత్మ అని, పరిచ్ఛిన్నకాలం యుగ వర్తమానాదులుగా విభక్తమై వ్యవహారోపయోగి అవుతుంద అంటూ పంచాంగం విశేషాలు తెలిపారు. తెలుగువారెప్పుడూ ధర్మపక్షమే. భారతకాలంలోను తెలుగువారు ధర్మపక్షమైన ధర్మరాజు పక్షమే వున్నారు. ఆంధ్రాశ్చోళాశ్చ పుండ్రాశ్చ అని వ్యాసులు తెలిపారు. ఇది క్షయ సంవత్సరం అక్షయం. ఆపదలక్షలకు క్షయం, సంపదలకు అక్షయం. ఈ సంవత్సరం బృహస్పతిరాజు, మంత్రి చంద్రుడు, సన్యాధిపతి శుక్రుడు. ప్రభుత్వం చక్కగా నడుస్తుంది. వర్షాలు బాగుంటాయి. కాని, కొన్ని ఒడిదుడుకులు తప్పవు. చిక్కులు వచ్చినప్పుడే మనం నిక్కగా నిలవదొక్కుకోవాలి. ఏమైనా సర్వం అక్షయం కావాలని భగవంతుని కోరుకుందాం - అన్నారు.

పిదప ముఖ్యమంత్రి కళాకారులకు సన్మానం జరిపారు. ప్రతి వారికీ వేయిన్నూట పదార్లు, కాశ్మీర్ శాలువ, ఒక ప్రశస్తి పత్రం ఇచ్చారు. కళాకారులలో, జానపద కళలకు జీవితాన్ని అంకితం చేసిన మరుగు పడిన మాణిక్యాలకు మరొక మారు మెరుగులు దిద్దడం విశేషం. సన్మానితులయిన కళాకారులు, శాస్త్రజ్ఞులు వీరు: శ్రీయుతులు అయిలాచార్యులు. సుప్రసిద్ధ లోహ శిల్పి. వరంగల్ జిల్లా పెంబర్తి. మన్ని అప్పలాచార్యులు. సుప్రసిద్ధ హస్తకళా నిపుణులు. విశాఖపట్నం జిల్లా ఏటికొప్పాక. కరుమజ్జి అప్పారావు. సాము గరిడీలలోను, కత్తి యుద్ధంలోను నిపుణులు. విజయనగరం. కవి ఉమాకాంత భాగవతారు హరి కథా నిపుణులు. చిత్తూరు జిల్లా జంగాలపల్లె డి. దుర్గాప్రసాద్. కొండపల్లి బొమ్మల నిర్మాణంలో నిపుణులు. కృష్ణాజిల్లా. ఈయన కీర్తిశేషులయి నందున శ్రీమతి ధరణికోట విజయ లక్ష్మి ఈ పురస్కారం గ్రహించారు. సి. ఎస్. ఎన్. పట్నాయక్. ప్రముఖ చిత్రకారులు. శ్రీకాకుళం జిల్లా బాడాం. అవేటి పిచ్చయ్య. రంగాలంకరణ నిపుణులు. పశ్చిమ గోదావరి జిల్లా పోలసాని పల్లి. కందుల మల్లికార్జునరావు (మల్లిక్) ప్రముఖ గాయకులు, సంగీత విద్వాంసులు. కృష్ణా జిల్లా మచిలీపట్నం. మారెళ్ల కేశవరావు. ప్రముఖ వాయులీన విద్వాంసులు. అంధులు. బరంపురం. మదికుక్కల చంద్రయ్య డోలు వాద్య నిపుణులు. వరంగల్ జిల్లా మాణిక్యాపురం. వాసగిరి చిన్న రమణమ్మ. ప్రముఖ కూచిపూడి నర్తకి. కర్నూలు జిల్లా కోవెలకుంట్ల. జొగ్గరి జోగు లింగమ్మ. జోగు కళా నిపుణులు. నిజామాబాదు జిల్లా ఎడపల్లి. ఓలేటి వెంకటేశ్వర్లు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి. తిరుపతి శేషయ్య. యక్షగాన కళా నిపుణులు. కరీంనగర్ జిల్లా గట్టిపల్లి. సాతులూరి శోభనాద్రి ఆచార్యులు. హస్త సాముద్రిక, జ్యోతిశ్శాస్త్ర నిపుణులు. కృష్ణాజిల్లా పుట్లగుంట. నేమాని శ్రీరామశాస్త్రి. వాస్తు జ్యోతిష హస్త సాముద్రిక శాస్త్ర నిపుణులు. తూర్పు గోదావరి జిల్లా వేరూరు. మఠం రమేశ్. ప్రముఖ రంగస్థల నటులు. అనంతపురం జిల్లా రాకట్ల. కె. రాజయ్య. ప్రముఖ చిత్రకారులు. మెదక్ జిల్లా సిద్దిపేట. వీరగంధం వేంకట సుబ్బారావు. ప్రముఖ హరికథకులు. ప్రకాశం జిల్లా భీమవరం. ఈయన ముఖ్యమంత్రికి పాదాభివాదనం చేశారు. లింగం గుంట్ల వేంకటేశ్వరరావు. ప్రముఖ ధనుర్వేదజ్ఞులు. గుంటూరు జిల్లా అరవపల్లి. షేక్ నాజర్. విఖ్యాత బుర్రకథా నిపుణులు. గుంటూరు జిల్లా పొన్నెకల్లు. షేక్ హసన్ సాహెబ్. ప్రముఖ నాదస్వర విద్వాంసులు. ప్రకాశం జిల్లా త్రోవగుంట. కొప్పరపు సరోజిని. ప్రముఖ రంగస్థల, చలన చిత్ర నటీమణి. కీ. శే. కొప్పరపు సుబ్బారావు గారి సతీమణి. ఒరిస్సా రాష్ట్రంలోని రసూల్ కొండ. ధూపం సూర్యలింగం. విఖ్యాత మృదంగ విద్వాంసులు. శ్రీకాకుళం జిల్లా బొద్దూరు. కొటేశ్వరరావు. ప్రముఖ ఛాయా చిత్ర గ్రాహకులు. హైదరాబాద్. ఈయన ముఖ్యమంత్రిని గాఢాలింగనం చేసుకొన్నారు. ప్రారంభంలో ప్రముఖ వైణికులు శ్రీ ఈమని శంకరశాస్త్రిని ముఖ్యమంత్రి సన్మానించి వైణిక సార్వభౌమ బిరుదంతో సత్కరించారు. తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం అధికార ముద్రను రూపొందించిన ప్రముఖ చిత్రకారుడు మారేమండ శ్రీనివాసరావును సన్మానించారు. ఏటా నవీన సాహిత్యానికి ఇస్తున్న బహుమతులు విజేతలకు ఇచ్చారు. ఈ సంవత్సరం ఉత్తమ సంస్కృత విద్వాంసులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృతశాఖ ఆచార్యులు డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడు. ఉత్తమ రచయిత్రిగా డాక్టర్ శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ సన్మానితు లయ్యారు. సభాధ్యక్షురాలు, సాంస్కృతికశాఖా మంత్రి శ్రీమతి ప్రతిభా భారతి ప్రసంగం తర్వాత ముఖ్యమంత్రి నూతన సంవత్సర సందేశం ఇస్తూ, పంచాంగ శ్రవణం చేసిన శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి ప్రసంగం అత్యద్భుతమని ప్రశంసించి, ఆయనను సత్కరించారు. ఏ జాతికైనా సంస్కృతి పునాది. భాషా సంస్కృతులను సంస్కరించుకొనక పోతే జాతి నిలువదు. కనుకనే ప్రాచీన కళా శాస్త్రజ్ఞులను గౌరవించాము. నేడు సన్మానితులైన శ్రీ లింగంగుంట్ల వెంకటేశ్వరరావు గారిని చూడండి. ప్రాచీన వేదశాస్త్ర పురాణాలలో నిక్షిప్తమైన ధనుర్విద్యను ఆయన స్వాయత్తం చేసుకొని అద్భుతాలు చేశారు. ప్రాచీన కళలను రక్షించుకొనక పోతే సంస్కృతి నిలువదు- అన్నారు ముఖ్యమంత్రి. నేడు ప్రజలే మహారాజులు. పాలకులు. నేడు ఉగాది పర్వదినాన నన్ను నా పాలకులైన ప్రజలకు పునరంకితం చేస్తున్నాను- అన్నారు ముఖ్యమంత్రి. తర్వాత కవి సమ్మేళనం జరిగింది. అప్పటికే మధ్యాహ్నం పన్నెండు కావడం వల్ల కవులు తమ పద్యాలు చదివిన వెంటనే, వేదిక దిగి రాసాగారు. వేదికపై చివరకు ఒకరిద్దరు, శ్రోతలలోను కొందరు మిగిలారు.

ఉపశ్రుతి:-


ఏం సార్, మళ్లీ నగరంలో ఫుట్‌పాత్‌ల దురాక్రమణలు, రోడ్ల మధ్య పెంట ప్రోగులు, ఎక్కువయాయి ఇటీవల. ఎందుకు?- అనడిగారు నన్నొకరు. ఏముంది? మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పడిందిగా- అన్నారు పక్కన ఉన్న ఒక పెద్ద మనిషి.

- తిరుమల రామచంద్ర

అభిమాన తారలపై అభిప్రాయం

నా అభిమాన నటుడు ఇండియన్ చార్లీచాప్లిన్ కమల్‌హాసన్ 'ఆకలిరాజ్యం' 'మరో చరిత్ర' 'అమావాస్య చంద్రుడు' చిత్రాలలోని నటనను చూచి నేను వారి అభిమాని నైనాను.

ఫైట్సులో, డాన్సులలో, నటనలో తనకంటూ ఒక ప్రత్యేకతను కల్గియున్న నటుడు కమల్. కాని దురదృష్టకర విషయం ఏమిటంటే 'సాగర




సంగమం' తర్వాత కమల్ నటించిన ఏ చిత్రం సక్సెస్ కాలేదు ఒక్క సాగర్ (హిందీ) తప్ప. దీనికి కారణం అతని నటనకాదు, ఆ చిత్రంలోని కథలోపమే అసలు కారణం. మళ్లీ ఇప్పుడు 'స్వాతి ముత్యం' చిత్రం కమల్‌కు మంచి పేరు తెచ్చిపెట్టగలదు.

చివరిగా అభిమానిగా నేను వారికిచ్చే సలహా ఏమిటంటే– ఇకనుంచి మంచి కథ ఉన్న చిత్రాల్లో వైవిధ్యమున్న పాత్రల్లో నటిస్తూ 'దటీజ్ కమల్' అని పేరు సంపాదించుకోగలరు.

–ఎస్.డి. అన్వర్, పాల్వంచ

* * *

నా అభిమాన నటి శారద. నేను ఆమెనటించిన చిత్రం 'మనుషులు మారాలి' మొదట చూసాను. అప్పటి నుండి ఆమె అభిమాని నయ్యాను. ఆమె నటనలో వైవిధ్యం కన్పిస్తుంది. చాల నేర్పు ఓర్పు, సహనం గల పాత్రలలో నటించడానికి ఆమెకు ఆమెయే సాటి అన్పిస్తుంది. ఆమె నటించే కొన్ని సన్నివేశాలలో నాకు తెలియకుండగనే నాకళ్లు వర్షిస్తాయి. ఆమె నటనలో జీవం వుంది. తల్లిగా, ప్రియురాలిగా, ఉపాధ్యాయురాలిగా చాలా పాత్రలు' నటించారు. ఇంచు మించు శారదగారున్న ప్రతి సినిమాను చూస్తుంటాను. అప్పటికి ఇప్పటికి






ఆమెనటనలో తేడా లేదు. కాలం మారింది, శారద, అడవిదొంగ, స్వాతి, రెండు కథల కథలో "నిమజ్జనం" ఒక మూగ బాలికతల్లిగా లాయరు పాత్ర నాకు నచ్చిన మరెన్నో చిత్రాలు ఉన్నాయి. ఒకదానిని మించి ఒకటిగా ఆమె నటనాద్భుతాన్ని అందించారు. అడవి దొంగలోని పాత్ర చాల బావుంది. ఆమె కట్టుతీరు, హావ భావాలు నటనలో జీవం పోసేతీరు, అభిమానులను విసుగు విరామం లేకుండా జవాబులిచ్చే ఆమంటే నాకు ఇష్టం. మరెంత మంది అభిమానాన్నో చూరగొనాలని కోరుకుంటున్నాను.

–సిహెచ్. వి. వి. ఎస్. సత్యా సత్యనారాయణరాజు, రామచంద్రపురం

* * *

నందమూరి బాలకృష్ణ అంటే నాకు చాలా అభిమానం. మరి ఆయన నటనకంటూ ప్రత్యేకత యుందని నిరూపించిన యువ నటుడు. నటన, పట్టుదల, సామర్థ్యం, ఉదారస్వభావం ఉన్నవ్యక్తి ఆయన. ఈయన నటించిన "దానవీర శూర కర్ణ"లో అభిమన్యుడి పాత్రలో యుద్ధ సమయంలో అద్భుతంగా నటించి నా హృదయంలో ఆనాడు చెరగని ముద్రగా నిలబడ్డాడు. "మంగమ్మగారి మనవడు", "కథానాయకుడు" "నిప్పులాంటి మనిషి" మొదలగు చిత్రాల ద్వారా తన అద్భుత నట సామర్థ్యంతో ఆకట్టుకున్నాడు. మరియు అనతి కాలంలోనే ఆయన అభిమానులచేత అందాల "ముద్దుల కృష్ణయ్య" అన్పించుకొని సినీ పరిశ్రమలో తనకు తానే సాటి అని నిరూపించి





"పట్టాభిషేకం" చేసుకొని తండ్రికి తగ్గ తనయుడుగా అఖిలాంధ్ర ప్రేక్షక హృదయాలలో నిలబడ్డాడు. ఆయన వ్యక్తిగత జీవితంలో, నట జీవితంలో కూడ గొప్పవాడు అని నా అభిప్రాయం. నేను ఆయన అభిమానిగా సలహా ఇచ్చేదేమిటంటే ఇంకా వెరైటీ మాస్ పాత్రలు ధరించాలని.

–పి. బస్వంత్‌రాజ్, దామర్‌గిద్ద

* * *

నా అభిమాన హీరో "చిరు". నేట చలన చిత్ర పరిశ్రమలో విజయోత్సవాల వైపు విమానంలా దూసుకు పోతున్న చిరంజీవి "మంచుపల్లకి" ద్వారా నా అభిమాని అయ్యాడు. కుటుంబ కథా చిత్రాల్లో కూడా చిరంజీవి' చిరంజీవేనని "విజేత" నిరూపించింది. విభిన్న తరహా పాత్రల్లో కూడా బాగా నటించగలడని చిరంజీవి "చిరంజీవి" ద్వారా నిరూపించాడు. కాని ఆ పాత్రల్లో చిరంజీవిని చూడడానికి ప్రేక్షకులు ఇష్టపడని కారణంగా ఆ చిత్రం రాణించలేక పోయింది. "అడవి దొంగ" ద్వారా చలన చిత్ర పరిశ్రమలో నంబర్ వన్ హీరోగా స్థానాన్ని పదిలం చేసుకొన్నాడు' నేడు చిరంజీవికున్న అభిమాన చిరంజీవుల సంఖ్య లెక్కింప లేము. అభిమానిగా నా సలహా ఏమంటే "శుభలేఖ" "కోతల రాయుడు" "మంచుపల్లకి" "మగ మహారాజు" "విజేత" లాంటి చిత్రాల్లో మరికొన్ని సార్లు చూడాలని మంచి కథలను ఎన్నుకొని




తద్వారా విజయాల వైపు సూపర్‌సానిక్ విమానం వలె వెళ్లాలని ఆశిస్తూ....

– రాచమల్లు బ్రహ్మానంద రెడ్డి, పులివెందుల

* * *

నా అభిమాన తార 'సూపర్‌స్టార్' జయసుధ. నేను మొదటిసారిగ 'అర్ధాంగి' చిత్రం చూచి ఆమె నటనా చాతుర్యమునకు, గాంభీర్యమునకు ఎంతో ముగ్ధురాలయ్యాను. అప్పటినుండి ఆమె నటించిన ఎన్నో చిత్రాలు చూచాను. చిత్రకథ ఏ విధంగా వున్నప్పటికీ, ఆమె తన పాత్రను అత్యంత ప్రతిభావంతంగా నటించగల సాటిలేని మేటి నటి.

'భార్యామణి' చిత్రంలో 'నటి శిరోమణి' జయసుధ ఉత్తమ భార్యగా భర్తకు చేదోడువాదోడుగా నిలిచి అడగడుగునా భర్తను తన నేర్పు, ఓర్పులతో కష్టములనుండి రక్షించి, ఒక ఉత్తమ భారత స్త్రీ యొక్క ఔదార్యము ప్రకటితమగునట్లుగా ఆమె నటించిన తీరు మరువలేనిది. మరువరానిది. 'శివరంజని' చిత్రములో సినీ నటుల క్లిష్టతర జీవిత విశేషములను ప్రేక్షకులకు తెలియునట్లుగా ఆమె చక్కగా నటించారు. ముఖ్యముగా ఆమె వయస్సు




మళ్లిన పాత్రలను నటించి అభిమానులను నిరుత్సాహపరచవలదని నా మనవి. 'మగధీరుడు' కుటుంబ కథా చిత్రంలో కూడా ఆమె బాగా నటించారు. నా అభిమాన నటుడైన డైనమిక్ హీరో చిరంజీవితో ఎక్కువగా ఆమె నటించవలెనని నా అభిలాష.

-సి. హెచ్. వెంకటనాగలక్ష్మి, కొరుకొల్లు □

జయసుధ సమాధానాలు



ఉత్తమ ప్రశ్న

పి. మంజుల, కడప

నేటి స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలపైమీ అభిప్రాయం?

ఈ అత్యాచారాల్ని స్త్రీలే కలసి కట్టుగా ఎదుర్కోవాలి. దుర్మార్గుల ... కామాంధుల ఆటలు కట్టించాలి. స్త్రీకి స్వేచ్ఛ కల్గేట్లు చేయాలి. సమాజంలో ప్రతి స్త్రీని పురుషుడు గౌరవించే విధంగా మార్పును తీసుకుని రావాలి.

యన్. సుశీలాదేవి, చాగల్లు

"ఆక్రందన" చిత్రంలోని హైందవికి వచ్చిన సమస్యలాంటిది నిజ జీవితంలో ఏ స్త్రీకైనా ఎదురైతే ...?

ప్రతిఘటించడమే!

ఆడది అబలకాదు అవసరమైతే ఆదిపరాశక్తిగా మారాల్సిందే!

ఆర్. పి. వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు

నేటి సినిమాలపైమీ అభిప్రాయం ఏమిటి?

సదభిప్రాయమే!

యస్. మీనాకుమారి, టాటానగర్

మా ప్రశ్నలకు జవాబులను మీరే స్వయంగా వ్రాస్తున్నారా? లేక పత్రికవాళ్లే వ్రాస్తున్నారా? అన్న నా సందేహాన్ని తీర్చరూ ...?

మీరడిగిన ప్రశ్నలకు నేను చెప్పే సమాధానాల్ని నానుంచి తీసుకుని "ఆంధ్ర సచిత్ర వారపత్రిక"వారు మీకు అందిస్తున్నారు. మీ సందేహం తీరినట్లేనా?

సుదర్శన్, నాగర్‌కర్నూలు

మా అందరి అభిమాన నటి అయిన మీరు నటనకు ఎందుకని స్వస్తి చెబుతున్నారు?

నటించడం మానేయాలన్నది నా అభిప్రాయం. ఇంకా అది ఓ రూపు దిద్దుకోలేదు.

పుష్పలత, హైదరాబాద్

నేడు వస్తున్న సినిమాలు ప్రేక్షకులకు ఎటువంటి సందేశాన్ని యిస్తున్నాయంటారు?

సందేశం మాట ఏమో కాని చక్కని కాలక్షేపాన్ని ..., ఆనందాన్ని యిస్తున్నాయి.

జి. సన్యాసిరాజు, జి. నాగరత్నమ్మ, నరసరావుపేట

జీవితమనే నాటకరంగానికి దర్శకుడు ఎవరు? దర్శకురాలు ఎవరు?

"భార్యా-భర్త" అనుకుంటాను ... ఔనంటారా?

రావి బాలకృష్ణ, కంటాభండి

మీకు తెలుగు వ్రాయడం ... చదవడం రాదు కదా ... మరి మా ప్రశ్నలకు ఎలా సమాధానాలు యిస్తున్నారు?

తెలుగు వ్రాయడం .. చదవడం రాకపోయినా చక్కగా మాట్లాడతాను. మీ ప్రశ్నకు సమాధానం యిస్తున్నాను కదా!

సూరే పుల్లాజీరావు, అనకాపల్లి

మీ వివాహమయిన పిదప మీలో గ్లామర్ తగ్గింది అంటాను. మీరు ఏమంటారు? సహృదయంతో నిజం చెప్పండి?

ఇలా చాలామంది అనుకుంటే అది పెద్ద తప్పే అవుతుంది. నా నటనలో లోపముంటే చెప్పండి. సహృదయంతో. స్వీకరిస్తాను. వివాహానికి – గ్లామర్‌కి సంబంధం లేదు.

యస్. నటరాజ్, అనకాపల్లి

అక్కినేని గారితో తప్ప మీరు ఏ హీరోతో నటించినా మంచి పేరు రాదు కనుక మీరు అక్కినేని గారితో నటించాలని నా అభిలాష.

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారితో పాటు అందరు హీరోలతోనూ నటించాను ... మీ మెప్పును పొందాను. అందుకే నన్ను యింతగా మీరు అభిమానిస్తున్నారు. ఈ హీరోతోనే నటించాలి - ఆ హీరోతో నటించకూడదు అనే అభిప్రాయాన్ని నా మనస్సులోకి ఏనాడు రానీయలేదు. రానీయను.

మీ అభిప్రాయానికి కృతజ్ఞతలు. ప్రస్తుతం నేను శ్రీ నాగేశ్వరరావుగారితో "ఆది దంపతులు"లో నటిస్తున్నాను. □

కూపన్

ఆంధ్రసచిత్రవారపత్రిక

జయసుధ సమాధానాలు

ప్రశ్న: ______________________

____

____

పంపినవారి పేరు:

పూర్తి చిరునామా:



మీ చిన్నారి పాప నూనూగు బుగ్గలపైన మీరిచ్చే ముద్దులా సున్నితంగా



పాప చిన్నారి లోకంలో యిమిడే అలాగె అతి ప్రత్యేకమైన అతి కొద్ది వస్తువుల్లో ఒకటి - జాన్సన్స్ బేబీ సోప్.

ఆపేక్ష చిలికే మీ స్పర్శలా మృదువుగా చేస్తుంది జాన్సన్స్ బేబీ సోప్‌లోని లెనోలిన్ అనే పదార్థం. మరి దానిలోని ఆ సువాసన మీ పాపపై చిలుకుతుంది, దాంతో యిక పాపకు చక్కగా సహజమైన ఆ సువాసన.

జాన్సన్స్ బేబీ సోప్
శుద్ధమై... సౌమ్యమై... భద్రమైనది.

Johnson & Johnson

12193 TFI

సినిమా

విశేషాలు

-జి.వి.జి.

"ప్రతిభా వంతుడు"లో పత్నీవ్రతుడు

భర్త విజయ్ (కృష్ణ) రాక కోసం ఎదురు చూసి, ఎదురు చూసి విసిగిపోయింది లక్ష్మి (భానుప్రియ). కాస్సేపటికి విజయ్ వచ్చి, మెల్లగా ఆమె భుజం మీద చెయ్యి వేశాడు. "ఛాంది! ఎన్ని సార్లు ఫోన్ చేసినా – ఇప్పుడే వస్తానంటూ, ఇప్పుడా రావడం? మీతో నేను మాట్లాడను," అంది బుంగ మూతెట్టుకుని లక్ష్మి.

"నువ్వు మాట్లాడకపోతే నేనేమై పోతాను, లక్ష్మి?" గోముగా అన్నాడు విజయ్.

"మీరు ఏమీ అవకుండానే కూడా తెచ్చుకున్నారుగా?"

"ఎవరిని?"

"మీ అసలు భార్యని," అంటూ బ్రీఫ్ కేస్ వంక చూపించింది లక్ష్మి. ఇద్దరూ నవ్వుకున్నారు.

పెడదారి పట్టి, కుటుంబ విచ్ఛిన్నానికి దారి చేస్తున్న దుర్మార్గులను తన ప్రతిభతో మంచిదారిన పెట్టే ఒక వినూత్న మైన పాత్రలో కృష్ణ అసమాన చాతుర్యంతో నటించిన ఎస్. ఆర్. ఫిలిమ్స్ వారి "ప్రతిభావంతుడు" చిత్రానికి ప్రభాకర రెడ్డి ప్రతిభావంతంగా దర్శకత్వం నెఱపారు. ఎస్. రామచంద్రరావు నిర్మాత.



"కలియుగ కృష్ణుడు"లో రాధ

భానుప్రియ, కృష్ణ "ప్రతిభావంతుడు"లో



క్రాంతికుమార్ దర్శకత్వంలో నాగార్జున "అరణ్యకాండ"


"ఏప్రిల్ 11 నుంచి మే 10 వరకు తూర్పు గోదావరి జిల్లాలోని మారేడుమిల్లి అడవుల్లో జరిగే రెండో షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు క్రాంతి కుమార్. ఈయన దర్శకత్వంలో ఉషోదయా మూవీస్ సుధాకర రెడ్డి నిర్మిస్తున్న "అరణ్యకాండ" చిత్రంలో అక్కినేని నాగార్జున, ప్రభాకరరెడ్డి, రాజేంద్రప్రసాద్, చరణ్‌రాజ్, రాళ్ళపల్లి, పి. ఎల్. నారాయణ, ప్రదీప్, రాధిక, తులసి, సంయుక్త, అహల్య, శ్రీలక్ష్మి, అన్నపూర్ణ పాత్రధారులు. కొమ్మనాపల్లి గణపతిరావు కథకు గణేష్‌పాత్రో సంభాషణల కర్త. వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త. హరి అనుమోలు ఛాయ, కృష్ణంరాజు కూర్పు, జయకుమార్ సహ దర్శకత్వం నిర్వహిస్తున్నారు.

స్మిత ద్విపాత్రాభినయంతో మరో చిత్రం

"ఏప్రిల్ 14 నుంచి 20 వరకు మొదటిషెడ్యూల్ ముగించాం. తదుపరి షెడ్యూల్స్ మే 15-20, జూన్ 11 నుంచి నెలాఖరు వరకు," అన్నారు రవితేజ. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎం. గంగాధర్, పి. వైజయంతి నిర్మించే మహాలక్ష్మి ఆర్ట్ ఎంటర్‌ప్రైజస్ వారి చిత్రంలో సిల్క్‌స్మిత, ఆనంద్‌బాబు, రజనీష్, నూతన్‌ప్రసాద్, కోట శ్రీనివాసరావు, వైజయంతి నటిస్తున్నారు. ఆకెళ్ళ మాటలు, సత్యం సంగీతం, బాబ్జీ శిల్పం, తరుణ్ నృత్యాలు, బషీర్ అహ్మద్ ఛాయ, ఎస్. ఎన్. రావ్ సంయుక్త దర్శకత్వం, కె. సత్యం కూర్పు నిర్వహిస్తున్నారు.

జంధ్యాల దర్శకత్వంలో సరిత "సత్యాగ్రహం"

"పల్లెసీమల్లో ఉండే చిన్న చిన్న రాజకీయాలతో నడిచే చక్కని కథ. గుంటూరుకు 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న అమీనాబాద్ గ్రామంలో ఏప్రిల్ 10 నుంచి 30లోగా మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. మే 20 నుంచి 30 వరకు రెండో షెడ్యూల్. ఇక, మా హీరో గురించి... వ్యవసాయ రంగంలో 'కృషి పండిట్' బిరుదు పొంది, రాజకీయ రంగంలో కృషీవలుడై, పలు బిరుదులు పతకాలు పొందిన విద్యాధికుడు చల్లా రామకృష్ణారెడ్డి సినిమా రంగంలో కూడా అంతటి ఖ్యాతిని తెచ్చుకోనున్నారు. ఈయనతో పాటు పరిచయం గావింపబడే రంగస్థల కళాకారులందరూ కూడా చాలా చక్కగా నటించారు. సరిత హీరోయిన్. నా డైరెక్షన్‌లో ఈమె తొలిసారిగా నటిస్తోంది." అన్నారు జంధ్యాల. ఈయన రచన, దర్శకత్వంలో విజయ్ అమర్‌నాథ్‌రెడ్డి నిర్మించే "సత్యాగ్రహం" చిత్రం ద్వారా వెండి తెర వెలుగులోకి వచ్చే ఇతర కళాకారులు : జి. ఎస్. ఆర్. శాస్త్రి, జగన్నాథం, విజయరాం, బ్రహ్మానందం, హనుమంతరావు, వాసుదేవరావు, కృష్ణమూర్తి, జయలలిత, ఆయెషా. శైలజ మున్నగు వారు. వేటూరి గీతాలు, రమేష్ నాయుడు సంగీతం, ఎస్. గోపాల్‌రెడ్డి ఛాయ, సత్యనారాయణ- సహకార దర్శకత్వం, యోగానంద్ నిర్మాణత, ఎం. వెంకటేశ్వరరావు ప్రొడక్షన్, యు. వి. వాణి సంయుక్త దర్శకత్వం, సి హెచ్. ప్రభాకరరెడ్డి నిర్వహణ, గౌతం రాజు కూర్పు తెర వెనుక హంగులు.



చిత్రంలో హీరోయిన్‌కి మతిమరుపు ఎక్కువ. అప్పుడప్పుడూ చీరా, జాకెట్ వేసుకోవటం మర్చిపోతూ వుంటుంది — అవి మీరు కత్తిరిస్తే కథాగమనం దెబ్బతింటుంది సార్!



"చైతన్యం"లో సాగరిక

"కర్పూర దీపం"

"విధి విలాసం కొద్దీ ఏకాకిగా ఉన్న ఇంజనీర్ మోహన్ హృదయంలోకి మానస అనే యువతి ప్రవేశిస్తుంది..... మంచి మనసు గల మనుషుల మధ్య జరిగే మానసిక సంఘర్షణ," అన్నారు మురళీమోహన్. ఈయన ప్రధాన పాత్ర నిర్వహిస్తూ, సమర్పించే జయభేరి వారి పై చిత్రంలో సుహాసిని, శరత్‌బాబు, సత్యనారాయణ, శుభలేఖ సుధాకర్, అరుణ, కాకినాడ శ్యామల, జానకి, కోట శ్రీనివాసరావు, భీమేశ్వరరావు నటించారు. గణేశ్ పాత్రో మాటలు, వేటూరి పాటలు, చక్రవర్తి సంగీతం, కె. ఎస్. హరి ఛాయ, తార నృత్యాలు, కె. అమరేశ్వరరావు సహకార దర్శకత్వం, కె. ఎస్. రాజేంద్ర సహదర్శకత్వం, తార నృత్యాలు, డి. రాజగోపాల్ కూర్పు, కిశోర్ నిర్వహణతో మాగంటి వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రానికి రాజాచంద్ర దర్శకుడు.



"అరుణకిరణం"లో డా॥ రాజశేఖర్, విజయశాంతి

సినిమా

పాండ్యరాజా దర్శకత్వంలో 'పెళ్ళి పెచ్చోళ్ళు" వినోదాత్మక చిత్రం

తమిళ చిత్ర రంగంలో క్రొంగొత్త మలుపులు తిప్పిన భారతీరాజా, భాగ్యరాజాల కోవకు చెందిన మరో సుప్రసిద్ధ కథకుడు, దర్శకుడు, నటుడు పాండ్యరాజా. "కాబోయే భార్యను చూసి రావడానికి పొరబాటున మరొక ఇంటికి వెళ్తాడు ఒక భూస్వామి పెద్ద కొడుకు. ఈ తప్పుల తమాషాలో రెండో కొడుకు కూడా చిక్కుకుని, లేని పోని ఇక్కట్లకు గురవుతాడు. ఈ గడ్డు చిక్కుల్లోంచి వాళ్ళు బయటపడడానికి పడే పాట్లు కడుపుబ్బ నవ్విస్తుంది," అన్నారు అలము మూవీస్ వారి పై చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించిన ఆర్. పాండ్యరాజా. ఈయన సిత అనే తెలుగు యువతిని ఈ చిత్రం ద్వారా పరిచయం చేస్తున్నారు. రేవతి, పాండ్యన్, శుభాకర్, వి. కె. ఆర్, జనకరాజ్ ఇతర పాత్రధారులు. వసంతకుమార్ సంభాషణలు, గోపి గీతాలు, ఇళయరాజా సంగీతం, అశోక్ కుమార్ ఛాయ, కుమార్ నృత్యాలు, ఇళంగో నిర్వహణ, రాజగోపాల్ కూర్పుతో ఈశ్వరి సుబ్రహ్మణ్యం నిర్మాత.

క్రాంతి కుమార్ దర్శకత్వంలో మురళీమోహన్

"విశాఖపట్టణంలో మే 21 నుంచి 30 వరకు మొదటి షెడ్యూల్, జూన్ 11 నుంచి 30 వరకు తదుపరి షెడ్యూల్," అన్నారు మురళీమోహన్. ఈయన "కర్పూరదీపం" అనంతరం సమర్పించే జయభేరి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ వారి 11వ చిత్రంలో ఈయన సరసన లక్ష్మి, భానుప్రియలు నటిస్తారు. కిశోర్ నిర్మాణతతో మాగంటి వెంకటేశ్వరరావు నిర్మించే ఈ చిత్రానికి క్రాంతి కుమార్ దర్శకుడు.

ఎ. వి. ఎం. ప్రొడక్షన్స్ తదుపరి చిత్రాలు


"మూగ నోము, రాము, నోము, పున్నమి నాగు, నాగ దేవత," వంటి హిట్ చిత్రాలను అందించిన ఎ.వి.ఎం. సంస్థ "బంధం" అనంతరం రామనారాయణ దర్శకత్వంలో నిర్మించే చిత్రంలో కృష్ణ హీరో.

శోభన్‌బాబు నటించే చిత్రానికి రాజాచంద్ర దర్శకుడు.

జూన్, జూలై మాసాల్లో సుమన్‌తో ప్రారంభించే చిత్రానికి కమలాకర కామేశ్వరరావు, తాతినేని ప్రసాద్, విజయబాపినీడు, రామనారాయణ ప్రభృతుల వద్ద సహాయ, సహకార, సంయుక్త దర్శకుడుగా అనుభవం గడించిన ఎం. సుగంధ రమేశ్‌ను దర్శకునిగా నిర్మాత ఎ.వి.ఎం. కుమరన్ పరిచయం చేస్తున్నారు. నిర్మాణ నిర్వహణ ఎ.వి.ఎం.కె. షణ్ముగం. □



గ్లూకోన్-డి సూపర్‌హీరో.
ఉక్కపోస్తూ అలుపు
పుట్టించే రోజున కూడా
ఉరకలు వేసే శక్తి.
Glaxo
Glucon-D®
Glucose-D
GL
High-grade, finely powdered glucose enriched with vitamin D and calcium phosphates.
GLAXO LABORATORIES (INDIA) LTD.
Dr. Annie Besant Road, Bombay 400 025, India.
Maximum Price Rs.
Local Taxes Extra
LOT
MONTH
అసలైన, కొత్త, రంగురంగుల ప్యాక్ కోసం చూడండి.
అలుపు తెచ్చే వేసవి రోజున మీ అబ్బాయికి కావలసింది గ్లూకోన్-డి: గ్లూకోజు, విటమిన్ డి, కాల్షియం ఫాస్ఫేట్సు గల తక్షణ శక్తినిచ్చే పానీయం.
గ్లూకోన్-డిని పళ్లరసం, పాలు, టీ, కాఫీ, లేదా నీళ్లలో కలిపారంటే కుటుంబం మొత్తానికి ఒక ఉల్లాస పానీయంగా తయారైపోతుంది.
100, 200, 500 గ్రాముల ప్యాకులలో లభిస్తుంది.
గ్లాక్సో వారి గ్లూకోన్-డి.
గ్లూకోన్-డి ®
సూపర్‌హీరో అమితంగా ఇష్టపడే శక్తినిచ్చే పానీయం.
GLL-2389



kiron/apco/86